# తిలక్ సాహిత్యం - సందేశం

(శతజయంతి సప్తాహం-అంతర్జాతీయ సదస్సు వ్యాసాలు)

సంపాదకులు

డా॥ ఎన్. ఈశ్వర రెడ్డి

ప్రచురణ

యోగివేమన విశ్వవిద్యాలయం, కడప

మరియు

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, అమరావతి

**TILAK SAHITYAM - SANDESAM**
*(International Webinar Proceedings)*

*Honoray Editor:*
**Prof. M. Surya Kalavathi**
**Vice-Chancellor, Yogi Vemana University, Kadapa-516 001**

*Main Editor:*
**Prof. D. Vijaya Raghava Prasad**
**Registrar, Yogi Vemana University, Kadapa-516 001**

*Editor:*
**Dr. N. Eswara Reddy**
**Associate Professor & Head**
**Department of Telugu, Yogi Vemana University, Kadapa -516 001**

*Co-Editors:*
**Dr. P.C. Venkateswarlu**
**Associate Professor, ORI, S.V.University, Tirupati -517 501**
**Dr. Sri Ganesh**
**Language Scientist, Haidleberg University, Germany.**

*Assistant Editor:*
**Dr. T. Venkataswamy**
**Assistant Editor, Centre for Publications**
**Dravidian University, Kuppam - 517 426**

**No. of Pages: xviii + 238**

© Editor

**First Edition : 2021**

**No. of Copies :** 500

**Price: Rs.200/-**

*For Copies:*
**1) The Registrar**
Yogi Vemana University, Kadapa-516001

**ISBN: 978-81-921672-3-7**

*Printing :*
**Vijayavani Printers**
**Chowdepalli - 517 257**

ఈ పుస్తకంలో ఉన్న వ్యాసాలలోని అభిప్రాయాలు ఆయా వ్యాసకర్తలవే.
– సంపాదకులు




ఆచార్య కె. హేమ చంద్రా రెడ్డి
ఛైర్మన్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి
3,4,5 అంతస్థులు, నీలాద్రి టవర్స్,
శ్రీరామ్ నగర్, 6వ బెటాలియన్ రోడ్
ఆత్మకూర్ (గ్రా), మంగళగిరి (మం)
గుంటూరుజిల్లా -522003, ఆం.ప్ర.


# భావాభ్యుదయ కవి తిలక్

దేవరకొండ బాలగంగాధర తిలక్ అంటే నాలాంటి వారికి చాలా ఇష్టం. కవిత్వాన్ని సమాజాన్ని కలిపి సరికొత్త టానిక్ తయారు చేసిన కవి తిలక్. వచనంలో లయను సాధించడం, చమత్కారాన్ని అలంకారంగా తీర్చిదిద్దడం, సహృదయతను సానుభూతిని లక్షణాలుగా చేసుకొని సృజన చేయడం వంటివి తిలక్ కవిత్వానికి అశేష పాఠకులను తెచ్చిపెట్టాయి. నా మట్టుకు నాకు 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి కవితావేదంలా ఆకట్టుకొంది. ఇంజనీరింగ్ చదివేరోజులనుండి ఇప్పటి దాకా దాన్ని చదువుతూనే ఉన్నాను. చదువుతున్న ప్రతిసారీ అది సరికొత్త భావాన్ని ఆవిష్కరిస్తోంది. మళ్లీ మళ్ళీ చదివించి అక్షర అక్షరాన్ని మనసుపత్రంపై ముద్రించగలిగేంత ప్రభావం చూపించిన కవిత్వం తిలక్‌ది. సాంకేతిక శాస్త్ర అధ్యయనంలో మెదడు బరువెక్కి పోయినప్పుడు కూడా తిలక్ కవిత్వాన్ని చదివి 'ఆల్ప్సు పర్వత శ్రేణిపైన, హిమవన్నగ పంక్తులపైన, సైబీరియాలో సియర్రా నెవడాలో, అంటార్కిటిక్ సముద్రం మీద, ఆస్ట్రేలియన్ స్టెప్పీలమీద' కురిసే మంచు ప్రాంతాలను చుట్టివస్తాను. 'కాళిదాసు శ్లోకం, బీథోవెన్ సోనెటా, లియోనార్డో

చిత్రం లేపాక్షీ శిల్పం' తదితరాలను తిలక్ అక్షర దర్పణాల్లోంచి ఆహ్లాదకరంగా దర్శిస్తాను.

కృష్ణశాస్త్రి శ్రీశ్రీలను కలిపి చదివిన అనుభూతి తిలక్ కవిత్వంలో దొరుకుతుంది. భావ కవిత్వంలోని అభివ్యక్తి, భావుకత, ప్రాకృతిక దర్శనం – అభ్యుదయ కవిత్వంలోని వర్గపోరాటం, సామాజిక దృక్పథం, అంతర్జాతీయ సమస్యల నేపథ్యం కలగలిసిన తిలక్ కవిత్వం భావాభ్యుదయ కోణంలో మనిషిని కట్టిపడేస్తుంది.

"సుందర స్వప్నాల స్వర్గాల మేడమెట్లనుండి
వాస్తవికతా శిథిల బధిర రుధిర కూపాలనికి
హఠాత్ పతితుడనైన నాకు తెలుసు
అల్పమని నీవు అల్లిన గొలుసు..." (భరతవాక్యం)

ఈ కవితలో మొదటి వాక్యం చదువుతుంటే కృష్ణశాస్త్రి తిరిగిన దివిదారులు గుర్తుకొస్తాయి. రెండో వాక్యంలోకి రాగానే శ్రీశ్రీ ఆలింగనం చేసుకున్న బాధాతప్త హృదయులు కళ్ళముందు మెదలుతారు. ఇదొక ప్రత్యేక శిల్పం. కవుల కవిత్వంలో సాధారణంగా వస్తువును బట్టి శిల్పం, అభివ్యక్తి స్థాయిలు మారిపోతుంటాయి.

అదే సమయంలో కవులు సమర్థించుకునే వాదానికి, లేదా ఉద్యమానికి అనుగుణంగా అభివ్యక్తి, భావుకచిత్రాలు సృష్టిస్తుంటారు. కానీ, తిలక్ అందుకు భిన్నంగా భాషకు, ఉద్యమానికి, వాదానికి, అతీతంగా కలాన్ని నడిపించాడు. అందుకే తిలక్ కవిత్వంలో ఒక భిన్నమైన పరిధులు లేని స్వేచ్ఛ కనిపిస్తుంది.

"కురుక్షేత్రమయితే కృష్ణుణ్ణి అడుగు
పానిపట్టయితే పీష్వాల నడుగు
బొబ్బిలయితే బుస్సీనడుగు
క్రిమియా యుద్ధం కొరియా యుద్ధం
ప్రథమ ద్వితీయ ప్రపంచ యుద్ధాలు

బిస్మార్క్ నడుగు హిట్లర్ నడుగు
బ్రహ్మదేవుణ్ణి అడుగు... " (వెళ్ళిపోండి వెళ్ళిపోండి)

కురుక్షేత్రం, కృష్ణుడు, బ్రహ్మదేవుడు ఇతిహాస పౌరాణికాంశాలు. పానిపట్టు, బొబ్బిలి యుద్ధాలు దేశంలో జరిగిన చారిత్ర్యకాలు. క్రిమియా, కొరియా, ప్రథమ-ద్వితీయ ప్రపంచ యుద్ధాలు అంతర్జాతీయ అంశాలు. పీష్వా, బుస్సీ, బిస్మార్క్, హిట్లర్‌లు సమీప గతంలో యుద్ధకారకులు. వీరి చరిత్ర వాస్తవం. కురుక్షేత్రాన్ని, కృష్ణున్ని, బ్రహ్మదేవుణ్ణి నమ్మేవాడు ఆధునిక యుద్ధాలకు కూడా విధినే ప్రతినిధిగా నిలబెడతాడు. ఎందుకంటే 'శివునాజ్ఞలేనిదే చీమ కూడా కుట్టదు' గనక. లేదా గతి తార్కిక భౌతిక వాదాన్ని విశ్వసించే వాడయితే ఇతిహాసాల వైపు ముఖం తిప్పడు. కానీ, తిలక్ కవిత్వంలో ఇలాంటి విభిన్నతలు పాఠకుల్లో కొత్త ఆలోచనలకు దారిచూపిస్తాయి. నిజానికి తిలక్ కవిత్వంలో ఉన్న బ్యూటీ కూడా అదే.

గాజు కెరటాల వెన్నెల సముద్రాలను, జాజిపువ్వుల అత్తరు దీపాలను, మంత్రలోకపు మణిస్తంభాలను తన కవితా చందన శాలలో అలంకార సామగ్రిగా ఉంచుకొని 'మేగ్నాకార్టా'లను, సైనికుడి ఉత్తరాలను, ఆర్తగీతాలను, ప్రార్థనలను సృష్టించిన తిలక్ నిఖార్సయిన ప్రయోగవాదిగా కనిపిస్తాడు. 'ఆశల వెచ్చని పాన్పుమీద స్వప్నాల పుష్పాలు జల్లుకొని, ఆదమరచి కాసేపు విశ్రమించడానికి' అనుమతి తీసుకొని మరీ వెళ్ళిపోయిన తిలక్ తెలుగు కవిత్వాభిమానుల గుండెల్లో నిత్యం కవితాగానం చేస్తుంటాడు.

తిలక్ శతజయంతి సంవత్సరం నడుస్తున్న సందర్భంలో, తిలక్‌ను నేటి తరానికి మరొక్క సారి పరిచయం చేసి, వారి సాహిత్య సుమగంధాన్ని అక్షరబద్ధం చేయాలని భావించాను. నా ఆలోచనను యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మునగాల సూర్యకళావతిగారికి చెప్పినవెంటనే అంగీకరించి, డా॥ ఎన్. ఈశ్వరరెడ్డికి ఈ పనిని అప్పగించారు. 2020 డిసెంబరు 14 నుండి 20 వరకు తిలక్ శతజయంతి సప్తాహం పేరుతో అంతర్జాతీయ అంతర్జాల

సదస్సును నిర్వహించాం. పేరెన్నికగన్న ఆచార్యులను, పరిశోధకులను ఒప్పించి పత్రసమర్పణలు చేయించాం. ఇప్పుడు వారి పత్రాలన్నీ అందమైన పుస్తక రూపంలో మీచేతిలోకి వచ్చాయి. శ్రమదమాదుల కోర్చి ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వర్తించిన తమ్ముడు ఈశ్వర రెడ్డిని అభినందిస్తున్నాను.



ఆచార్య మునగాల సూర్యకళావతి
ఉపకులపతి
యోగివేమన విశ్వవిద్యాలయం
కడప - 516 005

# విశిష్ట సృజనకారుడు తిలక్

యోగివేమన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా నిర్వహించిన 'తిలక్ శతజయంతి సప్తాహం (14–20 డిసెంబరు 2020) సాహితీ ప్రియులకు రసానందాన్ని ఇచ్చిందని భావిస్తున్నాను.

ఈ సదస్సుకు కర్త, కర్మ, క్రియ అన్నీ తానై నడిపిన వ్యక్తి కవిత్వ రుచి తెలిసిన రసహృదయులు, తిలక్ కవిత్వంతో స్నేహం చేస్తున్న కవితాభిమాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, మా శ్రేయోభిలాషి ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి గారు ఈ సదస్సుకు, ఈ పుస్తకానికి పునాది.

పేరెన్నికగన్న కథారచయిత, ఆర్తుల పక్షాన నిలబడే మానవీయ కథకులు, విమర్శకులు, ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ ఈ సదస్సును ఆశీర్వదించడం మాకు మరింత గౌరవాన్నిచ్చింది.

కవిగా, రచయితగా, విమర్శకులుగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సాహితీ వేత్త, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన విలువైన సందేశంతో సదస్సును ప్రారంభించడం ముదావహం.

దేవరకొండ బాలగంగాధర తిలక్ ఆధునికాంధ్ర సాహిత్యంలో ఒక విశిష్ట సృజనకారుడు. కవిత్వం, కథ, నాటక ప్రక్రియల్లో తన మానవతావాద హృదయాన్ని

ఆవిష్కరించిన కృషీవలుడు, కవిత్వంలో వస్తు, రూపాలకు సంబంధించిన విభిన్న రీతుల్లో తానేమిటో నిరూపించుకున్న కవి తిలక్.

"గూడులేని లోకం - గుండెలోతు తాపం - సోమయాజి శాపం" - కలిసిన భూమిలోని అట్టడుగులోకాలను దర్శించిన అభ్యుదయ వాదిగా -

"నా దేశాన్ని గూర్చి పాడలేను

నీ ఆదేశాన్ని మన్నించలేను" - అంటూ దేశం నిండా మూలుగుతున్న అభాగ్య బాధిత కన్నీళ్ళను దోసిళ్ళతో పట్టిన కవిపుంగవుడు తిలక్.

తపాలా బంట్రోతుగా, తల్లడిల్లే మానవ గొంగళిపురుగుగా, న్యూ సిలబస్‌గా, కవితామృతమై కురిసిన మధురకవి తిలక్.

అందరూ నిద్రపోయిన ఆ అమృతం కురిసిన రాత్రి జల జల మని కురిసిన వానలో, జాల్వారిన అమృతంపు సోనను దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చిన చిరంజీవి కవి తిలక్.

అనుభూతినీ, ఆదర్శాన్నీ, అందమైన అక్షరాలుగా దిద్ది, వెన్నెల్లో స్వేచ్ఛగా ఆడుకోనిచ్చిన ప్రజాస్వామ్య కవికి నీరాజనాలు అర్పించే అవకాశం మాకు ఇచ్చినందుకు, దీన్ని పుస్తక రూపంలోకి తేవడానికి ముందడుగు వేయించినందుకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను.

ఈ సదస్సును ఫలవంతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయిలో లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తలను ఆహ్వానించి, విశ్వవిద్యాలయ వ్యక్తిత్వాన్ని శోభాయమానం చేస్తున్న మా తెలుగు శాఖకు, అందుకు మూలమైన తెలుగు శాఖాధిపతి డా॥ ఎన్. ఈశ్వర రెడ్డికి అభినందనలు.

సదస్సులో పాల్గొన్న సాహిత్యకారులందరికీ ధన్యవాదాలు. ఒక వారం పాటు జరిగిన ఈ సదస్సులో సమర్పించిన పత్రాలను పుస్తక రూపంలో చూస్తున్నందుకు సంతోషం వ్యక్తపరుస్తూ, విలువైన పరిశోధనా పత్రాలు అందించిన ఆచార్యులకు, సాహితీవేత్తలకు శుభాభినందనలు తెలియజేస్తున్నాను.



**ఆచార్య సుధీర్ ప్రేమ్ కుమార్**
కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి
3,4,5 అంతస్థులు, నీలాద్రి టవర్స్,
శ్రీరామ్ నగర్, 6వ బెటాలియన్ రోడ్
ఆత్మకూర్ (గ్రా), మంగళగిరి (మం)
గుంటూరుజిల్లా -522003, ఆం.ప్ర.

# ఆర్తుల పక్షపాతి తిలక్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి & యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప సంయుక్తంగా ఏడు రోజులుగా నిర్వహించిన ఈ సదస్సు ఒక వినూత్న ప్రయోగం.

అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన యోగివేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.సాంబ శివారెడ్డి గారికి - సమాపనోత్సవ సందేశం అందించిన బహుభాషావేత్త, జానపద పరిశోధకులు, కవి, రచయిత, విమర్శకులు అయిన ఆచార్య ఆర్వీయస్ సుందరం గారు, గౌరవ అతిథి యోగివేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య డి.విజయ రాఘవ ప్రసాద్ గారు, విశిష్ట అతిథి విక్రమసింహపురి విశ్వవిద్యాలయ కులసచివులు డా॥ ఎల్.వి. కృష్ణా రెడ్డి గారు, ప్రత్యేక విదేశీ అతిథులు డా॥ శ్రీగణేశ్ తొట్టెంపూడి (జర్మనీ), డా॥ వైదేహి శశిధర్ (అమెరికా) గార్లు ఈ సదస్సుకు వన్నెతెచ్చారు.

ఈ కార్యక్రమాన్ని ఏడు రోజులపాటు నిర్విఘ్నంగా నిర్వహించి, దాన్ని పుస్తకరూపంలోకి తెస్తున్న డా॥ ఎన్. ఈశ్వర రెడ్డి అభినందనీయులు.

తెలుగు సాహిత్యంలో విలక్షణమైన కవి తిలక్ అంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే, ఆయన సాహిత్యంపైన మరొక్కసారి చర్చించుకోవాలనే ఆలోచనతో ఈ ఏడు రోజుల కార్యక్రమానికి స్వీకారం చుట్టాం. తెలుగు సాహిత్యంలో వేగుచుక్కలా

కనిపించి 45ఏళ్ళకే జీవితం చాలించిన తిలక్ సాహిత్యాన్ని గురించి చర్చించాల్సింది చాలా ఉంది.

ఈ రోజు సమాజం తీరు మనం చూస్తున్నాం. నాగరికులుగా ఉంటూ అనాగరికంగా ప్రవర్తిస్తున్నాం. ఈ సమాజాన్ని ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో ఆలోచిస్తూ తిలక్ కొన్ని కలలు కన్నాడు. ఆ విషయాన్ని మనకు ఒకసారి గుర్తు చేస్తూ "నేను చూసాను నిజంగా మూర్తి భవించిన ధైన్యాన్ని, హైన్యాన్ని క్షుదితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛుత్ శవాకార వికారుల్ని ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి ఏ బుద్ధ దేవుడి జన్మభూమికి గర్వస్మృతి?" (ఆర్తగీతం) అంటూ అన్యాయాల చీకటి చెరల్ని చీల్చి, కాంతిపుంజాన్ని ప్రసరించిన గొప్ప మానవతావాది తిలక్. ఆయన జీవితకాలంలో పదేళ్ళు బాల్యంతో గడచింది, ఎనిమిది సంవత్సరాలు అనారోగ్యం (నెర్వస్ బ్రేక్ డౌన్) వల్ల కాలగర్భంలో కలసిపోయింది. ఇక మిగిలిన పాతికేళ్ళలో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించాడు. సమాజంలోని తనకు మిగిలిన కాలం తుక్కువేనని ముందుగా గ్రహించాడేమో? కథలు, నాటికలు, నాటకాలు, గేయాలు, కవితలు, వ్యాసాలు, లేఖలు వంటి మధురమైన సాహిత్య ప్రక్రియల్లో బలమైన ముద్ర వేశాడు. ఇంటర్మీడియట్ పూర్తి చేయలేకపోయిన తిలక్ ఇటు తెలుగు, అటు ఆంగ్లం రెండిటిలోనూ మంచి పాండిత్యాన్ని సంపాదించడం పూర్వజన్మ సుకృతం మాత్రం కాదు. వ్యక్తిగా ఆయన సాధించుకున్నదే. ఎక్కడికి వెళ్ళినా కవులతో పరిచయాలు, సన్నిహితులతో సాహిత్య చర్చలు వంటి నిరంతరం తీరిక లేకుండా చేసిన పనులు ఆయన జీవితాన్ని వడివడిగా ముందుకు తీసుకెళ్ళాయి.

పాలగుమ్మి పద్మరాజు, మల్లవరపు విశ్వేశ్వర రావు, పిలకా గణపతి శాస్త్రి, సంపత్ రాఘవాచారి మొదలైనవారు వీరి సన్నిహితులు. అనిసెట్టి, అబ్బూరి, తాపీ ధర్మారావు, బాపిరాజు, కృష్ణశాస్త్రి మొదలైనవారు వీరి స్నేహితులు. ఇలాంటి వారితో ఉన్న కొద్దికాలంలోనే ఎన్నో రోజులు చర్చలు చేసేవాడు.

ఏ సంస్థలో సభ్యుడు కాకపోయినా, ఎవరు సదస్సుకు పిలిచినా వెళ్ళి అనర్గళంగా ఉపన్యాసం ఇచ్చేవాడు. మొహమాటం లేకుండా తన అభిప్రాయాన్ని

ఇతరులకు ఖచ్చితంగా చెప్పి, తర్వాత ఒంటరిగా కూర్చొని బాధపడేవాడు. ఇవన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని పరిచయం చేయడానికి మాత్రమే చెప్పిన నాలుగు మాటలు.

తిలక్ కవితాంతరంగాన్ని చూసినప్పుడు ఆయనపై సంప్రదాయ ముద్ర భావా భ్యుదయాల ప్రభావం, అనుభూతివాద ప్రసరణ, మానవతావాద వివేచన అనే విషయాలు కనిపిస్తాయి.

స్వయంవర' ఖండికలో, శ్రీరాముడు, సీతల గుణగణాలను వర్ణిస్తూ "ఇతడే పుత్రకామేష్టి యాగఫలము దశరథానంద నందనవనమ్ము అని చెప్పడంలో పౌరాణిక సంప్రదాయం కనిపిస్తుంది.

భావ కవితా ప్రభావానికి లోనైన తిలక్ 'గోరువంకలు', 'ప్రభాతము–సంధ్య' వంటి కవితా సంపుటాల్లో ఆ భావ కవిత్వాన్ని కుమ్మరించాడు.

"నువ్వు లేవు నీ పాట వుంది..........
సిగ్గిలిన సోగ కళ్ళతో మల్లెపూల వాల్జడతో నువ్వు పాడిన పాట
నా గుండెల దగ్గర తడబడుతూ" – అనడంలో ఆత్మాశ్రయ కవిత్వం తొణికిసలాడుతుంది.

భావ కవిత్వంలో స్మృతి ఒక భాగం. నెహ్రూ మరణించినప్పుడు భావకవిగా స్పందించాడు.

"ఎలాగ నీ స్మృతి నుండి పారిపోగలను
ఈ దుఃఖాన్ని మరచిపోగలను" అని నీరాజనాలను అర్పించాడు.

సుకుమార మనసు కలిగిన తిలక్ తన చుట్టూ ఉన్న ప్రజల బాధలకు చలించి అభ్యుదయ కవిత్వం రాశాడు. 'ముసలివాడు', 'శిఖరారోహణ' వంటివి ఇందుకు ఉదాహరణలు

"ముసలిదానికి మంచి వార్తనందించి
ముడతలు పడిన ముఖం మీద ఆనందాన్ని పరికించి" – అని చెప్పడంలో అభ్యుదయం నిక్షిప్తం చేయబడింది. మానవతావాదిగా, స్త్రీల బాధల్ని గురించి స్త్రీవాదులకంటే ముందే ఆలోచించాడు.

"ఎవరు మీరంతా ఎందుకిలా వంగిన నడుంతో కన్నీటితో
చెదరిన జుట్టుతో జారిన పైటలతో

ఈ సమాధుల చుట్టూ వెతుక్కుంటూ తిరుగుతారు" – అనడం వెనుక మానవతావాదం అర్థం చేసుకోవాలి. సమసమాజ నిర్మాణం కోసం తిలక్ నిశ్శబ్ద విప్లవాన్ని ఆహ్వానించాడని 'నీడలు' కవితా ఖండిక నిరూపిస్తుంది.

అనుభూతివాదిగా తిలక్ భావాల్ని 'నవతా – కవితా' ఖండిక పరిచయం చేస్తుంది.

కవిత కొత్త అనుభవాల కాంతి పేటికను తెరవాలి. కవిత్వం అంతరాంతర జ్యోతి సీమల్ని బహిర్గతం చేయాలి అనడంలో అనుభూతి నిండుగా ఉంది.

మానవతావాదిగా 'ఆర్తగీతం' ఆలపించిన తిలక్ తనకు శాంతి లేదని అంటాడు.

"ఒక్క నిరుపేద ఉన్నంత వరకు
ఒక్క మలినాశ్రుబిందువు వొరిగినంత వరకు
ఒక ప్రేవు ఆకలి కనలినంత వరకు
ఒక నైతిక శుష్కస్తన్య సన్నిధిని క్షుధార్తి నేడ్చు
పసిపాప ఉన్నంత వరకు
నాకు శాంతి కలుగదింక"

అని చెప్పడంలో ఆయన మనసును అర్థం చేసుకోవచ్చు.

చివరిగా మానవుణ్ణి దేవుని కంటే అధిక శక్తి కలవాడిగా తిలక్ వర్ణించాడు.

ఈ సదస్సు ఏడు రోజులపాటు దిగ్విజయంగా జరిగి మంచి పరిశోధనాత్మక పత్రాలతో పుస్తక రూపంలోకి రావడం అభినందించదగ్గ అంశం. యోగివేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.



ఆచార్య డి. విజయరాఘవ ప్రసాద్
రిజిస్ట్రార్
యోగివేమన విశ్వవిద్యాలయం
కడప - 516 005
ఆంధ్రప్రదేశ్

# సందేశాత్మక సాహిత్యాన్ని కాపాడుకోవాలి

సాహిత్యం మానవ నాగరికతలో ఒక ప్రధాన భూమిక పోషిస్తోంది. మానవ పరిణామ క్రమంలో భాష మనిషికి ఒక ఉన్నత స్థితి కల్పిస్తే, సాహిత్యం మానవ మనోవికాసానికి రహదారులు వేసింది. గతం - వర్తమానం - భవిష్యత్తులను సమగ్రంగా దర్శించి నిరూపించగల సామర్థ్యం సాహిత్యానికే ఉంది. 'రవి కాంచని చోటును కవి కాంచినట్టు' రాజులు నాయకులు కూడా చూడలేని సమాజ పొరల్ని సాహిత్యకారులు చూడగలుగుతారు. సమాజంలోని మంచి చెడుల్ని అతి స్పష్టంగా చూచి, న్యాయంవైపు నిలబడి మాట్లాడగల శక్తి రచయితలకు, కవులకు ఉంటుంది. అలాంటి శక్తి కలిగిన రచయితలలో దేవరకొండ బాలగంగాధర తిలక్ ఒకరు.

భావకవితా యుగంలో పాదాలు ఆన్చి, అభ్యుదయ యుగంలోకి తల నిగిడించిన గొప్ప భావకులు బాలగంగాధర తిలక్. ఇజాలకు, వాదాలకు కట్టుబడకుండా, వాస్తవిక పరిస్థితులను పూనికగా చేసుకొని కవిత్వం రాసిన మానవీయ కవి తిలక్, మానవుడికి ఎంత స్వేచ్ఛకావాలో తెలపడానికి ఆయన రాసిన 'అమృతం కురిసిన రాత్రి' కవిత్వం ఒక 'మేనిఫెస్టో'లా కనిపిస్తుంది. ఆర్తుల, అన్నార్తుల, దీనుల బాధలను అనుభూతించిన రచనలను మనకు అందించాడు. తిలక్ చేసిన రచనలు ఒక ప్రజాస్వామిక సందేశాన్నిస్తాయి. అలాంటి సందేశాత్మక సాహిత్యాన్ని కాపాడుకోవడమే గాక రాబోయే తరానికి కూడా అందించాలనే సత్సంకల్పానికి నిదర్శనం ఈ పుస్తకం. ఈ మహాకవికి శతజయంతి సంవత్సరం

నడుస్తున్నందున, ఈయనపై ఒక అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం, అందులో సమర్పించిన పత్రాలను ఒక పుస్తక రూపంలోకి తేవడం సంతోషకరం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో, మా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ ఈ మహత్తర కార్యానికి వేదిక కావడం మాకు మరింత ఆనందదాయకం. ఈ అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణలు చేసిన అతిరథ మహారథులైన ఆచార్యులకు, పరిశోధకులకు, పాల్గొన్న సాహితీ ప్రియులకు ధన్యవాదాలు చెప్తున్నాను. ప్రత్యేకంగా ఈ సదస్సు కార్యభారం మోయడమే గాక, దీన్ని పుస్తకంగా తేవాలనే సంకల్పానికి అక్షరరూపం ఇచ్చిన డా॥ ఎన్. ఈశ్వర రెడ్డిగారికి ప్రత్యేక అభినందనలు.

# విషయ సూచిక


**1) భావాభ్యుదయ కవి తిలక్**
ఆచార్య హేమచంద్రారెడ్డి, ఛైర్మన్
ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, అమరావతి iii

**2) విశిష్ట సృజనకారుడు తిలక్**
ఆచార్య ఎం. సూర్యకళావతి, ఉపకులపతి
యోగివేమన విశ్వవిద్యాలయం, కడప vii

**3) ఆర్తుల పక్షపాతి తిలక్**
ఆచార్య సుధీర్ ప్రేమ్ కుమార్, కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, అమరావతి ix

**4) సందేశాత్మక సాహిత్యాన్ని కాపాడుకోవాలి**
ఆచార్య విజయరాఘవప్రసాద్, రిజిస్ట్రార్
యోగివేమన విశ్వవిద్యాలయం, కడప xiii

**1. నూరేళ్ళ తిలక్ ఈనాటి మనం**
– ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 1

**2. రనచలో అనుభవ సాంద్రత సాధించిన కవి తిలక్**
– ఆర్వీయస్. సుందరం 6

**3. మానవతావాదం – తిలక్ కవిత్వం**
– ఆచార్య మేడిపల్లి రవికుమార్ 9

**4. తిలక్ కథలు – వస్తు విశ్లేషణ**
– ఆచార్య కె. ఆశాజ్యోతి 17

**5. దేవరకొండ బాలగంగాధర తిలక్ కథలు–మనస్తత్వ విశ్లేషణ**
– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి 27

**6. తపాలాబంట్రోతు–తిలక్ సామాజిక దృక్పథం**
– ఆచార్య ఎం. రామనాథం నాయుడు 39

**7. తిలక్ కవిత్వతత్త్వం**
- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు 46

**8. తిలక్ కథల్లో స్త్రీపురుష సంబంధాలు**
- ఆచార్య కిన్నెర శ్రీదేవి 55

**9. తిలక్ కవిత - నవ్యత**
- ఆచార్య ఎన్.వి. కృష్ణారావు 62

**10. తిలక్ కవిత్వం - అలంకార వైవిధ్యం**
- ఆచార్య పి.ఆర్. హరినాథ్ 81

**11. తిలక్ "అమృతం కురిసిన రాత్రి"-వస్తువిశ్లేషణ**
- ఆచార్య విస్తాలి శంకరరావు 85

**12. దేవరకొండ బాలగంగాధర తిలక్ సాహిత్యంపై పాశ్చాత్య ప్రభావం : ఒక విశ్లేషణ**
- ఆచార్య పి. పద్మ 99

**13. తిలక్ కథలు - మానవీయత**
- డా॥ ఎల్. విజయ కృష్ణారెడ్డి 119

**14. నవనవాలైన ఊహావర్ణార్ణవాలమీద ఉదయించిన సూర్యుడు తిలక్**
- డాక్టర్ వైదేహి శశిధర్, M.D. 125

**15. తిలక్ కథలు - పాత్రచిత్రణ**
- డా॥ పాలెం రమాదేవి 132

**16. తిలక్ నాటికలు - సామాజిక నేపథ్యం**
- డా॥ మూల మల్లికార్జునరెడ్డి 139

**17. తిలక్ నాటికలు - వస్తు విశ్లేషణ**
- డా॥ జి. పార్వతి 144

**18. తిలక్ "అమృతం కురిసిన రాత్రి" అనుభూతి-అభివ్యక్తి**
- డా॥ పి. విజయకుమార్ 151

**19.** **సాలెగూడు సామాజిక గోడు**
– డా॥ డి. నల్లన్న 169

**20.** **తిలక్ రచనలు – ఏకపాత్ర**
– డా॥ తోట వెంకటస్వామి 174

**21.** **తిలక్ వ్యాసాలు – సాహిత్య సైద్ధాంతిక ప్రతిపాదనలు**
– డా॥ టి. రాజశేఖర్ 178

**22.** **తిలక్ లేఖా సాహిత్యం**
– ఎ. రాజయ్య 188

**23.** **సౌందర్యానికి నిలువెత్తు నిదర్శనం తిలక్ కవిత్వం**
– ఎస్.పి. యూసుఫ్, ఎం.సి.జె. 197

**24.** **తిలక్ కథలు – కవిత్మాక శైలి**
– డా॥ వినోదిని మదాసు 204

**25.** **తిలక్ కథలు–శిల్పసౌందర్యం**
– డా॥ పి.సి. వెంకటేశ్వర్లు 208

**26.** **తిలక్ సాహిత్యం – సందేశం**
– డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి 224

# 1. నూరేళ్ళ తిలక్ ఈనాటి మనం

**– ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

వయస్సు సగం తీరకముందే
అంతరించిన ప్రజాకవి
నభసు సగం చేరకముందే
అస్తమించిన ప్రజాకవి.

– అని శ్రీశ్రీగారు తిలక్ గారిని గురించి సరిగ్గానే అన్నారు. తిలక్ ప్రసిద్ధులైన దేవరకొండ బాలగంగాధర తిలక్ బతికింది నలభ అయిదేళ్ళే (01.08.1921–02.09.1966) నడీడు కూడా తీరకుండా మరణించిన భారతీయ రచయితలలో తిలక్ ఒకరు. తిలక్ గారితో తెలుగు సమాజానికి చాలా అవసరం ఉండింది. అది తీరకుండానే అనారోగ్యం ఆయన్ని కబళించింది. ఎన్నేళ్ళు బతికామన్నది కాదు, బతికినన్నాళ్ళలో ఏమి చేశామన్నది ప్రధానం. తిలక్ గారు బతికిన నలబై అయిదేళ్ళలోనే ముప్పై ఆరేళ్ళ రచనా జీవితం గడిపారు (1932–66) ఆ రచనలలో చాలావరకు ఈ నాటికీ ప్రామాణికంగా ఉన్నాయి. ప్రాసంగికత కలిగి ఉన్నాయి.

తొంబై తొమ్మిదేళ్ళ క్రితం 1921 ఆగష్టు ఒకటవ తేదీన ఒక సుసంపన్నమైన కుటుంబంలో పశ్చిమ గోదావరి జిల్లా మండపాకవాసులు రామసోదెమ్మ, సత్యనారాయణమూర్తి దంపతులకు రెండవ సంతానంగా పుట్టిన తిలక్ అప్పటి రచనా రంగంలో మాత్రం అద్వితీయులలో ఒకడుగా నిలిచారు. స్వాతంత్ర్యోద్యమకారుడైన సత్యనారాయణమూర్తి లోకమాన్య బాలగంగాధర తిలక్ మొదటి వర్ధంతినాడు పుట్టిన కుమారునికి ఆభిమానంతో గౌరవంతో ఆ పేరును పెట్టుకున్నారు. అత్రేయ, కుందుర్తి అనిసెట్టి, ఆరుద్ర, గజ్జెల మల్లారెడ్డి, రా.రా., రెంటాల, మధునాపంతుల మొదలైన రచయితలంతా ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో ఒకరి మెడలు ఒకరు తొక్కు కుంటూ తెలుగులను చీల్చుకుంటూ పుట్టుకొచ్చారు ఈ తానులో పోగే తిలక్. ఆయన

పుట్టి నేటికి తొంభై తొమ్మిదేళ్ళు ముగిసాయి. నూరో సంవత్సరం మొదలైంది. ఆయనను స్మరించుకుందాం.

తిలక్‌గారు కవి, కథకుడు, నాటక రచయిత, విమర్శకుడు, నవలారచన కూడా ప్రారంభించారు. పూర్తికాలేదు. ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నిటినీ చేపట్టారు. కవిగా, కథకునిగా మంచి గుర్తింపు పొందారు. తన పదకొండవ ఏటనే 1932లో తిలక్‌గారు కథ రాశారనీ, అది 'మాధురి' అనే పత్రికలో అచ్చయిందనీ కాని అది దొరకడం లేదనీ విమర్శకులు చెబుతున్నారు. చిన్నవయసులోనే రచనలు మొదలుపెట్టిన తెలుగు రచయితలలో ఒకరుగా తిలక్ చేరారు. కవిగా ఆయన పద్యాలు, వచన కవితలు రాశారు. 'ప్రభాతము సంధ్య' (19370, 'అమృతంకురిసినరాత్రి' (1941–66 మధ్య రాసినవి). 'గోరువంకలు' (1942–66 మధ్య రాసినవి) ఆయన కావ్యాలు. తిలక్ రాసిన కథలు 1961లో రెండు సంపుటాలుగా వచ్చాయి. తర్వాత అన్నీ కలిసి 'తిలక్ కథలు' పేరుతో 1967లో వచ్చాయి. 'ఇరుగు పొరుగు" (1960) 'సుచిత్ర ప్రణయం' (1961). 'సుప్తశిల' (1967), 'పొగ' (1968) అనే నాటికలు, 'భరతుడు' అనే ఏకపాత్రాభినయం, 'సుశీలపెళ్ళి' (1961), 'సాలెగూడు' (1980 ప్రచురణ) అనే నాటకాలు రాశాడు. వీటి రచనా కాలాలు, ప్రచురణ కాలాలు వేరు వేరు. కొన్ని వ్యాసాలూ ఉన్నాయి. అమృతం కురిసిన రాత్రి అనే వచన కవిత్వ సంపుటికి 1968లో ఆం.ప్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చాయి.

ఆమధ్య కొన్నాళ్ళు 1855–65 మధ్య తెలుగు సాహిత్య చరిత్రలో స్తబ్దత కాలం అని అంటుండేవారు. దీని మీద సుదీర్ఘ చర్చలు జరిగాయి. అయితే ఆ పదేళ్ళలో గొప్పరచనలు చాలావచ్చాయి. తిలక్‌గారు రాసిన ముప్పై కథలలో పదహారు కథలు 1955–56 మధ్యనే వచ్చాయి. నాటకాలు దాదాపు అన్నీ ఆ కాలంలోనే వచ్చాయి. అమృతం కురిసిన రాత్రిలోని 83 కవితలలో యాభై కవితలకు పైగా ఆ పదేళ్ళలోనే వచ్చాయి. అయినా అది స్తబ్దతాయుగం కావడం విచిత్రం.

తిలక్ సహాయ నిరాకరణోద్యమ కాలంలో పుట్టారు. విప్లవోద్యమ తూర్పు పటం ఎగురుతున్న సమయంలో కన్ను మూశారు. భారత స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ రైతాంగ పోరాటం, చైనా విప్లవం, రెండవ ప్రపంచ యుద్ధం, ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అవతరణ చూశాడు. విద్యార్థి దశలో ఆయన వామపక్షవాదిగా ఉండేవారు తర్వాత రాయిస్ట్ అయ్యారు. ఆ తర్వాత గాంధీయన్ అయినట్లున్నారు.

తిలక్ తననుతాను 'అనభూతివాది'గా ప్రకటించుకున్నారు. "స్వాతంత్ర్యంలో సామ్యవాదం పనికిరాదు" అన్నారు. "ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఉంటే కవికి లాభదాయకం కాదు. ఉత్తమ కవితా సృష్టికి సరిపడదు" అన్నారు నా కవిత్వం కాదొక తత్వం/మరికాదు మీరనే మనస్తత్వం/కాదు ధనికవాదం, సామ్యవాదం/కాదయ్యా అయోమయం, జరామయం" – అని 1941లో 'నా కవిత్వం' అనే కవితలో ప్రకటించుకున్నారు. ఈ అభిప్రాయాలన్నీ ఆయన కాలంలో ప్రధాన స్రవంతిగా ఉన్న అభ్యుదయ, మార్క్సియ సాహిత్య ధోరణిని ప్రతిఫలించేవిగా కనిపిస్తాయి. ఆయన అభిప్రాయాలు ఆయన ఒక అనిబద్ధ రచయిత అనే అభిప్రాయం కలిగిస్తాయి.

"కాదేదీ స్థిరబిందువు" అని ప్రకృతిలో సమాజంలో మార్పును గుర్తించారు. మధ్యతరగతి జీవులు ఊగిసలాటను, క్రింది తరగతి జీవుల నిజాయితీని చిత్రించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దుర్మార్గాలను ఖండించారు. మానవత్వాన్ని ఆలింగనం చేసుకున్నారు. ప్రపంచ యుద్ధాన్ని చాలా కాలం వస్తువుగా చేసుకుని రచనలు చేశారు. ప్రపంచ శాంతిని కోరుకున్నారు. సమాజంలో కనిపించే వ్యదార్థ జీవుల యదార్థ గాథలను సాహిత్యీకరించారు. చైనాతో మన దేశానికి యుద్ధం వచ్చినప్పుడు చైనాను వ్యతిరేకించారు. తిలక్ సాహిత్యంలో అంతర్జాతీయ సమాజం కనిపిస్తుంది. జాతీయ దృష్టి ఉంది. ఏమైనా ఆయన కాల్పనిక లక్షణాలను వదులు కోకున్నా ప్రజావ్యతిరేక, తిరోగమనవాద రచయిత కాలేదు. సమకాలీన సామాజిక వాస్తవికత విమర్శనాత్మకంగా, కళాత్మకంగా ఆయన సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. అది ఈ నాటికీ మనకు ఆదర్శం.

"తత్వాల పేర, విప్లవాల పేర/ ఒకరినొకరు చంపుకో లేము". "మరచిపోకు అసలువాణ్ణి/ నీ సోదరువైన మానవుణ్ణి" – అన్నది తిలక్ ఆలోచనను ప్రతిబింబిస్తున్నది. రాజకీయ పార్టీలకూ పాలక వర్గానికి రచయితలు లోబడి ఉండడం ఆయనకు నచ్చలేదు 'కవివాక్కు' కవితలో ఈ విషయం ప్రకటించారు. మార్క్సిజం కన్నా ఆయనకు దేశీయమైన బౌద్ధం బాగా ఇష్టమైనట్లుంది. పరదేశీ స్తుతిలో స్వకీయ సంస్కృతి విస్మరించకు/ ఇంకా కరిగి నీరైపోలేదు హిమాలయ శిఖరాలు/ ఇంకా మరచిపోలేదు తథాగతుని మహాత్ముని ప్రవచనాలు" అని ప్రకటించారు.

తనది సామ్యవాదం కాదని తిలక్‌గారు చెప్పుకున్నా తన సాహిత్యం నిండా సామ్యవాదులు చిత్రించిన దృశ్యాలనే, సన్నివేశాలనే, సందర్భాలనే చిత్రించారు. స్తబ్ధతా యుగంగా ప్రచారం జరిగిన 1955–65 మధ్య తిలక్ రాసిన ఆరు కవితలు చాలు

వారిలోని అభ్యుదయ కవిని గుర్తించడానికి అవి 'అర్త గీతం' (1956), 'ప్రార్థన' (1963), 'నవత-కవిత (1964), 'తపాలా బంట్రోతు' (1959), 'సిఐడి రిపోర్టు' (1965). 'మన సంస్కృతి' (1965) ఇవి అప్పటికే కాదు, ఈనాటికి మన సమాజంతో, మన సాహిత్యంతో ప్రాసంగికత కలిగి ఉన్నాయి. 'అర్తగీతం'లో కవి చూసిన దృశ్యాలు 'కవితా! ఓ కవితా!'లో శ్రీశ్రీగారికి కనిపించిన దృశ్యాలను తలపిస్తాయి. "నా దేశాన్ని గురించి పాడలేను ఒక్క నిరుపేద వున్నంత పరకు/ ఒక్క మలినాశ్రుబిందువొలకినంత వరకు/ఒక్క ప్రేగు ఆకలి కనలినంతవరకు" అని 65 ఏళ్ళ క్రితం అన్నారు తిలక్. దేశం వెలిగిపోతోంది, అంతా బావుంది. స్వర్ణభారత్, స్వచ్ఛభారత్ వంటి ఆకర్షణీయమైన స్వీయ ముద్రలనడుమ కరోనా కాలంలో లాక్‌డౌన్ సడలింపు నేపథ్యంలో ఆరు వారాలు పనిలేక తిండి దొరక్క, నగరాల నుండి స్వస్థలాలకు రోడ్లమీదికి వచ్చి కాలి నడకన బయలుదేరిన 15కోట్ల మంది వలస కూలీలను చూస్తే తిలక్ నిరసనకు మనకు ఉన్న సంబంధం అర్థమౌతుంది. "ఏ వెలుగులకీ ప్రస్థానం" అని శ్రీశ్రీ ప్రశ్నించినట్లు "ఈ ఆర్తి ఏ సౌధాంతరాలకు పయనించగలదు" అని తిలక్ ప్రశ్నించారు.

"దేవుడా రక్షించు నా దేశాన్ని / లక్షలాది దేవుళ్ళ నుండి వారి పూజల నుండి వారి వారి ప్రతినిధుల నుండి" అని తిలక్ అయిదున్నర దశాబాల క్రితం చేసిన ప్రార్థన అప్పటి కన్నా ఇప్పటి మన సమాజానికి బాగా నప్పుతున్నది. ఈ కవితలో కవి పేర్కొన్నవారు ఇప్పుడు కుప్పలు తెప్పలుగా పెరిగిపోయి శాసించే దశకు చేరుకున్నారు. తిలక్ ముందుచూపు "మాకు నటనలు వద్దు" అన్నాడు కవి. ఈ నటననే తర్వాత దిగంబర కవులు ఎండగట్టింది. ఇప్పుడు నటనే రాజ్యమేలుతున్నది. గిరీశాలు ఇప్పుడు ఎందెందు వెదకి చూచిన అందందే కనిపిస్తున్నారు. "బ్రతుకు పొడుగునా స్వతంత్రం" కావాలని కోరుకున్నారు తిలక్‌గారు ఈ మాట ఇప్పటికీ అవసరమే.

"మనగలిగినదీ / కాలానికి నిలబడగలిగినదీ/ వద్దన్నా పోరు.../ మనుశిక్షాస్మృతికి/ గౌరవం లేదని వీరికి లోపల దిగులు.../ అయిదు ఖండాల మానవ సంస్కృతి అఖండ వసుధైక రూపాన్ని ధరిస్తోందనీ/ గ్రహించలేరు పాపం వీరు" - ఈ మాటలు గత కొంతకాలంగా మన సమాజంలో నెలకొన్న పిడివాద పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి. "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్" అని నమ్మే వాళ్ళకు, "మంచి గతమున కొంచెమేనోయ్" అని నమ్మే వాళ్ళు శత్రువులుగా కనిపిస్తున్నారు. అణచివేయవలసిన

వాళ్ళుగా కనిపిస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించడానికి భౌతిక దూరం పాటించమని తెలిసిన వాళ్ళు సూచిస్తే, ఇదే అదను అనుకొని 'చూశారా! మా పూర్వీకులు చెప్పిందే ఇప్పుడు ప్రపంచానికి ఆదర్శమైంది' అంటూ గతకాలపు దుర్మార్గాన్ని పద్యాలుగా రాసి రాగాలు తీసినవాళ్ళని మనం ఇటీవల చూశాం. కవిగా తిలక్‌గారు ఇలాంటివాళ్ళ కన్నా ఎంత ముందున్నారో కదా. వీళ్ళ నుంచే దేశాన్ని రక్షించమని ఆయన ప్రార్థించింది. "కవి, ప్రవక్తా కాలం కన్నా ముందుంటారు" అని గురజాడ అన్నది మనం గుర్తు చేసుకోవాలి.

తిలక్‌గారు మధ్యతరగతి రచయితగా పేరొందారు. క్రింది. తరగతివాళ్ళను గురించి కూడా ఆయన రాశారు. అయినా ఆయన సాహిత్యంలో మధ్యతరగతి మందహాసం వాస్తవిక రూపంతో ప్రతిబింబిస్తుంది. ఆయన కథలలో ఇది బాగా కనిపిస్తుంది. సీతాపతి కథ, ఆశాకిరణం, నల్లజర్ల రోడ్డు, సుందరీ సుబ్బారావు వంటివన్నీ మధ్యతరగతి కథలే. 'సముద్రపు అంచులు', 'ఊరిచివరి ఇల్లు' వంటి కథలు క్రిందితరగతి జీవిత ప్రతిఫలనాలు.

తిలక్‌గారిని 21వ శతాబ్దం యువ రచయితలు. యువ విమర్శకులు అధ్యయనం చేయాలి. ఇదివరకే చదివినవాళ్ళు మారిన ప్రపంచ సందర్భంలో కొత్తగా చదవాలి. వాదాలకు లొంగనంత మాత్రాన ఆయన దేనికి చెందని రచయిత కాదు.

"మతం నల్ల మందు

గతం ముదిమికి విందు" ('న్యూ సిలబస్' 1962) – అంటున్న తిలక్ గారి సందేశాన్ని ఇప్పటి ప్రపంచం గుర్తించాల్సిన, మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 2. రసచలో అనుభవ సాంద్రత సాధించిన కవి తిలక్

– ఆర్వీయస్. సుందరం

'అమృతత్వమోదో వ్యాపించె నాలోన' అని తనలో వ్యాపించిన అమృత తత్వాన్ని చదువరులకు అందించటానికి అవతరించిన విశిష్టసాహితీవేత్త దేవరకొండ బాలగంగాధర తిలక్.

ఎన్ని ప్రక్రియల్ని చేపట్టినా కవినే అత్యున్నత సాహితీ వేత్తగా గౌరవిస్తుంది సమాజం. విశ్వనాథ సత్యనారాయణగారు ఎన్ని ప్రక్రియల్ని పండించినా ఆయన్ని మహాకవి అనే అంటారు. శ్రీశ్రీ నవల, కథ, నాటకం, వ్యాసం, ఆత్మకథ రాసినా కవి అనే పిలుస్తారు. కవి 'ఆనందం మనిషైన వాడు.' కవి 'జీవితాన్ని ప్రేమించిన వాడు, జీవించడం తెలిసినవాడు. అంతేకాదు 'నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు.' అందువల్లనే కవికి అత్యున్నత స్థానం.

తిలక్ జన్మించి రచనలు చేసిన కాలం సంధికాలం. శ్రీశ్రీ జన్మించిన 11 సంవత్సరాలకు (1921) జన్మించిన తిలక్‌కు స్నేహితులు మల్లవరపు, అనిసెట్టి, అబ్బూరి వరదరాజేశ్వరరావు, ఆవంత్స సోమసుందర్ మొదలైనవారు. 14వ ఏట మొదలుపెట్టి 25 వరకు భావకవిత్వం రాసిన తిలక్ 33వ సంవత్సరం వచ్చేవరకు అనారోగ్యంతో బాధపడ్డారు. 1954 నుంచి 1966 వరకు అభ్యుదయ కవిత్వం రాశారు.

తిలక్ కీర్తి శేషులయ్యే కాలానికి దిగంబర కవులు వచ్చారు (1966). అంతవరకు వచ్చిన కవిత్వంలో ముఖ్యంగా భావకవిత్వం, నవ్యసంప్రదాయ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, పఠాభి ఆధునిక అభివ్యక్తి ప్రయోగాలు ముఖ్యమైనవి.

తిలక్ వచన కవిత్వానికి ప్రతినిధి అని, అనుభూతి కవి అని పేర్కొనటం జరుగుతోంది. తిలక్ వచన కవిత్వాన్ని రాసిన ఆనాటి కవుల్లో ముఖ్యులన్నది నిజం.

'అనుభూతి కవి' అనే పదాన్ని శేషేంద్ర తీవ్రంగా వ్యతిరేకించే వారు. అనుభూతి – అభివ్యక్తి లేని కవి ఎవరూ ఉండరు. అలాంటప్పుడు 'అనుభూతి కవి' అనటం తప్పు అంటారాయన. అయితే కొన్ని పదాలు మామూలు అర్థాలను మీరి పారిభాషిక పదాలుగా మారుతాయి. భావం లేకుండా కూడా కవిత్వం ఉండదు. కాని భావకవిత్వం అన్నది తెలుగులో పారిభాషిక పదమైపోయింది.

ఇవన్నీ ఎట్లున్నా తిలక్ సమన్వయ కవి అనిపిస్తుంది. అయి భావకవిత్వానికి, ఇటు అభ్యుదయ కవిత్వానికి సమన్వయం సాధించారు తిలక్. తిలక్ కవిత్వాన్ని చదువుతుంటే ఒక వైపు కృష్ణశాస్త్రి, మరోవైపు శ్రీశ్రీ కళ్ళముందు మెదులుతుంటారు. 'వర్షాహేల'లో తిలక్ ఇలా రాశారు

'తన విశాల వినీల ఘనాఘన చేలాంచలముల
దిశదిశలకు విసరుచు
హిమవింధ్యా శిఖరపర్వత్ పవన చలత్ తీరు
పర్ణకోటి నెగదిమ్ముచు
నిజ సముద్ర హృద్భడబాయిత విరహాగ్ని చ్ఛటా
కుదారముల ద్రిప్పుచు
వచ్చెనహో వర్షానవ తరుణుడు ధాత్రీ హృదయేశుడు
కదువడిగా.'

కృష్ణశాస్త్రి కురిసిన కవితా వర్షంలాగే ఉందిది. 'ముసలివాడు' అనే కవితలో ఇలా రాశారు తిలక్.

'కనుగూడులు నల్లనయి – పెనుమ్రోడులు చల్లనయి
కీలుకీలుగా బాధగా – నాడునాడులు లాగగా
చలిగాలి చూరులో కసరినట్టు
చలిచీమ మట్టిలో దొలచినటు
వచ్చినది మూగినది ముసరినది
ముసలితనము
ముసలివాణ్ణి నాయనలారా
ముసలివాణ్ణి.'

ఈ కవిత చదువుతుంటే శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' జ్ఞాపకం వస్తుంది. ఇవి కేవలం ఒకటి రెండు ఉదాహరణలు మాత్రమే. తిలక్ కవిత్వం తిలక్ కవిత్వమే. అది భావోద్వేగాన్ని సామాజిక స్పృహనీ మిళితం చేసి చెప్పిన సమన్వయ కవిత్వం. తిలక్

అచ్చమైన కవి. అచ్చమైన కవికి భాషకు సంబంధించిన పరిమితులుండవు. అవధుల్లేని కవితాత్మని ప్రదర్శించగల్గిన వాడే అచ్చమైన కవి. ఎవరైనా కవి అనగానే ఎవరు చదివినా, ఏ భాషలో చదివినా కవిత్వం అనుకోవాలి. కృష్ణశాస్త్రిని, శ్రీశ్రీని, శేషేంద్రని, శివారెడ్డిని అనువాదం చేసినప్పుడు ఇలాంటి అభిప్రాయాలే వెలువడ్డాయి.

తిలక్ కవిత్వ రూపంగా మలచిన పదాలు 'ఇది కవిత్వం' అనే అనుభవాన్ని కలిగిస్తాయి.

'నేను పుట్టిన పురుటి నొప్పుల చీకటి బాధ

నేను నశించి చావు సంజెల నెత్తుటి చార

చెరపికొని నీ మధ్య నా మధ్యగల దూరపు బాధ' – దీన్ని చదివినప్పుడు కలిగేది కవిత్వానుభవమే.

కవికి పదాలను ఎలా వాడుకోవాలో తెలియాలి. చెప్పేదాన్ని చమత్కార భరితంగా చెప్పాలి. వాచ్యార్థాన్నే కవిత్వం అనుకుంటే పొరపాటే. 'వక్రోక్తి' కవిత్వానికి జీవాన్నిస్తుంది. తిలక్ రాసే వాక్యాలలో ఇలాంటి గుణాలు అడుగడుగునా కనిపిస్తాయి. 'చీలిన జీవితాల అస్పష్టపు ఆక్రందన' అన్నప్పుడు ప్రతి పదాన్ని ఎలా ఉపయోగించుకొని కవి అవుతాడో స్పష్టమవుతుంది. అప్పుడు 'జీవితం చీలడమేమిటి' అనే ప్రశ్న ఉదయించదు. ఆక్రందన స్పష్టంగా వినిపిస్తుంది. ధ్వని పూర్వకంగా వస్తుంది. కాని 'అస్పష్టపు ఆక్రందన' లో విశేషం ఉంది. అది చీలిన జీవితాలకు సంబంధించింది.

'ధ్వనులు భయంకర రహస్యాలపైన నల్లని విస్మృతీ వస్త్రం కప్పేవేళ' అన్నది మరో రకమైన అభివ్యక్తి. రహస్యాలను దాచిపెట్టటానికి ధ్వని చేసే విచిత్ర సందర్భాన్ని వెలికి తీసే భావన.

తిలక్ రాసిన వాటిలో 'ఎండమావుల పండుగలు చేసుకొనే కోట్లకొలది జనుల్ని గురించి, కదలని గడియారపు గుండెల్నీ చినిగిన స్వప్నపు సంచుల్ని' గురించి ఉంది. వీటిలో ప్రతి వాక్యమూ ప్రతి పదమూ అర్థగర్భితమే.

కవిత్వంలోనే కాదు, కథల్లోనూ తిలక్ అనుభవాల సాంద్రత కనిపిస్తుంది. సంభాషణా చాతుర్యం, సుతిమెత్తని హాస్యం, రాజకీయ స్పృహ, గాఢమైన పరిశీలన కనిపిస్తాయి. పద్యంలాగే గద్యం కూడా త్యాగనిరతిని, ప్రేమ భావనల్ని, శాంతి కాముకతని ప్రదర్శిస్తుంది. మొత్తం మీద తిలక్ సాహిత్యం ప్రతి జీవితం ప్రత్యేక జీవితమని నిరూపిస్తుంది.

# 3. మానవతావాదం - తిలక్ కవిత్వం

- ఆచార్య మేడిపల్లి రవికుమార్

ఆంగ్లంలోని 'హ్యూమనిజం' అన్న మాటకు సమానార్థకంగా తెలుగులో వ్యవహరించబడుతున్న పదం - మానవతావాదం. ఇది పాశ్చాత్య దేశాల నుంచి మనకు సంక్రమించిన ఒక తాత్త్విక చింతన.

సాహిత్యంలో మానవతావాదాన్ని పరిశీలించే సందర్భంలో ఇప్పటికీ మనలో కొంతమంది దాని అస్తిత్వాన్ని అందుకోలేకపోతున్నారు. పుణ్యక్షేత్రాల పరిసరాలలో భిక్షువులకు దానధర్మాలు చేయడం; ఆకలితో అలమటిస్తున్న వారిపై జాలిపడి తనకు తోచింది సహాయం చేయడం; చీమలకు పంచదార చల్లడం; పాములకు పాలు పోయడం; పిల్లులకూ కుక్కలకూ మిగిలిపోయిన అదనపు ఆహార పదార్థాలను అందించడం; మరీ ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులపై జాలిపడి పిల్లలు పూటకు పిడికెడు మెతుకులు పెట్టడం వంటి సన్నివేశాలను మానవతావాదంలో భాగంగా; మూర్తీభవించిన మానవత్వానికి పరాకాష్ఠగా పరిగణించడం కొన్ని సందర్భాల్లో గమనిస్తున్నాం. ఇలాంటి అంశాలను మానవతావాదంలో భాగంగో భావించడం తప్పని చెప్పడం నా ఉద్దేశం కాదుగాని; కేవలం ఇది మాత్రమే మానవతా వాదం కాదని గుర్తించడం ఇక్కడ అవసరం.

మానవతావాదం అన్న భావన ఆవిర్భావం వెనుక ఒక తాత్త్విక సమాలోచన ఉంది. ప్రకృతి, భగవంతుడు, జీవుడు వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా కొన్ని శతాబ్దాలుగా చర్చోపచర్చలు జరుగుతూ ఉన్నాయి. ముఖ్యంగా ప్రకృతి - మానవుడు - భగవంతుడు మధ్య ఉన్న సంబంధం గురించీ; ఆధిపత్య అనాధిపత్యాల గురించీ; నాటి అస్తిత్వాల గురించీ ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన విశ్లేషణలు కొన్ని మనకు తెలిసినవే.

చారిత్రకంగా పరిశీలించినపుడు సాంస్కృతిక పరిణామక్రమంలో మధ్యయుగాల కాలంలో ఒక ఆలోచన స్థిరపడింది. మనిషిని భగవంతుడు సృష్టించాడనీ; మనిషి

కంటే భగవంతుడు బలవంతుడనీ; మానవశక్తి కంటే మానవాతీతమైన దైవశక్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఈ ఆలోచనాధోరణికి వ్యతిరేకంగా ఐరోపా దేశాల్లో పద్నాలుగు, పదిహేను శతాబ్దాల్లో మానవతావాదం పురుడు పోసుకుంది. పదహారో శతాబ్దం నాటికి పరిణత దశకు చేరుకుంది.

సాహిత్యంలోనూ ఈ వాదం స్పష్టంగా తన చిరునామాను లిఖించుకుంది. ఐరోపా ఖండంలో పునరుజ్జీవన ఉద్యమకాలం రినైజాన్స్ మూమెంట్ నాటి విలువలలో ఆదర్శాలూ 19వ శతాబ్దం నాటికి 'మానవతావాదం' పేరుతో వ్యవహారంలోకి వచ్చాయి.

ఈ మానవతావాదం ఆవిర్భావాన్ని విమర్శకులు ఇలా గుర్తించారు. "మానవుడు ఇహలోక, భౌతిక వాంఛలతో మలినమైన దారుణమైన పాపి అనే దాని నుంచి అతడు విముక్తి కావలసి ఉందని మధ్యయుగాలనాటి క్రైస్తవ ఋషుల అవగాహన. ఈ అవగాహనకి భిన్నంగా మానవుడిలో అనేకమైన ఉత్తమ శక్తి సామర్థ్యాలున్నాయనీ, భౌతిక ఆధ్యాత్మిక నైతిక మేథోపరమైన అంశాలన్నిటి మధ్యా మానవుడు ఒక సమతౌల్యాన్ని సాధించగలడనీ పునరుజ్జీవనకాలపు మానవతా వాదులు భావించారు." (ఎస్.ఎస్.నళిని – సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, పు.141). ఈ భావన అనతి కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా ప్రసరించింది. తాత్త్వికులనూ, రచయితలనూ అధునాతన ధోరణిలో ప్రభావితం చేసింది.

మన దేశానికి సంబంధించినంత వరకూ మానవతావాదం ప్రభావం రాజారామ మోహనరాయ్ మీద ప్రగాఢంగా పొడచూపింది. ఈ భావనకు భారతీయ ప్రతినిధి ఈతడే! అలాగే ఆంధ్రదేశానికి ప్రతినిధి కందుకూరి వీరేశలింగం పంతులుగారు. కవులలో జాతీయ స్థాయిలో రవీంద్రనాథ ఠాగూరు, రాష్ట్రస్థాయిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి మానవతావాద భావ వ్యాప్తికి భుజంకాశారు.

"రేపటి మనిషికోసం, రేపటి ఉజ్జ్వల ప్రతిభా వికాస్‌కోసం – మనిషి మనిషి తనాన్ని కోల్పోరాదనీ, సాటి మనిషి ఉనికినీ మరిచిపోరాదనీ, చేయీ చేయీ కలిపి, సంకుచిత ధోరణులు – అవి ఏ రూపంలో వున్నా నులిపేసి – ఒకే ఒక్క మానవ సంఘం ఒకే ఒక మానవాత్మగా మనగలగాలనీ మానవతావాద సారాంశం" అని విమర్శకులు గుర్తించారు. (ఇంద్రగంటి శ్రీకాంతశర్మ – మానవతావాద దృక్పథాలు – సామాజిక చైతన్యము (వ్యాసం) అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, సంపా. పేర్వారం జగన్నాథం, పు.128) ఈ మానవతావాద భావనను నిండుగా ఆవిష్కరించిన

అతికొద్దిమంది తెలుగు కవుల్లో ఒకరు బాలగంగాధర్ తిలక్. తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి అందుకు నిలువెత్తు సాక్ష్యం.

"అగాధ బాధా పాథః పతంగాలూ
ధర్మవీరుల కృత రక్తనాళాలూ
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతి సూక్తి
నా కళాకారుల ధగద్ధగ రవాలు" (నా కవిత్వం, పు.5)

పై పాదాలు 'నా కవిత్వం' కవిత్వలోనివి. 'అమృతం కురిసిన రాత్రి' సంపుటిలో ఇది తొలి కవిత. తిలక్ పేరు తెలిసిన వారందరికీ పైన ప్రస్తావించిన పాదాలు గుర్తుండక పోవచ్చుగానీ, కవిత అందరికీ పరిచయమే. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని తిలక్ తన కవిత్వాన్ని గురించి చెప్పుకొన్నది ఈ కవితలోనే. ఈ అందమైన ఆడపిల్లలు తిలక్‌లోని భావుకతనే ఎక్కువగా ప్రస్ఫుటం చేశారు. కానీ కవితలో నాణానికి మరోవైపు మూర్తీభవించి ఉన్న మానవత్వాన్ని ఈ ఖండికలో చాలామందిమి గుర్తించడం లేదు. పై పాదాలు తిలక్ అంతరంగంలో అణగిమనగి ఉన్న మానవతావాద భావజాలాన్ని పట్టి చూపిస్తాయి. ఈ పాదాల విస్తరణ రూపమే అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటి. విషయం కొందరికి అంత స్పష్టంగా అందకపోవచ్చు; కానీ, తిలక్‌లో అంతర్గతంగా మూర్తీభవించి ఉన్న మానవతావాద భావజాలానికి తొలి కవితలోని ఈ ప్రస్తావిత పాదాలు నాటకంలోని నాందీ ప్రస్తావనల వంటివి.

'ప్రార్థన' ఖండిక తిలక్ కవితల్లో ఒక కలికితురాయి. ఆ కవితలో తిలక్ ప్రదర్శించిన అద్భుతమైన కవితా శిల్పాన్ని అటుంచితే మానవత్వాన్ని ధ్వనింప చేసే కవితాపాదాలు ఆ కవిత నిండా ఏరులై పారుతాయి.

"చావు పుట్టుకల మధ్య సందేహం లాంటి
జీవితంలో నలువైపులా అంధకారం
మంచి గంధంలాగ పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం" (ప్రార్థన, పు.108)

జీవితంలో నలువైపులా అంధకారం ఆవహించినపుడు ఎవరికైనా కనీసం ఒక చిరుదివ్వె ఆసరా అవసరం. అందుకు ప్రమెదలూ, వత్తులూ, వగైరాలు వెతకనవసరం లేదు. మంచి గంధంలాంటి పరిమళించే మానవత్వాన్ని అలంకరించుకుంటే చాలు.

అదే ఒక పెనుదివ్వె కాంతులీనుతుంది. ఆవహించిన అంధకారాన్ని ఆవలదూరం నెట్టేస్తుంది.

దేశాన్ని అంధకారం అలుముకోడానికి కారణాలేమిటో, ఆ పీడక శక్తులేమిటో కవికి తెలుసు. వాటన్నింటినీ దేవుడి ముందు పరచి, వాటి నుంచి ఈ దేశాన్ని రక్షించుకుని తిలక్ దేవుణ్ణి ప్రార్థించాడు.

దేవుడా!
రక్షించునా దేశాన్ని
పవిత్రులనుండి పతివ్రతలనుండి
పెద్దమనుషుల నుండి పెద్దపులుల నుండి
నీతులరెండు నాల్కలు సాచి బుసలు కొట్టే
నిర్హేతుక కృపాసర్పాలనుండి
లక్షలాది దేవుళ్లనుండి వారి పూజారులనుండి
వారి వారి ప్రతినిధులనుండి
సిద్ధాంత కేసరులనుండి సిద్ధులనుండి
శ్రీ మస్మద్గురు పరంపరనుండి (ప్రార్థన, పు.107)

తిలక్ అభ్యుదయ కవి. ఇక్కడ దేశం అంటే చతుర్వేదాలూ, గంగాజలాలూ, కైలాస పర్వతాలు, ఆలయాలు వగైరాలు కావు. ఇవే దేశమనుకుంటే అక్కడ మానవత్వం పరిమళించదు. తిలక్ మానవతావాది. “దేశమంటే మట్టికాదోయ్ – దేశమంటే మనుషులోయ్” అన్న గురజాడ మాట తిలక్‌కు గురుబాట. అందుకే తిలక్ కష్టజీవుల పక్షాన, కడుపు నిండని వారి పక్షాన నిలబడ్డాడు.

లక్షలాది దేవుళ్ళనుండి, వారి పూజారులనుండి ఈ దేశాన్ని రక్షించమని కవి దేవుడికే విన్నవించుకోవడంలో ఒక గడుసుతనం ఉంది. సాంకేతికంగా చూసినపుడు అభ్యుదయవాదులు చెప్పే వర్గస్పృహకూ, మానవతావాదానికి కొంత భేదం ఉండొచ్చు. కానీ, ఈ రెంటినీ ఒక్కొక్కసారి విడదీసి చూడలేం. ఈ రెంటికీ అవినాభావ సంబంధం కూడా కన్పిస్తుంది. ‘దేవుడు చేసిన మనుషులు’ అనడం ఆధ్యాత్మికవాదుల ఆలోచన. ‘మనుషులు చేసిన దేవుళ్ళు’ అనడం అభ్యుదయవాదుల స్పష్టీకరణ. దేవుడు చేసిన మనుషుల్లో శ్రామిక ప్రజాపక్షం వహించేవారు, ప్రజావ్యతిరేక పక్షం వహించేవారూ ఉన్నారన్నది స్పష్టం. అలాగే ఈ వర్గపక్షపాత స్వభావం కలిగిన మనుషులు చేసిన

దేవుళ్ళు కూడా ఈ వర్గ దృక్పథాలు కలిగి ఉండటం సహజమే. కొందరు దేవుళ్ళు శ్రామిక ప్రజల పక్షం వహించి ఈ గట్టునున్నారు. మరికొందరు దేవుళ్ళు ప్రజా వ్యతిరేక పక్షం వహించి ఆ గట్టునున్నారు. దేవుళ్లలో వీరి సంఖ్యే ఎక్కువ. ఈ లక్షలాది దేవుళ్ళు, వారి పూజారుల ఆగడాలనుంచి, పీడనల నుంచి పేద ప్రజానీకాన్ని పరిరక్షించమని ఈ గట్టు నున్న దేవుణ్ణి తిలక్ ప్రార్థిస్తున్నాడు. పురుషులందు పుణ్యపురుషులు వేరైనట్టుగా దేవుళ్లలో ఈ గట్టునున్న దేవుళ్లు వేరు. వీరు మానవత్వం మూర్తీభవించి ఉన్న వాళ్లు.

ఆ గట్టునున్న ఈ లక్షలాది దేవుళ్లతో పాటు, వారి పూజారులను కూడా పీడకవర్గంలో కవి కలిపి చెప్పాడు. 'దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడ'నే సామెత మనకు తెలిసిందే. పూజారి వ్యవస్థలో అక్కడక్కడా కన్పించే దుర్మార్గానికి ఈ సామెత ఒక చెరిగిపోని సాక్ష్యం. గుర్రం జాషువ తన 'గబ్బిలం' కావ్యంలో 'ముప్పది మూడు కోట్ల దేవతలెగబడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారవని స్పష్టం చేశాడు. అందుకే అరుంధతీసుతుడు ఆగట్టునున్న కోట్లాది దేవతలకు కాక, ఈ గట్టునున్న శివుడికి తన ఆత్మఘోషను నివేదించమని గబ్బిలంతో చెప్పాడు. అది కూడా, పూజారి లేని వేళ విన్నవించమని ప్రత్యేకంగా సూచించాడు. 'గబ్బిలం' కావ్యంలోని ఈ ఘట్టాన్ని ఒకసారి ఈ సందర్భంలో గుర్తుచేసుకుంటే తిలక్ 'ప్రార్థన' ఖండిక, తిలక్‌లోని మానవత్వపు పరిమళం, బడుగు జీవుల పట్ల తిలక్‌కున్న సాహానుభూతి మరికొంత స్పష్టపడుతుంది. ఇటువంటిలోతైన ఖండికలు తిలక్ రచనల్లో మరికొన్ని లేకపోలేదు.

"కనుగూడులు నల్లనయి
పెను మ్రోడులు చల్లనయి
కీలు కీలుగా బాధగా
నాడు నాడులు లాగగా
చలిగాలి చూరులో కసరినటు
చలిచీమ మట్టిలో దొలిచినటు
వచ్చినది మూగినది ముసిరినది
ముసలితనము
ముసలివాణ్ణి నాయనలారా
ముసలివాణ్ణి (–ముసలివాడు, పు. 22)

ప్రముఖ అభ్యుదయ కవి, మహాకవి శ్రీశ్రీ రచించిన 'భిక్షువర్షీయసి' కవిత మనకందరికీ సుపరిచతమే. ఆ కవితలో చిత్రించిన ముదుసరి 'భిక్షువర్షియసి' అయితే; తిలక్ వర్ణించిన ఈ ముసలివాడు 'భిక్షువర్షీయుడు'. జెండర్ మాత్రమే మారింది. మిగిలిందంతా సేమ్ టు సేమ్. "ఊరు మారినా ఉనికి మారునా?" అన్నట్టుగా జెండర్ మారినా వెతార్త జీవుల యథార్థ జీవన దృశ్యాలు ఒకలాగే ఉంటాయనడానికి ఈ 'ముసలివాడు' ఖండిక ఒక ఆసరా. అభ్యుదయ వాదానికీ, మానవతావాదానికీ తరచూ కన్పించే సహోదర సంబంధాన్ని కూడా ఈ కవిత నిరూపిస్తుంది. తిలక్ రచించిన చాలా కవితలు ఈ విషయాన్ని మరికొంత స్పష్టం చేస్తాయి.

'అమృతం కురిసిన రాత్రి' సంపుటంలోని 'ఆర్తగీతం' ఈ నాటికీ మనకళ్ళు చెమ్మగిల్లచేసే చెదిరిపోని ఆర్తిగీతం.

"నా దేశాన్ని గూర్చి పాడలేను
నీ ఆదేశాన్ని మన్నించలేను
ఈ విపంచికకు శ్రుతి కలపలేను
ఈ రోజు నాకు విషాద స్మృతి
విధితమస్సులు మూసిన దివాంధరుతి
నా యెదద మ్రోడైన ఒక దుస్థితి" (–ఆర్తగీతం, పు.49)

ఈ కవితలోని 'దేశం' కూడా 'ప్రార్థన' ఖండికలోని దేశమే. గురజాడ చెప్పిన దేశమే. కవి 'యెదద మ్రోడైన దుస్థితి'కి కారణాలు అనేకం. కడుపునిండిన వాళ్ళకీ, యెదద కరుడు కట్టిన వాళ్ళకీ ఈ దేశంలో కన్పించే దృశ్యాలు వేరు. మట్టినికాక, మనిషుల్ని ప్రేమించేవారికీ, మానవత్వం మూర్తీభవించినవారికీ ఈ దేశంలో అగపడే దృశ్యాలు వేరు. అందుకే తిలక్ తాను చూసిన దృశ్యాలకు గర్వపడలేదు. ఎంతగానో ఆర్తి చెందాడు. ఆర్తగీతం ఆలపించాడు.

"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి
మర్రి చెట్టుకింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూశాను నిజంగా నీరంధ్రవర్షాన
వంతెనకింద నిండుచూలాలు
ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక

తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ
మురికి కాల్వ పక్కనే నిద్రించిన
మూడేళ్ల పసిబాలుణ్ణి
. . . . . . . . . . . . ."        (ఆర్తగీతం, పు.50)

ఇలాంటివే మరెన్నో దృశ్యాలు, ఇతరులకు కన్పించనివి, రవికి కూడా కన్పించనివి ఈ కవికి కన్పించాయి. ఆర్ద్రహృదయంతో ఈ ఆర్తగీతాన్ని ఆలకించినవారికి ఈ దేశంలోనివే, ఎవరెవరివో, ఎన్నెన్నో మూగరోదనలు వినిపిస్తాయి. ఇలాంటి దృశ్యాలు కని, ఇలాంటి రోదనలు విని సామాన్యులు విలపిస్తూ ఉండటం సహజమే. అయితే విలపించడం సమస్యలకు పరిష్కారం కాదు. వాటి నివృత్తికి ఒక పూనిక వహించాలి. అందుకు మనిషి మనస్సులో ఒక రసాయనిక చర్య జరగాలి. కొత్త సృష్టికి పుడమి తల్లికి పురుటి నొప్పులు స్ఫురింపించాలి. తిలక్ అభ్యుదయ కవి వ్యవస్థలో మార్పుకోరుకున్న కవి. గొప్ప భవిష్యత్తును కలగన్న కవి. సాటి మనిషి కోసం సాటి మనిషి పక్షాన, సాటి మనిషై నిలబడ్డ మానవతావాదకవి. అందుకే దేశంలో ఆర్తితో అల్లాడిపోతున్న ఈ అభాగ్య జీవుల జీవన దృశ్యాలు ఎన్నెన్నో చూసిన తరువాత తిలక్ చలించి పోయాడు.

ఒక్క నిరుపేద వున్నంతవరకు
ఒక్క మలినాశ్రుబిందు వొరిగినంతవరకు,
ఒక ప్రేగు ఆకలి కనలినంతవరకు,
ఒక్క శుష్క స్తన్య సన్నిధిని క్షుధార్తి నేడ్చు
పసిపాప వున్నంతవరకు,
ఒక తల్లి నీరవాక్రోశ రవమ్ము విన్నంతవరకు,
ఒక క్షతదుఃఖిత హృద మూరడిల్లనంతవరకు,
నాకు శాంతి కలుగదింక నేస్తం, నేను నిగర్వినైనాను." (ఆర్తగీతం, పు.51)

అని ప్రకటించుకున్నాడు.

"ఏ పూర్వపుణ్యమో, ఏ యోగబలమో, జనియించినాడవీ భరతఖండమున" అని ఈ దేశంలో జన్మించినందుకు కొందరు భావకవులు పొంగిపోవడం మనకు తెలిసిందే! ఇదే సందర్భంలో చారిత్రక భౌతికవాద దృక్పథంతో మహాకవి శ్రీశ్రీ "ఏదేశ

చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం!" అని స్పష్టం చేశాడు. మన దేశాన్ని కూడా ప్రపంచ దేశాల్లో చేర్చాడు. ఈ భరత ఖండంలో జనించినందుకు ఎగిరి గంతేయవసలిన పనిలేదని తేల్చాడు. ఈ విషయం సాహితీ పరులందరికీ తెలిసిన అంశమే.

కొంతమంది భావకవుల్లాగా బహుశా అప్పటి వరకూ తిలక్ కూడా ఈ దేశం గురించి కొన్ని భ్రమల్లో ఉన్నాడేమో!? చారిత్రక భౌతిక వాద పునాదుల్లోంచి ఈ దేశాన్ని అధ్యయనం చేసిన తరువాత, మానవతా వాద తాత్త్విక చింతనతో ఈ దేశంలోని సగటుమనిషి జీవన స్థితిగతులను, వికలమవుతున్న సజీవ దృశ్యాలను చూసిన తరువాత తిలక్‌లోఅప్పటి వరకూ గూడుకట్టుకొని ఉన్న భ్రమలన్నీ పగిలిపోయి ఉంటాయి. అందుకే "నేను నిగర్వినైనాను" అని సవినయంగా ప్రకటించుకున్నాడు.

'నిగర్వి' కావడం అంత సులభమైన అంశం కాదు. నిగర్వి కావడం అంటే పరిపూర్ణమైన మనిషి కావడం. పరిపూర్ణమైన మనిషి కావడం అంటే కొన్ని అశాస్త్రీయమైన, అవాంఛితమైన పునాదుల మీద నిర్మించబడ్డ తన అస్తిత్వాన్ని త్యజించడం. తన చుట్టూ కంచెలా నిర్మించబడి ఉన్న తన కులాన్నీ, మతాన్నీ, ప్రాంతాన్నీ అర్థబలాన్ని ఛేదించుకొని బైటకి రావడం. సాటి మనిషిని మనిషిగా చూడటం, మనిషై చూడటం, మనిషివైపు చూడటం. దీనిని సాధించడమే 'నిగర్వి' కావడం. దీనిని ఆశించడమే 'మానవతావాది' కావడం.

నిజమే! తిలక్ నిజమైన 'నిగర్వి'. మూర్తీభవించిన మానవతావాది. దీనిని రుజువు చేయడానికి ఈ నాలుగు మాటలు చాలు.

# 4. తిలక్ కథలు - వస్తు విశ్లేషణ

- ఆచార్య కె. ఆశాజ్యోతి

కథలో, కథనంలో కవిత్వాన్ని పలికించిన విశేష ప్రజ్ఞాలాలి దీవరకొండ బాలగంగాధర తిలక్స తిలక్ కవిత్వమెంత రసాస్వాదనమో, కథాసాహిత్యం కూడా అంతకంటి రసాయభూతిని అందిస్తుంది. చాలా సందర్భాలలో వాస్తవ జీవితం నగ్నంగా నిలబడుతూ అందోళనకు గురిచేస్తుంది. రస లక్షణం ఒక పక్క, వాస్తవికత ఒక పక్క నిలబడి పాఠకుల్లో తీవ్రంగా విచలితంచేస్తాయి తిలక్ కథలు. తిలక్ సున్నిత మనస్కుడు! సునిశిత పరిశీలకుడు! ఎంత హృదయవాదిగా కనబడతాడో అంత బలమైన రచనా యోధుడు! ఆకు కదలికకు ఎంత పొంగిపోతాడో అబల స్థితిగతులకు, కన్నీటికి అంత కృంగిపోతాడు! వెన్నెల తిలక్‌ను కదిలించినంతగా బహుశా మరే రచయితనూ, కవిని కదిలించలేదేమో అన్నంతగా ఆస్వాదించాడు. ఆ అనుభూతిని అందరికీ తన రచనలద్వారా పంచాడు. వెన్నెల తిలక్‌కు రసభరితంగానే కాదు, కథాసమయం-సంఘటన నిర్దేశిస్తే ఆది వెన్నెల రాలుతున్న బూడిదగానూ, శవంపై కప్పినదుప్పటిలానూ ఉందనీ ఖరాఖండిగా చెప్పాడు. రసాస్వాదనకు ఎంత ప్రాముఖ్యతనిస్తాడో, అవసరమైతే వాస్తవికతను నిర్మొహమాటంగా విడమరచడంలో వెనుకంజు వెయ్యడు. తిలక్ కథలలో రసార్థతతోపాటు, కఠిన వాస్తవ చిత్రం కూడా ఉంటుంది. చెప్పదలిచిన విషయాన్ని సున్నితత్వాన్ని మేళవిస్తూనే కుండబద్దలు కొట్టినట్టు చెప్పడంలో దిట్ట తిలక్. సున్నితత్వం మేళవిస్తూనే అని ఎందుకు అనడం అంటే సంఘటనల పట్ల ఆర్తి, ఆవేదన, పాత్రల నిస్సహాయత పాఠకుడికి అర్థమవుతూ, కథలలోని పాత్రలతో పాటు, పాఠకుడు కూడా దుఃఖితమతి అయిపోతాడు. ఎంత తీవ్రంగా ఆ ఉద్వేగం నుండి బయటపడాలనుకున్నా, తిలక్ పాఠకుణ్ణి తన పాత్రలతో సమానంగా తీసుకెళ్తుంటాడు. తన ప్రతీ కథలో పాఠకుణ్ణి భాగస్వామిగా చెయ్యడంలో తిలక్ దిట్ట.

ఆవంత్స సోమసుందర్‌కి రాసిన ఉత్తరంలో అనారోగ్య కారణంగా డాక్టరు దగ్గరకు వెళ్ళి వస్తూ ప్రిస్క్రిప్షన్ కాగితం వెనుక ఇలా రాసానని తిలక్ తెలిపాడు. “When my heart has stopped at some silent hour, I know that none of

you will shed a tear"అని! ఈ వాక్యాలు తను రాస్తున్న ఆంగ్ల కవితలోని పంక్తులని తిలక్ ఆవంత్సకు రాసినా, మిగిలిన ఆంగ్ల కవితా పంక్తులు దొరకలేదని వాటికై వెతుకుతున్నానని చెప్పినా, ఎక్కడో తన మరణాన్ని తిలక్ ఊహిస్తూనే వచ్చాడని తిలక్ ని చదివిన వాళ్ళకి అర్థమవుతుంది. ఏదో వేదనను మోసుకు తిరుగుతున్నాడని అనిపిస్తుంది, అనారోగ్య కారణం ప్రధానమే ఐనా, తిలక్ సున్నితమైన మనస్సు సమాజంలో ఉన్న పరిస్థితులకు ఒదగలేకపోవడం, అదే సమయంలో ప్రపంచ యుద్ధం యావత్ప్రపంచాన్ని బలంగా కుదిపేస్తూ ఉండడం సున్నిత మనస్కుడైన తిలక్‌ని చాలా ప్రభావితం చేసింది. ఆ ప్రభావం బాగా కథలలో తిలక్ కథలలో కనబడుతుంది. తిలక్ తన కోసం ఒక కన్నీటి చుక్క కూడా ఎవరూ రాల్చరన్న మాట వ్యక్తిగతంగా తీసుకోవలసిన అవసరం లేకపోయినా అవి ఆంగ్ల కవితా పంక్తులలో భాగమే ఐనా, చదివిన ప్రతి మనసుకూ తన గురించి చెబుతున్నాడని అనిపించి ఆవేదన కలిగిస్తుంది. తిలక్ జన్మించి ఇప్పటికి వంద సంవత్సరాలైనా తెలుగు ప్రజలు తలుచుకుంటున్నారంటే తిలక్ కవితా శైలి, కథలలో కనబరచిన వస్తు విన్యాసం ప్రధాన అంశాలు.

తిలక్‌ని మల్లెపువ్వుగా ఇద్దరు అభివర్ణించారు. పిలకా గణపతిశాస్త్రి "తిలక్ చెలిమి, ఆకృతి తలచుకున్నప్పుడల్లా నాకెందుకో మల్లెపువ్వు జ్ఞాపకం వస్తుంది. ఆ రోజుల్లో అచ్చంగా మల్లెపువ్వులా ఉండేవాడు" అనీ, రచయిత శ్రీ ఆదివిష్ణు "ఇప్పుడు వారు లేరు. వారుత్తరాలూ, వారి స్నేహం, వారి చిర్నవ్వూ, హెచ్చరికలూ, అన్నీ భద్రంగా దాచుకున్నాను. నన్నలరించిన మల్లెపువ్వు వాడిపోదు" అనీ తిలక్ మృదు హృదయ తత్వాన్ని వివరించారు. ఇది వీళ్ళిద్దరి అభిప్రాయం మాత్రమే కాదు. తిలక్‌తో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి అభిప్రాయమే. తిలక్ మరణించిన ఇన్నేళ్ళకు కూడా తిలక్‌ను చదివిన ప్రతి ఒక్కరి అభిప్రాయం ఇలానే ఉండడం ఆ ఆలోచనను బలపరుస్తోంది. తిలక్‌ని ముఖతః చూడని ఈ తరం కూడా ఇలానే భావిస్తుండడం తన రచనలలో తిలక్ ఎంత స్పష్టంగా కనబడుతున్నాడో అర్థమవుతోంది. కాదు తన కవిత్వం కానీ కథలు కానీ పుస్తకంగా చూసుకోవాలని ఎంతో ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం ఫలించకుండా మరణించినా, తిలక్ రచనలన్నీ తరువాత ముద్రింపబడడం తిలక్ రచనా పటిమకు తార్కాణం. తిలక్‌ను ప్రేమించిన అశేష సాహితీ ప్రియులందరి ప్రేమాభిమానాలను పొందిన రచయిత తిలక్.

**తిలక్ కథా సాహిత్యం**

తిలక్ సుమారు ముప్పై కథలను రాసాడు.

1. లిబియా యెడారిలో - ఆంధ్ర శిల్పి - ఫిబ్రవరి-1948
2. కదలే నీడలు - ?
3. అద్దంలో జిన్నా - 1961
4. హోటెల్లో - వాణి సచిత్ర పక్ష పత్రిక - 10.7.1941
5. ఆశాకిరణం - 1967
6. బాబు - 1948
7. యవ్వనం - 25.8.1941
8. గడియారపు గుండెలు - వాణి సచిత్ర పక్ష పత్రిక
9. పలితకేశం - 1969 రేడియో ప్రసారం, ఆనందవాణి-సంచిక
10. తీవ్రవాద నాయకుడు - భారతి ఏప్రిల్ 1963
11. కవుల రైలు - ?
12. బొమ్మ - ఆనందవాణి-దీపావళి సంచిక - 1948
13. దొంగ - జ్యోతి, మార్చ్ 1964
14. మణిప్రవాళం - స్వాతి - 1963
15. నల్లజర్ల రోడ్డు - ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక - 1964
16. ఓడిపోయిన మనిషి - జ్యోతి - 1963
17. సీతాపతి కథ - జ్యోతి - 1964
18. ఆతని కోరిక - జ్యోతి - 1963
19. ఊరి చివరి యిల్లు - 1961
20. సుందరి-సుబ్బారావు - 1961
21. సముద్రపు అంచులు - 1964
22. జీవితం - భారతి - ఆగస్టు 1941
23. ఉంగరం - 1961
24. నిర్మల మొగుడు - ఆంధ్ర వార పత్రిక, 19.11.1958
25. పరివర్తన - 1967
26. దేవుణ్ణి చూసినవాడు - 1964

27. నవ్వు - 1964
28. రాత్రి 9 గంటలకు - ఆంధ్రప్రభ వీక్లీ - 1961
29. ఏమీ లేదు - 1961
30. మీరేనా - నీవేనా - మాధురి సంపుటి, సంచిక -12, ఏప్రిల్ 1935

కథాసాహిత్య రచన 1935 లో 'మీరేనా-నీవేనా' కథతో ప్రారంభించినా, తిరిగి 1941 వరకు కథల వైపు వెళ్ళలేదు తిలక్. 1941లో 'హెూటెల్లో', 'యవ్వనం', 'జీవితం', 'గడియారపు గుండెలు' రాశాడు. తరువాత ఏడేళ్ళకు 1948లో 'లిబియా ఏడారిలో', 'బాబు', 'బొమ్మ' కథలను, తిరిగి పదేళ్ళకు 1958లో 'నిర్మల మొగుడు' కథను, మళ్ళీ మూడేళ్ళకు అంటే 1961లో 'అద్దంలో జిన్నా', 'రాత్రి 9 గంటలకు', 'ఊరి చివరి యిల్లు', 'సుందరీ - సుబ్బారావు', 'ఏమీ లేదు' కథలను, తిరిగి రెండేళ్ళకు 1963 లో 'తీవ్రవాద నాయకుడు', 'మణిప్రవాళం', 'ఓడిపోయిన మనిషి' , 'అతని కోరిక' కథలను, 1964లో దొంగ', 'సీతాపతి కథ', 'నల్లజర్ల రోడ్డు', 'సముద్రపు అంచులు', 'దేవుణ్ణి చూసినవాడు', 'నవ్వు' కథలను, 1967లో 'ఆశాకిరణం', 'పరివర్తన' కథలను రాశాడు. 1967లో రాయబడినట్టుగా ఉన్న కథలు తిలక్ మరణానంతరం ముద్రింపబడిన కథలు. 'కదలే నీడలు', 'కవుల రైలు' ఈ రెండు కథల కాలం అందుబాటులో లేదు.

మనసు ముక్కలైన మనుసులు నీ, పొడవునా రాస్తూనే ఉంటారు' అంటాడు. కెన్నెత్ పాషెన్ అనే అమెరికన్ కవి. ఈ వాక్యాలు చదవగానే వెంటనే తిలక్ గుర్తొస్తాడు. రాత్రికీ, వెన్నలకీ, వానకీ, తిలక్‌కీ విడదీయరాని బంధం ఉంది. ఈ మూడింటినీ పలకరించకుండా తిలక్ ఏ కథను ముగించలేదు. 'నా నెత్తురు ఈ సిరాతో కలసి ప్రవహిస్తోంది' అంటుంది ఆంగ్ల రచయిత్రి సిల్వియా. ప్రపంచ సాహిత్యంలో ఏ కనిని కదిలించినా, ఏ రచయిత్రిని పలకరించినా వేదనా గళాలను అంతరంగ ఆవిష్కరణకు వంతెనగా చేసుకుని సమాజానికి అందించడం బలంగా కనిపిస్తుంది. విశ్వసాహిత్యంలో కవుల మనోభావనలు ఏకముఖంగా సాగుతాయని కెన్నెత్ పాషన్, సిల్వియాల మాటలను బట్టి అర్థమువుతుంది. 1911లో జన్మిందిన కెన్నెత్, 1893లో జన్మించిన సిల్వియా, 1921లో జన్మించిన తిలక్, కాలాలు వేరైనా, స్థలాలు వేరైనా ఆలోచనా ధారలోని ఏకముఖత్వానికి నాటి సమాజం, వారి సారితీ వ్యక్తిత్వం కారణం. ఏ సందర్భంలోనో, దెబ్బ తిన్న వ్యక్తులుగా, అంతరంగాన్ని బహిర్గతం చేయడానికి సాహిత్యం ఆధారమైంది. విచలితమైన మనసు ప్రాంతాలకతీతంగా, సరిహద్దులను

చెరిపి ఒకే రీతిలో ఆలోచించగలగడం బుద్ధితో పాటు గుండెకు ప్రాధాన్యాన్నివ్వడం మానవులంతా ఒక్కటేనన్న భావం కలిగిస్తోంది.

తిలక్ కథల్లో వస్తువు అతి ముఖ్యమైనది. కథలోని వస్తువు పాఠకుడి అవగాహనకు రానాలన్నా, పాఠకుడిలో చైతన్యాన్ని కలిగించాలన్నా, సామాజిక పరిస్థితులపట్ల పాఠకుడిలో అపగాహన కలిగించాలన్నా రచయిత తీసుకున్న వస్తువు పైనే ఆధారపడి ఉంటుంది. రచయితను పాఠకుడు అర్థం చేసుకోవడానికి మార్గదర్శకంగా నిలిచేది వస్తువు. కథలోని వస్తువు ప్రదర్శితం కావాలంటే కింది అంశాలు దోహదపడతాయి. కథలో వస్తువు ప్రధానమైనది, ఒక పాఠం, ఒక సందేశం. కథా వస్తువు మానవ స్థితిని, సమాజాన్ని, జీవితాన్ని తెలుపుతుంది. కథలో వస్తువు ఎలా వ్యక్తీకరింపబడింది? వస్తువు తెలపడం కోసం కొన్ని అంశాలు మళ్ళీ మళ్ళీ ప్రస్తావింపబడ్డాయా? ఒక కథలో ఒకటి కంటే ఎక్కువ వస్తువులు ప్రస్తావించబడ్డాయా? వంటి విషయాలు ఒక్కొక్క కథా రచయితననుసరించి సాగుతాయి. కథ లేదా కథానిక పరిమాణంలో చిన్నదిగా ఉండి, వర్ణనాత్మక గద్యంగా ఉంటూ ఒక్క అంశం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. ఐతే ఇందులో తప్పకుండా ఉపోద్ఘాతం, కథా నిర్మాణం/ శరీరం కలిగి ముగింపును కలిగి ఉంటుంది. నవలలో ఉన్న విశాలతరమైన కాన్వాసు ఉండదు కనుక కథానికలో క్లుప్తత అధిక ప్రాధాన్యాన్ని వహిస్తుంది. కథానికా రచనలో సాహిత్యాంశాల మూలతః పరిజ్ఞానం అవసరం అంశాలు.

**కథా వస్తువును వెలుగులోకి తెచ్చే అంశాలు**

**1. సన్నివేశాలు/దృశ్యాలు**

సన్నివేశం కథానికలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. కథ ఎక్కడ, ఎప్పుడు ప్రారంభమైందో తెలిపేదే సన్నివేశం, నవలతో పోలిస్తే కథానికా సన్నివేశం పరిధి సీమితమైంది. కాలం లేదా సమయం నిర్ణీతమై ఉంటుంది. సన్నివేశం ఎలా ఏర్పడింది? భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, సమయం, సామాజిక పరిస్థితులు వంటివి సన్నివేశంలో ముఖ్య భూమికను పోషిస్తాయి.

అలాగే సన్నివేశం కథలో ఎటువంటి ప్రాధాన్యతను పొందింది? ఇతివృత్తానికి బలమైన ఆధారమా లేక నేపథ్యాన్ని తెలిపేది మాత్రమా లేదా ఒక చర్య జరుగుతుండగా కేవలం నేపథ్యంగా ఉంటుందా? ఈ చర్చ అర్థం కావాలంటే కథ ఎప్పుడు రాయబడింది? కథ సమకాలీనమా? గత కాలానిదా? భవిష్యత్తును తెలిపేదా

గమనించాలి. కథలోని భాష కాల ప్రభావితమైనదా? లేక సామాజిక స్థితిగతులను తెలిపేలా కాలం సాగుతుందా అని గమనించాలి.

**2. పాత్రపోషణ**

కథలో పాత్రలను చర్చించేది పాత్రపోషణ. కథలో నాయకుడెవరు. ముఖ్యపాత్ర కానీ, ఇతరపాత్రలుకానీ కథానుగుణంగా సంభాషణలద్వారా పరిచయమవుతున్నాయా? రచయిత పాత్రలను శారీరక లక్షణాల ద్వారా పరిచయం చేస్తున్నాడా? లేక ఆలోచనలు, భావనల ద్వారా పరిచయం చేస్తున్నాడా? కథలో పాత్రలు కదలిక లేనివిగా, చలరహిత పాత్రలుగా ఉన్నాయా ఎటువంటి లక్షణాలు కలిగిన పాత్రలుగా ఉన్నాయి? అసలు పాత్రలు నమ్మదగినవేనా?

**3. ఇతివృత్త నిర్మాణం**

సంఘటనల వరుస క్రమమే ఇతివృత్తం. సహజంగా కథలలో ఇతివృత్తం ఒక అనుభవం లేదా ముఖ్యమైన క్షణం చుట్టూ తిరుగుతుంది. కథలో ముఖ్యమైన సంఘటన మీద ఇతివృత్తం ఆధార పడిందా? దాని నిర్మాణామేంటి? ఇతివృత్తం నేరుగా సాగుతోందా లేక క్రమబద్ధంగా సాగుతోందా? ఇతివృత్తం నమ్మదగిందిగా ఉందా?

**4. కథకుడి కోణం**

కథ చెబుతున్న వ్యక్తి కథకుడు. కథలో కథకుడు ప్రధాన పాత్రధారి ఒక్కరేనా? అంటే కథ ఎవరి దృష్టికోణం నుండి చెప్పబడుతోంది. సహజంగా కథ ఒక పాత్ర దృష్టికోణం నుండి చెప్పబడుతుంది. కథను ఎవరు చెబుతున్నారు? రచయిత పాత్ర ద్వారా మాట్లాడుతున్నాడా? కథ ఉత్తమ పురుష కోణంలో చెప్పబడుతోందా? లేక ప్రథమ పురుషలో చెప్పబడుతోందా? లేదా కథంతా తెలిసిన సర్వ సాక్షి దృష్టి కోణంలో స్థల, కాల, పాత్రాదుల గురించి చెప్పబడుతోందా?

**5. సంఘర్షణ**

కథానికకు సంఘర్షణ ఆత్మ వంటిది. ఇది కథలో ప్రధాన పాత్రకు సంబంధించినది. ఒక ప్రధానమైనపెనుగులాట లేదా పోరాటం కథానికలో ఉంటుంది. ప్రధాన సంఘర్షణను ఎలా చూడాలి? సంఘర్షణ పరిస్థితులవల్ల ఏర్పడిందా లేక ప్రధానపాత్ర తనలో తాను ఏర్పరచుకున్న సంఘర్షణా?

**6. పతాక సన్నివేశం**

కథానికలో పతాక సన్నివేశం బలీయమైంది. కథ అవసరాన్ని బట్టి సంఘటనలు మలుపు తిరిగే సందర్భం. కథలో పతాక సన్నివేశం ఉందా? పతాక సన్నివేశం ఎప్పుడు ఏర్పడింది.

**7. శైలి**

రచయిత శైలి అతడి మాటల్లో, కల్పనలో, స్వరంలో ప్రతిఫలిస్తుంది ఇది కథపట్ల రచయిత వైఖరి తెలుపుతుంది, కొన్ని సందర్భాలలో రచయితలో నిందాస్తుతి స్వరం, హాస్యం, గడ్డకట్టించే చలి, నాటకీయత కనబడుతుంది. రచయిత స్వరం ఎక్కువ ఉపమాలంకారాలతో ధ్వనిస్తోందా? ఎటువంటి కల్పనలను రూపొందించాడు? రచయిత ఎక్కువ ప్రతీకలను వాడాడా? ఉత్ప్రేక్షలను వాడాడా?

**తిలక్ కథా విమర్శ**

తిలక్ కథలలో వస్తువు మధ్య తరగతి మనిషి. ఎక్కడా మధ్య తరగతి మనిషిని దాటి ఆడపా దడపా బెస్తవాళ్ళను పరిశీలించాడు. కింది తరగతుల మనస్తత్వాలను పరిశీలించాడు. కథలన్నింటిలో ఒక మామూలు మనిషి కనబడతాడు. మరింతగా ఆలోచిస్తే పాఠకుడు తిలక్ కథలలో ఎక్కడో ఒక సందర్భంలో తన గురించి రాశాడా అని ఉలిక్కిపడే సందర్భాలు చాలానే తగుల్తాయి. తిలక్ కథలను విశ్లేషించే ముందు తిలక్ కథలను విభజించాలి. 1935 నుండి 1958 వరకు వచ్చిన కథలు ఒక భాగంగా. 1961 – 1967 వరకు వచ్చిన కథలు ఒక భాగంగా తీసుకోవాలి. మొదటి భాగంలోని కథలు పాఠకుడి మీద చూపే ప్రభావం కంటే 1961 నుండి వచ్చిన కథలు సమాజాన్ని కుదిపేసాయని చెప్పవచ్చు. ప్రతి వ్యక్తి మీద తిలక్ కథలు బలమైన ప్రభావం చూపాయి. తిలకని బలమైన కథకుడిగా చూపించే 'ఊరిచివరి యిల్లు', 'నల్లజర్ల రోడ్డు', 'ఆశాకిరణం', 'దేవుడిని చూసినవాడు', 'పరివర్తన', 'ఓడిపోయిన మనిషి', 'అతడి కోరిక', 'పలితకేశం', 'సుందరీ – సుబ్బారావు', 'సముద్రపు అంచులు' వంటి కథలు కథానికా ఆకాశంలో ధృవతారల్లాంటివి. విశ్వ సాహిత్యంలో చేరవలసినవి.

మొదటి భాగంలో కథలు రెండవ విభాగంలోని కథలతో చేరక పోయినా తిలక్ అంతరంగ ఆవిష్కరణ బాగా ఆ కథలలో కనబడుతుంది. 'మీరేనా –నీవేనా', 'లిబియా యెడారిలో', 'కదలే నీడలు', 'అద్దంలో జిన్నా', 'హెటెల్లో', 'బాబు', 'యవ్వనం',

'తీవ్రవాద నాయకుడు', 'కవుల రైలు', 'బొమ్మ', 'దొంగ', 'మణి ప్రవాళం', 'అతని కోరిక', 'జీవితం', 'నవ్వు', 'రాత్రి 9 గంటలకు', 'ఏమీ లేదు' కథలలోని వస్తువు సమాజంలోని అస్తవ్యస్త స్థితిని, యుద్ధ వ్యతిరేకతని, సమాజం మీద తిరుగుబాటు చెయ్యడాన్ని, స్త్రీ – పురుష సంబంధాలు వంటి అంశాలు చర్చలో పెట్టాడు తిలక్.

రెండవ భాగంలోని కథలలో ఊరిచివరి యిలు, నల్లజర్ల రోడ్డు, ఆశాకిరణం, దేవుడిని చూసినవాడు, పరివర్తన, ఓడిపోయిన మనిషి, అతని కోరిక, పలితకేశం, సుందరి – సుబ్బారావు, సముద్రపు అంచులు ప్రతీ కథా బలమైన ముద్ర వేస్తాయి. ఈ కథలలోని వస్తువు మొదటగా తెలిపేది మానవ మానసిక తత్వాన్ని. ప్రతీ సందర్భంలో మనిషి ఎంత బలహీనుడో, తానున్న సమాజ పరిధిలో ఎంత కనిష్టుడుగా ఉన్నాడో తెలిపే కథలు ఇవి. ఊరి చివరి యిల్లులో జగన్నాథం నల్లజర్ల రోడ్డులో రామనాథం, పలితకేశంలో ప్రసాదరావు, సుందరీ–సుబ్బారావులో సుబ్బారావు, అతని కోరికలో లక్ష్మీ మోహనరావు పాత్రలు కల్లోలమైన మనస్తత్వాన్ని కలిగి ఉంటాయి. "Psycho analysis - explores the role of consciousnesses and the unconscious in literature including that of the author, reader, and characters in the text"– అంటారు Sigmund Freud, Jacques Lacan, Harold loom, Slavoj zizek, Viktor Tousk , వీళ్ళ అభిప్రాయం ప్రకారం మానసిక విశ్లేషణ అన్నది కథలలో స్పృహ – స్పృహరాహిత్యం అనే విషయాన్ని అన్వేషిస్తుంది. ఈ అన్వేషణలో రచయిత, పాఠకుడితో పాటు పాత్రలు భాగస్వామ్యం వహిస్తాయి. తిలక్ ఆపాదించిన చేతకానితనం లక్షణంలో సాగిన పురుష పాత్రలలో రచయితతో పాటు, పాఠకుడు, అలాగే ఆ పురుష పాత్రల చుట్టూ ఉన్న ఇతర పాత్రల ప్రమేయం తిలక్ కథలలో బలంగా కనబడుతుంది.

"Queer theory examines, questions, and criticizes the role of gender identity and sexuality in literature" అంటారు Judith Butler, Eve Kosofiky Sedgwick, Michel Toucault. 'Queer' అంటి ఎంజైన, విపరీతమైన, వికారమైన, అద్భుతమైన అన్న అర్థాలున్నాయి. ఈ సిద్ధాంతం barodo LGBT (Lesbian, Gay, Bi-Sexual, Transgender) పరంగా ఒక మానసిక తౌల్యం లేని వ్యక్తుల తత్వంగా పరిశీలించదగిన కోణం. కథా సాహిత్యంలో Queer theory సాహిత్యంలో లైంగికతను, లైంగిక అస్తిత్వాన్ని పరీక్షించడం, ప్రశ్నించడం, విమర్శించడం చేస్తుంది. తిలక్ కథలు లైంగికత – పురుష సంబంధాలు, అవి

కలిగించే మానసిక ఆందోళనలతో ఆద్యంతమూ సాగుతాయి. ఈ సిద్ధాంతానికి సరిగ్గా తూగే కథ – అతని కోరిక. కుమారుడి మరణం, పేదరికం వంటి సమస్యలతో సతమతమవుతూ లక్ష్మీమోహనరావు భార్య తాళి తీసుకుని వేశ్య దగ్గరకు వెళ్ళడం, అతడి విపరీతమైన మనస్తత్వానికి తార్కాణం.

జనపద కథానిర్మాణం మీద కృషి చేసిన రష్యన్ పరిశోధకుడు వ్లాదమిర్ ప్రాప్ సిద్యాంతం ఆధునిక కథకూ అన్వయించుకోవచ్చువచ్చు, ప్రాప్ "Structurnlism and semiotics - examines the universal underlying structures in a text, the linguistic units in a text and how the author conveys meaning through any structures". అంటాడు . దీన్ని బలపరచినవాళ్ళు, Ferdinand de Saussure, Roman Jakobson, Claude Lévi-Strauss, Roland Barthes, Mikhail Bakhtin, Yurii Lotman, Umberto Eco, Jacques Ehrmann, Northrop Frye వంటి వాళ్ళు, ప్రాప్ ప్రకారం కథారచనలో నిర్మాణక్రమం, భావప్రకటనాధ్యయనం కోణం పరికించాలి, కథానిర్మాణంలో క్రమత ఉంటుందనీ దాన్ననునరిస్తూ సంస్కృతి సంగీతాధ్యయనం సాగుతుందనీ భావించాడు. అందులో భాగంగా "Structuralism - semiotics రెండు–కథలో మూలాధారమైన నిర్మాణాలు, భాషా విభాగాలను పరీక్షిస్తూ సాగుతూ, రచయిత కథా నిర్మాణం ద్వారా కథాంతరార్థం అందజేస్తున్న తీరును పరిశీలిస్తుంది"

"Reader-response - focuses upon the active response of the reader to a text" Louise Rosenblatt, Wolfgang Iser, Norman Holland, Hans-Robert Jauss, Stuart Hall – పాఠక స్పందన సిద్ధాంతంలో రచన చదువుతున్న పాఠకుడి స్పందన కథ ద్వారా ఎలా ఉంది అన్న విషయం గమనింపబడుతుంది.

**ముగింపు**

తిలక్ కథలలో పురుష పాత్రులు వెన్నెముకలేని పాత్రలుగా ఉంటాయి. స్త్రీ చైతన్యాన్ని ప్రత్యేకంగా తిలక్ ప్రస్తావించక పోయినా పురుష పాత్రలు బలహీనమైనవి కావడంతో స్త్రీలు మానసిక స్థైర్యంలో అసామాన్యంగా కనబడతాయి. సీతాపతి కథ కానీ, పలితకేశం కానీ, అతని కోరిక కానీ తెలిపేది ఈ విషయాన్నే. తిలక్ కథలు సింహ భాగం విషాదాంతాలుగా ఉంటాయి. కొన్ని సందర్భాలలో కథలు విచిత్రంగా అనిపిస్తాయి. 'కవుల రైలు' కథ అటువంటిదే. 'రాత్రి 9 గంటలకు' కథ, 'ఏమీలేదు'' కథలు తమాషాగా అనిపిస్తూ అంతస్సూత్రంగా మానవ ఆంతరంగ చిత్రణను

ఆవిష్కరిస్తాయి. 'మార్మికత' తిలక్ కథలలో కనబడుతుంది. తిలక్ అన్ని కథలలో అవ్యక్త వేదన ప్రతిఫలిస్తూ ఉంటుంది. యుద్ధకాలం ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం, భారత్ – చైనా యుద్ధం, వాటి దుష్పరిణామాలు, అవి కలిగించిన భీతావహ స్థితిని తిలక్ తీవ్రంగా నిరసించాడు. యుద్ధాలు కలిగించిన, మిగిల్చిన వేదనను చాలా సందర్భాలలో కథలలో ప్రస్తావించాడు. మానసిక విశ్లేషణ తిలక్ కథలకు అదనపు బలం. మధ్య తరగతి మనిషి మనస్తత్వాన్ని సహజంగా చిత్రించాడు. మధ్యతరగతి మనిషి అంతరంగ ఆవేశాలు, అనాలోచిత వ్యవహారాలు, అసంగత ప్రేలాపాలు, ఆయోమయం, పరాధీనత, పరాఙ్ముఖత్వం వంటి ఎన్నో అంశాలు తెర మీదకు తెచ్చి చర్చకు పెట్టిన సహజ కథకుడు తిలక్. తెలుగులో మానసిక విశ్లేషణ ఆధారంగా కథాసాహిత్యం రచించిన అతి తక్కువ కథకులలో ఒకరు. తెలుగు కథాసాహిత్యంలో తిలక్ స్థానం తిరుగులేనిది. మరువరానిది.

# 5. దేవరకొండ బాలగంగాధర తిలక్ కథలు - మనస్తత్వ విశ్లేషణ

**- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి**

యోగి వేమన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న తిలక్ శత జయంతి సందర్భంగా అంతర్జాతీయ అంతర్జాల సప్తాహం సదస్సుకు నన్ను ఆహ్వానించినడా. ఎన్. ఈశ్వర్‌రెడ్డి గారికి, తెలుగుశాఖకు ధన్యవాదాలు.

దేవరకొండ బాలగంగాధర తిలక్ (1.8.1921 - 1.7.1966) ప్రసిద్ధ కవి. కవిగా 'అమృతం కురిసిన రాత్రి' కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందాడు. కవే కాదు కథకుడు, వ్యాసకర్త కూడా. ఠాగూర్, మాక్సిమ్ గోర్కిల ప్రభావమున్న తిలక్ కృష్ణశాస్త్రి శ్రీశ్రీల ప్రభావం తనపై ఉందని చెప్పాడు. సున్నిత మనస్కుడి అనుభూతి కవిత్వంలో, సమాజావేదనాభ్యుదయ కాంక్ష కథలలో కనిపిస్తాయి.

సమకాలీన చలనాలను గుర్తించి, అందిపుచ్చుకొన్న చైతన్యశీలి తిలక్. తిలక్ మనుషుల అంతరంగాలలోనికి తొంగి చూసి మరీ పాత్రల మనస్తత్వాలను చిత్రించాడు కథల్లో. 'కథ ఒక మనస్తత్వానికీ, ఒక సంఘటనకీ, ఒక స్వభావానికీ సంబంధించి వుంటుంది. కాని ఆ పరిధిలోనే ఒక విశిష్టత ప్రదర్శించాలి' అంటాడు తిలక్ 'కథలు వ్రాయడం ఎలా'? అనే (తిలక్ సాహిత్య సందర్శనం, పు.255) వ్యాసంలో. సాహిత్యంలో మనస్తత్వ ప్రాధాన్యం ఎంతో చెప్పకనే చెప్పటం ఇక్కడ చూడవచ్చు.

తిలక్ చెప్పాడని మునిపల్లెరాజు, తంగిరాల వెంకట సుబ్బారావుకు చెప్పిన మాటలు ' ఆకలితో సమానంగా కామం కూడా మనిషి మనస్తత్వాన్ని విశదీకరిస్తుంది?'. ఈ అంశం కూడా మనస్తత్వాన్ని అంచనా వేయటంలో పనికి వస్తాయి.

అణిగిపోయిన జీవితాలు మోసానికి గురైన జీవితాలు వీటి అన్నింటికి శాడ్ ఎన్‌డింగ్ ఉంటుంది. బాధ తప్తంగా జీవితాలు అలా మిగిలిపోవడం అనేటటువంటిది అతికష్టం కల్గించే విషయం. దీనిని హ్యూమన్ మీజరీగా చూడడంగా పతంజలి

శాస్త్రి చెప్తూ ఉంటే; అదే మనకు మనస్తత్వ పరిశీలనకు ఉపయోగపడే వనరుగా కన్పిస్తూ వుంది.

**1. Fantasy(ఫాంటసి)**

'An exaggerated form of imagination' అని 'As the root of obsession, mental illness & loss of productivity' (future health. Org) 'A figment of the imagination, a mental image, night dream, or day dream in which a persons conscious or unconscious wishes and impulses are fulfilled (dictionary. apa.org) అని భిన్న లక్షణాలను తెల్పింది.

Fantasy ఇది ఒకింత వరకు మనిషి వ్యక్తిత్వాన్ని పెంపొందించటానికి ఉపయోగపడుతుంది. Fantasy అంటే ఊహాకల్పన, ఊహాచిత్రం వంటి అర్థాలు నిఘంటువులు ఇస్తున్నా, పగటి కలలు అనవచ్చు. ఈ నిమిషంలో ఈ క్షణంలో మనం ముఖ్యమంత్రిగానో, ప్రధానమంత్రిగానో ప్రపంచ అధినేతగానో అయిపోగలం. అలా అయిపోవడం వెనకల మానసిక ఆనందం పొందడం మనలో స్వభావరీత్యా ఉంటుంది. అది సహజమైన లక్షణం. ఇది ప్రతి మనిషిలోనూ వుంటుంది. ఫాంటసీస్ అనేవి కొన్నిసార్లు మన ఎదుగుదలకు ఉపయోగపడతాయి. అది మనస్తత్వ శాస్త్రం చెప్తుంది. అదే సమయంలో ఆ ఫాన్‌టసీస్‌లోనే బ్రతుకుతూ ఉంటే మనిషి పతనం అయిపోతాడు అనేది కూడా వాస్తవం. వాస్తవికం కానిది, హేతుబద్ధం కానిది అయినటువంటిది ఏదైన ఒక ఊహా లేకపోతే తీయని కల మనిషిని నేలకు లాగేస్తుంది, కుంగదీస్తుంది, తిరిగి కోలుకోలేకుండా చేస్తుంది. ఫాంటసీస్ నీకు హేతుబద్ధంగానూ వాస్తవంగానూ ఉన్నప్పుడుఒక మనిషి దానిని సాకారం చేసుకోడానికి ప్రయత్నం చేస్తూ వుంటాడు. అబ్దుల్‌కలాం 'కలలు కనండి ఆ కలలను సహకారం చేసుకోండి' అని అంటాడు. వాటికి ఒక హేతువు ఉన్నప్పుడు. వాస్తవాలు వేరు కలలు వేరు. వాస్తవాలు, ఆలోచనలు వేరు. వాస్తవం హేతుబద్ధత రెండూ కలిసి వుండి నీవు కలలు కంటే, అది ఫలిస్తుంది వాస్తవికతకు అది వ్యతిరేకం అయితే నాశనం అవుతుంది. అలాంటి జీవితం చెప్పాడు 'ఉంగరం', 'సుందరి సుబ్బారావు' కథల్లో.

సుబ్బారావు సుందరి కథలో ఒక డబ్బు ఉన్న అమ్మాయిని ప్రేమించి ఆ అమ్మాయి కూడ తనను ప్రేమిస్తుంది అని ఆశలు పడి ఆశల నిచ్చెనలు ఎక్కి ఎక్కి చివరికి, ఆమె తన బావతో పెళ్ళి అంటూ కార్డు ఇచ్చినప్పుడు కుదేలు అయిపోయిన స్థితి

సుబ్బారావులో కన్పిస్తుంది. ఎంత ఆశపడుతాడూ అంటే తాను చేసే ఉద్యోగం కూడా సుమిత్ర ఆస్తి ముందు ఏ మాత్రం పనికిరాదు. తనకు వచ్చే 20రూపాయలు ఆమె రోజుకు ఖర్చు చేసే డబ్బు ముందు దిగుదుడుపే అనీ, తాను ఉద్యోగం చేయక్కరలేదని ఉత్సాహపడ్డాడు. ఈ అమ్మాయిని చేసుకొంటే జీవితం మారిపోతుందనే ఊహలు దెబ్బతిని, నేల మీద పడడం సుబ్బారావు కథ. ఇంత కంటే దయనీయమైన పరిస్థితి ఉంగరం కథలో కన్పిస్తుంది. ఇక్కడ వస్తు విశ్లేషణ సంగతి అలా వుంచితే, పని పిల్లగా ఉన్న అమ్మాయి చక్కని బట్టలు వేసుకోవాలి, రోజూ సువాసనలు వెదజల్లే సబ్బుతో స్నానం చేయాలి, తన కోసం కలల రాకుమారుడు వచ్చి తనను తీసుకొని వెళ్ళాలి అని, తన జీవితం అంతా కార్లలో తిరగాలి అని, ఇలాంటి మంచి జీవితం అనుభవించాలి అని పంచరంగుల కలలు కంటూ వుంటుంది. ఆ కలలు కనడంలో కూడా కొన్ని జాగ్రత్తలు పడుతూ వుంటుంది. ఎవరంటే వాళ్ళు వచ్చి అడిగితే మోసపోకూడదు, ఇంతకు ముందు మోసపోయినట్లు, ఎవ్వరినైనా సరే జాగ్రత్తగా ఎంచుకోవాలి అని.

ఇలాంటి కలలు కనేటటువంటి మనిషి, తాను పనిచేసే ఇంట్లో బాబు ఉంగరం తీసుకొంది. బాబుకు ఒక మిఠాయి కొనిచ్చి ఉంగరం తెచ్చుకొనింది. దానితోటి పట్నం వెళ్ళిపోయి తన ఊహలకు అనుగుణంగా బ్రతకాలి అనుకొంటూ ఉన్నప్పుడు, ఈ అమ్మాయిని నారాయణ అనే వ్యక్తి చూశాడు. అతని రూపాన్ని చూసి నేను కోరుకోనే కలల రాకూమారుడు నాకోసమే వస్తున్నాడు అనుకుంటూ ఉంటే అతను వచ్చాడు. ఆ ఉంగరం అమ్మాయి చేతుల్లో చూశాడు. ఆమెను మాటల్లో పెట్టి ఆమె మానసిక స్థితిని, పసిగట్టి దానికి అనుగుణంగా మాటల గారడి చేసి ఉంగరం తాను అమ్మి తెస్తాను. రేపు పొద్దున బొంబాయికి వెళ్ళిపోదాంలాంటి మాటలుచెప్పి ఉంగరం తీసుకొనిపోయాడు. ఈ లోపల ఈ అమ్మాయిని పోలీసులు పట్టుకొన్నారు. అతను ఉంగరం అమ్ముకొని బాగా జల్సాగా తిరిగి ఖర్చు చేసి మరల ఈ అమ్మాయి ఉన్న జైలులోనే పక్క రూంలో చేరాడు. జైలులో వుంటూ పక్క గదిలో ఉన్న ఆమెను హేళన చేయడం కనిపిస్తుంది. జీవితం పట్ల స్పష్టత లేనటువంటి వ్యక్తి తాను ఉన్నతంగా జీవించాలని నిరంతరం తపనపడే వ్యక్తి, ఆ తపనకు తాను ఎలాంటి సజావైన మార్గాలు వేసుకోవాలి అనేది తెలియని వ్యక్తి, ఏర్పర్చుకొన్న కల ఎంత తీవ్రంగా భగ్నం అయ్యిందో చెప్పినటువంటి స్థితి 'ఉంగరం' కథలో కన్పిస్తుంది.

'సముద్రపు అంచులు' కథలోనూ వీరయ్య పాత్ర ఇలాంటి స్థితినే చూపిస్తుంది. దాని వస్తు విశ్లేషణా, తిలక్ పాత్రల నిర్వహణ ఎలా చేశాడు అనేటువంటిది ఇక్కడ ప్రధానం కాదు. మనస్తత్వం వరకు మాత్రమే చూసినప్పుడు ఫాంటసీస్ మనిషిని నిరాశపరచటం కన్పిస్తాయి

**2. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు**

ఫ్రాయిడ్ మనిషిలో మూడు ప్రధాన అంశాలు చెప్పాడు. Id Ego, super Ego లు. మనిషి ఒక సమతౌల్యంతో వుండే స్థితి Egoఅయితే, Id అనేటటువంటిది నిత్యం ఏదో ఒకటి చేసేయాలి చేసేయాలి అని ఉత్సాహపడే గుణం. దానికి ఒక హేతువు కాని, భయంకాని ఏమి వుండవు. అది అనుకొన్నది చేసే వరకు మనిషి స్థిమితంగా వుండనీయదు. ఆ లక్షణం కలిగిన ధోరణిని Id లోచూస్తాం. super Ego మంచిని చెప్తూ వుంటుంది. మంచిని చెప్తున్నపుడు వినకపోతే అది నిందిస్తూ వుంటుంది. Ego అనేది ఈ రెండింటిని బ్యాలెన్స్ చేసే లక్షణాన్ని చూపిస్తుంది. Id లో వుండే అసంబద్ధ ఆలోచనలు, అసంబద్ధ ప్రేరణలు, అసంబద్ధ ప్రేలాపనలు అసంబద్ధంగా వుండే చర్యలకు సంబంధించిన ఆలోచనలు అన్నింటిని సామాజిక దృష్టికోణం నుంచి, నీతి నియమాల నుంచి, విలువల నుంచి, అది జరగవచ్చా జరగకూడదా అని ఒక బేరీజు వేసుకొనే పనిని, బ్యాలెన్స్ చేసే పనిని Ego చేస్తుంది. మనిషి స్పృహలో ఉన్నపుడు Ego పని చేస్తుంది. మనకు బుద్ధి చాంచల్యం వచ్చినప్పుడు Id ఏమి అడుగుతూ వుంటుందో దాని వైపు మొగ్గుచూపడం ప్రతి మనిషిలోనూ ఉంటుంది. మనస్తత్వ శాస్త్రం తెలిసినప్పుడు ఎలాంటి ఆలోచనలు చేయడానికి అవకాశం వుంటుంది, ఎలా ఉండవచ్చు లాంటి జ్ఞానం పొందటానికి అవకాశం వుంది. Id super Egoలాంటివి తిలక్ కథల్లో కన్పిస్తాయి.

**2.1.Id**

అసంబద్ధమైన కోరికలు, సభ్యసమాజంలో అంగీకరించని కోరికలు, సామాజికమైనటువంటి నియమాలలో బతుకుతూ ఔచిత్య అనౌచిత్య దృష్టులతో ఏర్పరచుకోనేటువంటి వాటితో ఏ మాత్రం సంబంధంలేకుండా ఉండే Id, ప్రవర్తనను నిర్ణయిస్తేఎలా ఉంటుందో చెప్పినటువంటికథ "అతని కోరిక". తిలక్ నాయకులందరూ విఫలమైన నాయకులు. అలాంటి పాత్ర ఇందులో ఉంది. ఇంట్లో పిల్లలకి భార్యకి సరియైన పోషణ ఇవ్వలేనివాడు, తిండి పెట్టలేనివాడు ఒక రకమైన పలాయనం

చేస్తున్నటువంటి వాడు, ఈ కథలోని ప్రధాన పాత్ర. ఇంట్లో కొడుకు అరోగ్య పరిస్థితి చేజారిపోతుంటే భార్య పూస్తెలతాడును తీసుకొని వెళ్ళి అమ్మి మందులు తేవాలనుకొన్నాడు. ఆ పనికి పూనుకోక పూర్వమే కుమారుడు చనిపోయాడు. ఆ పూస్తెలతాడును ఇంటికి తెచ్చాడు. రాత్రి భార్య ఏడుపులు, కష్టం, మనసంతా అతనికి ఏదో తెలియని బాధ. అతను ఒక గందరగోళంగా అయోమయంగా స్తబ్ధత వచ్చినటువంటి స్థితిలో వున్నాడు. మరుసటి రోజు లేచి ఆమె లేస్తే ఏడ్వడం మొదలేడితే దానిని భరించే శక్తి తనకు లేదు అనే దృష్టితో, బయటికి వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఆమె పూస్తెలతాడు తీసుకొనిపోయాడు. రోడ్లమీద తిరిగాడు, సత్రంలో తిన్నాడు అక్కడే నిద్రపోయాడు. సాయంత్రం గోదావరి తీరానికిపోయి కొడుకు చనిపోయిన వేదన నాకు ఎందుకు లేదు అనుకొంటూ గోదావరి ఒడ్డున కూర్చొంటే చిన్నప్పటి అమ్మ, అమ్మ ప్రేమ, గడిచిన రోజులు ఆ రోజుల్లో తాను చూసిన భోగంమేళాలు ఆ నృత్యాలు, భోగం స్త్రీ పట్ల తనకు కలిగిన ఇష్టం ఇవన్నీ గుర్తుకు వచ్చాయి. భోగం స్త్రీల ఆలోచన వచ్చి అకస్మాత్తుగా అతనికి ఆ ఊరిలోనే ఉన్న ఒక భోగం స్త్రీ గొప్పగా నృత్యం చేస్తుంది అనేది గుర్తుకు వచ్చింది. చేతిలో వున్న బంగారం గుర్తు వచ్చి, వెంటనే ఆమె దగ్గరికిపోయాడు. ఆమె అతని పరిస్థితి చూసి వెనక్కి పంపించడం తరువాత విషయం. ఇక్కడ ఈ పాత్ర మనసును మానసిక స్థితిని గమనిస్తే, ఉన్న సందర్భం ఏమిటి, చేస్తున్న పని ఏమిటి? మనిషి తనకు ఉండే కోర్కెలను ఏ క్షణాలలో తీర్చుకొంటాడు? సాధారణంగా విలాసవంతమైన ఆలోచనలు నేపథ్యమూ వాతవరణమూ ఉన్నప్పుడు, ఇలాంటి విశృంఖల ప్రవర్తనను అంగీకరించ వచ్చేమోకాని, ఇంట్లో ఒక అశుభం జరిగింది. ఆ అశుభాన్ని తట్టుకోనే మానసిక స్థితి లేక పారిపోయి వచ్చాడు. ఈ పలాయనాన్నుంచి తాను బయట పడాలనుకొన్నాడు. కానీ, ఎంత విపరీతమైన ఆలోచన వచ్చింది. మనిషే, ఇవన్నీ తెలుసు, భార్య ఏడిస్తే కష్టంగా వుంటుంది. అందుకని భార్యను వదిలేసి బయటకు వచ్చేశాడు. ఇవన్నీ అందరికీ తెలిసిన మామూలు మనిషుల్లో కన్పించేవి. కానీ బయటకు వచ్చినప్పుడు ఇలాంటి ఆలోచన ఎట్లా వచ్చింది? అంటే అది Id ప్రభావం, అది ఆడించిన మనిషి స్థితి.

ఇలాంటిదే చాలా ప్రసిద్ధ తిలక్ కథ. 'నల్లజర్ల రోడ్డు'లో కనిపిస్తుంది. ఇందులో కూడా, పాముకాటుతో చనిపోబోయే తనస్నేహితుడు రామచంద్రాన్ని రక్షించుకోవడానికి భూషణం బాధ పడుతూ తాపత్రయ పడుతూ ఉన్నప్పుడు, పాములు పట్టే

ముసలాయన ఆయన కూతురు వీళ్ళను రక్షించారు. రామచంద్రాన్ని రక్షించటం కోసం వీరిని బ్రతిమలాడుతూ ఆస్తిలో సగం రాసి ఇస్తాను అనే మాట కూడా మాట్లాడిన భూషణం ప్రమాదం గడిచిన తరువాత, సూరీడు అనే ఆ అమ్మాయి పట్ల లైంగికపరమైన ఇచ్ఛను ప్రకటించడం వెనకల కూడా Id కన్పిస్తుంది. ఈ మనోచాంచాల్యానికి నేపథ్యాలను బాగా చెప్పాడు తిలక్. ఈ చాంచల్యాలకి కారణం ఏమిటీ అంటే హద్దూ అదుపు లేకుండా ప్రవర్తించే Id తలెత్తటం. అలాంటప్పుడు ఇలాంటి ప్రవర్తన కనిపిస్తుంది.

### 2.2. Super ego

The super ego incorporates the values and morals of society which are learned from one's parents and others. It is similar to a conscience, which can punish the ego through causing feelings of guilt' ( simply psychology. Org.). ఇంకొక అంశం super Ego. దాని గురించి ఏమిటి అంటే మోరల్స్‌ను చెప్తుంది. విలువలను చెప్తుంది. సమాజం దేనిపైన నడుస్తుందో చెప్తుంది. వీటి అన్నింటితో ఉన్నటువంటి అంతరాత్మను చెప్తుంది. ఈ అంతరాత్మ నిరంతరమూ మంచి చేయమని మనుషులను వేధిస్తూ ఉంటుంది. మనిషి మార్గం తప్పినప్పుడు, ఎలా ప్రవర్తిస్తాడో అంతరాత్మ ఎలా నిందిస్తుందో ఆ వేదనను 'జిన్నా' కథలో చెప్పాడు. దాంట్లో నాయకుడు, ఒక ఊహను చూపించి, ఒక భావాన్ని చూపించి, బాగా ప్రాచుర్యంలోనికి వచ్చాడు. తాను చేస్తున్నది పొరపాటు, తప్పు అని తెలిసినా కూడా వెనక్కి రాలేని పరిస్థితిని తిలక్ చూపించాడు. ఇలా చూపించేటప్పుడు అతడి ప్రవర్తన అంత కూడాను బయట అలా కన్పిస్తున్నా super Ego కనిపిస్తుంది. నాయకుడు తాను చేస్తున్నది తప్పు అవి గుంజాటన పడుతుంటాడు. ఆ గిల్టీనే సూపర్ ఇగో ఇస్తుంది. అదే కథల్లో ప్రధానం. 'హోటెల్లో' అనే కథలో కూడా రచయిత ఇదే చెప్తాడు. ఇది రచయిత స్వానుభవమై వుంటుంది అంటాడు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ. ఐదురోజుల డైరీగా ఈ కథను రాశాడు తిలక్. ఇతను ఒక రూంలో వున్నాడు. పక్క రూంలో ముగ్గురు కుర్రాళ్ళు వున్నారు. అక్కడికి ఒక జంట వచ్చారు. ఆ జంటలో ఉన్న పురుషుడు అనారోగ్యంగా వున్నాడు. ఇతని దగ్గరికి వచ్చి ఒక ఐదురూపాయలు డబ్బు అడిగితే, అవమానించి మాటలతో ఛీత్కరించి పంపించాడు. భార్యాభర్తల ప్రవర్తన ప్రక్క రూంలోని కుర్రాళ్ళ ప్రవర్తన

ఏదో తేడాగా ఉన్నట్లు పసిగట్టాడు. మరుసటి రోజు ఆ భర్త తన గురించి తాను ఎల్లా బ్రతికింది తాను ఎట్లా ప్రేమించి పెండ్లి చేసుకొందీ, తాను ఎందుకు ఈ కష్టాలు పడుతున్నదీ చెప్తే మందుల కోసం ఐదురూపాయలు ఇచ్చాడు. ఆ భర్త ఆ నోటును చింపి ఇతని మోహన కొంటాడు. కోపం వచ్చింది ఈ పాత్రధారికి. పూర్వం ఆ భర్త ఐదురూపాయలు అప్పు తీసుకొన్నాడు ఆ ముగ్గురి యువకులు దగ్గర. తిరిగి ఇవ్వలేదు. ఇవ్వలేనప్పుడు తన భార్యను వాళ్ళ దగ్గరికి పంపాలి. పంపాడు. అలా పంపడం వలన ఆమెకు ఇబ్బంది, దు:ఖం, కష్టం, అవమానం, ఆత్మగౌరవం లోపించడం జరిగాయి. దాని మూలాన ఆమె నీవు నన్ను చంపేయ్ అనింది. అతను ఆమెను చంపాడు. దాని వలన ఆమె అపరాధభావన నుంచి ఆమెను రక్షించినట్టు అయ్యింది. ఇతను తన గిల్టీ భావనతో బతకడం బతకాల్సి రావటం బాధ. బతకాడానికి అప్పుచేశాడు. సరైన సమయంలో ఇతను ఐదురూపాయాలు ఇచ్చి ఉంటే వారి ఇద్దరి జీవితాలూ భద్రంగా ఉండేవి. సమయానికి ఇవ్వలేదు. ఇవ్వకపోవడం మూలంగా స్త్రీ యువకుల దగ్గరకు వెళ్ళాల్సి వచ్చింది. దాని వలన మాట నిలబెట్టుకొన్న పరిస్థితి ఉంది. చంపేసెయ్ అన్నప్పుడు ఆమెలో వున్న అంతర్మథనం కనిపిస్తుంది. అదే అంతరాత్మ ఘోష.కథను నిర్వహించేటప్పుడు ఇటువంటి లోతును బాగా చూడటం అనేది తిలక్ రచనలో బాగా చూస్తాం.

**3. Inferiority complex**

'A psychological sense of inferiority that is wholly or partly unconscious' .......Some times marked in aggressive behavior in compensations .... results in social withdrawal, extreme sensitivity and attention seeking behavior'(Britannica). ఇవి ఆత్మన్యూనతకు నిదర్శనం.

ఆడ్లర్ చెప్పిన ఒక ఆలోచన ఇన్‌ఫీరియార్టి కాంప్లెక్స్ ప్రతి మనిషిలో ఇన్‌ఫీరియార్టీ సూపీరియార్టీ కాంప్లెక్సులు వుంటాయి. అందరూ చిన్నతనం నుంచి ఇన్‌ఫీరియార్టీని ఏదో రూపంలో సూపీరియార్టీగా మార్చుకోవడానికి మార్పు చేసుకోవడానికి కృషి చేస్తూనే వుంటారు. ఇన్‌ఫీరియార్టీ మనిషిని ఏదో ఒక రకంగా ఇబ్బంది పెట్టడం, ఒక అసమతుల్య మానసిక స్థితికి నిదర్శనం. అలాంటి వారు, ఇన్‌ఫీరియార్టీ కాంప్లెక్స్‌లో ఉండేటువంటి వాళ్ళు, అదే పనిగా గోల గోలగా అరుస్తూ

ఉండటంగాని రోదిస్తూ ఉండడంగాని ప్రతీది మాకే ఎందుకు ఇలా జరగాలి అని కాని సతమతమైపోతూ, చూట్టూ వున్న వాళ్ళను సతమతం చేయటం, ఇంకొన్ని సార్లు అటెన్షన్ సీకింగ్ బిహేవియర్‌తో ఉండటం కన్పిస్తాయి. సుఫీరియార్టీ కాంప్లెక్స్ ఇంకో రకమైన రుగ్మత. ఇన్‌ఫీరియార్టి కాంప్లెక్స్‌కి మంచి ఉదాహరణ 'సీతాపతి' కథ. సీతాపతి చాలా సంపన్నుడైన వ్యక్తి. అనారోగ్యంతో వుండేవాడు. ఆయనకు తిన్నది అరిగే శక్తి తక్కువ. అరిగే శక్తి సరిగ్గా లేకపోవడం మూలాన బలహీనంగా ఉండటం ములానా, ఆయన అందమైన భార్య, అతడిని చాలా చిన్న పిల్లాడిలాగా గారాబంగా సుకుమారంగా సుతిమెత్తంగా చూసుకొంటుంది. దానిని భరించలేని స్థితి ఇతనిది. అన్నీ ఆమె చెప్పినట్లే చెయ్యాలా! నేనెం తినాలో నేను ఏంచెయ్యాలో ఆమె చెప్పాలా! అన్నీ ఆమే చెప్పాలా! అని ఉక్రోషం.పొలానికి పోయి పని చేస్తానంటే ఆ ఎండను మీరు భరించలేరు పని మనిషి చేస్తాడు, అని ఆమె సముదాయిస్తూ చెప్తూ వుంటే సహించలేడు. ఈ అసంతృప్తితో ఒక రోజు ఇల్లు వదిలేసి వెళ్ళిపోయారు. పక్క ఊరికి పోతే అక్కడస్నేహితుడు లేడు. ఒక పెద్దాయన ఆశ్రయం ఇచ్చాడు. అక్కడ తిండి పడక పోవటం వలన జ్వరం వచ్చి చాలా సీరియస్ అయితే, అతని డైరీని చూసి పెద్దాయన సీతాపతి భార్యను పిలిపించాడు. ఆపై కథ సజావుగా సాగింది. అసమర్ధునికి కోపం ఎక్కువ అనేది సాధారణమైన మాట. ఈ అసమర్థత ఎక్కడ నుంచి వచ్చింది అంటే సీతాపతిఅనారోగ్యం నుంచి వచ్చింది. అనారోగ్యం అతని అసమర్థత అశక్తత, అనుకోకపోగా భార్య తనని శాసిస్తోందని, తన పైన సవారీ చేస్తూ ఉందని కోపం. జ్వరం రావడానికి ముందు భార్యను పద్మ రాక్షసి' అని రాశాడు భార్య వచ్చి ఆయనను జాగ్రత్తగా చూసుకొని సేవలు చేసి కోలుకొనేటుటుగా చేశాక 'పద్మ దేవత' అని రాశాడు. ఆయన మనస్తత్వం ఆమె ప్రేమ ముందు తన అశక్తత వల్ల కుంచించుకుపోయింది. ఆమె అద్భుతమైన సౌందర్య రాశి. ఈమె లావుగా వుంటే బాగుండేది కదా! ఎందుకు ఇంత అందంగా వుంది అనుకొంటాడు. ఆమె అందంగా ఉండటం కూడా ఆయనకు కష్టమయిపోయింది. చుట్టుపక్కల వారు, ఇంత మంచి భార్య దొరకడం అతని అదృష్టమంటూ పొగడటం కూడా అతనికి నచ్చదు. ఆమెకు సంబంధించి ప్రతీదీ అతను ఇంకా ఇంకా కుంచించుకోపోవడానికి కారణం అయింది. అసమర్థత ఏమిటి మనం ఎందుకు ఇలా వున్నాం? దీని నుంచి ఎట్లా బయటపడవచ్చు? అనే స్పృహ

వుంటే  మంచిదే, కానిఅది జరగలేదు. అంత ధనవంతుడికి ఇదేం బాధ. ఇన్ఫీరియారిటితో కలుగుతున్న ఇబ్బందులు తిలక్ కథల్లో కన్పిస్తూ వున్నాయి. తిలక్‌కు తన జీవితంలో కూడాను తన ఆరోగ్యం పట్ల విపరీతమైన భయం ఉండేది. తాను ఏదో అనారోగ్యంతోటి వున్నాను అని నిత్యం అనుకొంటూ వుండడం ఆయన గురించి రాసిన వాళ్ళు చెప్తూ ఉన్నటువంటి మాట. అదే అనారోగ్యపు  భావనతో భయంతోటే చనిపోయాడని  కూడా రాస్తాడు ఇంద్రగంటి. ఇది ఆరోగ్యసంబంధమైన భయం, భయంలో వచ్చేటువంటి చావు భీతిలాంటివన్నీ మనకు తిలక్ కథల్లో పదే పదే కన్పిస్తూ ఉన్నాయి. సీతాపతి కథ అనారోగ్యం వలన తలెత్తిన ఇన్ఫీరియార్టీకి  నిదర్శనం.

**4. Collective unconsciousness**

'Collective unconsciousness is made up of a collection of knowledge and imagery that every person  is born with and is shared by all human being due to ancestral experience. Though humans may not know, what thoughts and images are in their collective unconscious, it is thought that in moments of crisis the psyche can tap in to the collective unconsciousness' (verywellmind .com).

కలెక్టివ్ అన్‌కాన్షియస్‌నెస్ గురించి యూంగ్ చెప్పాడు. మనసు మూడుభాగాలుగా కన్పిస్తుంది. దాన్ని ఐస్‌బర్గ్‌గా చెప్పుతారు సైకాలజీలో. ఉపరితలంగా ఉండే దానిని కాన్షియన్‌నెస్ అంటారు.  ఉపరితలం నుంచి లోపలికి ఉన్నటువంటి సముద్రంలోని ఐస్‌బర్గ్‌ని దృష్టిలో పెట్టుకొంటే లోపలికి వుండే పై పై భాగాన్ని ప్రీ కాన్షియస్‌నెస్ అంటారు. లోతుల్లో లోపలికి వుండేదానిని అన్‌కన్షియష్ అంటారు. మనుషులు చాలా తెలివైనవాళ్ళు చాలా రకాలైనటువంటి మాస్క్‌లు పెట్టుకొని తిరుగుతుంటారు కాన్షియస్‌నెస్‌లో.  ప్రీకాన్షియస్‌నెష్‌లో నిన్నమొన్న జరిగినవేవో ఉండిపోతూ ఉంటాయి. అన్‌కాన్షియస్‌నెస్‌లో ఏవి వద్దో అవి అన్నీ పోయి అక్కడ బతుకుతూ వుంటాయి. ఏవి ఇష్టపడమో,  సాంఘిక నియమాలు ఏవయితే వద్దంటూ వుంటాయో,  అవి అన్నీ పోయి అక్కడ బతుకుతూ ఉంటాయి. అవసరమైనప్పుడు అవి బయటికి వచ్చి విరాటస్వరూపాన్ని చూపిస్తూ వుంటాయి.  మనలో ఇలాంటి ఒక కుత్సితమైన కఠినమైన క్రూరమైన మనిషి ఉన్నడా! అని ఎవరికి  వాళ్ళు ప్రశ్నించుకొని భయపడే పరిస్థితిని

ఇది వ్యక్తం చేస్తుంది. దీనిలో అన్‌కన్షియష్ స్థితిలో రెండు రకాలు ఉన్నాయంటాడు యూంగ్. 1. పర్సనల్ అన్‌కాన్షియస్‌నెస్ 2. కలెక్టివ్ అన్‌కన్‌షియష్‌నెస్ అంటాం. పర్సనల్ అన్‌కాన్షియస్‌నెస్‌లో వ్యక్తిగతమైనటువంటి అనవసరమైన ఆలోచలన్నీ వుంటాయి. సామూహికంగా వుండేటటువంటివి, తరతరాల నుండి వచ్చే భావాలు, రక్తంతో పాటు అన్‌కన్‌షియష్‌నెస్‌లో కలెక్టివ్ అన్‌కాన్షియనెస్‌లో వచ్చి కూర్చొని వుంటాయి. ఇలాంటి భావాలు మనిషిని శాసిస్తాయి అని చెప్పేది, కలెక్టివ్ అన్‌కన్‌షియష్‌నెస్ . ఇవి ఆర్కీటైప్స్. జానపదకథల్లో కూడా ఇలాంటి చాలా చూడవచ్చు. సింబల్స్,మోడల్స్, నమునాలు ఇలా మాట్లాడేవన్ని కలెక్టివ్ అన్‌కన్‌షియష్‌నెస్ ప్రతిబింబాలు. దీనిని 'దేవుడిని చూసినవాడు' కథలో చూడవచ్చు. కథాంశం ఎట్లున్నా గవరయ్య బహు కూరూపి మశూచి వచ్చి మొఖం అంతా మచ్చలు పడిపోయిన వ్యక్తి చాలా బలిష్టమైన వ్యకి,_ ఒంటి నిండా రోమాలతో వికార రూపాన్ని కలిగిన వ్యక్తి, ఇతనికి రెండో భార్యగా వచ్చింది అందమైన యువతి. అతనికి 54 ఏళ్లు అమ్మాయి 15 ఏళ్లు చిన్నది. చాలా చక్కనైన అమ్మాయి. అతను ఎవ్వరితోను మాట్లాడడు, ఎవరితోను ఉండడు, సంబంధాలు పెట్టుకోడు, తన లోకంలో తాను వుంటాడు. తన కుటుంబాన్ని అలాగే ఉంచుకొన్నాడు. తండ్రి సూచన మనుషులను నమ్మకు అని. అది పాటించాడు. తండ్రి దగ్గరికి తీసిన స్త్రీ ఇతనిని కాపాడి పెంచింది. ఆమె ఇతని దగ్గరే ఉండి చనిపోయింది. ఇతను, ఇతని భార్య ఇంట్లోనే వుంటారు. వీరితో ఒక కుక్క.

ఇట్లా వుండేచోట, ఆ అమ్మాయి తన ఇంటెదురుగా వుండే టైలర్‌తో ఊరు విడిచి వెళ్ళిపోయింది. అప్పుడు, ఊరందరూ వచ్చి ఈయనను ఓదార్చడానికి ప్రయత్నం చేశారు. ఎవ్వరితో మాట్లాడడు, ఎవ్వరినీ రానీడు, ఎవ్వరితో కలవని వ్యక్తిని దేవుడివైపు తిప్పడానికి దేవుడి ఆలయాలకు చందాలు ఇప్పించడానికి, దేవుడి ఆలయ ప్రాకారాలు కట్టించడానికి ఊరందరు ప్రయత్నం చేశారు. ఈ చేయటం వెనకాల ఉన్నది, దేవుడు అనే భావనని వీరందరిలోనూ సామూహికంగా ఉన్న భావన. religion as a manifestation of collective unconsciousness. అద్వైతే ఇతను లొంగుతాడు అనే భావన. ఇదే కథలో ఇంకో అంశం. ఆ వెళ్ళిన భార్య ప్రసవ సమయానికి మళ్ళీ వచ్చి తమ ఇంటి గడ్డివాములోనే మూలుగుతూ పడిపోయి వుంటే, చంపేద్దాం అనేంత కోపం వచ్చినా ఆమె దయనీయ స్థితి చూసి చంపకూడా ఆమెకు

తిండిపెట్టిన ఉదారత గవరయ్యలో కన్పిస్తే, ఊరిలో ఆడామగ అందరూ కలిసి నీతి తప్పిన ఆడమనిషిని ఊరిలోఎట్లా వుంచుతారు, ఇంట్లో ఎట్లా పెట్టుకొంటారు, తరిమివేయ్యండి అని అంటారు. ఈ అనటం వెనకాల కూడా, తరాల నుండి మానవుల మనస్తత్వం ఎన్ని రకాలుగా శాసింపబడుతూ ఉందో అర్ధమవుతుంది. పురుషుడు అంటే హృదయం లేకుండా అనాడు అనుకోవచ్చు. మరి స్త్రీలు? తోటి స్త్రీ ప్రసవ వేదనతో వుంటే కూడా ఈ స్త్రీలు ఇలా అనటం వెనకాల కారణాలు ఏమిటి,, ఈ ఆలోచనలు ఎక్కడి నుంచి వస్తున్నాయి అంటే, అవి ఆ వ్యక్తివి కాదు ఆ కుటుంబానివి కావు, ఆ సమాజానివి కావు, అవి సమాజాన్ని అంతటినీ శాసిస్తూ వస్తున్న నియమాలు. తరాలన్నింటి నుంచి సంస్కృతిలో నుంచి శాసిస్తూ వస్తున్న నియమాలు శాసించడం కన్పిస్తుంది. కలెక్టివ్ అన్ కన్షియస్‌నెస్ మనిషిని ఎంత శాసించడానకి ఆవకాశం ఉందో ఇది చెప్తూ ఉంది.

**5. Magicalrealism**

Magical realism combines a magical, often grotesque element with a reality based back ground(Magical realismas applied to the field of psychology,www.123helpme.com) ....'Magical realism or Magic realism is an approach to literature that weaves fantasy and myth into everyday life'(thoughtco.com).

మ్యాజిక్ రియలిజం అనే ధోరణి ఉంది ఆధునిక సాహిత్యంలో. మ్యాజికల్ రియాలిజం అని కూడా అంటారు. హేతువులేదు. ఊహలతోటి వాస్తవాన్ని కలిపేసే పని చేయడం లాంటిది మ్యాజికల్ రియాలిజంలో చూడవచ్చు. మ్యాజికల్ రియాలిజంలో చాలా వరకు విశేషంగా కన్పించే అంశం, మనిషిలో ఉండే కోరికలను కలలను తీర్చుకోవడానికి ప్రయత్నం చేయడం. సమాజంలో వుండే కోరికలో కలలో వికారాలో నిషేధాలో చూపించడం. ఈ చూపించే క్రమంలో సమాజాన్ని సరిచేయాలని రచయిత ఆలోచన. 'This type of literaure containscharacteristics, such as real and unreal elements...'(Magicl realism and psychology,bartleby.com).ఇవి కన్పిస్తాయి 'లిబియా ఎడారిలో' అనే కథలో. యుద్ధ సమయం తిలక్ కథలో చాలా వాటిలో ఉంది. 1921లో పుట్టిన తిలక్

యుద్ధ సమయాన్ని బాగా చూసిన ఆయన కథల్లో ఆ వాతావరణం చాలా చోట్ల కన్పిస్తుంది. ఈ కథ చనిపోయిన వాళ్ళ శరీర అవయవాలు ఖండాలు ఒకదానితో ఒకటి మాట్లాడుకొంటూ ఉండటం చూడగలం.

మ్యూజికల్ రీయాలిజంకి ఉదాహరణ ఇది. 'రెండు నక్షత్రాలు ఆకాశం మీదికి నిచ్చెన ఎక్కినట్లుగా ఎక్కి సూర్యుడికి చంద్రునికి మధ్య ఎక్కడో ఒకచోట నిల్చుండి పోయాయి. ఈ విచిత్రం చూస్తున్న మొండి చేయి అంతవరకు ఏడుపు మానేసి తిరిగి మొదలు పెట్టింది'. Magical realism clarifies reality and reveals the beauty or horror. మొండి చెయ్యి ఏడవ్వడం ఏమిటి? నక్షత్రాలు నిచ్చెన ఎక్కినట్లు ఎక్కిపోవడం ఏమిటి? ఇవన్నీ అసంబద్ధాలు. ఈ అసంబద్ధాలు అయిన వాటిని చూపించడం మ్యాజికల్ రియాలిజం కనిపించేది. ఇంకా చెప్పాల్సి వస్తే రచయిత ఆలోచనలకు ప్రతిబింబంగా ఇలాంటివి కన్పిస్తాయి. మనస్తత్వశాస్త్రం చూసేటప్పుడు పాత్రల్లో చూడవచ్చు. సాహిత్యంలో చూడవచ్చు. రచయితలో చూడవచ్చు వాటి మధ్య ఉండే సంబంధాలలోనూ చూడవచ్చు. మరణానంతరం కూడా భవ సాగర బంధాల బాధను ఆ యా శరీర ఖండాలు అనుభవించినట్టు రచయిత పేర్కొన్నాడు.

అద్భుతమైనటువంటి మానవ ప్రవృత్తులను వేదనతోటైనా ఓటమితోనైనా చూడడం అటు వుంచితే, మానవుని ప్రవృత్తులను చూపించడంలో మాత్రం అద్భుతంగా సఫలీకృతడయాడు తిలక్. ఈ కోణంలో అద్భుతమైన ఒక పరిశోధనా గ్రంథం వెలువడాల్సిన అవసరం తెలుస్తూ ఉంది.

# 6. తపాలాబంట్రోతు-తిలక్ సామాజిక దృక్పథం

- ఆచార్య ఎం. రామనాథం నాయుడు

ఆధునికాంధ్ర సాహిత్యంలో ఒక విశిష్టకవిగా తిలక్ గుర్తింపు పొందాడు. ఆధునిక తెలుగులో భావకవితా దశ అంతరించి, అభ్యుదయ కవిత్వం పురోగమిస్తున్న కాలంలో తిలక్ అటు భావకవితా మార్దవాన్ని, ఇటు అభ్యుదయ కవితా చైతన్యాన్ని రంగరించుకుని అమృతంవంటి కవిత్వాన్ని తెలుగు పాఠకులకు రంగరించుకుని అమృతం వంటి కవిత్వాన్ని తెలుగు పాఠకులకు అందించారు. తిలక్ 1941లో 'నా కవిత్వం' అనే కవితతో తన కవిత్వాన్ని ప్రారంభించి 1966 వరకు అద్భుతమైన కవితావ్యవసాయం చేశారు. "నా కవిత్వం - కాదొక తత్వం" అని తన కవిత్వాన్ని గురించి నిర్దిష్టమైన అభిప్రాయాన్ని ప్రకటించడంలో ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో అర్థమవుతుంది. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలు కలిగిన కవి మాత్రమే ఇంత స్పష్టంగా తన గొంతుకను ప్రకటించగలడు.

ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఆపోశన పట్టిన తిలక్ సంస్కృతాంధ్ర భాషలలో బాగా పట్టు కలిగిన కవిపండితుడు. భావానికి అనుగుణంగా పదబంధాలను ప్రయోగించి అనుభూతి ప్రధానమైన సామాజిక కవిత్వ రచనలో తనదంటూ ఒక ప్రత్యేక ముద్రను రూపొందించుకున్నారు. ఉజ్జ్వలమైన భావుకత, సామాజిక స్పృహతో తిలక్ కవిత్వం కూడినది కాబట్టి ఆయనను భావకవిత్వానికి, అభ్యుదయ కవిత్వానికి చెందిన గొప్ప సమన్వయ ప్రతినిధిగా తెలుగు విమర్శకులు భావించారు.

అమృతం కురిసిన రాత్రి, నగరం మీద ప్రేమగీతం, నీవులేవు నీ పాటవుంది వంటి కవితల్లో తిలక్ భావపుష్టిని, ఉదాత్త ప్రేమతత్వాన్ని ప్రస్ఫుటం చేస్తూండడంవల్ల ఆయనను భావకవిగా గుర్తించడం జరిగింది. అలాగే ఆర్తగీతం, ప్రార్థన, సైనికుడి ఉత్తరం, తపాలా బంట్రోతు వంటి కవితల్లో తిలక్ దీనుల వేదనలను, పతితుల విలాసాలను కళ్ళకు కట్టినట్టు చిత్రించడం వల్ల అభ్యుదయ కవిగా గుర్తించడం జరిగింది. తిలక్ రచించిన కవిత్వాన్ని ఆధారంగా చేసుకుని ఆయన భావ, అభ్యుదయ

కవిత్వ వారధి అని చెప్పడం సబబుగా వుంది. తిలక్ మానవతా ప్రబోధంతో ఒక నూతన మార్గాన్ని ఏర్పరచి ఆధునిక కవులపై లోతైన ప్రభావాన్ని కలిగించారు. వచనకవిత్వంలో లయాన్వితమైన ఒక చక్కటి కొత్త బాణీని ప్రవేశపెట్టారు. ఆధునికాంధ్ర కవిత్వంలో "అమృతం కురిసిన రాత్రి కావ్యసంపుటి ఒక దీపస్తంభం" అని విమర్శకులు అభిప్రాయపడ్డారు. అందుకే విప్లవకవి శ్రీశ్రీగారు తిలక్‌ను "యువకవి లోకప్రతినిధి, నవభావామృత రసధుని, కవితాసతి నొసట నిత్యరస గంగాధర తిలకం" అని అభివర్ణించారు.

తిలక్ కవిత్వంలో మానవత్వ ప్రబోధం, కారుణ్యభావం, యుద్ధనిరసన, శాంతికాముకత వంటివి ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. ఈ అంశాలన్నింటినీ ఆయన తన అమృతం కురిసిన రాత్రి అనే కవితా సంపుటిలో పలుచోట్ల అభివ్యక్తం చేశాడు. తిలక్ యుద్ధానికి వ్యతిరేకంగా మేల్కోండని ప్రజలకు హితవు పలికాడు.

**"ధాత్రీజనని గుండెమీది**
**యుద్ధపు కొరకంచుల ఎర్రనిరవ్వలు**
**మీరెవరైనా చూశారా**
**కన్నీరైనా విడిచారా**
**ముడుచుకున్న కాగితపు గుండెలు చిరిగిపోకముందే**
**అణచుకొన్న నల్లనిమాటలు ఆకాశానికి రేగకముందే**
**మీరిపుడైనా మేల్కొంటారా!"** అని అన్నాడు.

సంస్కృత లాక్షణికులు "కవితా అద్యస్తీ రాజ్యేన కిం" అని అన్నట్లుగానే అడిదం సూరకవి "కవిత గలిగిన రాజ్యాధికారమేల" అని చెప్పారు. అందుకే కాబోలు తిలక్ "నా కవిత్వం"లో

**"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు**
**నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"**

అని ప్రకటించుకున్నాడు. ఇంతకంటే ఆనందం ఏముంటుందని భావించుకున్నాడు. ఆయన కృష&ణశాస్త్రి భావనాశక్తిని, శ్రీశ్రీ అభ్యుదయ అనురక్తిని జీర్ణించుకుని స్వేచ్ఛాప్రియత్వం, సౌందర్యం, అభ్యుదయం అనేవాటిని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కలిగిన ఆధునిక తెలుగు కవిగా జీవించాడు.

ఆధునిక కవితారంగంలో తన కవితలు కవితాసంపుటిగా వెలువడకముందే తిలక్ ఉత్తమ కవిగా కీర్తి గడించాడు. ఆయన రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితాసంపుటి శ్రీశ్రీ "మహాప్రస్థానం", కృష్ణశాస్త్రి "కృష్ణపక్షం", ఆరుద్ర "త్వమేవాహం", సోమసుందర్ "వజ్రాయుధం" సరసన నిలబడింది. 1965లో ఆంధ్రసాహిత్య అకాడమీ అవార్డు, 1971లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందింది. "తపాలా బంట్రోతు" అనే కవిత "అమృతం కురిసిన రాత్రి" అనే కవితాసంపుటిలోనిది. తిలక్‌లోని అనుభూతి లక్షణానికీ, అభ్యుదయ దృక్పథం గల సామాజిక స్పృహకు "తపాలా బంట్రోతు" నిలువుటద్దంగా నిలిచింది.

సాధారణ కవులు సహజంగా కన్నదాన్ని, విన్నదాన్ని కళ్ళకు కట్టినట్టు, వీనులవిందుగా చెపుతారు. కన్నదాన్ని, విన్నదాన్ని మాత్రమే కాకుండా చూడని, వినని అంశాలను సహితం సహృదయులు చూచేవిధంగా, వినగలిగేటట్టు చెప్పడమే మహాకవుల పని. ఈ పని భావుకతతోనే సాధ్యం అవుతుంది. సమాజంలో తాను దర్శించే అంశాలనే కవితావస్తువుగా ఆధునిక ప్రగతివాద కవులు గ్రహిస్తారు. తాము చూచిన వాస్తవిక జీవితం నుండి పొందిన అనుభూతిని గాఢమైన భావికతతో అభివ్యక్తం చేయడం తిలక్ గారి ప్రత్యేకత.

ఒకప్పుడు కవిత్వం అంటే అందమైన అమ్మాయిలు, సుందర వదనాలు, గిరులు ఝరులు, ప్రణయాలు, మన్మథతాపాలు, ఉపశమనాలు వంటి వర్ణనలతో కనిపించాలి. ఆ కవిత్వం కూడా ఊరకే అబ్బదు. కవికి సకల సదుపాయాలు కల్పిస్తే తప్ప కవిత్వం వెలువడదు. దీనికి చక్కని ఉదాహరణ "నిరుపహతి స్థలంబు..." అని పెద్దన రాజరాజుకు చెప్పిన పద్యం. అయితే పోతన "ఇమ్మను రాజేశ్వరాధములకిచ్చి..." అనే పద్యంలో సత్కవులు తమ భార్యాబిడ్డల పోషణకోసం అడవులపాలై, ఆకులు అలములు, కందమూలాలు తిని జీవించినా ఫరవాలేదు కాని కవిత్వాన్ని మాత్రం అమ్ముకోకూడదని హితవు పలికాడు.

తిలక్‌ను సుబ్బారావు అనే మిత్రుడు సాదాసీదా పోస్టుమాన్ మీద కవిత రాయమన్నందుకు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు. ప్రశ్నించాడు కూడా. ఈ ప్రశ్నలో నిరసన భావం కనిపిస్తుంది. డబ్బులకోసం ధనవంతుని మీద కవిత చెప్పే వారిమీద, కీర్తికోసం రాజకీయ నాయకులను, మంత్రులను ఆకాశానికి ఎత్తుతూ కవిత్వం రాసి పబ్బం గడుపుకునే కవులపై తిలక్‌కు తిరస్కార భావం కలిగింది. అందుకే సుబ్బారావు

తనను పోస్ట్‌మాన్ మీద కవిత రాయమన్నప్పుడు అతని అభ్యర్థన అసభ్యంగా వుందని తోసేశాడు. అలాగే ఉత్తి పోస్టుమాన్ మీద తనకు ఊహలే రావు అని కొట్టిపారేశాడు.

ప్రభుత్వ ఆస్థాన కవులవలె, ప్రచార కవులవలె మూడవ పంచవర్ష ప్రణాళిక, ఏడవ వనమహోత్సవపు దినం మీద, బిర్లావంటి పెట్టుబడి దారులమీద, దాల్మియావంటి పైరవీకారుల మీద, సినిమాలు వంటి ఏ విషయంపైనైనా సరే తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేస్తూ రాయాలంటే చెప్పు అద్భుతమైన కవిత్వం రాస్తాను అని మిత్రునితో చెప్పాడు. ఇక్కడ తిలక్ తనకు ఆపాదించుకుని చెప్పుకున్న భావాలు నిజంగా ఆయనకు సంబంధించినవి కావు. వ్యంగ్యంగా తనమీదనే చెప్పుకుని, ఆనాటి కవులలో వుండే దౌర్భల్యాన్ని, స్వార్థచింతనను నిరసించాడు.

సుబ్బారావ్! తపాలా బంట్రోతులో గొప్పతనం ఏముందని కవిత రాయమంటావు. అతడు ప్రధానమంత్రి కాదే. ఎండలో ఎండుతూ, వానలో నానే చిన్నపాటి జీతగాడు.

చెవిలో పెన్సిలు, చేతిలో సంచి, అరిగిన చెప్పులు, కాకిదుస్తులు – ఇదే కదా అతని వేషం. ఇలాంటి సాదా సీదా వ్యక్తిమీద కవిత్వం రాయమంటావా? అని కవి తన మిత్రుడిని ప్రశ్నిస్తూనే తపాలా బంట్రోతు స్థితిగతుల్ని భావికతతో వ్యక్తం చేశాడు. చాలిచాలని జీతంతో కుటుంబ భారాన్ని మోస్తున్న పోస్టుమాన్ ఇతరుల కష్టసుఖాలను తన సంచిలో వేసుకుని మోస్తుంటాడు. వాటిని ఇల్లిల్లు తిరిగి పంచుతుంటాడు. ఇది పోస్ట్‌మాన్ వాస్తవిక జీవితం. ఆయన అందించే ఉత్తరంకోసం ఎంతోమంది కళ్ళు ఎదురుచూస్తుంటాయి.

**"అయితే చూడు**
**ఆ కిటికీలో రెండు విచ్చిన్న కలువల్లాంటి కళ్ళు**
**ఆ వీధి మొగవైపే ప్రసరిస్తోన్న చూపుల ముళ్ళు**
**ఆ కళ్ళల్లో ఆతృత**
**ఆ గుండెల్లో గడచిన**
**దేశాంతర గతుడైన ప్రియుడి వార్తకోసం"**

పద్దెనిమిదేళ్ళ ఒక పడచు తన భర్త భుక్తికోసం పొట్టచేత పట్టుకొని దేశాంతరం వెళ్లడం అక్కడ అతను ఎటువంటి కష్టాలు అనుభవిస్తున్నాడో, ఇంటికి ఎప్పుడు తిరిగి వస్తాడో వంటి విషయాలను తెలుసుకోవడానికి ఉత్తరం ఎప్పుడు వస్తుందా అని పోస్ట్‌మాన్ కోసం ఆతృతతో ఎదురుచూస్తున్న విషయాన్ని కవి చక్కగా వర్ణించాడు.

తన పద్దెనిమిదేళ్ళ పడచుతనాన్ని భద్రంగా పళ్ళెరంలో దాచిన ఆ యువతి తన భర్త రాకకోసం ఎదురుచూస్తున్న తీరును కంటనీరు పెట్టించే విధంగా చిత్రించడం తిలక్‌కే సాధ్యమైంది.

**"అదుగో పోస్ట్‌మాన్**
**ఒక్క ఉదుటున వీధిలోకి నువ్వు**
**వెళ్ళిపోతున్న తపాల బంట్రోతు వెనుక**
**విచ్చిన రెండు కల్హార సరస్సులు"**

సూర్యోదయం నుండి పోస్ట్‌మాన్ తెచ్చే ఉత్తరంకోసం ఎదురుచూస్తున్న యువతికి తన ఇంటి ముందునుండి వెళుతున్న పోస్టుమాన్ ఉత్తరం రాలేదని చెప్పడానికి ఇష్టంలేక ఒక చిరునవ్వు నవ్వి ఉత్తరం రాలేదని చెప్పడానికి ఇష్టంలేక ఒక చిరునవ్వు నవ్వి వెళ్ళిపోవడంతో ఆమె కళ్ళు ఎర్ర కలువలు పూసిన సరస్సులా మారిందని కవి ఎంతో హృద్యంగా వర్ణించాడు. ఇక్కడ తిలక్ దాంపత్య ప్రేమలోని వియోగబాధను సామాజిక పరిస్థితులకు అనుగుణంగా చిత్రించడం చూస్తే ఎవరి కళ్ళయినా చెమ్మగిల్లక మానవు.

అలాగే **"గుడిసెముందు కూర్చున్న పండు ముసలి అవ్వ**
**గడచిన బ్రతుకంతా కష్టపు నెత్తుటి కాలువ**
**కనపడీ కనపడని కళ్ళల్లో**
**కొడిగట్టిన ప్రాణపు దీపంతో**
**తాను కనిన తన ప్రాణం, తనకు మిగిలిన ఒకే ఒక స్వప్నం**
**తన బాబు తన ఊపిరి**
**అస్సాం రైఫిల్సులో షోల్జర్ సిమ్మాచలం**
**కోసం నిరీక్షణం"**

ఒక నిరుపేద తల్లి సైన్యంలో చేరిన తన కుమారుని ఉత్తరం కోసం ఎదురుచూస్తున్న సన్నివేశాన్ని తిలక్ అద్భుతంగా చిత్రించాడు. దేశాన్ని కాపాడటానికి, శత్రుసైన్యాలతో పోరాడటానికి సిపాయిలుగా కూటికి గుడ్డకు నోచుకోని వాళ్ళు ఎక్కువగా చేరుతుంటారు. ధనవంతులు ఉన్నత విద్యలను అభ్యసించి, కమాండర్ లాంటి పెద్ద పెద్ద హోదాలలో వుంటారే తప్ప దేశభక్తితో సిపాయిగా చేరదామనుకోరు. పేదవాడికి యుద్ధ భయంకన్నా జీవన పోరాటమే ఎక్కువ భయాన్ని కలుగజేస్తుందని వాస్తవ పరిస్థితులను చక్కగా అన్వయించి కవి తన కవిత్వాన్ని రచించారు. యుద్ధమంటూ జరిగితే మొదటగా సిపాయిలే బలి అవుతారు. కాబట్టి తిలక్

**"బంట్రోతూ వెళ్ళు వెళ్ళు త్వరగా**
**ముసలిదానికి మంచి వార్తనందించు"**

అని అంటాడు. సైన్యంలో మృత్యువుతో పోరాడుతున్న తన కుమారుని యోగక్షేమాలను తెలుసుకోవడానికి చితికిన బ్రతుకుతో పోరాడుతూ కొడిగట్టిన దీపంలా వున్న ఒక ముసలి తల్లి పడుతున్న ఆరాటాన్ని, ఆ ఆరాటం వెనుకవున్న వాత్సల్య ప్రేమను కరుణరసాత్మకంగా కవి చిత్రించడం జరిగింది.

"దగ్గర దగ్గరౌతున్న మిత్రుని లేఖకోసం నిలిచిన తరుణిడికి నీరాక ఒక బాసట" అని సఖ్య ప్రేమను ఒక్క వాక్యంలో కవి ఇమిడ్చి చెప్పాడు. ఇదొక విధంగా తోడ్పాటుకు సంబంధించినది.

పోస్టుమాన్ తెచ్చే ఉత్తరాలలో సామాజిక జీవితాలతో ముడిపడిన దాంపత్య, వాత్సల్య, సఖ్యప్రేమలను కవి వాస్తవిక దృష్టితో చిత్రించి తన సామాజిక స్పృహను తెలియజేశాడు. మానవ సంబంధాలతోనూ, అవసరాలతోనూ, పరిస్థితులతోనూ ముడిపడివున్న అనేక విధమైన ఉత్తరాలను తపాలా బంట్రోతు అందిస్తుంటాడు. ఇందులో వర్తకులు, నర్తకులు, దొంగలు, హంతకులు, ఉద్యోగస్తులు వంటివారు రకరకాలుగా వుంటారు. అందరికీ పోస్టుమాన్ ఉత్తరాలు అందిస్తాడే తప్ప అతనికి వాళ్ళ కులంతోనూ, మతంతోనూ, భాషతోనూ, పేద, ధనికవంటి వాటితో సంబంధం వుండదు. అతని దృష్టిలో అందరూ ఒకటే. అతనిలో పక్షపాతం, తారతమ్యం వుండదు. దూరాల దారాలను విచిత్రంగా ఒకే నిమిషం అనే కండెకు చుట్టగల నేర్పరితనం వున్న పోస్టుమాన్ జీవితం మాత్రం తీరం వదలి వెడలిపోయే ఏకాకి నౌక. ఉత్తరాల ద్వారా శుభ అశుభాలతోపాటు మమతల మల్లెలను కూడా అందరికీ పంచే పోస్టుమాన్ జీవిత స్థితిగతులను గురించి ఎవ్వరూ ఆలోచించరు. అతని దీనావస్థను లోకంలో పట్టించుకునే నాథుడే లేడు. సాధారణమైన ఒక తపాలా బంట్రోతు దైనందిన జీవితం చుట్టూ కవి ప్రసరింపజేసిన వాస్తవ భావరూపాలు ఆయనలోని సామాజిక దృక్పథాన్ని తేటతెల్లం చేయడం జరిగింది.

కవిత్వం ఒక అల్కెమీ. దాని రహస్యం కవికి తెలుసు. కాళిదాసుకు, పెద్దన్నకు, కృష్ణశాస్త్రికి, శ్రీశ్రీకి తెలుసు అని తిలక్ కవితాకళను రసవాద విద్యతో పోల్చాడు. కవితలోనే నవత వుందనే గొప్ప సందేశాన్ని యువకవులకు తెలియజేశాడు.

దేవరకొండ బాలగంగాధర తిలక్ మానవతావాదాన్ని పతాకగా ధరించి ఉదాత్తమైన, రసరంజితమైన కవిత్వాన్ని రచించాడు. అభ్యుదయ భావన, సౌందర్యం

తిలక్ కవిత్వంలో కలగలిసి మానవతను పెంపొందించాయి. తిలక్ కవితలలో కరుణరసం, దానితోపాటు నైరాశ్యం ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఏ సిద్ధాంతాలకు తాను నిబద్ధుడు కానని తిలక్ ప్రకటించుకున్నాడు. 'కవిత్వం' అనేది అంతరాంతర, జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేయాలి. విస్తరించాలి. చైతన్యపరచాలి అని తెలియజేస్తూనే కవి "అగ్నిజల్లినా అమృతం కురిసినా, అందం ఆనందం దాని పరమావధి" అని చక్కగా నిర్వచించాడు.

**ఆధారగ్రంథాలు**

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య. జి, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1996, శ్రీరామమూర్తి కొర్లపాటి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
3. కర్నాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం బోధనాపాఠాలు, మైసూరు.

# 7. తిలక్ కవిత్వతత్త్వం

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

"తిలక్" అంటే మన సాహితీవేత్తలకు 'దేవరకొండ బాలగంగాధర తిలక్' మాత్రమే. ఇంకా చెప్పాలంటే ఆగష్టు 1, 1921లో పుట్టి, జూలై 1, 1966వ తేదీన మరణించిన తిలక్ మాత్రమే. మనకి భారతదేశ స్వాతంత్ర్యోద్యమం గురించి మాట్లాడితే లోకమాన్య బిరుదాంకితుడైన బాలగంగాధర తిలక్ (1856 – 1920) మాత్రమే గుర్తుకొస్తాడు. ఈ వ్యాసంలో మనం 'తిలక్' అంటే సాహితీవేత్త దేవరకొండ బాలగంగాధర తిలక్ కవిత్వ తత్త్వం గురించే మాట్లాడుకుందాం. ఆయన పేరు చెప్పగానే "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటి గుర్తుకొస్తుంది. ఆయన పేరు చెప్పగానే "నా అక్షరాలు కన్నీటి జడులతో తడిసే దయా పారావతాలు/నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు/నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడ పిల్లలు" అనే కవితా పాదాలు గుర్తుకొస్తాయి. ఆయన వివిధ సందర్భాల్లో తన కవిత్వం గురించి చెప్పిన ఇలాంటి కవితాత్మక శాస్త్ర విషయాలు ఆలోచనలో పడేస్తాయి. ఆ విషయాలు గురించే ఈ వ్యాసంలో చర్చించుకుందాం.

తిలక్ పుట్టిన వందసంవత్సరాల తర్వాత వీటి గురించి ముచ్చటించుకోవడమనేది కేవలం ఆయన్ని గుర్తుచేసుకోవడానికి మాత్రమే. ఇంతకు ముందే ఎంతో మంది ప్రసిద్ధ సాహితీవేత్తలు తిలక్ కవిత్వం గురించి, ఆయన కవిత్వ తత్త్వం గురించి మాట్లాడారు. అయినా, ప్రతి కవినీ, ప్రతి కవితనీ ప్రతి పాఠకుడూ తనదైన అనుభూతితో తన హృదయానికి హత్తుకుంటాడు. ప్రతి విమర్శకుడూ తనదైన మేధోగతమైన విశ్లేషణ చేసుకుంటాడు. దీనికి కారణం– కొంతమంది కవిత్వం ఎప్పుడు చదివినా చదవాలనిపిస్తుంది. దానిలో ఏదో కొత్తదనం ఉందనిపిస్తుంది. ఎన్నిసార్లు చదివినా నిత్యనూతనంగా అనిపిస్తుంది. తిలక్ కవిత్వానికి కూడా అలాంటి గుణమే ఉంది. ఆ విధంగా తిలక్ కవిత్వాన్ని చదివినప్పుడు ఆ కవిత్వంలో ఒక నూతనానుభవమేదో మనం పొందగలుగుతున్నామని అనుకుంటున్నాను. ఆ దృష్టితోనే తిలక్ కవిత్వాన్ని

చదువుతుంటే భిన్నకోణాలు దర్శనమిస్తున్నాయి. కవిత్వం ఒక అనుభవాన్ని కలిగించే దొక కోణమైతే, కవిత్వం గురించి కవిత్వం చెప్పే శాస్త్రకారుడిగా తిలక్ దర్శనమివ్వడం మరొక కోణం. సాధారణంగా ఏ కవిత్వాన్నైనా ఆ వస్తువుని బట్టో, ఆ వస్తువుని అభివ్యక్తీకరించే శిల్పాన్ని బట్టో ఆ కవిత్వాన్ని చదువుతాం. తిలక్ కవిత్వాన్ని కూడా అలాగే చదువుతున్నా, ఈ వ్యాసంలో మాత్రం తిలక్ కవిత్వం గురించి తన కవిత్వంలో చెప్పిన అంశాల్ని, ఆయన కవిత్వ తత్త్వాన్ని ఈ వ్యాసంలో విశ్లేషించుకునే ప్రయత్నం చేద్దామనుకుంటున్నాను.

తిలక్ అనేక కవితల్లో తన కవిత్వ తత్త్వం గురించి కొన్ని అభిప్రాయాల్ని కవిత్వమై చెప్పాడు. తిలక్ రాసిన కవితల్ని ఆయన మరణించిన తర్వాత1968లో విశాలాంధ్ర ప్రచురణ సంస్థ వారు 'అమృతం కురిసిన రాత్రి' పేరుతో ఒక సంపుటిగా కుందుర్తి ఆంజనేయులు గారి చేత మంచి పీఠిక రాయించి ప్రచురించారు. అమృతం కురిసిన రాత్రి అని ఆ కవితా సంకలనానికి పేరు పెట్టింది కూడా కుందుర్తి గారే. తర్వాత అనేక సార్లు పునర్ముద్రిస్తూ, కొన్ని కవితల్ని చేరుస్తూ వచ్చారు. ప్రధానంగా కవిత్వం ద్వారా మాత్రమే ప్రసిద్ధి పొందిన తిలక్ రాసిన కథల్ని కూడా ప్రచురించారు. పరిశోధకులు ఆయన లేఖా సాహిత్యాన్ని పరిశీలించారు. మరికొంతమంది ఆయన రాసిన నాటికలు, నాటకాల్ని ప్రముఖంగా పేర్కొన్నారు. మనసు ఫౌండేషన్ వారు ఎమెస్కో ప్రచురణ సంస్థతో కలిసి దేవరకొండ బాల గంగాధర తిలక్ సాహిత్యాన్ని ఒక బృహత్సంపుటిగా ప్రచురించి, ఆయన్ని భిన్న పార్శ్వాల్లో చూడొచ్చని నిరూపించారు. ఆయన కేవలం కవిత్వం గురించి తన కవితల్లోనే కాకుండా, లేఖల్లో కూడా సందర్భాన్ని బట్టి ప్రస్తావించినా, కవిత్వమై చెప్పిన 'అమృతం కురిసిన రాత్రి' కవిత్వమే ఆయన కవిత్వ తత్త్వాన్ని నిరూపిస్తుంది.

### తిలక్ కవిత్వం కా'దొక'తత్వం

'నాకవిత్వం' అనే కవితాఖండికలో తన కవిత్వమెలాంటిదో వివరిస్తూ 'నాకవిత్వం కాదొకతత్వం' అనడంద్వారా ఒకే దృక్పథానికీ, ఒకేవస్తువుకీ చెందింది కాదని మాత్రమే అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, ప్రతికవితకూ ఒక తత్వం ఉంటుంది. కానీ ఒక తత్వం కాదనే తిలక్ ఆలోచన ఒకే ధోరణితో రాసింది కాదనేభావనగా తీసుకోవాలని తర్వాత ఆ కవితలో చెప్పిన 'కాదు ధనికవాదం, సామ్యవాదం' అనడం ద్వారా ఏదో ఒక ధోరణికి మాత్రమే చెందిన కవిత్వంగా తన కవిత్వానికొక ముద్రవేసేస్తారేమోననే

ఆందోళన కనిపిస్తుంది. 'న్యూ సిలబస్ ' అనే కవితలో కూడా " ఇజంలో యింప్రిజన్ అయితే యింగిత జ్ఞానం నశిస్తుంది/ ప్రిజమ్ లాంటిది జీవితం, వేర్వేరు కోణాలు ప్రదర్శిస్తుంది" అనడం ద్వారా ఏదో ఒక ధోరణితో మాత్రమే కవిత్వం రాయడం సరైందికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు కవి. సాధారణంగా కొంతమంది కవులు 'సంఘాలు' ద్వారా తమ భావజాల నిబద్ధులుగా ప్రసిద్ధం కావడానికి ఇష్టపడుతుంటారు. మరికొంతమంది తన కవిత్వం ఒక 'సంఘం' నిర్దేశించిన ప్రణాళికలు, ఆ సిద్ధాంతాల ప్రచారాలకణుగుణంగా రాయడానికి ఇష్టపడరు. తిలక్ తనకాలంలో కవిత్వంపైనా, సాహిత్యంపైనా కొన్ని భావజాలాల ముద్రలువేసే క్రమాన్ని గుర్తించాడు. దానికి అనుగుణంగానే తానీ అభిప్రాయాల్ని ప్రకటించాడనిపిస్తుంది.

తన కవిత్వం "గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ/జాజిపువ్వుల అత్తరు దీపాలూ/ మంత్ర లోకపు మణి స్తంభాలూ/నా కవితా చందనశాలా సుందర చిత్ర విచిత్రాలు" అనడం ద్వారా భావుకతను వీడని కవిత్వాన్ని రాస్తుంటానన్నాడు. సముద్రం లోతు దిగితేగాని తెలియదు. కవిత్వం చదవడం మొదలు పెడితేగాని దాని భావుకత అర్థంకావడం మొదలుకాదు. కవితను లేదా కవితల పుస్తకాన్ని కొంతమంది ఏముందంటూ తిప్పేస్తుంటారు. కానీ పదాలుగా ప్రవహించిన భావాలను అంటే కొన్ని అర్థమైయ్యీ అర్థం కానట్లుండే శబ్దార్థాలు పైకి కనిపించే సముద్రంలాగా అనిపించినా దాని లోతులు తెలియాలంటే దానిలో దిగాలి. కవి భావుకతతో పాఠకుడు పయనించాలి. వాచ్యార్థాన్ని మించిన ప్రతీయమానార్థం మనకు గోచరమవ్వాలంటే, కేవలం నిఘంటు అర్థం చూస్తే సరిపోదు. మన ప్రాచీన ఆలంకారికులన్నట్లు అభిధా వ్యాపారాన్ని మించిన లక్షణ, వ్యంజనల్ని చూడాలి. అప్పుడు మాత్రమే కవిత్వ సౌందర్యం పాఠకునికి హృదయానికి పరిమళభరితమౌతుందని చెప్పడమే తిలక్ జాజిపువ్వుల అత్తరు దీపాలు అనడంలోని ఆంతర్యం. కవిత్వం లౌకిక ప్రపంచం నుండి అలౌకిక ప్రపంచానికి తీసుకుపోవాలి. అది నిజమైన కవిత్వంచేసే పని దీన్ని తిలక్ మంత్ర లోకపు మణి స్తంభాలు అన్నాడు. అప్పుడు కవిత్వం మనిషికి హాయినిస్తుంది. ఒక గొప్ప అనుభూతినిస్తుంది. దీన్ని చందనశాల అన్నాడు కవి. భావుకత గురించి చక్కని భావచిత్రాలతో అనుభూతి రమ్యతను సాధించాడు. కవిత్వానికి అభివ్యక్తి గొప్పతనాన్ని కలిగిస్తుందని ఔచిత్యంగా చక్కని అభివ్యక్తితో తన అభిప్రాయాన్ని చెప్పాడు. దీని తర్వాత తన కవిత్వంలో వ్యక్తమయ్యే కవిత్వ వస్తువు గురించి "అగాధ బాధా పాథః

పతంగాలూ/ధర్మవీరుల కృత రక్తనాళాలూ/త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిసూక్తి/నా కళా కరవాల దగద్ధగ రవాలు" అని చెప్పాడు.

### కవిత్వంలో అబ్స్ క్యూరిటీ (obscurity)

తిలక్ కొన్ని కవితల్లో ఒక ఆలంకారికుడిలా, ఒక సాహిత్య విమర్శకుడిలా కొన్ని లక్షణాల్ని చెప్తాడు. ఇమేజరీ (భావచిత్రాలు) వేయాలనే కుతూహలంతో అర్థంకాని ఇమేజరీలు వేయకూడదంటాడు. సరస్వతీ నారద సంవాదంలో కందుకూరి వీరేశలింగం ప్రబంధానుకరణ కవుల్ని అధిక్షేపించినట్లుగా తిలక్ విదేశీ కవిత్వాన్ని అర్థం పొసగని వాక్యాలతో కవిత్వం రాసేవార్ని "ఒక దేశం నిర్దేశంలేని వాక్యాల వికారంతో/ఎందుకు బాధిస్తావు నన్ను, బాధపడతావు నువ్వు!" అని విమర్శిస్తాడు. కానీ తాను కూడా ఇతర భాషల్లోని కవిత్వాన్ని చదువుతాడు. వాటిలో నచ్చిన కొన్నింటిని అనుసృజన కూడా చేశాడు. కానీ, సహజత్వం కవిత్వానికి ప్రాణంగా ఉండాలనేది ఆయన అభిప్రాయంగా తెలుస్తుంది. ''కవిత్వంలో అబ్స్‌క్యూరిటీ (obscurity) కొన్ని సందర్భాలలో వుండొచ్చును,/కాని, పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాలి హత్తుకోవాలి./అది ట్రాన్స్‌పరెంట్(transparent)చీకటై వుండాలి, నిన్ను పలకరించాలి. /కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి, కదిలించాలి" అని కవిత్వం ఎలా ఉండాలో ఒక లాక్షణికుడిలా వివరించాడు. ఈ లక్షణాన్ని తన కవిత్వంలో అనుసరించాడు కూడా.

### కవిత్వం ఒక ఆల్కెమీ (alchemy)

పరసువేది వల్ల దేన్నైనా బంగారం చేయవచ్చుననే ఒక ఆలోచన ఉంది. వేమనకు ఆ విద్యవచ్చునని చాలామంది అంటారు. అలాగే కవిత్వం రాయడం ఒక విద్య. దేన్నైనా కవిత్వం చేయడం ఒక గొప్ప రసవిద్య. అయితే ప్రాచీన ఆలంకారికులు, ముఖ్యంగా ధనంజయుడు (దశరూపకం) వ్యక్తం చేసిన

"రమ్యం జుగుప్సితముదారమథాపినీచ
ముగ్రం ప్రసాది గహనం వికృతం చ వస్తు
యద్వాప్యవస్తు కవిభావకబావ్యమానం
తన్నాస్తి యన్న రసభావముపైతి లోకే." అనే ఈ అభిప్రాయం కళకళకోసమనే వాదనగా వ్యాఖ్యానించినవాళ్ళున్నారు. కవి ప్రతిభావంతుడైతే, దేన్నైనా కవిత్వం

హృద్యంగా మార్చగలుగుతాడు. అయితే, దీన్ని వ్యాఖ్యానించిన వాళ్ళు వస్తువు కంటే దాన్ని అభివ్యక్తీకరించే విధానమే ముఖ్యమన్నట్లు చెప్పారు. కానీ, తిలక్ వస్తువుకీ, దాన్ని అభివ్యక్తీకరించిన విధానానికీ ప్రాధాన్యాన్నివ్వాలంటూ.. “కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును/కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు/కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు” నంటూ ‘నవత–కవిత’ కవితాఖండికలో కవిత్వమెలా ఉండాలో తన అభిప్రాయాల్ని వర్ణించాడు.

కవిత్వం జీవితాన్ని స్పర్శించాలి. ఆ జీవితం కష్టాలకు, కన్నీళ్ళకు నిలయమైన వారిదై ఉండాలి. వాటిని పోగొట్టే ఆలోచనను హృదయ ద్వారాల్ని సున్నితంగా తెరిచేలా చెప్పగలగాలి. కవి పీడితుల పక్షాన నిలబడున్నానంటున్నాడు. అది ధర్మం బద్ధంగా జీవించేవాళ్లు, ధర్మం కోసం పోరాడేవాళ్ళు, నిస్వార్థంగా ప్రేమించేవాళ్లని కూడా స్పష్టంగానే చెప్తున్నాడు. అటువంటి ధర్మపరుల కోసం తన కవిత్వమనే కళను సాధన చేస్తున్నాడు. తన కవిత్వం హృదయాల్ని కరిగిస్తుందనిదానికే ‘నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయపారావతాలు’ అన్నాడు. తనకవిత్వం చదివి ప్రజలు పరిపర్తన చెంది, మానవాళి శ్రేయస్సుని ఆకాంక్షిస్తారనే నా అక్షరాలు ప్రజాశక్తులవహించే విజయ ఐరావతాలు అన్నాడు. దీని ద్వారా తన కవిత్వ ప్రయోజనాన్ని కూడా చెప్పాడు. తన కవిత్వ అభివ్యక్తి ఆహ్లాదాన్ని కలిగిస్తుందని నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు అన్నాడు. అందుకనే ‘నాకవిత్వం’ అనేది ఎంతో విలువైన కవిత. అది అంతా తిలక్ కవితాతత్వాన్ని నిరూపించిన కవిత. తనదొక తత్వం కాదంటూనే తన కవిత్వ తత్వాన్ని నిరూపించుకునేలా రాసుకున్న కవిత. ఈ ప్రణాళిక ప్రకారమే భావుకతనూ, అభ్యుదయాకాంక్షను వ్యక్తం చేస్తూ కవిత్వమయ్యాడు. ప్రతి కవితలోనూ ఈ లక్షణాలే కనిపిస్తాయి. తిలక్ కవిత్వం నిత్య నూతనంగా ఉండాలనుకుంటాడు. మన ఆలంకారికులు చెప్పినట్లు ‘నవనోవేన్మేషనం’గా ఉండాలంటాడు. దాన్నే ఒక సందర్భాన్ని ఉపయోగించుకుంటూ ‘ఆమె చిరునవ్వులో/ కవిత్వంలాంటి కొత్తదనం మెరిచింది’ అంటాడు.

## వసుధైకతత్వాన్ని వీడని దేశభక్తి తత్వం

తిలక్ జీవించిన కాలంలో ముఖ్యంగా కవిత్వమవుతున్న కాలంలో అప్పుడప్పుడే భావకవిత్వం స్థానంలో సామ్యవాదాకాంక్షతో అభ్యుదయకవులు ఉద్యమప్రాయంగా రాస్తున్న కవిత్వం, రష్యా ప్రభావం, చైనా యుద్ధ కవ్వింపులూ మొదలైన నేపథ్యాలన్నీ

తన కవిత్వంలో ప్రతిఫలిస్తాయి. 'ప్రాత: కాలం', 'ప్రవాసలేఖ' మొదలైన వాటిలో భావకత్వఛాయలు, మేగ్నకార్టలో శ్రీశ్రీ ప్రభావం స్పష్టంగా కనిపిస్తూ భావ, అభ్యుదయ భావాల సంఘర్షణ తిలక్ కవిత్వంలో కనిపిస్తుంది. సంస్కృత పదభూయిష్టమైన శైలితో ఒక్కొక్క కవితలో ప్రబంధశైలి కనిపిస్తుంది. 'ఆర్తగీతం' కవితలో 'నేను చూశాను ... అంటూ ఆకలినీ, నిర్భాగ్యుల్నీ, అనాథల్నీ, నిర్లక్ష్యానికి గురౌతున్న చిరు ఉద్యోగుల్నీ, పేదరికాన్నీ, అనారోగ్యం పాలవుతున్న కుటుంబాల్నీ, అధికసంతానంతో కష్టనష్టాలకు గురౌతున్నవాళ్ళనీ ఏకరువుగా వర్ణించి, అటువంటి స్థితిలో 'నాదేశాన్ని గూర్చి పాడలేను' అనడం కూడా దేశం పట్ల కవికున్న దేశభక్తికి నిదర్శనమే. అటువంటి సందర్భాల్లో కవికి గురుతరమైన బాధ్యత ఉండదంటాడు కవి. అలాంటి సందర్భాల్లో కవి భావుకతకు, చిత్ర విచిత్రంగా కవిత్వాన్ని రాసుకోవడం తగదనే సామాజిక బాధ్యతను వ్యక్తీకరిస్తూ "చిత్ర శిల్పకవితా ప్రసక్తివాంఛింపను, తత్వ సూత్రవాదోక్తి చలింపను" అన్నాడు. కవిత్వం కవిత్వం కోసమనే కేవల సాహిత్యవాదుల్ని తూర్పారబదుతున్నాడు. అంతేకాదు, కష్టాల్లో ఉన్నవాళ్లకు బోధించే కర్మసిద్ధాంత తత్వాలను వ్యతిరేకిస్తున్నాడు. కవికి దేశం పట్ల అచంచలమైన ప్రేమను అనేక సందర్భాల్లో వ్యక్తీకరిస్తూ 'భారతదేశాన్ని కాదనలేను/రష్యాను కొలవలేను" అని 'కవివాక్కు' కవితలో స్పష్టంగా కూడా చెప్పాడు. 'ఒక సత్యంలో మరో సత్యాన్ని ఖూనీ చెయ్యకు/ పరదేశ స్తుతిలో స్వకీయ సంస్కృతి విస్మరించకు' అనడం దీన్ని మరింత బలపరుస్తుంది. అయితే తిలక్ దేశభక్తి మూఢత్వంతో నిండిండి కాదు. 'సంకుచితమైన జాతి, మతాల సరిహద్దుల్ని చెరిపేస్తున్నాను చూడు" (వసుధైకగీతం) అనికూడా స్పష్టంగానే చెబుతున్నాడు. మానవుడే కేంద్రంగా, మానవత్వమే కేంద్రంగా తాను కవిత్వం రాస్తాననడానికి వసుధైకగీతంతో పాటుఅనేక కవితాత్మక పాదాలు కనిపిస్తాయి. బుద్ధుని బోధనల్లోని శాంతిని హృదయానికి హత్తుకుంటూ "ఇంకా కరిగినీరై పోలేదు హిమాలయాలు శిఖరాలు/ ఇంకామరిచిపోలేదు తథాగతుని మహాత్ముని ప్రవచనాలు" అనగలిగాడు కవి. 'కరుణలేని కవివాక్కు సంచితమౌతుంద" అనేక చోట్ల కరుణరసాత్మకమైన కవిత్వం ప్రవహించింది.

### అమృతమై కురిసిన నిత్య చైతన్యతత్వం

'కాయ్ రాజా కాయ్' కవితలో జీవితాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ 'జీవితమే ఒక జూదం'గా కూడా ఒక్కోసారి అనిపిస్తుందంటాడు. కానీ, తిలక్ 'అమృతం కురిసిన

రాత్రి' కవితాఖండిక ఆయనకు ఎంతో పేరుతెచ్చిన ఖండికల్లో ముఖ్యమైంది. చక్కని భావచిత్రాభివ్యక్తితో తానుచెప్పవలసిన వస్తువుని తన కవిత్వతత్వానికి అనుగుణంగా వర్ణించిన కవిత. కవిత చదువుతుంటే ఒక కథలా అనిపిస్తుంది. పాఠకుని హృదయంలో ఒక దృశ్యం ఆవిష్కృతమవుతుంది. కథనాత్మక కవితలా అనిపిస్తుంది. అందరూ నిద్రపోతుంటే, ఒక్కడు మాత్రం రాత్రంతా నిద్రపోకుండా మెలకువగా ఉన్నాడంటూ ఒక కథలా చెప్పి, మెలకువగా ఉన్నవాడికే అమృతం దొరికిందంటాడు కవి. ఏమిటా అమృతం? ఎవరిచ్చారా అమృతం? ఎవరా అప్సరసలు? ఈ కవిత చదువుతున్న పాఠకుడికి ఇలాంటి ప్రశ్నలెదురౌతాయి. ఈ కవితను చివరి వరకు చదివి మరలా మొదటికి రావాలనుకుంటున్నాను. “అమృతంకురిసిన రాత్రి/అందరూ నిద్రపోతున్నారు/ అలసి నిత్యజీవితంలో సొలసి సుషుప్తి చెందారు/అలవాటునీ అస్వతంత్రతనీ కావలించు కున్నారు/అధైర్యంలో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు” అని ముగించే ముందు కవి చెప్పిన మాట. దీనిలో ఒక కీలకం ఉంది. ముందుగా ప్రతి వ్యక్తిలోనూ ఉండే స్వతంత్రంగా ఆలోచించలేనితనాన్ని, ధైర్యంగా ముందుకెళ్ళలేని తనాన్ని గుర్తించాలి. తాము సాధించాలనుకున్న దాని గురించి నిత్యం శ్రమించాలి. దానిపైనే దృష్టి కేంద్రీకరించాలి. ఆకాశంలాంటివి అవకాశాలు. అనంతంగా ఉంటూనే అందనంతగాను, కనిపించకుండానూ ఉంటాయి. వాటిని అందుకోవడానికి స్వతంత్రమైన ఆలోచన, సాధిస్తాననే ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్ళగలిగే ధైర్యం ఉన్నవాడు 'నవనవాలైన ఊహావర్ణాల మీద ఉదయించిన సూర్యుడు' లాంటివాడు. కొత్తగా ఆలోచిస్తాడు. కొత్తమార్గాల్ని అన్వేషిస్తాడు. సూర్యుడిలా ఒకరోజు అయిపోయినా మరలా కొత్తశక్తితోఉదయిస్తున్నట్లు తన పనిని సాధించేవరకూ ప్రయత్నిస్తుంటాడు. దానిక్కారణాన్నిలా చెప్పాడు కవి. 'జీవితాన్ని ప్రేమించినవాడు జీవించడం తెలిసినవాడు' మాత్రమే అలాచేయగలడు. 'ఎవరికి దొరకని రహస్యాల్ని కూడా తాను వశపరచుకో గలడు. అలా చేయాలంటే 'కలలు పట్టు కుచ్చులూగుతూన్నకిరీటం ధరించా'లంటాడు కవి. తాను సాధించాలనే లక్ష్యాన్ని కలగనాలి. అటువంటి నిరంతర పట్టుదల, శ్రమించే తత్వం, కొత్తగా, స్వతంత్రంగా ఆలోచించడం, తన జీవితంపట్ల తనకు ప్రేమకలిగి ఉండడం, ఇతరులతో కలిసిమెలిసి బ్రతకడమెలాగో తెలియడం వంటి లక్షణాలున్న నిత్యచైతన్యశీలంగల మానవుడే నిజమైన అందగాడు. ఆ ఆనందమే మనిషిని నిజమైన మనిషిగా జీవించేటట్లు చేయగలుగుతుంది. అటువంటివాడికే 'అమృతం' లభిస్తుంది.

అటువంటి మానవుడు దుఖ దు:ఖాల్ని సంతోషంగా స్వీకరిస్తాడు. బుచ్చిబాడు 'చివరికి మిగిలేదేమిటి' అని ప్రశ్నించి ప్రతి జీవితానుభవమూ జీవితానికి ఒక అనుభూతి నిస్తుందని చెప్తే, తిలక్ మనిషి తన జీవితాన్ని ప్రేమిస్తూ నిత్యచైతన్యశీలిగా మారడంలోనే అమృతత్వం దాగి ఉందని తెలుసుకోవాలంటాడు. ఈ కవితనే మరొక పార్శ్వంలో విశ్లేషించుకున్నప్పుడు కవి నవ్యభావనలతో కవిత్వం అందించడం కోసం కవిత్వం ఒక తపస్సులా భావించాలి. కవిత్వానికి జీవితం వస్తువవుతూనే జీవితాన్వేషణను దర్శింపజేయాలి. స్థల, కాలాతీతంగా కవిత్వం పాఠకుణ్ణి ఆనందలోకాలకు తీసుకొని పోగలగాలి. అప్పుడు మాత్రమే కవికి శాశ్వతమైన కీర్తి లభిస్తుంది. కవిత్వం జీవిత పరమార్థాన్ని ప్రబోధిస్తుంది. ఆ ప్రబోధమే అమృతత్వం. దాన్ని కవి మాత్రమే కాదు, పాఠకుడూ ఆస్వాదించగలుగుతాడు. అందుకే ఈకవిత తిలక్ కవిత్వతత్వాన్ని కూడా తెలియజేస్తుంది.

దీనితో పాటు మరికొన్ని కవితల్లో కూడా కవిత్వ తత్వం గురించి వివరించాడు. కొనకళ్ళకు అక్షరాంజలి కవితలో కూడా 'సిన్సియారిటీ కవితా సుందరికి సీమంతం లాటిది/శివ సుందరాలకి సత్యం బేస్ లాంటిది' అంటాడు. ఇక్కడ 'సిన్సియారిటీ' అనే పదం కవిత్వం పట్ల జీవితమంత అపేక్ష ఉండడం, శ్రద్ధగా రాయడం వంటి లక్షణాల్ని స్ఫురింపజేస్తున్నాడు. అయితే సంప్రదాయ భావాల్లో కవిత్వం గురించి చెప్పేటప్పుడు సత్యం, శివం, సుందరంగా ఉండాలని కొంతమంది భావిస్తారు. దీన్ని భగవంతుడే సత్యం, భగవంతుడి గురించి చెప్పడమే శివం, భగవంతుడి గురించి ఆలోచించడమే సుందరంగా వ్యాఖ్యానించిని వాళ్ళూ ఉన్నారు. తిలక్ కూడా ఒకటి రెండు చోట్ల సంప్రదాయ భావాల్ని తన కవిత్వంలో వర్ణించాడు. 'శ్రీశాంభవి కూర్చిన శివఫాల విలసితమౌ/వెలుగుల విభూదివా' అంటూ 'ప్రాత: కాలా'న్ని దైవసంకల్పంగా అభివర్ణిస్తాడు కవి.

మన తెలుగు సాహిత్యంలో కవిత్వాన్ని రాసిన కవులు తమ కవిత్వ లక్షణాల గురించి చెప్పుకోవడం కొత్తేమీకాదు. నన్నయ నుండి నేటి వరకూ ఇంచుమించు ప్రతి కవీ ఏదొక సందర్భంలో తన కవిత్వ తత్వం గురించి గానీ, తన కవిత్వాన్ని అర్థం చేసుకోవడమెలాగని గానీ, కవులు మళ్ళీ తమ కవిత్వంలోనే చెప్పిన సందర్భాలూ అనేకచోట్ల ఉన్నాయి. అవి తమ పూర్వ లాక్షణికుల్ని నిరాకరించడంగానో, వ్యతిరేకించడంగానో భావించనవసరం లేదనుకుంటాను. తమ కవిత్వాన్నిలాగే

చదవాలనే లాక్షణిక కవి అవతారమెత్తడంగా కూడా భావించనవసరం లేదనుకుంటాను. తమ కవిత్వం గురించి తాము చెప్పుకోవడం తెలుగు కవుల సంప్రదాయంగానే దాన్ని సూత్రీకరించడం సమంజసమేమో అనుకుంటాను. ఎందుకంటే కవిత్వం రాసేవాడికి కవిత్వం రాసుకుంటూ పోవడమే తన పనిగా పెట్టుకోవాలి. తాను కవిత్వంలో శాస్త్రాన్ని చెప్పడం తన పనికాదుబీ కానీ, శాస్త్రాన్ని చెప్తున్నట్లనిపించే కవిత్వం పట్ల తన కవిత్వావేశంతో వ్యక్తీకరించే అభిప్రాయాలుగా మాత్రంగా భావించాలి. అందుకనే ప్రాచీనకవులు కావ్యావతారికల్లో కవిత్వంపై చెప్పిన వాటిని 'అభిప్రాయాలు' అని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు చేసిన వ్యాఖ్య ఎంతో ఆలోచనతో చేసిందను కుంటున్నాను. కవులు చెప్పిన కవిత్వతత్వాన్ని అటువంటి దృష్టితోనే చూడాలనుకుంటూ, తిలక్ కవిత్వ తత్వంపై వ్యక్తం చేసిన ఆయన కవిత్వ పాదాల్ని కూడా అలాగే చూడ్డం శాస్త్రీయమైన వివేచన అవుతుందనుకుంటున్నాను.

# 8. తిలక్ కథల్లో స్త్రీపురుష సంబంధాలు

– ఆచార్య కిన్నెర శ్రీదేవి

మానవ సంబంధాల్లో స్త్రీపురుష సంబంధాలు అత్యంత ప్రధానమైనవి. సంఘ సంస్కరణోద్యమం మొదలుకొని స్త్రీవాదఉద్యమం వరకు అన్ని ఉద్యమాలు స్త్రీల స్థితిగతుల్లో, స్త్రీ పురుషుల ఆలోచనల్లో మార్పురావాలని కోరుకున్నారు. స్త్రీ పురుష సంబంధాల్లో సమతౌల్యం సాధించడం ఆధునిక ప్రజాస్వామిక సంబంధాల్లో భాగం. స్థూలంగా చెప్పాలంటే, భారతీయ సమాజం స్త్రీ పురుష సంబంధాల విషయంలో ప్రజాస్వామిక దృష్టి కోణాన్ని ఇంకా అలవర్చుకోవాల్సి ఉంది. అస్తిత్వవాద, స్త్రీవాద సిద్ధాంత భావజాలం విస్తరించే క్రమంలో మానవ సంబంధాలను స్త్రీపురుష దృష్టికోణంతో చూడటం, విశ్లేషించటం ఒక కొత్త విమర్శ పరికరంగా మన ముందుకు వచ్చింది. స్వాతంత్ర్యానంతరం తిలక్ కథల్లో 1948 నుండి 67 వరకు అంటే మూడు దశాబ్దాల కాలంలో స్త్రీ పురుష సంబంధాలలో సమాజ స్వరూపాన్ని దర్శించడం ద్వారా ఆనాటి స్త్రీల స్థితిగతులను అంచనా వేయడానికి అర్థం చేసుకోవడానికి చేసిన ప్రయత్నమిది.

ఏ రచయిత ప్రత్యేకతనైనా విశ్లేషించడానికి ఆ రచయిత సామాజిక సాంస్కృతిక వాతావరణం నుంచి భిన్నంగా మరింత అభివృద్ధి అయిందా, అని ఆలోచించ గలిగాడా? ఆ ఆలోచనకు సాహిత్య వ్యక్తీకరణ ఇవ్వగలిగాడా? అనేది కీలకాంశం అవుతుంది. ఈ దృష్టితో చూసినప్పుడు తిలక్ తన సమకాలికులనుంచి కొంతవరకు విభిన్నంగా వున్నాడని చెప్పాలి. ఎందుకంటే, ఆయన కథలు రాస్తున్న సందర్భంలో కథకులను ప్రధానంగా ప్రేరేపించిన అంశం ఆర్థికాంశం. చలంలాంటి వాళ్లు ఆర్థిక సంబంధిత విషయాలలో వెలిగా ఉన్నప్పటికీ, కథకులకు ఆర్థిక అంశాలు జీవితాన్ని ప్రభావితం చేస్తున్న తీరే ప్రధాన ప్రేరణ. అటువంటి భావవాతావరణంలో తిలక్ ఆర్థికాంశంతో పాటు వ్యక్తి కొన్ని సందర్భాలలో సమూలంగా పరివర్తన చేయగలిగే సహజాతాల లైంగిక ప్రేరణలను కూడా తన కథల్లో తిలక్ ప్రముఖంగా చిత్రించారు.

ఈచిత్రీకరణే తిలక్ ను తన సమకాలికుల నుంచి విలక్షణ పరుస్తుంది. ఈ విషయాన్ని విస్మరించి తిలక్ ను కేవలం అమూర్త మానవతావాద ఛాయలో నుంచి కథల్ని రాశాడనటం, ఆయన తెలుగు కథాసాహిత్యంలో చేసిన కృషి గుర్తించడానికి, ఆయన ప్రతిపాదించిన లైంగిక సహజాత సామాజిక దృష్టికోణాన్ని అంగీకరించకపోవటమే అవుతుంది.

సాధారణంగా స్త్రీల పట్ల సమాజం విధిస్తున్న కట్టుబాట్లు, నైతిక విలువల చట్రం మధ్య జరిగే సంఘర్షణను తిలక్ అక్షరబద్ధం చేశారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ కూడా నైతిక చట్రాల పరిధిలో నుంచే ప్రవర్తించడాన్ని తిలక్ తన కథల్లో నమోదు చేశారు.

మధ్యతరగతి నుండి దిగువ మధ్యతరగతిలోకి నెట్టేస్తున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో మనుషులు నైతిక విలువల చట్రాలమధ్య నలిగిపోతున్నాడు. మనిషి తన అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం ఆవిలువల చట్రాన్ని అధిగమించడానికి చేసే ప్రయత్నంలో ఆర్థికంగా ధ్వంసం కావడం తప్ప మరో ప్రత్యామ్నాయం కనపడదు. “ఆశాకిరణం”, “తీవ్రవాద నాయకుడు”, “ఊరి చివరి ఇల్లు”, “సుందరి సుబ్బారావు”, “హోటల్లో”, “సీతాపతి”కథల్లోని స్త్రీపురుష సంబంధాలు ఆర్థిక సంబంధాలను దాటి ప్రవర్తించలేదు. పైన చెప్పిన కథలు అన్నింటిలో కూడా ఎకనమిక్ కండిషన్స్ ప్రిమరీ రోల్ ప్లే చేస్తే “యవ్వనం”,”సీతాపతి”, “ఊరిచివరి ఇల్లు” కథల్లో మాత్రం ఆర్థికాంశం సెకండరీ గా ఉంటుంది. సామాజిక విలువలకు, నైతిక విలువలకు మధ్య జరిగిన సంఘర్షణలో లైంగికపరమైన సహజాతం సామాజిక కట్టుబాట్లను సైతం అధిగమించడం ఈ కథల్లో చూడగలం.

తిలక్ రచనాకాలానికి ముందు సమాజం ఏర్పరిచిన నైతిక విలువలు మారాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ (ట్రాన్సిషన్ పీరియడ్) సంధికాలంలో అంతవరకు సమాజంలో అమలవుతున్న ఫ్యూడల్ భావజాలంస్థానంలో స్త్రీలను అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని అనివార్యంగా భావించారు. ముఖ్యంగా ఆర్థికస్థితి వలన ఏర్పడే సామాజిక ప్రతిఫలనాలు దొంగతనం, వ్యభిచారం. వ్యభిచారాన్నిఒక సామాజిక రుగ్మతగా చాలా కథల్లో రిపీటెడ్‌గా చెప్పే ప్రయత్నం చేశారు తిలక్. ఇలా రిపీటెడ్ చెప్పడంలో నిరుపేద స్త్రీల దయనీయత ఎంతగా కదలించిందో తెలుస్తుంది. ఆసమస్య పట్లగల సంవేదనలు ఒకకథగా మలిచిన తరువాత కూడా మళ్ళీ మళ్ళీపునరావృతం కావడం.

"ఆశాకిరణం", "తీవ్రవాద నాయకుడు" ఈ రెండు కథల్లో కూడా ఆత్మహత్య సదృశ్యమైన అంశాల నుంచి వ్యభిచారించడం ఒక పరిష్కారమార్గంగ భావించారు. అలా భావనలో నుంచి ఆనాటి సామాజిక స్థితికి నిదర్శనంగా చూడటం ఒక ఎత్తయితే, రెండవ కోణంలో ఆర్థిక దుస్థితి యొక్క తీవ్రరూపాన్ని చెప్పడంలో భాగంగా కుటుంబ భారాన్ని మోయమని పురుషుల్ని ఆదేశించింది. కానీ "ఆశాకిరణం"కథలోని వెంకటేశ్వర్లు గాని, "తీవ్రవాద నాయకుడు"లోని ఆదిశేషయ్యగానీ కుటుంబ భారాన్ని నిర్వహించలేని ఒక నిస్సహాయ స్థితిలోకి వెళ్లినప్పుడు, ఫ్యూడల్ విలువలను అధిగమించి స్త్రీలు కుటుంబ భారాన్ని మోయవలసి రావడాన్ని పురుషులు వ్యతిరేకించకుండా ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, ఎలాంటి భేషజం లేకుండా అంగీకరించారు. ఫ్యూడల్ భూస్వామిక విలువల విధ్వంసాన్ని అంగీకరించి ఆహ్వానించటం ఒక సామాజిక పరిణామ పర్యవసానం. ఈ రెండు కథల్లో కూడా స్త్రీ శరీరమే కేంద్రం కావడం గమనించాల్సిన అంశం.

"ఆశాకిరణం" కథలో నేను చావనవసరం లేదు'' అని వెంకటేశ్వర్లు అనుకోవడానికి, "ఆడ దాన్నయితే ఎవడో ఒకడు నన్ను లేవతీసుకు పోయేవాడు కదా" అని "తీవ్రవాద నాయకుడు" కథలోని ఆదిశేషయ్య పాత్ర ఆలోచన వెనుక స్త్రీపురుష సంబంధాల్లో ప్రతిఫలించే ఆర్థికాంశమే ప్రధానంగా ప్రతిఫలిస్తుంది.

"యవ్వనం'' కథలో భార్యపాత్ర పరపురుషుని సాంగత్యానికి సిద్ధంగా లేదు. కానీ ఆమెలో భార్యాభర్తల మధ్య గల నైతిక వాస్తవానికి సహజతానికి మధ్య జరిగిన ఘర్షణ ఫలితంగా ఏర్పడిన వాక్యూమ్ ను అపరిచితుడు గుర్తుపట్టగలిగాడు. "వెంకట్రామయ్య ఉన్నారా?" అని అడగడానికి వచ్చిన అగంతకుడికి ఆమె మీద నిర్దిష్టమైన ప్రేమగానీ, వ్యామోహం గాని ఏమీ లేవు. కేవలం ఆమెలోని లైంగిక పరమైన భావనలను గుర్తుపట్టడం వల్లనే అవకాశాన్ని తీసుకున్నాడు. భర్త కూడా ఆమెలోని ఉత్సాహం గుర్తించే, సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోవాలనుకుంటాడు. అందుకే ఆతడు భార్యను నిర్లక్ష్యం చేసిన భర్త పాత్రగా పాఠకులు భావించరు. ఈ కథే కాదు ఏకథతీసుకున్నా ఫ్యూడల్ విలువల తీవ్రత స్త్రీపురుషుల లైంగిక జీవితాల్ని ఎలా నిర్దేశించి, నియంత్రిస్తుందో వాటిని ఉల్లంఘించినపుడు గానీ అర్థంకాదు.

ఆడిట్ జరుగుతున్నప్పుడు సెలవు పెడితే తన ఉద్యోగం ఊడతుందనే భయం వల్లనే భర్త ఇంట్లో ఉండలేక పోతాడు. ఆర్థికాంశం ఎంతబలమైనదో ఇటు లైంగిక భావనల యొక్క తీవ్రత రెండూ కూడా కౌటుంబిక చట్రంలోని స్త్రీపురుషుల జీవితాలను

ఎలా నియంత్రిస్తుందో తెలియజేస్తాయి. ఆ నియంత్రణ సహజాతాల ముందు ఎంత బలహీనమౌతాయో కూడా తిలక్ కథలు నిరూపిస్తాయి.

కేవలం వ్యక్తుల్ని దోషులుగా నిలబెట్టే ఆర్థిక అంశాలపై దృష్టి కేంద్రీకరించి తిలక్ రచనలు చేయలేదు. ఎందుకంటే, ఆర్థిక దృష్టికోణం ఖచ్చితంగా పొలిటికల్ డైమన్షన్ తీసుకుంటుంది. కానీ తిలక్ కథల్ని గమనించినట్లయితే, తిలక్ తన కథలకు రాజకీయ కోణం ఇవ్వలేదు. అట్లని ఆర్థిక సంబంధాలను కూడా నిర్లక్ష్యం చేయలేదు. తిలక్ ఈరెండు అంశాలను సమప్రాధాన్యతాంశాలుగా నిలబెట్టే ప్రయత్నంచేశారు. ఇదే తిలక్ కథలకు విలక్షణత్వాన్ని చేకూర్చే అంశం.

"ఊరిచివరి ఇల్లు" కథలో పడుపువృత్తిలో జీవించిన ముసలవ్వ, ఏ దిక్కులేని రమకు చేయూత అందించడం, జగన్నాథం అందించే చేయూత నుండి తప్పించటంలో ఆర్థిక కోణానికి, మానవత్వానికి వున్న పలుచటి పొర స్త్రీపురుష సంబంధాలలో సమస్యాత్మకం అవుతుంది. అవ్వకోణం నుంచి అవ్వపాత్ర కరెక్ట్ అనుకుంటే, రమ, జగన్నాథం దృష్టికోణం నుంచి కూడా కరెక్టేనని పాఠకుడు భావిస్తాడు. ఇది తిలక్ పాత్రల మనోప్రవృత్తి పరంగా నడిపించడం వల్ల ఏ ఒక్కరిని తప్పుపట్టలేక పోతాం. సమాజంలోని ఫ్యూడల్ నైతిక విలువల పతనాన్ని స్త్రీపురుష సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తుందో తిలక్ వాచ్యం చేయదు. కానీ పాఠకుడికి ఆస్పృహను అందిస్తాడు. అత్యంత సహజంగా ఆ పాత్రలు అలా ప్రవర్తించకపోతే, లేక మరోలా ప్రవర్తిస్తే, పూర్తిస్థాయి నాటకీయ ఆదర్శీకరణ జరిగివుండేది. దాంతో కథలో వాస్తవికత దెబ్బతినేది.

విజయుడి గురించి రమ చెప్పినదంతా అబద్ధమని డబ్బులకోసం ఆడుతున్న నాటకంగా చెబుతుంది. జగన్నాథంలోని పురుష స్వభావంతో అతన్ని మనస్ఫూర్తిగా జీవితం లోకి ఆహ్వానించిన రమను కోల్పోతాడు. ఆర్థిక సంబంధాలకేది అతీతం కానిదేదీ లేదు. అందులో స్త్రీ పురుష సంబంధాలు భాగమే అని చెప్తూనే స్త్రీ పురుష సంబంధాల విషయంలో ఆర్థికాంశం పాత్ర పరిమితం కావాలన్న ఆకాంక్ష రమ డబ్బుతో సహా పర్స్ విసరటంలో రచయిత దృష్టికోణం, ఆర్థికాంశాన్నిమించిన ఆమె జీవితేచ్ఛ వ్యక్తమవుతుంది. ఆమెకు అతనిపట్ల గల ఇష్టాన్ని, నిజాయితీని వ్యక్తం చేస్తుంది. స్త్రీ పురుషుల కలయికలో జాలి కూడా నిర్ణాయక పాత్ర పోషించడం ఈకథలో చూడగలం.

ఆర్థిక అవలంబన మానసికమైన అండ లేని నిస్సహాయ స్థితి సమస్యాత్మక జీవితం నుంచి బయటపడటం రమ లక్ష్యం ఆమెకు మాత్రమే సంబంధించిన భావుకత ఆమె తలపుల్లో ని విధేయుడు అతని స్థానంలో జగన్నాథం ఆమె ఈ ప్రపంచంలో స్థానం పొందాడు అలా పొందటానికి ఆమెకు విజయ్ పాత్ర ద్వారా ఆమె అందించిన లీడ్ జగన్నాథం స్పందించాడు అతను కోరుకోవడానికి గాని జీవితాన్ని ఇవ్వడానికి గాని బలమైన కారణం లేదు. ఆమె స్థితి కి కేవలం జాలిపడి మాత్రమే ఆమెను తనతో తీసుకు వెళ్లాలి అనుకుంటాడు నిజంగా డబ్బు కోసం అబద్ధం ఆడిందా లేక రమ నిజంగా నిజంగా ఇష్టపడి తనతో వస్తుందా అని ఒక్క క్షణం ఆలోచించి ఉంటే బాగుండు కదా అని పాఠకులు భావిస్తారు కానీ ఆమె చెప్పిన విజయుని పోలికలు జగన్నాథం పోలికలు యాదృచ్ఛిక మా? వాళ్ళిద్దరి మధ్య గల ఆంత రంగిక సంబంధం నిజమా? అబద్దమా ? అని తేల్చుకోవాల్సినంత బంధం (అటాచ్మెంట్) గానీ, అవసరం కానీ జగన్నాథానికి లేదు. రమ ఈ విషయంలో ఇంటెన్సివ్ గా ఫీల్ అయిందనిపిస్తుంది. ఆమె రెండు రకాలుగా స్పందించింది. పాత స్నేహితుడు విజయుడిని జగన్నాథంలో చూసుకోవడం ఒక బలమైన కారణం అయితే జగన్నాథం రమను కలవటం గాలివాటం. అతనికి రామ పట్ల ప్రేమ లేదు. అలా ఉండడానికి కారణం కూడా లేదు. రమ విసిరేసిన పర్సులో ఫోటో లేకపోవటం జగన్నాధాన్ని (డైలమా)సందిగ్ధత లోకి నెడుతుంది. కాంక్రీట్ గా ఆమె చెప్పిన గతం నిజమే అన్నా భావన అతనికి లేదు. ఒకవేళ ఆమె నిజాయితీ పట్ల నమ్మకం కుదిరినా పరిస్థితి చేయి దాటి పోయింది. వెనక్కి తిరిగి రాలేని పరిస్థితి అతనిది. అంతటితో కథ ముగిసిపోతుంది. కథను ఎక్స్ టెన్షన్ పాఠకుల ఊహకే అతను రైలు మరో స్టేషన్ లో దిగి వెనక్కి వచ్చి ఆమెను స్వీకరించాడా? లేక మధ్యలోనే చైన్ లాగి దిగిపోయాడా? లేక అలాగే తిరిగి రాకుండా వెళ్లిపోయాడా? ఈ ఊహలన్నీ పాఠకులకే వదిలేస్తాడు. దయనీయమైన స్త్రీల దౌర్భాగ్య స్థితిని చిత్రించడం వరకే రచయిత బాధ్యత. స్త్రీల పురుషుల పట్ల సామాజికుల దృక్పథంలో రావాల్సిన మార్పును మాత్రమే తిలక్ ఆశించాడు. సాహిత్య ప్రయోజనానికి ఇంతకుమించిన దాఖలా ఏముంటుంది.

మరో అరుదైన స్త్రీ పురుష సంబంధాలను చిత్రీకరించిన కథ "కదిలే నీడలు". ఈ కథలో రెండు జంటలు ప్రధాన పాత్రలు. ఒక జంట మిలటరీ లో పనిచేస్తున్నజవాను %--% నర్స్ అయితే మరోజంట ఆమా%--%యూబా. నర్స్ భర్త మిలటరీలో

చేరి, తిరిగి రాలేదు. ఎప్పటికైనా అతను తిరిగి వస్తాడని ఎదురుచూస్తూ, అతడు తిరిగి రాని విషాదంలోనే ఆమె ఉంటుంది. చీకటి పడిన తరువాత ఈ రెండు జంటలు కలుస్తారు. మాటల్లో ఆమె నీకేం అవుతుంది అని అడుగుతుంది ఎందుకంటే "ఆమె నీ కంటే పెద్దదిగా వుంది కదా" అని తనప్రశ్నను సమర్థించుకుంటుంది. దానికి యూబా సూటిగా చూసిన చూపులో అలాఅడగటం యూబాకు నచ్చని అంశంగా గుర్తిసాం. అంటే స్త్రీ పురుష సంబంధాలకు వయసు నిమిత్తం కాదన్న ప్రతిపాదన వుంది. యూబాకు నచ్చని విషయం అని కథకుడు స్పెసిఫిక్ గా చెప్పడంలోని అర్థమదే. అందులోనూ యుద్ధ సమయాల్లో సాధారణ పరిస్థితులలో ఏర్పరుచుకున్న నియమాలు ప్రాతిపదిక కాదని తిలక్ అవగాహన.

ఉద్యోగం గురించి నర్సు అడిగితే "నేను మిలటరీలో చేరదామనుకుంటున్నాను" అంటాడు. మరి ఆమా ఏమవుతుంది అని ఆమె ప్రశ్నిస్తుంది. "ఏమవుతుందీ.. ఏడుస్తుంది. ఏ సౌకర్యము లేక, తిండిలేక ఎన్నాళ్లు ఉండడం? నేను సైన్యం లో చేరితే ఇంకొక మంచి వాడితో స్నేహం చేసుకుంటుంది. యుద్ధం వచ్చినప్పుడు స్నేహం ఎంత త్వరగా చేసుకుంటా మో అంత త్వరగా తెంచుకోవాలి" అంటాడు యూబా. యుద్ధ విధ్వంసం వలన అయిన వారిని కోల్పోయి కొత్త సంబంధాల్లోకి వెళ్లాల్సిన అనివార్యతను యుద్ధం ఏర్పరుస్తుంది. ఏ సంబంధాలనైతే యుద్ధం తెంచుతుందో అదే యుద్ధం కొత్త బాంధవ్యాలను కూడా ఏర్పరుస్తుందని యూబా-నర్స్ మధ్య జరిగిన సంభాషణ ద్వారా తెలుస్తుంది. యుద్ధ విధ్వంసం వల్ల అయిన వారిని కోల్పోయినపుడు కొత్త సంబంధాల్లోకి వెళ్లాల్సిన అగత్యం స్త్రీపురుషులిరువురికి వుంది. సమాజం వాటిని ఒక చట్రంలో బిగిస్తుంది. వైవాహిక చట్రానికి వెలుపలగల స్త్రీ పురుష సంబంధాలలోని తాత్కాలికతను యుద్ధ నేపథ్యంలో తిలక్ చర్చించారు.

"అతని కోరిక" కథ ఆకలి, లైంగిక అవసరం రెండూ శారీరక అవసరాలే. ఒకదానితో ఒకటి ముడి పడి ఉన్న అంశాలే. కథ ఆకలికి తాళలేక బిడ్డజబ్బు పడిందని భార్య తన తాళిబొట్టు భర్త చేతికిస్తుంది. అతను భార్య తాళి బొట్టుతో పడుపు వృత్తి చేసే పుష్పవల్లి అనే స్త్రీ దగ్గరికి దగ్గరికి వెళ్తాడు ఆమె అతని దారిద్ర్యాన్ని పసిగడుతుంది అతని ఆకలి తీర్చి అతని బంగారం అతనికి ఇచ్చి పైగా పది రూపాయలు కూడా అతని జేబు లో పడుతుంది ఆమె తన దారిద్ర్యాన్ని చేతగాని తనాన్ని గుర్తించడమే కాకుండా దా సహాయం చేయటం ఆ స్థితిలో ఉండటం అతని పురుషత్వం అంగీకరించ

లేకపోయింది. ఎంత పేదరికంలో ఉన్నా ఆకలితో అలమటిస్తున్నా అవమానాలు పడుతున్నా అడ్డురాని అహం శరీర వ్యాపారం చేసే స్త్రీ దృష్టిలో లోకువ కావడం లక్ష్మీ మోహన్ రావు సహించలేక పోతాడు.

దారిద్ర్యం నిరుపేద స్త్రీల తీరని కోరికలు, కల్లలైన కలల ప్రపంచం మిగిల్చిన విషాదంలోనే జీవితాలను వెళ్ళ మార్చిన "ఊరి చివరి ఇల్లు" కథలోని రమ "ఉంగరం" కథలోని లక్ష్మి గృహిణులుగా జీవించాలని కలలుగన్నారు. కానీ లక్ష్మిని సమాజం దొంగ అని ముద్ర వేసి జైలు జీవితం గడపమంది. అలాగే "ఊరి చివరి ఇల్లు" కథలోని రమను వ్యభిచార కూపంలో జీవించమని సామాజిక విలువలు అమూర్త సామాజిక విలువలు వీళ్లను శాసించాయి. అలాగే గృహస్థ జీవితంలో ఉన్న స్త్రీలు "అతని కోరిక" కథలోని భార్య భర్త ప్రమేయంతోనే శారీరక సంబంధంలోకి వెళ్ళాల్సివస్తుంది. "యవ్వనం" కథలోని భార్య వైవాహిక సంబంధంనుండి తప్పుకోవాల్సి వస్తుంది. ఫ్యూడల్ వైవాహిక చట్రం స్త్రీలను తమంతకు తాము దోషులుగా భావించి నూన్యతలోకి నెట్టేసే (మృత్యువును ఆశ్రయిస్తారు)అమానవీయ క్రమాన్ని బహిర్గతం చేశారు.

తిలక్ స్త్రీ పురుష సంబంధాలు సహజాతాలకు అతీతంగా వ్యవహరించవు. ఆకలి, సెక్స్ లాంటి సహజాతాలతో ముడిపెట్టి, సాధారణీకరణాల నుంచి అసాధారణీకరణాలను తిలక్ కథలుగా మలిచారు. స్త్రీ పురుష సంబంధాలు ఫ్యూడల్ నైతిక విలువల చట్రాలను అధిగమించి అత్యంత సహజంగా, వాస్తవికంగా తిలక్ కథల్లో స్త్రీపురుష సంబంధాలు మలచబడ్డాయి.

# 9. తిలక్ కవిత – నవ్యత

**– ఆచార్య ఎన్.వి. కృష్ణారావు**

**సంప్రదాయ సాహిత్యపు ఇరుసులలో ఇరుక్కుపోకుండా**
**భావ కవిత్వపు ఛాయలతో కప్పబడిపోకుండా**
**అభ్యుదయ ఆలోచనా దృక్పథంతో**
**మానవతా కవితా పతాకను ఎగురవేసిన**
**నాటి కొద్దిమంది కవులలో**
**లెక్కగట్టవలసిన**
**గుట్టు పట్టుకోవలసిన**
**గుర్తు పెట్టుకోవలసిన**
**ప్రభాత – సంధ్యాకవి – దేవరకొండ బాలగంగాధర్ తిలక్ !**

తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటిలో వ్యక్తపరచిన నవ్యతను సంక్షిప్తంగా వివరిస్తుందీ వ్యాసం.

తిలక్ కవిత్వంలోని నవ్యతను పరామర్శిస్తున్నప్పుడు – అతని కవిత్వానికన్నా ముందు వెలువడిన కవిత్వంలోని పాతదనమేమిటో కొద్దిగానైనా తెలియాలి.

**అసలు కందుకూరి వీరేశలింగం పుట్టుకే కవిత్వంలో ఓ నవ్యత**

**కందుకూరి సాహిత్య సృజనే సాహిత్యలోకంలో ఓ నవ్యత**

**తెలుగు సాహిత్య వ్యాసంగ కాలగమనంలో 1910వ సంవత్సరమే ఓ నవ్య సాహితీ శకానికి నాంది**

**కన్యాశుల్కం ఓ నవ్యత – రాయప్రోలు ఓ నవ్యత**

**శ్రీశ్రీ కవిత్వం ఓ నవ్యత – అజంతా శిల్పం ఓ నవ్యత**

ఇన్ని నవ్యతలు కనిపిస్తున్నప్పుడు తిలక్ సాహిత్యంలోని నవ్యతను ఎలా చర్చించాలి అన్నదే ప్రశ్న ?

పైన చెప్పినవన్నీ ప్రాచీన తెలుగు సాహిత్య పునాదులతో ఇతర భాషా సాహిత్యాల ప్రభావంతో ఆధునిక తెలుగు సాహితీ భవన నిర్మాణానికి దారులు చూపిన నవ్య కవితా మార్గాలు.

తిలక్‌కు ముందున్న సాహితీ పరిణామాన్ని గమనిస్తే – సంప్రదాయ కవిత్వం, భావ కవిత్వం, దేశభక్తి కవిత్వం, అభ్యుదయ కవితా దశలు కనిపిస్తాయి.

ఆధునిక సంప్రదాయ సాహిత్య ప్రారంభకులు – తిరుపతి వేంకట కవులు. భావ కవిత్వ ప్రారంభకులు – రాయప్రోలు. అభ్యుదయ కవితా మార్గ దర్శకులు – గురజాడ. వీరి భావాలను అందిపుచ్చుకొని సంప్రదాయ, భావ, అభ్యుదయ కవిత్వంలో విజృంభించిన వారు విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ. నాటి సమాజంలో పై ముగ్గురి ప్రభావం పడని కవి లేరంటే అతిశయోక్తి కాదేమో !

వీరి ముగ్గురి ప్రభావ ప్రవాహంలో పడినా, కొట్టుకుపోకుండా తన అస్తిత్వాన్ని ప్రకటించాలని ప్రయత్నించడమే – తిలక్ వ్యక్తిత్వానికి తొలి నవ్యత !

తిలక కవిత్వాన్ని పరిశీలిస్తే స్థూలంగా మూడు రకాల నవ్యతలు కనిపిస్తాయి. అవి 1. వస్తు నవ్యత 2. శిల్ప నవ్యత 3. భావ నవ్యత. సూక్ష్మంగా పరిశీలిస్తే ఏడు రకాల నవ్యతలు కనిపిస్తాయి. 1. పదప్రయోగ నవ్యత 2. వాక్య నిర్మాణ నవ్యత 3. వస్తు నవ్యత 4. అభివ్యక్తి నవ్యత 5. భావ నవ్యత 6. పదచిత్రాలు 7. అలంకార ప్రయోగాలు.

నవ్యత అంటే కొత్తదనం. అంతకు పూర్వం వరకూ కనబడనిది, వినబడనిది, కవిత్వంలో అయితే రాయబడనిది. నవ్య కవితా మార్గం అంటే – పాత కవితా మార్గాన్ని అనుసరించకుండా, ఆచరించకుండా కొత్త కవితా మార్గాన్ని అన్వేషించడం. ఈ మార్గం పాఠకులకు చేరువ కావాలి. వారి నోళ్ళల్లో నానాలి. పాఠకుల్నీ, ప్రజల్నీ ఉత్సాహపరచాలి, ఉత్తేజితుల్ని చేయాలి, చైతన్యవంతులుగా మార్చాలి.

తిలక్ కవిత్వంలోకి తొంగి చూస్తే నవ్యత్వం ఎన్నో విధాలుగా కనబడుతుంది. ముఖ్యంగా వస్తు నవ్యత ఎన్నో రీతులు – రోడ్ల మీద కనిపించే అతి సామాన్య వ్యక్తుల నుండి ప్రపంచాన్ని శాసించే, నాశనం చేసే యుద్ధోన్మాదుల వరకూ అతని పాళీకి చిక్కని వస్తువు లేదు. అనాథలు, అభాగ్యులు, అశాంతులు, బిచ్చగాళ్ళు, ప్రకృతి, ప్రేయసి, వేకువ, రాత్రి, వాన, ఉత్తరం, వ్యధలు, గాథలు...... ఒకటేమిటి, చూసిన విన్న ప్రతిదానికి స్పందించే మనసు, రాయించే చేయి రెండు ఆయుధాలుగా, రెండు అవసరాలుగా సమాజాన్ని కవితా జల్లెడ పట్టిన సున్నిత, సుకుమార, అభ్యుదయ,

మానవతా వాది తిలక్. నా కవితా మార్గమే నవ్య కవితా మార్గమని కవిత్వం ద్వారా స్పష్టంగా ప్రకటించిన కవి తిలక్ ! 'నా కవిత్వం' అనే కవితను చూస్తే తిలక్ కవితా తత్వమేంటో తెలుస్తుంది.

**నా కవిత్వం కాదొక తత్త్వం**
**మరి కాదు మీరనే మనస్తత్వం**
**కాదు ధనిక వాదం, సామ్యవాదం**
**కాదయ్యా అయోమయం, జరామయం**
**గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ**
**జాజిపువ్వుల అత్తరు దీపాలూ**
**మంత్రలోకపు మణిస్తంభాలూ**
**నా కవితా చందన శాలా సుందర చిత్ర విచిత్రాలు**
**నా అక్షరాలు కన్నీటి జడలలో తడిసే దయా పారావతాలు**
**నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు.**

ఇందులో పద ప్రయోగంలోనూ, వాక్య నిర్మాణంలోనూ, భావ ప్రకటనలోనూ కొత్తదనం కనిపిస్తుంది అంతకు ముందు ఎవరూ చెప్పని రీతిలో. ఒక్క కవితలోనే ఇంత అద్భుతంగా, స్పష్టంగా, ముక్కుసూటిగా తన కవితా మార్గాన్ని నిర్దేశించి చెప్పినవారు నాటి ఆధునిక తెలుగు వచన కవులలో ఎవరున్నారు? ఒక్క తిలక్ తప్ప! ఒక తత్వానికి, ఒక మనస్తత్వానికకి, ఒక ధనికవాదానికి, ఒక సామ్యవాదానికి పరిమితం కాదంటూ, తన కవిత్వం ఎటువంటి అయోమయానికి గురి చేయదంటూ, తన కవిత్వం శాశ్వతమైనదని స్పష్టం చేశాడు. తన కవిత్వంలో సుందర చిత్ర విచిత్రాలూ కన్పిస్తాయని, ధగద్ధగ రావాలూ వినిపిస్తాయని ప్రకటించాడు. తన అక్షరాలు 'వెన్నెలలో ఆడుకొనే అందమైన అమ్మాయిలు' అంటూ సుందర మనోహారాలు, దయాపారావతాలు అంటూ జాలి, కరుణ, ప్రేమ, త్యాగం చూపే శాంతి పావురాలు, విజయ ఐరావతాలు అంటూ సమాజంలో సగటు మానవుడికి విజయాన్ని సాధించిపెట్టే ధీర, గంభీర గజాలుగా చలిస్తాయి, జ్వలిస్తాయి, చలింపజేస్తాయి అంటూ తన కవితా తత్వాన్ని కప్పి, విప్పి, చెప్పిన ఆధునిక, ఆదర్శ కవి తిలక్.

'దృశ్యభావాలు' కవిత – అదొక అక్షర సుందర చిత్ర విచిత్రం. దీనిలోని పద నవ్యత శ్రీశ్రీని గుర్తుకు తెస్తుంది.

**'ఘోష**
**హేష**
**మురళి**
**రవళి,**
**కదలి కదలి**
**ఘణం ఘణంల నిక్వణ క్వణల ఝణం ఝణం**
**బండి మువ్వ**
**కాలిగజ్జె కలసిపోయి**
**పక్షిరెక్క**
**పొన్నమొక్క**

**జొన్న కంకె'....** – ఈ కవిత మొత్తం చదవాల్సిందే ! అప్పుడే తిలక్ మదిలో మెరసిన, కళ్ళలో విరిసిన దృశ్యభావాలు కనిపిస్తాయి.

ప్రాతఃకాలాన్ని ఎంతో కొత్తదనంతో, ఎవరూ ఊహించని రీతిలో పలకరించాడు కవి తిలక్.

**చీకటి నవ్విన చిన్ని వెలుతురా !**
**వాకిట వెలసిన వేకువ తులసివా !**
**ఆకలి మాడుచు వాకిట వాకిట**
**తిరిగే పేదల సురిగే దీనుల**

**సుఖవ్యాప్తిని చెరచే సుందర రాక్షసివా !** ఈ పోలిక తిలక్‌కుగాక మరొకరికి సాధ్యమా ! వేకువ తులసివా అంటూ నున్నితంగా, సుందర రాక్షసివా అంటూ వ్యంగ్యంగా, అబద్ధపు బ్రతుకుల వ్యవహారాలకిక మొదలువో అంటూ మానవుల మనస్తత్వాన్ని, ప్రభాత గీత ధవళిమవా అంటూ సమాజాన్ని చైతన్యపు కాంతులతో నింపడానికి వస్తున్న గీతానివా అంటూ కొత్తగా పలకరించాడు. పద నవ్యతతో, భావ నవ్యతతో ప్రాతఃకలాన్ని స్వాగతించాడు కవి.

భావ నవ్యతకు చక్కని ఉదాహరణ 'ఈ రాత్రి' కవిత. రాత్రిని తిలక్ చూసిన కోణం, రాత్రితో మాట్లాడిన తీరులో కొత్తదనం వుంది.

**ఈ రాత్రి**
**బరువుగా బరువుగా**
**బ్రతుకు కీళ్ళ సంధులలోన**

**చీకటి కరేల్మని కదిలింది.**
**ఈ రాత్రి**
**నిలువునా నిలువునా**
**పరచుకొని అవని గుండె నెరదలలోని**
**వింత బాధలు విప్పి చూపింది**
**ఈ రాత్రి**
**మూగతో సైగతో**
**మేలుకొన్న నిరాశతో మాటలాడాను.**

రాత్రిని ఎంతో బరువుగా చూశాడు. భూమి గుండె పొరలలో వ్యాపించిన బాధను చూస్తున్నా రాతిరితో నిరాశతో మాటలు రాక సైగలతో మాట్లాడాను. భావంలో ఎంతో నవ్యత !

అభివ్యక్తిలో నవ్యతను చూపించిన కవిత 'పాడువోయిన ఊరు'. పాడైపోయిన ఒకక ఊరు గురించి తిలక్ వ్యక్తీకరించిన తీరులో ఓ నవ్యత దాగి వుంది. చరిత్రలో ఆనవాళ్ళు అగపడకుండా నశించిన పోయిన గ్రామం గురించి ఇలా క్కూడా చెప్పవచ్చన్న ఊహను కల్పించింది.

**'అది అంతా యిసుక**
**చరిత్రలో ఒక మసక**
**ఇది నశించిన ఒక గ్రామం**
**విశ్వసించే ఒక స్మశానం**
**ప్రాణం గల పాడే వేణువులీ యిసుక రేణువులు**
**ఈ భూమి కింద మేడలు మిద్దెలు కదిలే విచిత్ర శబ్దం**
**ఈ గాలివాన పూర్వుల శరీరాల స్పర్శల శైత్యం**
**గతమంతా తోలు బొమ్మలాడిన ఒక తెర**
**వర్తమానం నీ కన్నుల గప్పిన ఒక పొర'** – ఇదొక అద్భుతమైన భావ నవ్యత కూడా.

వస్తు నవ్యతకు, అద్భుతమైన పద చిత్రానికి ఉదాహరణ 'ముసలివాడు' కవిత. 'ముసలివాడు' వస్తువు. ముసలివాడ్ని చాలామంది చూసి వుంటారు. అతని గురించి రాసి వుంటారు. కాని తిలక్ చూసిన ముసలివాడు వేరు. ఆ ముసలివాడి ఆర్తిని చిత్రించిన తిలక్ కవితా పదచిత్రం వేరు.

**కనుగూడులు నల్లనయి**
**పెనుబ్రోదులు చల్లనయి**
**కీలుకీలుగా బాధగా**
**నాడు నాడులు లాగగా**
**చలిగాలి చూరులో కసరినటు**
**చలిచీమ మట్టిలో దొలచినట్లు**
**వచ్చినది మూగినది ముసిరినది – ముసలితనము**
**ముసలివాణ్ణి నాయనలారా ముసలివాణ్ణి !**

**--------------------------**

**గది మూలల సాలిగూడులు**
**గదిగోడల గబ్బిలాలు**
**గది లోపల పక్షవాతపు కుక్కి మంచపు కౌగిలింతలో**
**చెదపట్టిన భాగవతం**
**బిలహరి రాగంలో చదివే**
**ముసలివాణ్ణి నాయనలారా ముసలివాణ్ణి !**

ముసలితనం గూర్చి ఇంత పద సుందరంగా ముందు చెప్పినవారు కనిపించరు. ఇందులో పదచిత్రముంది, భావంలో నవ్యత వుంది, వ్యక్తీకరణలో నవ్యత వుంది. తనకు ముసలితనం వచ్చిందని, తన భార్య భౌతికస్థితిని, యథాస్థితిని ఆర్ద్రంగా వర్ణించటంలో నవ్యత కనిపిస్తుంది.

ఎత్తుగడ నుంచి ముగింపు దాకా ఆద్యంతం కొత్తదనాన్ని ప్రదర్శించిన కవిత 'సైనికుడి ఉత్తరం'. ఈ కవిత చదువుతుంటే – కవిత ప్రారంభంలోనే ఎవరూ చెప్పని నవ్యత చూపించాడు కవి.

**'ఇక్కడ నేను క్షేమం – అక్కడ నువ్వు కూడా**
**ముసలి అమ్మా, పాత మంచం కోడూ,**
**మన చిన్నబ్బాయి, చెరువులో కొంగా.....'**

ఉత్తరంలో ఎవరూ ఇలా పేర్కొన్న సందర్భాలు లేవు. 1943లోనే రాయబడిన ఈ కవితలో ఉత్తరంలో అందరి క్షేమాలు అడగటం సాధారణమే. కాని 'పాత మంచం కోడూ', 'చెరువులో కొంగా' అనే పద ప్రయోగాలు అపూర్వమైనవి. ఈ కవిత ముగింపు కూడా అద్భుతమే !

**'జాగ్రత్త సుమీ జాగ్రత్త**

**నువ్వు, పిల్లలు, బల్లులూ అందరూ' –**

ఈ కవిత మొత్తం ఒక నవ్య ప్రయోగమే. కేవలం తన కుటుంబ సభ్యుల క్షేమసమాచారాలే కాకుండా చెరువులో కొంగల్నీ, గోడమీది బల్లుల్ని కూడా అడగటం ఒక నూతన సందర్భం.

**'చలి గుండెల మీద కత్తిలా తెగింది**

**నీ రూపం నా దేహానికి వెచ్చగా తగిలింది',**

ఎక్కడో దూర ప్రాంతంలో, మంచు కొండల్లో దేశరక్షకుడుగా కాపలా కాస్తున్న ఓ సైనికుడి ఆలోచనకు అక్షరరూపమిది. భార్యను ఓ మధుర స్వప్నంలా ఊహించుకొంటూ ఓ సైనికుడి ప్రేమ, అనురాగం, ఆప్యాయతల కలగలసిన ఉత్తరం ఇది. భావంలో నవ్యరీతి చూపించిన కవిత ఇది.

**"నేనదివరకిటి నేను కాను**

**నాకు విలువల్లేవు, నాకు అనుభూతుల్లేవు**

**చంపడం, చావడం, మీసం దువ్వటం లాంటి అలవాటయ్యింది**

**కనిపించే ఈ యూనిఫారం క్రింద**

**ఒక పెద్ద నిరాశ, ఒక అనాగరికత**

**బ్రిడ్జీ కింద నదిలాగ రహస్యంగా వుంది.**

**వదలలేని మోసపు ఊబిలాగ వుంది**

**నేనంటే నాకే అసహ్యం**

**అందుకే మరీ మరీ చంపుతాను, మరీ మరీ తాగుతాను**

**ఇంకేం చేసినా ఎవరూ ఒప్పుకోరు'**

యుద్ధంలో తనలాంటి మనుషుల్లే చంపుతున్న ఓ సైనికుడి ఆవేదనను, అంతర్మథనాన్ని కొత్తకోణంలో ఆవిష్కరించిన కవిత. తిలక్ ప్రకటించిన భావ నవ్యతల్లో ఇదొకటి.

యుద్ధం వద్దంటూ, సామాన్యుడి నోటికి అన్నం ముద్దంటూ, మానవత్వానికి హద్దు లేదంటూ ప్రజలను లేచిరమ్మని పిలుస్తున్న 'పిలుపు' కవితలో సామాన్యుడికి కూడా అర్థమయ్యే రీతిలో కొత్త భావాన్ని, అభివ్యక్తిని ప్రకటించిన తిలక్ సగటు మానవుని పక్షపాతిగా దర్శనమిస్తాడు.

**ధాత్రీ జనని గుండె మీది**
**యుద్ధపు కొరకంచుల ఎర్రని రవ్వలు**
**మీరెపుడైనా చూశారా**
**కన్నీరైనా విడిచారా**
**ముడుచుకున్న కాగితపు గుండెలు చిరిగిపోకపోతే**
**అణచుకొన్న నల్లని మంటలు ఆకాశానికి రేగకముందే**
**మీరిపుడైనా మేల్కొంటారా**
**చీకటి తెరలను చీలుస్తారా**
**ప్రభాత విపంచిక పలికిస్తారా ?**

ప్రజలను ప్రశ్నిస్తూ, పిలుస్తున్న ఈ కవిత మొత్తం చదివితే తిలక్‌లోని మానవత్వం, సున్నితమైన మనసు పడుతున్న ఆవేదనను గుర్తించవచ్చు.

'భూలోకం' కవిత అంతటా పద విన్యాస నవ్యత, వాక్య నిర్మాణ నవ్యత, అభివ్యక్తిలో నవ్యత కనిపిస్తాయి. సరళమైన పదాలు, తేలికైన వాక్య నిర్మాణాలు, అర్థాలు మాత్రం అగాథాలు, భావాలు భావి వారసులకు వరాలు.

**అస్థి మూల పంజరాలు**
**ఆర్త రావ మందిరాలు**
**ఏ లోకం తల్లీ, ఏవో బాష్పజలాలు?**
**కూడు లేని లోకం యిది**
**గుండెలోతు తాపం యిది**
**సోమయాజి శాపం యిది**
**భూమి అడుగు లోకం యిది**
**-----------------**
**దారి పొడుగు జన శవాలు**
**జారిపడే చేయి కాలు**
**ఏ లోకం తల్లీ – యిట ఎగిరిపడే రాబందులు ?**

– ఇందులో పద విన్యాస నవ్యత

**వంగదేశ క్షామం యిది**
**వ్యంగ్య భాష క్షేమం యిది**
**పర ప్రభుత్వ దానం యిది**

**ధనిక లోక ధర్మం యిది**
**కాలు కడుపు యిమ్మన్నది**
**గాజు మేడ లేదన్నది**
**అన్నపూర్ణ కంటి ముందు**
**కనపడినది రక్త బిందు**
**ఇది కలికాలం అబ్బీ**
**కళ్ళు లేని పాపం యిది'** - ఇందులో వాక్య నిర్మాణంలో నవ్యత.
**కాలు కడుపు యిమ్మన్నది - గాజుమేడ లేదన్నది**
**మృత్యువనే మైదానం - శత్రువనే అజ్ఞానం**
**యీర్ష్యలోని ఒక దాహం - సంధ్య లాంటి సందేహం**
**పిలిచికొన్న ఒక సైన్యం - తిరిగి రాని ఒక దైన్యం**
**ఇది యుద్ధం అబ్బీ - యిపుడింట యింట ఆక్రోశం**
**వీరికి మిగిలేదొక భాష్పం'-**

1945లో రాయబడిన ఈ కవిత 1941 నుండి 1945 వరకు వున్న బెంగాల్ పరిస్థితికి అద్దం పడుతుంది. అనావృష్టి, తుఫానులు, యుద్ధం వలన 1941 నుండి బెంగాల్ ప్రజలు దీనస్థితిలోకి జారిపోయారు. ఆ తర్వాత కరువు, అంటు వ్యాధులు బెంగాల్ ప్రజల జీవితాల్ని అంపశయ్యలపై పడుకోబెట్టాయి. 1945 దాకా ఈ పరిస్థితి కొనసాగింది. 1946లో కొంత మెరుగుపడింది. ఆనాటి స్థితిని ఆర్ద్రంగా ఆవిష్కరించిన ఈ కవితలో భావంలోనూ, అభివ్యక్తిలోనూ నవ్యత్వం కనిపిస్తుంది.

'కవివాక్కు' కవితలో తన వ్యక్తిత్వాన్ని స్పష్టంగా ప్రకటిస్తూ, మానవత్వం కావాలని ప్రవచించారు. కవిత ప్రారంభంలోనే కొత్తదనం ప్రవేశపెట్టబడింది.

**'భారతదేశాన్ని కాదనలేను**
**రష్యా దేశాన్ని కొలవలేను**
**నిజం ఎక్కడో - అక్కడ నా ప్రాణం వుంది**
**హృదయం ఎక్కడో - అక్కడ ఉదయం వుంది'**

ఇది నిజంగా నవ్య భావనే. నిజం ఎక్కడ వుందో అక్కడే నా ప్రాణం ఉందంటూ తనేంటో చెబుతూనే 'హృదయం ఎక్కడో అక్కడ ఉదయం ఉంది' అన్నారు. ఈ ప్రయోగం 'నభూతో న భవిష్యతి' అనవచ్చు. 'హృదయం ఎక్కడో అక్కడ ఉదయం ఉంది' సాధారణ వాక్యం కాదు. అసాధారణ ప్రయోగం. హృదయం అంటే

ఏ హృదయం ? మనం మామూలుగా భావించే హృదయం కాదు. మానవత్వంతో, అభ్యుదయ కాంక్షతో, చైతన్యంతో తొణికిసలాడుతూ, జాలి, కరుణ, ప్రేమ, త్యాగం, శ్రమను చూపించే హృదయం. ఆ హృదయం ఉన్న చోట తప్పనిసరిగా ఉదయమే వుంటుంది. అంటే పైకి ఎదుగుతోన్న సూర్యబింబం, ప్రపంచాన్ని విస్తరిస్తోన్న సూర్యకాంతి, అభివృద్ధికకి సంకేతమైన తేజస్సు – అన్నీ కనిపిస్తున్నాయి. ఇది సరికొత్త పద విన్యాసమే. వాక్య నిర్మాణ నవ్యత్వమే. భావ నవ్యత, అభివ్యక్తి నవ్యత, అలంకార ప్రయోగం – ఆద్యంతమూ నవ్యత్మమే !

**'శాంతి కోసం యుద్ధాన్ని ప్రజ్వలింప చేస్తారు**
**సుఖం కోసం ఆ రక్త విప్లవాన్ని తరింపచేస్తారు**
**స్మశాన భూమిని వికసిస్తుంది మీరు నాటిన పూల చెట్టు**
**కాని ఎవరు తుడుస్తారు తల్లీ ! నీ కన్నీటి బొట్టు?'** అని ప్రశ్నించడం తిలక్ ఒక్కడికే సాధ్యమైంది.

ఇక ఆర్తగీతం ఓ ప్రత్యేక గీతం. దీని గురించి ఎంత చెప్పినా తక్కువే ! అక్షర నవ్యత, పద విన్యాస నవ్యత, వస్తు నవ్యత, అభివ్యక్తి నవ్యత, పదచిత్ర నవ్యత, అలంకార నవ్యతలతో తిలక్ కవితా నవ్యతకు పరాకాష్ఠగా నిలిచిపోయిన, ప్రకటించబడిన కవిత.

**'నా దేశాన్ని గూర్చి పాడలేను**
**నీ ఆదేశాన్ని మన్నించలేను**
**ఈ విపంచికకు శ్రుతి కలపలేను'** ఈ మూడు వాక్యాలు చాలు – తిలక్ వ్యక్తిత్వాన్ని, కవితా తత్వాని అద్దం పట్టడానికి, అర్థం చేసుకోవడానికి.

ఈ కవితంలో కవి చేసిన 'నేను చూశాను, నేను చూశాను' అనే ప్రయోగం కవిత ఎత్తుగడలోనూ, ఒక అంశ ప్రకటనలోనూ కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ రాబోయే కొత్త కవులకు ప్రేరణ కలిగించి నూతన కవితా మార్గాన్వేషణకు నేపథ్యంగా మిగిలింది. 'నేను చూశాను' అనే వాక్య నిర్మాణంలో విషయ నిర్ధారణలో స్పష్టత, విషయ ప్రకటనలో నిజాయితీ, కవిత్వంలో వాస్తవికత ధ్వనిస్తాయి.

'తపాలా బంట్రోతు' ఓ అద్భుతమై కవిత. నవ్యత్వాన్ని నిండా నింపుకొన్న కవిత. కవిత ఎత్తుగడలోనే ఎవరూ చేయని ప్రయోగం చేసి తర్వాత తరాలకు నవ్యమార్గాన్ని నిర్దేశించాడు కవి.

మైడియర్ సుబ్బారావ్
కనిపించడం మానేశావ్

ఏమిటీ ! పోస్ట్‌మాన్ మీద కవిత్వం వ్రాయాలా ? అంటూ ప్రాచీన కవితా వస్తువులను స్పృశిస్తూ, తన కొత్త కవితా వస్తువును ప్రకటించాడు. 'మైడియర్ సుబ్బారావ్ ! కనిపించడం మానేశావ్' అంటూ సంబోధనతో కవిత్వం ప్రారంభించడం విశేషం.

**'అందమైన అమ్మాయి మీద కాని**
**చందమామ మీద కాని**
**వంద్యుడైన భగవంతుడి మీద కాని అ**
**వంద్యుడైన ధీర నాయకుడు మీద కాని**
**పద్యాలల్లమని మన పూర్వులు శాసిస్తే**
**ఎక్కడి పోస్టుమానో యీ గోల, ఈ సాయంత్రం వేళ**
**ధనవంతుణ్ణి స్తుతి చేస్తే**
**పది డబ్బులు రాలుతాయి**
**సచివోత్తముణ్ణి స్మరిస్తే**
**పదికళ్ళు మన మీద వాలుతాయి**
**ఉత్త పోస్టుమాన్ మీద ఊహలు రానేరావు"** – ఇవన్నీ పాత కవితా వస్తువులు. పోస్టుమాన్ కొత్త కవితా వస్తువు. పోస్టుమాన్‌ను పద చిత్రంలో బంధించేశాడు కవి.

**'ఎండలో వానలో / ఎండిన చివికిన / ఒక చిన్న సైజు జీతగాడు**
**చెవిలో పెన్సిల్ / చేతిలో సంచి / కాకీ దుస్తులు / అరిగిన చెప్పులు**
**ఒక సాదా పేదవాడు / ఇంటింటికి / వీధివీధికి / ప్రతిరోజూ తిరిగేవాడు'** – అనడంలో ఒక 'పోస్టుమాన్' రూపం కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది.

ఇంకా పద విన్యాస నవ్యతలో

**'వర్తకుడికి, నర్తకుడికి ఖైదులో దొంగకి హంతకుడికి**
**ఉద్యోగ శప్తుడైన నవీన యక్షునికి, మనిషికి, రాక్షసునికి'**
**ఉత్తరం యిచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్ళిపోయే నిన్ను చూసినప్పుడు**
**తీరం వదలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు'**

ఎంతటి చక్కటి పోలిక, అలంకారిక ప్రయోగం. 'తపాలా బంట్రోతు' కవిత తిలక్ నవ్య కవితా వస్తువుకు, సామాన్య కవితా వస్తువుకు నిలువెత్తు నిదర్శనం.

'న్యూ సిలబస్' కవిత నిజంగా ఆధునిక తెలుగు వచన కవిత్వంలో ఒక న్యూవేవ్, న్యూవే ! కొత్త తరంగం, కొత్త మార్గం. ఈ కవిత ఆనాటికి ఓ న్యూ కంటెంట్, తిలక్ న్యూ టాలెంట్. అంతర్జాతీయ స్థితకి ఈ కవిత ఓ దర్పణం. కవితలో ప్రారంభ

వాక్యాలు చూడండి. అందరి నోళ్ళలో నానిన మాటలివి.

**'అమెరికాలో డాలర్లు పండును**

**ఇండియాలో సంతానం పండును.'**

అభివ్యక్తిలో ఓ సెటైర్, వ్యంగ్యం, ఓ ఎత్తిపొడుపు, ఒక కోణంలో పాజిటివ్, ఓ కోణంలో నెగెటివ్. అంతకు ముందు వరకూ ఎవరూ చెప్పని, చేయని వాక్య నిర్మాణం. అభివ్యక్తిలో కొత్తదనం. ఇంకా –

**'భూమి తన చుట్టూ తాను తిరుగుతూ**

**ధనవంతుడి చుట్టూ తిరుగుతుంది'** – అంటాడు. దీనిలో అద్భుతమైన ధ్వని కనిపిస్తుంది, వాస్తవం అదేననిపిస్తుంది. ప్రస్తుతం భూమి సూర్యుడి చుట్టూ తిరగడం లేదు, ధనవంతుడి చుట్టూ మాత్రమే తిరుగుతుంది కదా !

'అమృతం కురిసిన రాత్రి' కవిత ఒక అనంత చైతన్యోత్సవాహ్వానాన్ని వినిపించిన కవిత. ఎవరూ వినిపించుకోలేదని వేదన చెందిన కవిత. నూతన అనుభూతిని మిగిల్చే కవిత.

భావ నవ్యతకు అద్దం పట్టే కవిత 'అమ్మా నాన్న ఎక్కడికెళ్ళాడు' కవిత. ఇందులో అవకాశవాదులు నోరు తెరిస్తే దుర్వాసన' అన్నాడు. లోకంలో అవకాశవాదుల గురించి చాలామంది చెప్పి వున్నారు. కానీ ఈ ప్రయోగం ఎవరూ చేయని కొత్త ప్రయోగం. ఆలోచనాత్మకమైనది. చాలా లోతైన భావవ్యక్తీకరణ.

'సైనికుడు' అనే వస్తువుని తీసుకొని దేశభక్తిని పతాకస్థాయికి తీసుకెళ్ళిన ఘనత తిలక్‌దే! 'అమ్మా, నాన్న ఎక్కడికి వెళ్ళాడు' అనే కవితలో

'అమ్మా, నాన్న ఎక్కడికి వెళ్ళాడు – ఇంకా రాడేం?

అని అడుగుతున్న కుమారుణ్ణి అక్కున చేర్చుకొని

అమె కూడా రుద్ధ కంఠంతో 'జైహింద్' అని మెల్లగా పలికింది.

ఆ మాట స్వర్గంలో ఒక వీరునికి హాయిగా తీయగా వినబడింది' ! ఇది ఎంత గొప్ప భావన ! మరెంత కొత్త భావన అప్పటికి ! దేశం కోసం చనిపోయిన వీరునికి, ఒక మగనికి ఇల్లాలి 'జైహింద్' పిలుపు ఎంత ఆనందాన్ని కలిగించింది. అలాగే ఇల్లాలిలో వున్న దేశభక్తిని కూడా ప్రకటిస్తుంది.

తిలక్ కవిత్వంలోని నవ్యతను చెప్పడానికి ఎన్ని కవితలున్నా నిజానికి ఒక్క ఐదు కవితలు చాలు. అవి 1) ఆర్తగీతం 2) పోస్టుమాన్ 3) ప్రార్థన 4) సి.ఐ.డి. రిపోర్టు 5) నిన్నరాత్రి.

'ప్రార్థన' మరో అద్భుతమైన కవిత. ఈ ప్రార్థనలోని ప్రతి పదం, ప్రతి వాక్యం, ప్రతి భావం, అభివ్యక్తి అంతా నూతనత్వాన్ని ప్రకటిస్తుంది. అంతకు ముందటి వారు చేయని పద, వాక్య విన్యాసాలు కనిపిస్తాయి.

**'దేవుడా**
**రక్షించు నా దేశాన్ని**
**పవిత్రుల నుండి పతివ్రతల నుండి**
**పెద్ద మనుషుల నుండి పెద్ద పులుల నుండి**
**నీతుల రెండు నాల్కలు సాచి బుసలు కొట్టే**
**నిర్హేతుక కృపా సర్పాల నుండి**
**లక్షలాది దేవుళ్ళ నుండి వారి పూజారుల నుండి**
**వారి వారి ప్రతినిధుల నుండి**
**సిద్ధాంత కేసరుల నుండి సిద్ధుల నుండి**
**శ్రీ మన్మద్గురు పరంపర నుండి**
**దేవుడా**
**కత్తివాదరకు తెగిన కంఠంలో**
**హఠాత్తుగా ఆగిపోయిన సంగీతాన్ని వినిపించు**
**మానవ చరిత్ర పుటలలో నెత్తురొలికి**
**మాసిపోయిన అక్షరాల్ని వివరించు**
**మమ్మల్ని కనికరించు**
**మంచి గంధంలాగ పరిమళించే మానవత్వం**
**మాకున్న ఒకే ఒక అలంకారం'**

వస్తువు సామాన్య ప్రజానీకం గురించి. కానీ అభివ్యక్తి అసామాన్యం. ఆ వాక్య నిర్మాణం చూడండి. 'దేవుడా రక్షించు నా దేశాన్ని' అంటూ సాగే కవితా వాక్కులలో ఎంత వ్యంగ్యం, ఎంత వేదన, ఎంత ఆకాంక్ష ! ఒక గొప్ప ధ్వనిని ధ్వనింపజేస్తూనే మనిషి గొప్ప లక్షణం మానవత్వమని, అది మంచి గంధంలా పరిమళాలను వెదజల్లుతుందని ప్రకటించడం తిలక్‌లోని మానవతా ప్రేమకు నిదర్శనం.

పద విన్యాస నవ్యతకు అద్దం పట్టిన కవిత 'పోయిన వజ్రం׀.

**ఆతృప్తాలైన కళ్ళు**
**ఆతృతతో అలసిన కళ్ళు**

**అబద్ధంలో చుట్టబెట్టిన రాళ్ళు**
**ఏ భూమ్మీద కట్టుకోమంటావు పొడి ఇసుకతో ఇళ్ళు**
**ఏ ఆకాశం మీద జల్లమంటావు అదియాసలు పుప్పొళ్ళు**

**--------------**

**దేనికోసమో తెలీని అన్వేషణ**
**అదృశ్య జీవిత శాఖలపైన పువ్వు లవలేని మొగ్గల సంభాషణ.**

అంత్యప్రాసలతో ఆకట్టుకొనే పద విన్యాసం సృష్టించబడింది ఈ కవితలో. పద ప్రయోగంలోను, వాక్య నిర్మాణంలోనూ, భావ ప్రకటనలోనూ నవ్యతే. దీని అంతరార్థం వేరే. నవ్యత వరకు చూస్తే 'పువ్వు లవలేని మొగ్గల సంభాషణ', ఎంత కొత్త భావ ప్రకటన.

'నవత–కవిత' అనే కవితలో ఆధునిక కవి, కవిత్వం ఎలా వుండాలో తెలియజేస్తున్నాడు. ఒక కొత్తదనం, రాబోయే కవితరానికి వస్తు సూచన చేసినట్లుగా కనిపిస్తుంది.

**'ఈ కాలంలో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు**
**ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు**
**నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి, నీలోంచి రావాలి – చించుకొని రావాలి'**

వస్తు మార్గ నిర్దేశనం చేసిన కవులు అరుదు. అందులోనూ ఇంత విశాలదృష్టితో, నిక్కచ్చిగా, స్పష్టంగా చెప్పడం తిలక్‌కే చెల్లింది. తిలక్ కవే కాదు, కవితా వస్తు మార్గ నిర్దేశనం చేసిన కవితా గురువు కూడా.

నిజంగా 'సి.ఐ.డి. రిపోర్టు' కవిత ఆద్యంతం నవ్యత్వానికి పెద్దపీట వేసింది. కవితా రచనలో నూతనత్వానికి ఆవాసం, అస్తిత్వం, స్థిరత్వం కల్పిస్తుందని నా భావన. కవిత ప్రారంభం నుండి ముగింపు వరకూ అంతా వినూత్నమే. ఇది అందరూ ఖచ్చితంగా చదవవలసిన కవిత.

**అయినాపురం కోటేశ్వరరావు**
**అకాలంలో కాలధర్మం చెందడంలో**
**అంత రహస్యం గాని, కుట్రగాని, శత్రుప్రయోగం గాని లేవని**
**రూఢిగా తెలియవస్తోంది పరిశోధనల ఫలితంగా**

– ఇది వాక్య నిర్మాణంలో నవ్యత !

**ఏమైనా కోటేశ్వరరావు చనిపోవడం నిజం**

**డాక్టర్ తీర్పుకన్నా మేనజర్ రాగానే లేచి నుంచోకపోవడమే ఇందుకు నిదర్శనం**
**ఇతని తాలూకు వివరాలేమీ ప్రమాదకరంగా లేవు**
**ఇతని తండ్రి గుమాస్తా, తాత గుమాస్తా, ముత్తాత గుమాస్తా**
**సాంప్రదాయకమైన వినయ విధేయతలకీ,**
**గౌరవకరమైన దరిద్రానికీ వీళ్ళ వంశం ఒక రాస్తా**
**ఇతని యింట్లో ఆరుగురు పిల్లలూ, ఒక ముసలి తల్లీ, బక్క పిల్లీ**
**ఒకర్తె నీరసంగా వున్న భార్య**

– ఇది అభివ్యక్తిలో నవ్యత !

**లంచాలు పట్టడు, ఎవర్నీ తిట్టడు, ఎవరేమన్నా పట్టించుకోడు**
**నీతి నిజాయితీ వున్నవాడు, నిర్మలమైన దైవభక్తి వున్నవాడు**
**కాని – చనిపోయే ముందు రోజునే కనకయ్య అనే మిత్రుణ్ణి కలుసుకొని**
**సుఖమంటే ఏమిటి? ఎలా వుంటుంది ? ఎక్కడ దొరుకుతుంది అని అడిగాట్ట**
**ఈ సందేహం అతని జీవితానికి మచ్చ**
**ఇంకా పెరిగి పెద్దదవకుండా అతను మరణించడం దేశానికి రక్ష"** – ఇందులో ఎంత భావ నవ్యత దాగి వుందో, విషయంలో అంత నర్మగర్భత వుంది. వస్తువే సామాన్య గుమాస్తా, అదొక నవ్యత. పదప్రయోగం, వాక్య నిర్మాణం, అభివ్యక్తి, భావ ప్రకటనలో నూతన ఒరవడిని సృష్టించాడు తిలక్.

'నిన్నరాత్రి' కవిత ఒక అద్భుతమైన వ్యాఖ్యాన కవిత. తిలక్‌కు మాత్రమే సాధ్యమైన స్టైల్. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో, పాఠకుల్ని ఎలా మెప్పించాలో బాగా తెలిసిన టెక్నీషియన్ తిలక్. ఎవరూ ఊహించని విధంగా కవితను ప్రారంభించాడు.

**'ఒక్కమాట చెప్పు**
**నిన్నరాత్రి దేవుడు వచ్చి నా మంచం మీద కూర్చొని**
**దీనంగా నాకేసి చూసి కన్నులు దించుకున్నాడు**
**ఏమైనా అన్నానా ? నేనేమైనా అన్నానా ?**
**----------------------**
**నిజం చెప్పు నిజం చెప్పు**
**నిన్ను గూర్చి నన్ను గూర్చి**
**నిఖిల సృష్టిలోని ఖిలం గూర్చి**
**నీరవ సుందర హృదయపాత్ర నిండిన హాలాహలం గూర్చి**

**నిజం చెప్పమని అడిగానా ? నిందించానా ? నిర్బంధించానా ? అంటూ**

**------------------------------------**

**నాకు తెలుసు నాకు తెలుసు**

**మానవుడే దానవుడై తిరగబడినపుడు**

**పాపం పెద్దవాడు - కన్నకడుపు - ఏం చేస్తాడని !**

ఒక చక్కటి కొసమెరుపుతో కవితను ముగించాడు. తప్పనిసరిగా చదువవలసిన కవితలలో ఇదొకటి. 1965 నాటి ప్రపంచస్థితిని, సమాజ గతిని ఆవిష్కరించిన కవి. దేవుడే దీనంగా తలదించుకున్నాడని, దానికకి కారణం మానవత్వం మరచి దానవుడై మానవుడు ఆశలతో, స్వార్థంతో ఎదుటి వారిని బలి చేస్తూ, తానే బలైపోతూ జీవనం సాగిస్తున్నాడని, అది చూసి సృష్టించిన భగవంతుడే ఏమీ చేయలేని నిస్సహాయత స్థితిలో దీనంగా విచారిస్తున్నాడు, బాధపడుతున్నాడని చెబుతూ కవి కూడా బాధపడ్డాడు.

కొత్త పద ప్రయోగాలకు నెలవు 'కిటికీ' కవిత.

**కిటికీ తెరిస్తే**

**గాలి వెలుతురుతో పాటు**

**జాలి జీవితపు ధూళీ జ్ఞానమధూళీ కూడా వస్తాయి**

**గదికీ మదికీ కూడా గవాక్షాలుంటాయి**

**అంతరిక్షంలో జీవిత రహస్యంలోకి సృష్టి సమక్షంలోని**

**విచ్చుకొనే విచిత్రాక్షి సమూహాలు**

**ఆనంద శోకానుభూత్య విరళ తటచ్ఛరిత వార్షుక వలాహకాలు**

శ్రీశ్రీతో పాటుగా, ఒక్కోసారి శ్రీశ్రీ కూడా చేయ ని కొత్త పద సృష్టి తిలక్ చేశాడు.

'నువ్వు లేవు నీ పాట వుంది' అనే ఈ కవితా శీర్షిక తరువాత తరం వారికి, ఎంతోమంది కవితలకు, రచనలకు ప్రేరణనిచ్చిందనేది కాదనలేని సత్యం. 1965లో వెలువడిన ఈ కవిత, నాటి సినీ గేయ కవులకు, కవితా రచయితలకు ఎన్నో సుందర, విషాద ఊహలకు రూపమిచ్చిందనడం సత్యదూరం కాదేమో !

అభినవ ఋగ్వాదం' కవిత అంతా హాస్యస్ఫోరకమే. అందులోనూ నవ్యతే !

**'సుబ్బారావు పెళ్ళాం సూర్యంతో లేచిపోయిన రోజున**

**కురిసిందట కదూ కుంభవృష్టిగా వాన**

**ధార్మికులు దాన్ని దేవతల కన్నీటి సోన అన్నారు**

**నాస్తికులు రోమాంటిక్ తోటలో పూలతేనె అన్నారు**
**అసలు సుబ్బారావు నీతి శతకం రాసి అంతకు ముందు రోజునే**
**అర్ధాంగికి అంకితమివ్వపోతే ఇంత పని జరిగుండదని**
**గుడిపాటి వెంకటాచలేయుడు గుండెబాదుకు చెప్పాడుట.'**

చాలా స్పష్టంగా, సరళంగా, నిదానంగా వివరించిన, వినిపించిన తీరులోని కవితా రసాస్వాదన చేయవలసిందే.

నగరం మీద ప్రేమగీతం, నగరంలో హత్య, మన సంస్కృతి, ద్వైతం కవితలు – కవిత్వ రచనా నిర్మాణంలో కొత్త కోణాలను, మార్గాలను, భావాలను ప్రతిఫలించాయి.

పదహారేళ్ళ నల్లని నీగ్రో కుర్రవాడైన పోవెల్‌ను హార్లెమ్ స్క్వేర్‌లో ఒక తెల్లదొర దారుణంగా కాల్చి చంపిన విషయాన్ని తనదైన శైలిలో, నవ్యతతో తిలక్ వ్యక్తీకరించిన తీరు పోవెల్ ఆత్మాభిమానాన్ని, తెల్లదొరల జాత్యహంకారాన్ని చూపుతుంది.

యుద్ధాల మీద తీవ్ర వ్యతిరేకత కలిగిన తిలక్ 'శవం' కవితలో అభివ్యక్తిలోను, భావ ప్రకటనలోనూ నవ్యతను చూపించాడు.

**'ఈ శవం చాలా దుర్మార్గపు శవంలా వుంది**
**ఇది సరిగ్గా యుద్ధ విరమణ రేఖమీద వచ్చింది**
**మనందరికీ చచ్చే చావు వచ్చింది'** – అంటూ చెప్పిన కవితా పంక్తులు యుద్ధోన్మోదుల్ని వ్యంగ్యంగా నిరసిస్తాయి.

**సోల్జరు శవం**
**డెమోక్రసీదా ? సోషలిస్టు కేంపుదా ? ఇంపీరియలిస్టుదా ?**
**వీడి పెళ్ళాంకి వీడి ఆనమాలు తెలుస్తుంది**
**వీడి పెళ్ళామెవరో ఎలా తెలుస్తుంది ?**
**వీణ్ణి ఏ సైనిక గౌరవాలతో, ఏ దేశ నినాదాలతో**
**తగలెయ్యాలో, పాతిపెట్టాలో ఎలా తెలుస్తుంది ?**
**ఒకటే మార్గం వుంది**
**అన్ని దేశాలలో ఏడుస్తూన్న**
**కొత్త కొత్త విధవల్ని తీసుకురండి**
**ఐడెంటిఫికేషన్ పెరేడ్ పెట్టేస్తాను**
**యుయన్ఓ పీస్ కమిషన్ ఛైర్మన్ గారూ ! భయపడకండి**
**ఇదేం కష్టం కాదు వినండి**

**ఇదంతా తద్విధవల కన్నీటితో తడై బురదైపోతుందని భయపడకండి**
**నెత్తురు వరదల్ని చూసిన మనకి**
**కన్నీటి వాన లెక్కా జమా ?**
**బాల్చీలు సిద్ధం చేయిస్తాను నేను**
**విధవల్ని వరుసలో నిలబెట్టండి మీరు**
**ఒకవేళ వీడొక పెళ్ళికాని బ్రహ్మచారైతే ఎలాగ ?**
**చచ్చంరా బాబూ! '**

పెళ్ళైనవాడు, భార్య వున్నవాడు అయితే సరే శవాన్ని గుర్తుపడతారు. అదే పెళ్ళికాని వాడైతే –గొప్ప సెటైర్ ఇదే. ఎంతో వ్యంగ్యం, ఎంతో వేదన కవితలో దాగి వున్నాయి.

'కాస్మోపాలిటన్' కవితలో ఎన్నో కొత్త ఆంగ్లపదాలను ప్రవేశపెట్టాడు.

**రష్యాలో 'రివిజనిస్టు' వోడ్కా సిప్ చేసి**
**చైనాలో 'రివల్యూషనిస్టు' సప్పర్ భోంచేసి**
**----------------------------**

ఫ్రీలాన్స్ జర్నలిస్టు, వార్ కరస్పాండెట్, వెంట్రిలోక్విస్టు'..... ఇలా అనేక ఆంగ్ల పదాలను తెలుగు కవితలలో చొప్పించిన ఘనత తిలక్‌దే! కొంత శ్రీశ్రీని అనుసరించినట్లు కనబడినా తన ప్రత్యేకతను ప్రదర్శించాడు తిలక్. తర్వాత కవులు, రచయితలు, ఆంగ్లపదాలను ప్రయోగించడానికి ఈ 'కాస్మోపాలిటన్' కవిత కారణమైందీ, ప్రేరణనిచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

'త్రిశూలం' కవితలో ప్రారంభంలోని 6 కవితా పంక్తులు – 3 శూలాలే. గొప్ప అభివ్యక్తి, వాస్తవ ప్రకటనశక్తి – త్రిశూల కవితాసక్తి !

**నమ్మకు నవ్వలేని వాడిని, పువ్వులు చిదిమే వాడిని**
**బరిమీద వదలిన పాముని, చైనావాడిని**
**నమ్మకు హంతకకుడని ఈటెని, గోతులున్న బావిని**
**భోగం దాని పాటని, చౌ ఎన్ లై మాటని**
**నమ్మకు మొసళ్ళున్న సరస్సుని, మూర్ఖుదధ్యక్షించిన సదస్సుని**
**సినీతార వయస్సుని, మావ్ సెటుంగ్ మనస్సుని –**

కొత్త పద ప్రయోగం, కొత్త వాక్య నిర్మాణం, వస్తు నవ్యతను ప్రదర్శించే కవిత 'ముసలిదైపోయింది భూమి'. ఎవరూ ఊహించని, చేయని పద ప్రయోగం. భూమి

ముసలిదైపోవడమేమిటి? మన ఊహకు కూడా అందని పదప్రయోగం చేసి కవితను, కవిత్వంలో నవ్యతను సాధించాడు తిలక్.

**ముసలిదైపోయింది భూమి**
**మూర్ఖులైన తన కొడుకుల్ని నమ్ముకొని**
**ముసురుకున్నన బాధల వానకారులో**
**మసలుకునేదెలా చివరకంటా**

వినూత్న పద వాక్య ప్రయోగం, ఆలంకారిక ప్రయోగం 'వేకువ' కవితలో కనిపిస్తాయి. వేకువ ఎలా ఉంటుంది? అని ఊహించటంలో ఎవరూ ఊహించని విధంగా ఊహించటం తిలక్‌కే సాధ్యమైంది. అందులో నూతనత్వానికకి చోటు దక్కింది.

**'రాత్రిని రంపం పెట్టి కోసినపుడు**
**రాలిన పొట్టులాగుంది వేకువ**
**రాత్రంతా నిశ్శబ్దపు వలలో తగుల్కొన్న పక్షులు**
**తటాలున విడిపించుకు ఎగిరిపోయినట్టు కువకువ'**

'వేకువను – రాత్రిని రంపం పెట్టి కోస్తే రాలిన పొట్టులా" అని ఎవరైనా అనగలరా ? చెప్పగలరా ? రాయగలరా? లేదు, ఒకే ఒక్కడు మాత్రమే చేయగలడు. అదే బాలగంగాధర్ తిలక్.

ఈ విధంగా 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటిలోని దాదాపు అన్ని కవితలలోనూ నవ్యత్వానికి పెద్దపీట వేశాడు తిలక్. పదసృష్టిలో, వాక్య నిర్మాణంలో ముఖ్యంగా వస్తు నిర్ణయంలో, అభివ్యక్తిలో, భావ ప్రకటనలో, శిల్ప నైపుణ్యంలో నవ్యతను ప్రదర్శించి తన తరం కవులకు, తన తర్వాతి తరం కవులకు స్ఫూర్తిగా నిలిచాడు. కవుల చర్చల్లో, కవితా ప్రస్థానంలో శ్రీశ్రీతో పాటుగా తన పేరును కూడా స్మరించే స్థాయిని, విస్మరించని స్థితిని సాధించాడు తిలక్. కవిత్వం రాయాలనుకునే నవ, యువతరం వాళ్ళు చదువవలసిన కవితా సంపుటాలలో తన 'అమృతం కురిసిన రాత్రి'కి ఉత్తమమైన స్థానం కల్పించాడు. తిలక్ జయహో ! అమృతం కురిసిన రాత్రి జయ జయహో!

# 10. తిలక్ కవిత్వం - అలంకార వైవిధ్యం

- ఆచార్య పి.ఆర్. హరినాథ్

హేమచంద్రుడనే ఆలంకారికుడన్నాడు

దృష్టపూర్వా అపిహ్యర్థాః

కావ్యే రస పరిగ్రహాత్

సర్వే నవా ఇవాఽభారతి

మధుమాస ఇవద్రుమాః

'ఇంతకు మునుపు చూసిన అర్థాలే (వస్తువులే) అయినా కూడా కావ్యంలో రస పరిగ్రహం చేత కొత్తగా అనిపిస్తాయి. వసంత ఋతువులో చెట్లలాగా అంతగా కొత్తవేమో అన్నట్లు వెలిగిపోతాయి'.

కవిత్వానుభవం ఇలానే ఉంటుంది. నిన్నటి దాకా మామూలుగా ఒక ఎండిన కొమ్మలాగా అనిపించిన చెట్టుకొమ్మ - ఈ రోజు చిగుళ్లు తొడగడంతో కొత్తగా అనిపించడం - అదొక పలవరించదగిన, పరవశించదగిన అందం కావడం - కవిలోకానికి అనుభవమే.

ఎలాగైతే చిగుళ్లు చెట్టును నవీకరించాయో, కవిత్వంలో అలంకారాలు కూడా నవ్యానుభవాన్నీ, దివ్యానుభవాన్నీ కలిగిస్తాయి.

తెలుగు సాహిత్య లోకంలో ప్రత్యేక పరిచయం లేని కవులలో తిలక్ ముందు వరుసలో ఉంటాడు. 'అమృతం కురిసిన రాత్రి', 'గోరువంకలు', 'సుప్తశిల', 'సుచిత్ర ప్రణయం', 'సుందరీ సుబ్బారావు', 'తిలక్ కథలు' - మొదలైన రచనలతో పాఠకలోకం పరవశించింది.

'అమృతం కురిసిన రాత్రి' సంపుటిలో ఆ ప్రాతః కాలం ఖండికలో వరుసగా ఉత్ప్రేక్షలు కనిపిస్తాయి. ఉదయం ఎలా ఉంటుందనే అంశాన్ని కవి భిన్న రీతుల్లో ఊహించాడు.

అప్పటిదాకా చీకటిగా ఉన్న ఆకాశం మెల్లమెల్లగా తెలిరేకులు విచ్చుకుంటూ వెలుగు లీనడం, ప్రతి ఉదయమూ జరిగే సంఘటనే. ఆ ఉదయపు వెలుగు ఎలా

ఉందో, చెప్పాడు కవి. చీకటి నవ్వితే కలిగిన చిన్న వెలుతురులా ఉందట ప్రాతఃకాలం. 'నవ్వు' అనే అంశం తిలక్‌కు చాలా ఇష్టమైన వాటిలో ఒకటి. 'చీకటి నవ్వడం' అనే ఊహను విస్తరించి, కవి దృష్టితో చూస్తే – మరింత సుందర్‌గా కనిపిస్తుంది. ఉదయం వేళ – చీకటి ఉండగానే ఎరుపు వన్నె అల్లుకుంటూ కనిపిస్తుంది. ఆ ఎరుపు నుండి తెల్లని వెలుతురు మెల్లమెల్లగా పరచుకుంటుంది. పెదవులు ఎర్రగా ఉండడం, అవి విచ్చుకుంటే తెల్లని పలువరుసతో వెలుగు కనబడడం అనే ఊహను మొత్తాన్నీ ఒక మాటలో 'చీకటి నవ్వు' అంటాడు. 'ఎర్రని పెదవులపై తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు' అని అప్సరలు కవి గురించి అనిన మాటలను అనుసంధించు కుంటే ఈ ఊహ స్పష్టమవుతుంది.

ఇదే కవితలో మరో ఊహ. అప్సరలు చాలాకాలం విరహ నిద్రలో ఉన్నారు. నిద్రను కౌగిలించుకుని పడుకున్నారు. అందులో ఒక కల కంటున్నారు. ఆ పరిష్వంగం వీడిపోగా అంటే నిద్ర చెదిరిపోగా కంటున్న మంచుకల నేలకు జారింది. ఆకాశం నుంచి నేలకు జారుతున్న అప్సరల కలలా తెల్లగా ఉంది. మంచుపొరలతో ఉంది ప్రాతః కాలం. ఇదొక సంశ్లిష్టమైన భావచిత్రం. విస్తృత భావాన్ని కుదించి ఒక చిన్న మాటలో బంధించాడు తిలక్.

ఒక కాల్పనిక లోకాన్ని ప్రదర్శించి పఠిత అందులో విహరిస్తుండగానే – కఠిన వాస్తవికతను కూడా చూపడం తిలక్ కవితలో కనిపిస్తుంది.

ఇదే కవితలో నవ్వు గురించి, అప్సరల కల గురించీ చెప్పాక – ఆకలిగొన్న పేదలను స్మరిస్తాడు. పేదలు తిండిలేక మాడిపోతున్నారు. ఆకలితో ప్రతి వాకిలి వద్దకూ తిరుగుతున్నారు. అలా ఆకలితోనే నిద్రలోకి జారుకుంటున్నారు. తిండిలేక మాడిపోవడం కంటె నిద్రలో కాస్త సుఖమైనా దక్కుతుంది. కనీసం ఆ శాంతిని కూడా వారికి దొరకనీకుండా, నిద్రను భగ్నం చేస్తూ తెల్లవారుతూంది.

'ఆకలి మాడుచు
వాకిట వాకిట
దిరిగే పేదల
సురిగే దీనుల
సుఖ సూప్తిని చెరిచే
సుందర రాక్షసివా'

అని ప్రాతః కాలాన్ని ఒక అందమైన రాకాసిగా భావించడంలో పేదల పట్ల

కరుణ, వారి దైన్యం పట్ల సానుభూతి ప్రకటితమవుతాయి. వేకువ వెలుగు యుద్ధాల నుండి రేగిన పొగలా తెల్లగా పరచుకుని ఉందంటూ, వెంటనే పార్వతీదేవి శివుడి నుదుటిపై పూసిన విబూదిలా ఉందంటాడు.

ఈ ఆలంకారిక చిత్రణలో శృంగారముంది, కల్పనాలోక విహారముంది. వాస్తవిక లోక చిత్రణ ఉంది. సంప్రదాయ పౌరాణిక భావన ఉంది. అన్నీ కలిపి కవిత్వ పరిమళముంది.

'వేసవి' కవితలో మధ్యాహ్న తీవ్రతను వర్ణించడానికి స్వభావోక్తిని ప్రయోగించి కళ్లముందు నిలిపాడు.

'కాలం కదలదు
గుహలో పులి పంజా విప్పదు
చేపకు గాలం తగలదు

ఎండుటాకులు
సుడిగాలికి తిరిగెను గిర్రున
వడగొట్టిన భిక్షుకి
అరచెను వెర్రిగ – '

వంటి స్వాభావిక చిత్రణ చేస్తూ, హఠాత్తుగా అంటాడు:

నిశ్శబ్దం అంటుకుంది
మధ్యాహ్నం మంటల జుట్టుని విరబోసుకు
నగ్నంగా రోడ్ల మీద తిరుగుతూంది.

మధ్యాహ్నాలలోని నిశ్శబ్దాన్నీ, నిర్మానుష్యతనూ ప్రకటించిన చిత్రణ ఇది. వీథి నిర్జనంగా ఉండడం, వేడికి మాడిపోతుండడం అనేవి అనుభవంలోకి వస్తాయి.

'సంధ్యలాంటి సందేహం' (భూలోకం)

'దీపపు వత్తి చివర నిద్రపోయే నిప్పు నలుసు' (యుగళగీతిక)

వంటి చిత్రణలు ఆలంకారిక అభివ్యక్తికి తార్కాణాలు.

'వానలో నీతో' కవిత ఒక విశిష్ట రచన. వానకురిసినప్పటి అనుభవాన్ని శృంగార భరితం చేసిన చిత్రణ ఇది.

'అరటితోట నడుం చుట్టి
కాలువ ఏటవాలుగా మలుపుతిరిగింది.'

అనడంలో అరటితోటను చుట్టుకుని వెళ్ళిన కాలువ గురించి చెపుతున్నాడు.

అరటి తోటకు నడుమెక్కడిది? వంపు తిరిగిన వయ్యారపు భాగమే నడుము. ఆ నడుము చుట్టూ ఉన్న కాలువ – పరిష్వంగ బద్ధ బాహువు. కవి శృంగారి అయినపుడు – కనిపించేదంతా రాగబద్ధమవుతుంది.

'గుమ్మం తగిలి తలమీద బొప్పికట్టినా
గొప్పకి నవ్విన కొత్త కోడలు లా
వచ్చి నిలుచుంది కొత్త సంవత్సరం' (శిఖరారోహణ)

అనడంలో ఉపమాలంకారం స్పష్టంగా ఉంది. ఇలాటిదే.

'గది అవతల స్టెయిన్‌లెస్ స్టీలు రేకులా ఎండ' (గ్రీష్మం)

వంటివి.

'ప్రార్థన' కవితలో చతురత ఏమిటంటే – 'దేవుడా' అని ప్రార్థించేది ఎవరినో రక్షించుమని అడిగేది కూడా వారినుంచే. 'దేవుడా నన్ను రాక్షసులనుండి కాపాడు' అనడం రివాజు.

'దేవుడా రక్షించు నా దేశాన్ని
లక్షలాది దేవుళ్ల నుంచి
వారి వారి పూజారుల నుంచి' (ప్రార్థన)

అనడం చతురత

కొన్ని ఆలంకారాలు సూటిగా చెప్పినవి

'దీపాలు బాగుంటాయి
పాపల్లాంటి దీపాలు
కనుపాపల్లాంటి దీపాలు
పాపాల వంటి సహజ స్వచ్ఛ తీవ్రమైన దీపాలు' (దీపం)

అలంకారం ఒక అతి ప్రాచీన అభివ్యక్తి. బహుశా మాట పుట్టిన తొలిరోజుల్లోనే అలంకారం కూడా పుట్టి ఉంటుంది. మానవానుభవాలను మరింత బలంగా చెప్పడానికి ఒక ప్రసిద్ధమైన అంశాన్ని ఆధారం చేసుకోవడం సహజం. తెలియని దానిని తెలిసిన దాని సహాయంతో తెలపడం అలంకారంలో కనిపిస్తుంది. కవిత్వంలో అలంకారం అభివ్యక్తికి బలాన్ని ఇస్తుంది. ఫలాన్నిస్తుంది.

# 11. తిలక్ "అమృతం కురిసిన రాత్రి"-వస్తువిశ్లేషణ

- ఆచార్య విస్తాలి శంకరరావు

అమృతం కురిసిన రాత్రి అనే మాటను వింటేనే మనసులో ఏదో తెలియని అద్భుత సౌందర్యలోకంలో విహరించినట్లు ఉంటుంది. అబ్బా ఎటువంటి శీర్షిక అని హృదయాన్ని కదిలించి వేస్తుంది. అలాగే అసలు ఈ "అమృతం కురిసిన రాత్రి"ని వర్షింప జేసిన ఆ కవి ఋషి ఎవరా? అనిపిస్తుంది! అతడే దేవరకొండ బాలగంగాధర్ తిలక్.

అమృతం కురిసిన రాత్రి మొదటి సారిగా 1968 జూలైలో విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ప్రచురించారు. ఈ ముద్రణ తిలక్ మరణాంతరం జరిగింది. తను జీవించిన కాలంలోనే పుస్తకంగా రావాలని ఎంతగానో తహ తహలాడారు. అది సాధ్యం కాలేదు. నాటి నుండి నేటి వరకు తెలుగు సాహిత్యంలో ఎన్నెన్ని పేర్లుతో రచనలు వచ్చినా ఈ అమృతం కురిసినరాత్రి మాత్రం ప్రత్యేకంగా నిలుస్తుంది.

ఈ అమృతం కురిసినరాత్రి తొలి ప్రచురణ మొదలు అంటే 1968 నుండి 1976 నాటి ప్రచురణ వరకు 64 కవితలు మాత్రమే ఈ సంపుటిలో ఉన్నాయి. ఆ తర్వాత 1984 జూన్‌లో నాల్గవ ముద్రణ నాటికి మరో 22 కవితలు చేరి మొత్తం 86 కవితలు అయ్యాయి.

ఈ రచన 1965లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డు, 1971లో కేంద్రసాహిత్య ఆకాడమీ ఉత్తమ కవిత్వపురస్కారం అందించింది.

తిలక్ కాలంనాటి పరిస్థితులను గమనిస్తే, తిలక్ భావకవిత్వంలో పుట్టి, అభ్యుదయ కవిత మీదుగా అనుభూతి కవితా ప్రస్థానం సాగించిన కవిగా దేవరకొండ బాలగంగాధర తిలక్ నిలుస్తారు. అంటే తిలక్ కవితా రచన చేసే సమయానికి భావకవితా యుగం అంతరించి క్రమంగా అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం ఆవిర్భవించాయి. తిలక్ గొప్ప భావకుడు కవిత్వ సిన్సిబిలటి ఉన్నవాడు, రసార్ద్ర హృదయం కలిగినవాడు. తిలక్ వస్తుత: భావకవి అందుకు తగ్గ విషాద అలంకారికతే

వారి కవిత్వంలోను దర్శనమిస్తుంది. అమృతం కురిసిన రాత్రి సంపుటిలో కవితలే కాదు, కథలలోని కొన్ని సందర్భాలను కవితలుగా ఉన్నాయి. ఉదా॥ యుద్ధ బీభీత్సం, సైనికుడి ఉత్తరం మొదలైనవి కనిపిస్తాయి. శాంతి కోసం తిలక్ పడే తపన కూడా దీనిలో అంతర్లీనంగా కనిపిస్తుంది. ఈ సంపుటిలోని వస్తువు పరంగా చూస్తే ఎన్నో వైవిద్యాలు కనిపిస్తాయి.

**ఉదా॥ – కథాత్మకమైనవి (కథను సూచించేవి)**

- **ఋతువులను చిత్రించే కవితలు**
- **ప్రణయ భావనను ఆవిష్కరింపజేసే కవితలు**
- **హాస్య, చమత్కార నిర్వచన ప్రాయమైన కవితలు**
- **మధ్య తరగతి మనుషుల పట్ల నిరసన ప్రకటించేవి**
- **కవిత్వాన్ని నిర్వచించేవి**
- **జీవన దృక్పదాన్ని ప్రకటించేవి**

ఇలా అనేక సందర్భాలను వర్ణించే కవితలు ఈ అమృతం కురిసిన రాత్రిలో దర్శనమిస్తాయి.

ఉదాహరణకు కొన్ని..... అమృతం కురిసినరాత్రి, ఆర్తగీతం, నాకవిత, నువ్వులేవు నీ పాట ఉంది, తపాలబంట్రోతు, మేగ్నకార్టాం, వానలోనీతో, శిఖరారోహణ, నీడలు, వెన్నెల, నవత–కవిత, ప్రకటన, అద్వితీయం మొదలైనవి. ప్రస్తుతం అన్నిటిని దర్శించడం సాధ్యంకాదు కనుక కొన్నిటిని పరిశీలిద్దాం.

### 1. "అమృతం కురిసిన రాత్రి"

తిలక్‌గారి కవితా తత్త్వాన్ని తెలుసుకోవాలంటే అమృతం కురిసిన రాత్రి ఖండిక అనే ఖండిక ఒక్కటి చాలు...

కొంచెం లోపలికి వెళ్లి ఆ అమృతం కురిసిన రాత్రి ఎంత అందంగా ఉందో వీలైతే ఆ రసాస్వాదనను మనం కూడా పొందుదామని మనసు ఉరకలెస్తుంది. అమృతం కురిసినరాత్రిలో వెళ్లి చూస్తే ఈ కవి ఎంత అదృష్టవంతుడో, ఎవ్వరికి అందని ఆ రాత్రి సౌందర్యాన్ని ఎంత గొప్పగా ఆస్వాదించాడో అనే అసూయ కూడా కలుగుతుంది. కాని ఏం చెయగలం. సరే కనీసం ఆ అమృతం కురిసి వెళ్లిపోయిన తర్వాత ఆ సువాసనలైన ఆస్వాదిద్దామని ప్రయత్నం చేస్తే, ఆ కవి ఆస్వాదించగా మిగిలిపోయిన ఆ అమృతమే నన్ను ఈ బాహ్య ప్రపంచాన్ని మైమరపింపజేసి సౌందర్యలోకంలో

విహరించేలా చేసింది. కావాలంటే మీరు ఆ రోజు అసలు ఏం జరిగిందో ఒక్కసారి వినండి.

ఈ ఖండిక తిలక్ కవితా సౌందర్యానికి చక్కని నిదర్శనం. దీనిలో ఎంతో అద్భుతమైన వస్తువును ఎంచుకుని దాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దిన తీరు పాఠకులను మైమరిపింపజేస్తుంది.

**అమృతం కురిసినరాత్రి**
**అందరు నిద్రపోతున్నారు**
**నేను మాత్రం తలుపుతెరచి ఇల్లు విడిచి**
**ఎక్కడికో దూరంగా.....**
**కొండదాటి కోనదాటి**
**వెన్నెల మైదానంలోకి**
**వెళ్ళి నిలుచున్నారు**

**ఆకాశం మీద అప్సరసలు**
**ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు**
**వారి పాదాల తారా మంజీరాలు**
**ఘల్లు ఘల్లుని మ్రోగుతున్నాయి**
**వారి ధమ్మిల్లాల పారి జాతాలు**
**గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి**
**వారి పృథువక్షోజ నితంబ భారలై**
**యౌవన ధనస్సుల్లా వంగిపోతున్నారు**
**నన్ను చూసి కిల కిల నవ్వి ఇలా అన్నారు**
**చూడు వీడు**
**అందమైన వాడు**
**ఆనందం మనిషైనవాడు**
**కలల పట్టుకుచ్చులాగుతున్న కిరీటం ధరించాడు**
**కళ్ళ చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు**
**ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు**
**ఎవరికీ దొరకని రహస్యాన్ని వశపరుచుకున్నాడు**

**జీవితాన్ని ప్రేమించినవాడు, జీవించడం తెలిసినవాడు**
**నవనవాలైన ఊహా వర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు**
**ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు, మనకి వరుడు**
**జలజలమని కురిసింది వాన**
**జాల్వారించె అమృతపు సోన**
**దోసిళ్లతో తాగి తిరిగివచ్చాను**
**దు:ఖాన్ని చావునీ వెళ్లి పొమ్మన్నాను**
**కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను**
**జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను**
**జైత్రయాత్ర పథంలో తొలి అడుగు పెట్టాను**
**ఈ నాటికి ఎవ్వరికి తెలియదు**
**నేను అమరుడినని.....**

ఈ ఖండిక చదువుతుంటే ఆహా ఎంత సౌందర్యం, ఎంత ఆనందం, ఎంత అదృష్టం, ఇలా అమృతాన్ని ఆస్వాదించినవారు అమరులుగాక ఏమవుతారు! ఆ అమరుడే దేవరకొండ బాలగంగాధర తిలక్.

'తిలక్' తెలుగు సాహిత్యంలోనే ఒక విలక్షణమైన వ్యక్తి. తనకు ముందు, తన తరువాత ఎందరు కవులున్నా తిలక్ పేరే ఒక ప్రత్యేకం. ఆ ప్రత్యేక వ్యక్తిత్వం నుండి జీవం పోసుకున్న మధురమైనదారే "అమృతం కురిసినరాత్రి" తెలుగు సాహిత్యానికే ఒక అమృతత్వాన్ని కలిగించిన ఒక విశిష్ట రచన.

ఈ కవిత్వానికి ఎంచుకున్న వస్తువు ఎంతో అందమైంది, ఎంతో సుందరంగా ఉంది. ఒక కాల్పనిక ఘటనను తీసుకుని ఆకర్షణీయమైన, ఆనందకరమైన అభిరుచిని కలిగించేలా తీర్చిదిద్దాడు. గమనిస్తే కవి మనోధర్మం, సౌందర్య భావనకు స్వాప్నకాను భూతికి ఈ కవిత్వం ఎంతగా ఒదిగిందో అర్థంచేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే తిలక్ జీవితంలోగల సౌందర్యారాధన, అమృత భావన ఎంత తీయనైందో తెలియజేసే ఖండకావ్యమే ఇది.

దీనిలో వస్తు ప్రాధాన్యంతో పాటు ఎన్నెన్నో పదచిత్రాలు దాగి ఉన్నాయి ఒక్కొక్క వాక్యాన్ని స్పృశిస్తే దానిలోని లోతైన భావన తెలిసిపోతుంది.

ఈ కవితలో తిలక్ అన్నీ ప్రతీకలనే వాడాడు.

**"అమృతం కురిసిన రాత్రి**
**అందరూ నిద్రపోతున్నారు**
**నేను మాత్రం**
**తలుపు తెరచి యిల్లు విడిచి**
**ఎక్కడికో దూరంగా**
**కొండదాటి కోనదాటి**
**వెన్నెల మైదానంలోకి**
**వెళ్ళి నిలుచున్నాను"**

ఇక్కడ 'అమృతం కురిసిన రాత్రి' అంటే 'జీవితమనే సముద్రాన్ని మథించిగా అమృతం లభించిన రాత్రి'. అనగా అది 'కవితా సాక్షాత్కారం'. 'అమృతం' అంటే, 'కష్ట సుఖాల మదనంతో జీవితం కళాత్మక సత్యంగా ఆవిష్కృతమైనపుడు లభించే కళామృతమే అమృతం.

"అందరూ నిద్రపోతున్నారు" అంటే వారు చచ్చిపోలేదు. కానీ అలర్ట్‌గా లేరు. నేను – అంటే కవి.

కవి మాత్రం ఒక్కడే తన హృదయకవాటం విప్పుకుని, అనగా మనసును విస్తృతపర్చుకొని, ఎక్కడికో దూరంగా కొండలు కోనలు దాటి వెన్నెల మైదానంలోకి వెళ్ళి నిల్చున్నాడు. వెన్నెలమైదానం అంటే 'సౌందర్య సీమ' ఈ సౌందర్యం భౌతిక మయినది కాదు, ఇది కళాత్మక సౌందర్యం.

**"ఆకాశం మీద అప్సరసలు**
**ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు**
**వారి పాదాల తారా మంజీరాలు**
**ఘల్లు ఘల్లని మోగుతున్నాయి**
**వారి ధమ్మిల్లాల పారిజాతాలు**
**గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి**
**వారు పృథు వక్షోజ నితంబ భారలై**
**యేవన ధనస్సుల్లా వంగిపోతున్నారు"**

ఇక్కడ కవి యొక్క 'కళాసౌందర్య భావన' మనకు కనిపిస్తున్నది. ఈ సృష్టినందే సమస్త సుందర దృశ్యాలు, భావాలు ఇమిడి ఉన్నాయి అని చెప్పారు.

ఇక్కడ అప్సరసలు అంటే వాళ్ళకు ఆకారం లేదు. కాని వాళ్ల భావన మాత్రం ఉంది. వాళ్ల కాలి అందెలుగా 'నక్షత్రాలు' ఘల్లు ఘల్లు మంటున్నాయి, వారి కొప్పులో పారిజాతాలు సుగంధ పరిమళాలను వెదజల్లుతున్నాయి. పాలవెల్లి వలన వంగిపోతున్నారు. ఇవన్నీ సృష్టిలోని సౌందర్యాలే. ఈ సౌందర్యం సృష్టిని, ప్రకృతిని, జీవితాన్ని ఆశ్రయించుకొని ఉంది.

**"నన్ను చూసి చూసి కిలకిల నవ్వి యిలా అన్నారు**
**చూడు వీడు**
**అందమైన వాడు**
**ఆనందం మనిషైన వాడు**
**కలల పట్టు కుచ్చు లాగుతున్న కిరీటం ధరించాడు**
**కళ్ళ చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు**
**ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు**
**ఎవరికి దొరకని రహస్యాల్ని వశపరచుకున్నాడు**
**జీవితాన్ని ప్రేమించినవాడు జీవించడం తెలిసినవాడు**
**నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు**
**ఇతడే సుమీ మన ప్రియుడు నరుడు మనకి వరుడు"**

ఇక్కడ తిలక్ ఎంత మానవతావాదో తెలుస్తుంది. సృష్టిలోని అన్ని జీవులకన్నా మానవుడు మహోన్నతుడు. "ఆంతరంగిక విచక్షణ వలన మానవజన్మ విలక్షణ మైనది" మనిషికి మించిన అందగాడు ఎవరూ కాదు, ఆ అందం ఆనందం వల్ల వచ్చిందే. మనిషిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు తిలక్. అంతేకాక దీనిలో

**కలల పట్టుకుచ్చు లాగుతున్న కిరీటం ధరించాడు – 'మానవతావాదం'**

**ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వు – 'ఆశావాదం'**

**కళ్లు చివర కాంతి సంగీతాన్ని రచిస్తున్నాడు – ఉత్సాహాన్ని పోగొట్టుకోకుండా........**

ఈ విధంగా ఆశావాదిగా, జీవితాన్ని నిరంతరం ప్రేమించే, ఊహల్లో జీవితాన్ని ఉత్సాహపరుచుకుంటుండే, మానవున్నే 'కళాత్మక సౌందర్యం' వరిస్తుంది. కావ్య సౌందర్యమును స్థానం ఈ రకమైన మానవుడు.

కావ్య సౌందర్యం మానవుని వరించినపుడు మానవతావాదాన్ని ఆశ్రయించుకుని, కావ్యాన్ని పరిశీలించినప్పుడు ఈ కావ్యామృతం దక్కుతుంది.

**జలజల మని కురిసింది వాన**
**జాల్వారింది అమృతంపు సోన**
**దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చాను**
**దు:ఖాన్నీ చావుని వెళ్ళిపొమ్మన్నను**
**కాంక్షామధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను**
**జీవితాన్ని హసన్మందారమాలగా ధరించాను**
**జైత్రయాత్ర పథంలో తొలి అడుగు పెట్టాను**

పరిశీలిస్తే మానవున్నే వరించిన కావ్యామృతం యక్కడ కవి మీద కురిసింది. దాన్ని అనుభవించి వచ్చి దు:ఖాన్ని చావును దరికి రావద్దన్నాడు. కోరికలతో కూడిన ఆశావాదం పెంచుకున్నాడు, దు:ఖాన్ని కూడా హసన్మందారమాలగా ధరించాడు. అప్పుడే తొలి ఆడుగు విజయం వైపు వేయగలిగాడు.

**అమృతం కురిసిన రాత్రి**
**అందరూ నిద్రపోతున్నారు**
**అలసి నిత్యజీవితంలో సొలసి సుషుప్తి చెందారు**
**అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు**
**అధైర్యంతో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు**
**అనంత చైతన్యోత్సవాహ్వాన్ని వినిపించుకోలేక పోయారు.**
**అందుకే పాపం**
**ఈనాటికీ ఎవరికి తెలియదు**
**నేను అమరుడని**

ఇక్కడ సౌందర్యాన్ని ఆస్వాదించలేని వారందరికీ శాంతి లేదు వాళ్ళజీవితం ఎప్పుడు అలసట, అధైర్యం, అస్వతంత్రత మొదలైన చైతన్యరాహిత్యాలను కలిగి ఎప్పుడూ అశాంతిగానే ఉంటారు. వాళ్లను తెలియదు కవి కావ్యామృతాన్ని ఆస్వాదించడం వలన చిరంజీవియని.

ఈ ఖండికలో తిలక్, మానవతావాదంతో తపస్సు చేయగా , మనుసుతలపులు తెరచుకొని, కవితామృతం లభించిందని తెలుస్తుంది. ఈ మానవాతావాదం... ఆశావాదం యితరులను ప్రేమించాలి. ఆనందాన్ని చెక్కు చెదరనీయకుడదు ఒక గమ్యంతో ప్రయాణించాలి. ప్రధానంగా జీవితాన్ని ప్రేమించాలి. అలాంటి వారినే కావ్యసౌందర్యం వరిస్తుంది, వశమౌతుంది. ఇది వరించడం వల్లనే కవికి కళామృతం

దక్కుతుంది. ఇలాంటి భాషాభివ్యక్తి తిలక్ రచనలో కుదిరినట్లు చాలమంది కవుల రచనలో కనిపించదు. ఇలా

– కృష్ణశాస్త్రి గేయ సాహిత్యానికి కవిత్వ స్థాయిని కల్పించి గౌరవం తెచ్చినట్లుగా

– తిలక్ వచన పద్యానికి సాహిత్యంలో విశిష్టమైన గౌరవ స్థానం కల్పించారు.

తన కవితాతరంగాన్ని తెలుసుకోవాలంటే 'నా కవిత్వంలో నేను దొరుకుతాను' అనే ఖండికలో తెలుస్తుందంటారు. ఈ ఖండిక తిలక్‌గారి స్వంతంత్రమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది.

**"నా కవిత్వంలో నేను దొరుకుతాను"**

తిలక్ కవితాంత్రరంగాన్ని పసిగట్టాలంటే వారు రాసిన 'నా కవిత్వంలో నేను దొరుకుతాను' దర్శించాలి. దీనిలో తిలక్ స్వతంత్ర వ్యక్తిత్వం విలక్షణంగా ఉంటుంది.

**"నా కవిత్వం కాదొక తత్త్వం**
**మరికాదు మీరనే మనస్తత్వం**
**కాదు ధనికవాదం, సామ్యవాదం**
**కాదయ్య అయోమయం, జరామయం**
**గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ**
**జాజిపువ్వుల అత్తరు దీపాలూ**
**మంత్ర లోకపు మణిస్తంభాలూ**
**నా కవితా చందనశాలా సుందర చిత్రవిచిత్రాలు**
**అగాధ బాధా పాథ పతంగాలూ**
**ధర్మవీరుల కృత రక్తనాళాలూ**
**త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిసూక్తి**
**నా కళా కరవాల ధగద్ధగరవాలు**
**నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు**
**నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"**

ఇలా తిలక్ తన కవిత్వం గురించి రాసుకున్న మాటలు మనల్ని కొత్త ఆలోచనలలోను, ఆశ్చర్యంలోను ముంచెత్తుతుంది. ఈ కవితను పరిశీలిస్తే ఎన్నో అద్భుత పదచిత్రాలు దర్శనమిస్తాయి.

ఉదా॥ "గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ" అన్నప్పుడు గాజు కాంతిని వెదజల్లే తత్త్వం ఉంది.

కెరటాలు – అనేది భావాల వెల్లువను తెలియజేస్తుంది

వెన్నెల – మెత్తని ప్రకాశవంతమైన గుణాన్ని తెలియజేస్తుంది

అలాగే జాజిపువ్వుల అత్తరు దీపాలు – ప్రకాశంతో పాటు సహజసుగంధాన్ని 'మంత్రలోకపు మణిస్తంభాలూ' అసాధారణమైన, అమూల్యమైన విలువలతో తెలియజేస్తుంది. అలాగే సౌందర్యం, ప్రణయం, కారుణ్యం ఇవి తిలక్ కవిత ప్రాతిపదికలుగా మనం భావించవచ్చు. అలాగే మరో ఖండికను పరిశీలిద్దాం.

**"ఆర్తగీతం"**

తిలక్ ఎంత సున్నితమైన భావన కలిగినవాడో ఈ ఖండికద్వారా తెలుసుకోవచ్చు. చిన్న చిన్న సంఘటనలకు కూడా చలించె హృదయం వారిది. తాను దర్శించిన దానికి స్పందించే తీరు కూడా తిలక్‌లో లాలిత్యా భరితంగా ఉంటుంది.

ఉదా॥ ఆర్తగీతంలో.....

**నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి**
**మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి**
**నేను చూశాను నిజంగా నీరధ్రవర్షాన వంతెనకింద**
**నిండు చూలాలు ప్రసవించి మూర్చిల్లిన దృశ్యాన్ని**
**నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక**
**ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నుల తుడుచుకుంటూ**
**మురికి కాల్వ పక్కన నిద్రించే ముదేళ్ళ పసిబాలుణ్ణి**
**నేను చూశాను నిజంగా క్షయగ్రస్త భార్యయిక బ్రతకదని**
**దాక్టర్ చెప్పినపుడు ప్రచండవాతూల హతనేపశాఖవలె**
**గజగజ వణికి పోయిన అరక్త అశక్త గుమాస్తాని.**

దీని లోతులలోకి వెళ్ళితే 1920 కాలానికి కాస్తంత ముందు కాలం నాటి సామాజిక దైన్యాన్ని గురించి సిద్ధాంత రాద్ధాంతాలేవి లేకుండా వర్ణించి చెప్పిన కవి దేవరకొండ బాలగంగాధర తిలక్. తెలుగు వచన కవితా సౌందర్యానికి నికార్సైన ప్రతినిధులు ఆయన కవితలు. ఉదాహరణకు తాను రచించిన కవితా సంకలనమేది

వెలువడక పూర్వమే కవిగా ప్రసిద్ధులైన ప్రతిభాశాలి తిలక్. వారి ఏకైక వచన కవితా సంపుటి 'అమృతం కురిసిన రాత్రి' కూడా మరణానంతరం ప్రచురింతమైంది.

ఈ ఆర్తగీతం కవితలో వర్ణించిన ముసలివాడు, పసిబాలుడు, గుమస్తాల బ్రతుకులు ఎంతదైన్యంగా ఉన్నాయో కవి సాక్షత్కరింపజేశారు. ఇటువంటి సంఘటనలు హృదయాన్ని కదిలివేస్తాయి.

"ఇది ఏ నాగరికత ఫలశ్రుతి

ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి" అని ప్రశ్నిస్తాడు. అయితే ఈ ఆర్తగీతంలో వేదనను అర్థం చేసుకోవడం వరకే ఉంది. తిలక్ హృదయవేదనలో ఆర్తగీతి ఆలపించి తన హృదయ వేదనను వ్యక్తం చేసుకోవడం వరకే పరిమితం అయ్యాడు. తన ఆవేదన వల్ల ఈ రోజు నాకు విషాద స్మృతి అని ప్రకటించి నా కొత్త సింగారమ్మ వలదు, ఉదాత్త సురభిళాత్తశయ్య సజ్జితమ్ము వలదు అని విరక్తి చాటాడు. అలాగే మరో కవితను పరిశీలిద్దాం.

**"తపాలబంట్రోతు"**

ఈ కవితను సుబ్బారావు అనే మిత్రుడు జిల్లాతపాలశాఖ జరుపుకునే వార్షికోత్సవానికి ఫోస్ట్ మాన్ మీద కవిత రాయమని కోరినపుడు తిలక్ 'తపాలబంట్రోతు' అనే కవిత రాసినట్లుగా తెలుస్తుంది. ఇది ప్రజల మనోభావాలకు అద్దం పట్టే ఖండిక.

దీనిలో ఉత్తరాలకోసం ఎదురుచూసే వివిధ రకాల వ్యక్తుల మనస్తత్వాలు, స్థితిగతుల్ని వస్తువుగా స్వీకరించి చక్కగా ఖండికగా ఆవిష్కరించారు. ఉదా॥ ప్రియుడి వార్తకోసం ఎరురుచూసే ఒక ప్రేయసి స్థితి ఎలా ఉందో చూడండి.

**"ఆ కిటికిలో రెండు విచ్చిన కలువల్లాంటి కళ్ళు**
**ఆ వీధి మొగవైపె ప్రసరిస్తున్న చూపులముళ్ళు**
**ఆ కళ్ళలో ఆత్రుత**
**ఆ గుండెల్లో గడిచిన**
**దేశాంతరగతుడైన ప్రియుడి వార్త కోసం"**

ఈ పలుకులు పరిశీలిస్తే భావకవులు ప్రేయసి ప్రియుల వియోగ మాధుర్యాన్ని వెల్లడించే తీరును స్పష్టం చేస్తాయి. భావకవులు వియోగ శృంగారానికి ప్రాధాన్యత ఇస్తారు.

ఆ యువతి తన ప్రియుడికోసం నిరీక్షిస్తున్న స్థితిని వర్ణిస్తూ......

**"ఆ అమ్మాయీ**
**పద్దెనిమిదేళ్ళ పడుచుదనాన్ని భద్రంగా దాచి**
**పళ్లెరంలో పెట్టి ప్రాణనాధుడి కందించాలనే**
**నీ ఆశ నాకు అర్థమంది"**

ఇక్కడ ప్రియుడి కోసం ఎదురుచూసే యువతి. తన పడుచుదనాన్ని ప్రాణనాధునికి భద్రంగా సమర్పించాలని భావించడం భావకవితా లక్షణంగా చెప్పవచ్చు.

అలాగే దీనిలో ఒకపేద ఉద్యోగి జీవితాన్ని, తన కొడుకు రాసే ఉత్తరం కోసం ఎదురు చూసిన తీరు హృదయాలను ద్రవించివేస్తుంది. ఇలా తపాల బంట్రోతు ఖండికలో అనేక మనోహరమైన భావాలను తిలక్ వెల్లడించారు. సమాజంలో తన అనుభూతికి వచ్చిన అంశాలనే వస్తువుగా స్వీకరించి వర్ణించాడు కాబట్టి తిలక్‌ను అనుభూతివాద కవి అని పేర్కొనడంలో అతిశయోక్తి లేదు.

**"వానలో నీతో"**

అలాగే 'వానలో నీతో' అనే ఖండికను పరిశీలిస్తే....

తిలక్ గారికి ఋతువులన్నిటిలోకల్లా వర్ష ఋతువు అంటే ఎంతో ఇష్టం. వారి దృష్టిలో వర్షం ఎంత ఆకర్షణీయంగా ఉంటుందంటే వారి మాటలోనే చూస్తే (మిరియాల రామమూర్తికి రాసిన లేఖ ఆధారంగా).

"నాకు వర్షాకాలం చాల ఇష్టం. స్నానం చేసి వచ్చిన యవనవతి శరీరంలాగా విచిత్రమైన అందం, ఆకర్షణ" అంటారు. ఈ మాటలు ఆధారంగా వర్షాన్ని తిలక్ ఎలా ఆస్వాదిస్తారో తెలుస్తుంది. మరో మిత్రునికి రాసిన లేఖలో వర్షం కురిసినప్పుడల్లా నాకు కొత్తగా, ఆనందంగా కనిపిస్తుంది". ఇలా ఈ మాటలు వారి సౌందర్య దృష్టికి నిదర్శనంగా భావించవచ్చు.

జీవులన్నిటిని శాసించేది ప్రణయభావన, ఆ ప్రణయభావన తాత్త్విక లోతులను తెరిచే సాధనం కావడం అనేది ఎన్నో కవితలలో చూడగలం. అందుకే విశ్వ ప్రణయమూర్తిగా తిలక్‌ని ధర్మించవచ్చు.

**వానలో, కానలో, నాకు అవిరామం ప్రాచీనత స్ఫురిస్తుంది**
**వర్షుకాంబ్రం నాకు యక్షసతి, సౌందర్యాన్ని రచిస్తుంది**

**బాబిలోనియన్ ఈజిప్టు నాగరికతాస్తూపాల నీడలలో**
**ప్రాణప్రియా? మనమిరువురం మధువు సేవించినట్లు గుర్తొస్తుంది**

ఇలా ఈ కవితను పరిశీలిస్తే అవిరామ ప్రాచీనత, ఈ కవితలోని వివిధ పదచిత్రాలూ, మానవ నాగరికతలోని వివిధ దేశాల ప్రాచీన స్మృతులను బయటకు తెచ్చి మానవ జీవితం మధురంగా అలా ముందుకు కొనసాగుతూనే ఉంటుందనే నమ్మకం కలిగిస్తుంది. అదే కవి తిలక్ ఈ కవితలో చూచించిన అమరత్వం.

వానలో, కానలో తిలక్‌కే కాదు మనకు కూడా ప్రాచీనత స్ఫురిస్తుంది. కవులకు తప్పకుండా స్ఫురిస్తుంది. కాని ముగింపులో....

బాబిలోనియన్, ఈజిప్టు నాగరికతస్థూపాల నీడలలో ప్రాణప్రియా మన మిరువురం మధువు చేవించినట్లు గుర్తోస్తుంది.

ఇది కీలకం బాబిలన్, సుమెర్, ఆర్యుల ప్రాచీన నాగరికతల చరిత్ర చదివి తెలుసుకున్న వారికి ఈ పద్యంలో అంతరార్థంలో దాగిన చిత్రం చక్కగా తెలుస్తుంది.

**"ప్రార్థన"**

ప్రార్థన అనే ఖండికను గమనిస్తే
**"ఇదోక అద్భుత కవితాశిల్పం**
**దేవుడా**
**రక్షించు నా దేశాన్ని**
**పవిత్రులనుండి, ప్రతివతల నుండి**
**పెద్ద మనుషుల నుండి పెద్దపులుల నుండి**
**నీతులు రెండు నాల్కలు సాచి బుసలు కొట్టే**
**నిర్హేతుక కృపాసర్పాల నుండి"** అంటారు.

ఈ పాదాలను గమనిస్తే కవి నిరసిస్తుంది ఈ దేశంలో ప్రబలిపోతున్న హిప్రొకసిని, అందులోని వ్యంగ్యాత్మకత లేకపోతే పవిత్రులు మొదలయిన మంచిని సూచించే పదాలను ఉపయోగించడంలో విశేషంలేదు కాని వెంటనే పెద్దపులి అనే పదాన్ని ప్రయోగించడం దౌష్ట్యాన్ని, వ్యతిరేకతను సూచించడానికి ఉపయోగించడం జరిగినట్లుగా భావన కలుగుతుంది.

**"నువు లేవు నీ పాట ఉంది"**

అలాగే మరో ఖండికలో ఇంటిముదరి ఉద్యానవనంలో చిన్ననాడు తాను అనుభవించిన ప్రేయసీ సమాగమానుభూతి యొక్క అతిదూరస్మృతి వేదన ఈ గేయంలో

వస్తువుగా స్వీకరిస్తూ ఇలా ప్రారంభిస్తాడు.

తిలక్ వచనా కవిత్వంలో మరీ మంచివాటిలో ఇదొకటి.....

**నువ్వు లేవు నీ పాట ఉంది. ఇంటి ముందు**
**జూకా మల్లితీగల్లో అల్లుకుని**
**లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని**
**నా గుండెల్లో చుట్టుకుని**
**గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో**
**దాక్కుని నిరవంగా నిజంగా వుంది**
**జాలిగా హాయిగా వినపడుతూ వుంది**

ఈ గీతంలో తన ప్రేయసితో ఇజాలు, రాజకీయలు, వాదాలు, హత్యలు, యుద్ధాలు ఇంకా ఇటువంటి చెత్త చెదారం మనస్సులో పేరుకొకముందే పండిన మొగలి పోత్తివంటి పరిమళంగల ప్రారంభ యవ్వనంలో నిండిన ఆరోగ్యపు వాకిళ్లముందు విసిరిన నందివర్ధనం పువ్వుల మధ్య నువ్వు నేను కూర్చొని అలాగే ఒకరినొకర్ని చూసుకుంటూ ఈ లోకంలోని బాధలన్నిటిని మరిచిపోదాం అంటారు.

వచన కవిత్వంలో శృంగార రసాన్ని అత్యంత ప్రతిభావంతంగా పోషించగలిగినవాడు తిలక్. అనుభూతుల అగాధ సీమల మీద పరిచిన అమొఘమైన హృదయ దీపం "నీవ్వు లేవు నీ పాట ఉంది".

చిన్ననాడు తన కౌగిలిలో పాడిన ప్రేయసి యొక్క అనుభూతి అతని హృదయంలో ఎలా స్పందించిందో ఈ ఖండిక తెలియజేస్తుంది. వారి సమాగమ సమయానికి వాతావరణంగా ఉన్న జూకామల్లె తీగలో, లాంతరు సన్నని వెలుగులో అతని గుండెలో ఆ పాట నిండిపోయింది.

ఆ సమయంలో ఆపాట, వాతావరణం, అతని గుండెంతా ఒకే అద్వైతి సముద్రంలో సంగమించిపోయింది. కాని యినాటికీ ఆ స్మృతి అనిర్వచనీయమైన వేదనా సహితమైంది. ఆ వేదనలో తియ్యతనం కరిగిపోయి ఉన్నది.

**ముగింపు :**

ఇలా తిలక్ అమృతం కురిసిన రాత్రి కవిత్వం సర్వంతో ముఖంగా ప్రకాశించింది. దీనిలో శృగారం, ప్రణయం మానవుని దైన్య విషాదాలు, సాంఘిక రాజకీయ పరిస్థితులు సమస్తం దానిలో వైవిధ్యంగా వర్ణింపబడ్డాయి.

వీటికి తోడు చక్కని చమత్కారం, హాస్యం, రాజకీయ చమత్కారాలు అందరిని అలరిస్తాయి. వీటన్నిటి సమ్మేళనమే తిలక్ కవిత్వం.

ఇలా ఈ అమృతం కురిసిన రాత్రిలో ప్రతి ఖండికలో ఎంచుకున్న వస్తువు, ఆ వస్తువు లోతులను, దర్శించిన తీరు, దాన్ని అభివ్యక్తికరించిన వైనం పాఠకులను కట్టిపడేస్తుంది. కనుకనే తెలుగు సాహిత్యంలో రోజు రోజుకు ఎన్నెన్ని వచన కవితా సంపుటాలు వెలువడుతున్న, నాటికి నేటికి వన్నె తగ్గక మరింత పరిమళామృతాలను వెదజల్లుతూ పాఠకలోకానికి ఆనంద డోలికలలో ముంచి తేలుతుంది. కనుకనే ఎన్ని సార్లు చదివిన అది నిత్య నూతనంగానే కనిపిస్తూ సాహితీలోకంలో స్థిరస్థాయిగా నిలిచింది.

మరొక మాటచెప్పి ముగిస్తాను. జాషువాకు గబ్బిలం, శ్రీశ్రీకి మహాప్రస్థానం, ఆరుద్రకు త్వమేవాహం, సోమసుందర్‌కు వజ్రాయుధం, రెంటాలకు సర్పయాగంలాగా ఆధునిక తెలుగు సాహిత్యంలో తిలక్‌కు ఈ అమృతం కురిసిన రాత్రి అలాంటి విశేషమైన కీర్తిని, విశిష్టమైన స్థానాన్ని కల్పించింది.

ఆధునిక యుగంలోని తిలక్ సాహిత్యంలో విభిన్న శైలులు కనిపిస్తాయి.

1. గురజాడ శైలి – ఈయనది మానవతావాద దృక్పథం. ఈ శైలికి రూపాన్ని ఇచ్చింది ముత్యాల సరాలు

2. విశ్వనాథ వారి శైలి – వీరిది రసదృష్టి, సంప్రదాయిక మార్గ ఛందస్సు

3. కృష్ణశాస్త్రి శైలి – భావకవిత దృక్పథం, తేటగీతులు

4. శ్రీశ్రీ శైలి – వాస్తవికత మార్గం – ఈ శైలికి రూపాన్ని తీర్చినవి మాత్రా ఛందస్సులు

ఈ నాలుగు సంప్రదాయాలు ఆధునిక కవిత్వంలో స్థిరపడి పోయాయి. వీరి దృక్పథాలు తేడా ఉన్నట్లే కవితా రూపాలలో తేడా ఉంటుంది. ఈ లక్షణాలు అన్నీ తిలక్‌లో దర్శనమిస్తాయి. కనుకనే ఈ అమృతం కురిసిన రాత్రి ఎన్నో విలక్షణమైన లక్షణాలతో ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానాన్ని పొంది ఉంది.

# 12. దేవరకొండ బాలగంగాధర తిలక్ సాహిత్యంపై పాశ్చాత్య ప్రభావం : ఒక విశ్లేషణ

– ఆచార్య పి.పద్మ

ఆధునికం (modern) అనగానే పాశ్చాత్య (Western) పదంగా గోచరించే అంతగా పాశ్చాత్య ప్రభావం ఇరవై శతాబ్దంలో భారతీయ సాహిత్యంపై పడింది. ఈ పదం సాహిత్యంతోపాటు జీవన విధానానికి కూడా వర్తిస్తుంది. ఆధునిక కవిత్వపు లక్షణాలు శతాబ్దాల మునుపే తెలుగు కవైన వేమన, హిందీ కవులైన కబీర్, గురునానక్ వంటి వారి పద్యాలలో కనిపించినప్పటికీ బ్రిటీష్‌వారి పరిపాలనా కాలంలో ఆ లక్షణాలు ఎక్కువగా సమాజంలోనూ, రచనలలోనూ ప్రాముఖ్యత పొంది ప్రచారంలోకి వచ్చింది. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, తిలక్ ఆధునిక ఆంధ్ర కవిత్వాన్ని మలుపు తిప్పిన నాయకులు. దేవరకొండ బాలగంగాధర్ తిలక్ (1921–1966) రాసిన భావ కవిత్వం (1935–1946) అభ్యుదయ కవిత్వం (1954–1966) ఆధునిక యుగంలో వచ్చినవి కావున తిలక్‌పైన ప్రాశ్చాత్వ ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలా పడిందో ఈ పత్రంలో క్లుప్తంగా పరిశీలింపబడినది. తిలక్ కథలు, నాటికలు, లేఖలు, లఘు వ్యాసాలు రచించినప్పటికీ తనకు బాగా పేరు తెచ్చిపెట్టినది, అతని మరణానంతరం సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన వచన కవితా సంపుటి అమృతం కురిసిన రాత్రి (1968). ప్రస్తుత పత్రంలో విశ్లేషించిన అంశాలు అందులోని కొన్ని కవితలపై కేంద్రీకృతమైనవి. బ్రిటీష్ పరిపాలనా సమయంలో భారతదేశంలో వచ్చిన మార్పులు, 20వ శతాబ్దంలో ప్రపంచంలో వచ్చిన మార్పులు తిలక్‌ని ఎలా ప్రభావితం చేశాయో, తిలక్ సాహిత్యంపై కన్పించిన ప్రాశ్చాత్యప్రభావం వివిధ రూపాలలో–పదాలు, పదబంధాలు(Words and phrases), స్వీకరణ(adoption), ప్రభావం (influence). అనుకరణ (imitation), అనువాదం (translation and trans-creation), చివరగా (inter-textuality) కనిపించేవి వాటిని ఈ పత్రంలో క్లుప్తంగా విశ్లేషించబడినది.

* * *

The influx of new ideas and concepts form the West infused fresh life into our literature and set it on a new path to progress. The changes brought by the influence from the West was indeed phenomenal, both in variety and output. The earliest literature in Telugu was grand in theme, universal in its appeal, and at the same time true to human nature. But the literature that came into existence from the time of Srinatha, and especially the works written during the 16th, 17th and 18th centuries were of a stereotyped nature both in content and form….. catering mostly to the erotic nature of the people of the court.

(Prof. G.N. Reddy, unpublished thesis from S.V. University, (A.P.)

ప్రపంచం నలుమూలల బ్రిటీష్ వాళ్ళు కాలనీలు ఏర్పరుచుకుని 'సూర్యుడు అస్తమించ'ని రాజ్యంలా విస్తరించినప్పుడు, భారతదేశం వారికి పెద్ద కాలనీగా నిలిచింది. సూమారుగా 400 సంవత్సరాలు బ్రిటీష్ వాళ్ళు భారతీయులతో జీవించినప్పుడు, మనచరిత్ర వాళ్ళ చరిత్రతో ముడిపడి ఉన్నప్పుడు మన సాహిత్యం వారి సంస్కృతి, సాహిత్యంతో మాత్రం ప్రభావితం కాకుండా ఎలా ఉండగలదు?! ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపార నిమిత్తం భారతదేశానికి వచ్చినప్పుడు పరిస్థితులు వేరు, భారతీయులు స్వతంత్ర పోరాటం బ్రిటీష్ వారితో చేయవలసి వచ్చినప్పుడు వేరు. ఈ మధ్యకాలంలో బ్రిటీష్ వారితో భారతీయుల సాహిత్య సంబంధం దశలవారీగా సాగింది. వారి పరిచయం మొదటిగా వ్యాపారం ప్రారంభించిన దశలో పదాలను అర్థం చేసుకోవాలన్న ప్రయత్నంతో మొదలైంది. తర్వాత దశలో వ్యాపారవిస్తరణ కోసం వినియోగదారుల గురించి తెలుసుకోవాలన్న పట్టుదలతో భారతదేశంలోని రాజ్యాల గురించి, రాజుల గురించి, పంటలు, ప్రజలు, వాతావరణంలాంటి వివరాలు సేకరించారు, విశ్లేషించారు, మ్యాపింగ్ చేశారు. వీటితోపాటు మన సంస్కృ తిని కూడా తెలుసుకుని భారతీయులకు దగ్గర అవ్వాలని ఆశించి కృషి చేశారు ఆనాటి ఓరియంటలిస్ట్లు.

**బ్రిటీషు వారి పరిపాలనా సమయంలో విద్యాసంస్థలు**

1781లో కలకత్తాలో మదరస ఆరబిక్, పర్షియన్ నేర్చుకొని, ఇస్లామిక్ చట్టం

ప్రోత్సహించడం, 1791లో బెనారస్ యూనివర్శిటీ ప్రాచీన సంస్కృతంలో రచించినవి చదివి పరిపాలనకు ఉపయోగించడం ప్రారంభించారు. 1820లో మదరాసులో థామస్ మన్రో గవర్నర్‌గా ఆంగ్లేయ అధికారులకు స్థానికభాషలను అభ్యసించాలని ఆదేశించారు. ఇది పరిపాలన సులభతరం చేస్తుందని అభిప్రాయ పడ్డారు. తెలుగు భాషా ఓరియంటలిస్ట్‌గా చార్లెస్ ఫిలిప్ బ్రౌన్‌ని పేర్కొనవచ్చు. బ్రౌను మూలనపడ్డ తెలుగు సాహిత్యాన్ని (వేమన పద్యాలు మొదలగునవి) సేకరించాడు, అనువదించాడు. తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు కూడా రాసి, ఇంగ్లీష్ నేర్చుకోవడానికి తెలుగువారికి సహాయపడ్డాడు. ఆయన ప్రభావం తెలుగు సాహిత్యంపైన పడింది. తిలక్ వేమనలాగే సామాజికస్పృహతో కవిత్వం రాశాడు. సంఘంలోని మూఢనమ్మకాలను దురాచారాలను ఖండించాడు.

ఓరియన్‌టలిస్టుల విధానాన్ని ప్రతిఘటిస్తూ ఆంగ్లిసిట్సు ఆంగ్లభాషలో ఆంగ్ల సాహిత్యం సంస్కృతి బోధించాలని, అది ఆంగ్లేయుల ఆధిపత్యం పెంచడానికి, పాలనా కార్యక్రమాలకు ఉపయుక్తంగా ఉంటుందని భావించారు. 1835లో అప్పటి గవర్నర్ జనరల్ విలియమ్ బెనడిక్ విద్యా ఆక్ట్ జారీ చేశాడు. 1840లో మదరాస్‌లో ప్రెసిడెన్సీ కాలేజి ప్రారంభించారు. “వైట్‌మాన్ బర్డన్” అనే ఆశయంతో నాగరికతను మతం, సాహిత్యం ద్వారా మార్చడానికి యత్నం చేశారు. బ్రిటిష్ మిషనరీస్ చర్చిలతో పాటు, పలు పాఠశాలలు నెలకొల్పారు.

**తిలక్ విద్యాభ్యాసం**

దేవరకొండ బాల గంగాధర తిలక్ పశ్చిమగోదావరిజిల్లాలో 1921లో జన్మించారు. అప్పటికి భారతదేశం బ్రిటీష్‌వారి పరిపాలనలో ఉంటూ, భారతీయులు స్వతంత్ర పోరాటం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1966 వరకు తిలక్ జీవించియున్నాడు. మచిలీపట్నం, రాజమండ్రి, యానం, విశాఖపట్టణాలలో ఓడరేవులు ఉండడంవల్ల బ్రిటీష్ వారి స్థావరాలు అక్కడ కేంద్రీకృతమై ఉండేవి. ఇవి తిలక్‌కి అందుబాటులో ఉండడంవల్ల, ఆంగ్లభాష, వారి సాహిత్యం అతనికి అందుబాటులో ఉండేవి. ఇంటర్ చదవటానికి మదరాసులోని లయోలా కాలేజికి వెళ్ళినప్పుడు కూడా మదరాసులోని ప్రెసిడెన్సీ కాలేజీ ముద్రించిన పుస్తకాలు ఆనాటి అధ్యాపకుల ద్వారా, గ్రంథాలయాలలో తిలక్‌కు పరిచయం అయ్యాయి. ఇంటర్‌పూర్తి కాకుండానే విశాఖపట్టణానికి వచ్చాడు తిలక్. డిగ్రీలు సంపాదించకపోయినా జీవితాన్ని బాగా చదివాడు. ఆంగ్లభాషను ఆంగ్లసాహిత్యాన్ని, చరిత్రను బాగా చదివాడు.

"The difference between the present and the past is that the conscious Present is an awareness of the past in a way and to an extent which the Past's awareness of itself cannot show."

- T.S. Eliot, Tradition and the Individual Talent: An Essay

ఈయన హంసలాగా తనకు కావలసినవి కొత్త, పాత అని చూడకుండా స్వీకరించాడు, తన కవిత్వంలో వీటిని కలపోసి వాడాడు.

### తిలక్ సాహిత్యంలో దశలు

తిలక్ టీనేజ్ లో రాసిన కవితలు లయాత్మకంగా ఛందోబద్ధమైన గోరువంకలు పేరుతో ఉన్నాయి. తరువాత ప్రజలకు చేరువయ్యే విధంగా వచన కవిత్వం రాసాడు తిలక్,. తెలుగులో ఆటవెలదిలో వేమన వచన కవిత్వం రాసినా, హిందీ లో కబీర్, నానక్ రాసినా , కవిత్వం అంటే ఛందోబద్ధమైనదనే అభిప్రాయం మారలేదు. కాని తిలక్ రాసిన తరువాత వచన కవిత్వానికి గుర్తింపు వచ్చింది. ఈయన మొదటి దశలో 1935 నుండి 1946 వరకు భావ కవిత్వం రాశాడు. రెండవ దశలో 1954 నుండి 1966 వరకు అభ్యుదయ కవిత్వం రాశాడు. 'All India Progressive Writers Association' (1944) బాంబేలో జరిగినప్పుడు, ఒక తెలుగు కవిగా హాజరయ్యాడు తిలక్. అప్పటి నుండి తిలక్ దృక్పథం మారింది. భావకవిత్వం కాకుండా అభ్యుదయ కవిత్వం రాయడం మొదలుపెట్టాడు.

### సాహిత్య క్లబ్బులు

సాహిత్య క్లబ్బులు 18 వ శతాబ్దం నుండి స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్ మొదలైన ఐరోపా దేశాలలో ప్రారంభమయ్యాయి. అక్కడ రచయితలు, విమర్శకుల చేరి సాహిత్య గోష్టి చేసేవారు. బ్రిటన్‌లో 'శ్యామ్యుల్ జాన్సన్ లిటరరీ క్లబ్'గా పేరుగాంచినది. అలాగనే ఇక్కడ కూడా బాల గంగాధర తిలక్ సాహిత్యసరోవరం, శతపత్ర బృందావనం, కాళాసమితి లలో పాల్గొనేవాడు. 1958 లో కళాసమితి కి ప్రధాన కార్యదర్శిగా ఉండేవాడు. తిలక్ చాల మంది కవులు, పండితులు, రచయుతలతో స్నేహంగా ఉండేవాడు, వారితో సాహిత్య చర్చలు చేసేవాడు.

### రచయితలు, ఉద్యమనాయకుల ప్రభావం

Karl Marx, Lenin, Nehru, Jaya Prakash Narayan, Roy రచనలు చదివినట్లు లేఖల ద్వారా తెలుస్తుంది. అప్పట్లో హిందీ, తెలుగు, ఇంగ్లీష్ సినిమాలు

బాగా చూసేవాడు, ఆ భాషలోని పాటలు వినేవాడు. మన ఉత్తర భారతదేశంలోని రచయితలో శరత్ చంద్రునితో ప్రభావితం అయినట్లుగా తనే పేర్కొన్నాడు. ఆనాటి సోషలిస్టు నాయకుడు రామారావు, కమ్యూనిస్టు నాయకుడు వంకా సత్యనారాయణ తిలక్‌గారి మిత్రులని, వాళ్లు అడిగినప్పుడు విరాళాలు ఇచ్చేవాడే తప్ప, వారిలా తీవ్రవాది కావటం అతనికి ఇష్టంలేదు. భారతదేశంపై అతని దృక్పథం ఆరోగ్యకరంగా ఉండేది.

భారతదేశాన్ని కాదనలేను
రష్యాను కొలవ లేను (కవి వాక్కు)

"వస్తువు లేక భావం అభ్యుదయం, అభివ్యక్తి భావ కవిత్వం, తిలక్ భావాభ్యుదయ కవి. అందువల్ల కృష్ణశాస్త్రి + శ్రీశ్రీ = తిలక్ అని చెప్పవచ్చును" అన్నాడు తంగిరాల వెంకట సుబ్బారావు.

విశ్వనాథను, కృష్ణశాస్త్రిని, శ్రీశ్రీని త్రిమూర్తులుగా భావించి ప్రశంసించినా, తనకు కనిపించిన లోపాలను ఎత్తి చూపాడు.

నా కవిత్వం కాదొక తత్వం
మరికాదు మీరనే మనస్తత్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం
కాదయ్యా అయోమయం, జరామయం..... (నా కవిత్వం)

అంటూ తన కవిత్వ తత్వాన్ని తానే నిర్వచించుకున్నాడు.

## ఇరవైయవ శతాబ్దంలో ఐరోపా ఖండ పరిస్థితులు : తిలక్‌పైన ప్రభావం

### యంత్రయుగం

పంతొమ్మిదవ శతాబ్దం నుంచి ఐరోపా ఖండంలో చాలా మార్పులు వచ్చాయి. వ్యవసాయ జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు మారుతూవచ్చాయి. యంత్రయుగంలో పట్టణాలు పెరిగాయి. పెద్దమిద్దెలు, వాటి పక్కనే మురికి వాడలు, ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అన్న వ్యత్యాసం బాగా కనిపించసాగింది. వ్యాపారం, పరిశ్రమలు మరియు వాణిజ్యీకరణతో మనుషులపై కంటే డబ్బులపై మక్కువ పెరిగింది. అమానవీయమైన వాణిజ్య చట్టాలు ఆలోచనతీరును మార్చాయి. రినైజన్స్ సూత్రాలైన వ్యక్తివాదం, మానవతావాదం, ఉదారవాదాలను జనం మరిచారు.

### ప్రపంచ సాహిత్యంపై డార్విన్, ఫ్రాయిడ్ ప్రభావం

పాశ్యాత్య దేశాలలో మత సంస్కరణ ప్రభావం సమాజంలో తగ్గింది. డార్విన్

రచించిన ఆరిజన్ ఆఫ్ స్పీసీస్ వెలువడిన తరువాత శాస్త్రీయాత్మకమైన ఆలోచనలు, హేతువాదం, సంశయవాదం, అజ్ఞేయవాదం, దేవునిపై నమ్మకం అలాంటి విషయాలలో మార్పులు వచ్చాయి. సిగ్మండ్ ఫ్రాయిడ్ కనుగొన్న 'అపస్మారక స్థితి' మానవ ప్రవర్తనకు కొత్త కోణం జోడించింది. ఫ్రాయిడ్‌కి మానవుడు జీవదృగ్విషయం, ప్రవృత్తులు కలిగిన ప్రేరణా జీవి. మార్క్సిస్టులకు మనిషి ఆర్థిక మరియు సామాజిక శక్తుల ఫలితం. విక్టోరియన్ కాలంలో హేతువాదం తరిగి మనిషిలో మానవత్యం మీద పెంచుకున్న అపార నమ్మకం చెదిరింది. మనిషి తను చేసే పనులకు తానే బాధ్యత వహించడం అన్న ఆలోచన మారింది. దానితో నేరాలు, అక్రమాలు, వక్ర ఆలోచనలు పెరిగాయి.

**కుటుంబ సంబంధాలు, జీవనశైలి**

కుటుంబ సంబంధాలలో పాత అధికార నమూనా మారింది. లింగధారిక నియమాలు, సాపేక్ష పాత్రల అంచనా మారాయి. మగ ఆధిపత్యం గొప్ప దెబ్బను ఎదుర్కొంది. తరానికి తరానికి మధ్య తేడా పెరిగింది. తల్లిదండ్రుల పిల్లల సంబంధం పున:నిర్మాణం చేసుకోవలసి వచ్చింది. రైలు, బస్సుతో మానవుని సంచారం పెరిగింది. అదే ఊరిలో కొనసాగడం అన్న పరిస్థితి మారింది. ఆదర్శాలు, విలువలు మారాయి. పారిశ్రామీకరణ, శాస్త్రీయ ఆవిష్కరణలు జీవితాన్ని సులభతరం చేశాయి గాని మనసుపై అలజడిని పెంచాయి. ఒంటరితనం, అసహనం మనిషిని నిస్సహాయకుణ్ణి చేశాయి. జీవనశైలి, నమ్మకాలలో మార్పులు వచ్చాయి. జాతీయవాదం, అంతర్జాతీయవాదం మధ్య సంఘర్షణ పెరిగింది. బ్రిటీష్ వాళ్ళు మూడవ వంతు ప్రపంచాన్ని పరిపాలిస్తూ సామ్రాజ్యవాదం పెంచారు. ఈ పరిస్థితులన్నీ తిలక్ కవిత్వంలో చక్కగా కన్పిస్తాయి.

సంఘ పరిస్థితులు అనుగుణంగా, ఆంగ్ల సాహిత్యంలో 'ఇజమ్స్' వచ్చాయి. రియలిజమ్, న్యాచురలిజమ్, సోషల్ రియలిజమ్, మ్యాజిక్ రియలిజమ్, సింబాలిజమ్, ఇమాజిజమ్, రొమాంటిసిజమ్, ట్రాన్స్‌సెన్డెంటలిజమ్, మోడ్రనిజమ్, ఎక్స్‌ప్రెషనలిజమ్, సర్రియలిజమ్, అబ్జార్డిజమ్. ఇవి భారత సాహిత్యాన్ని ప్రభావితం చేసాయి.

కవిత్వం ముందు రస ప్రదాయంలో ఉండేది. ఆధునిక యుగంలో భావ ప్రధానంగా వచ్చింది. ఇది సామాన్యుడి జీవితంను ప్రతిబింబించేది. కాబట్టి ప్రఖ్యాతి గాంచింది. తిలక్ వచనకవిత్వంలో నవరసాలను పలికించ గలిగాడు. అందులోనూ కరుణా రసం ఎక్కువపాళ్లలో ఉంది. ఆర్తనాదంలో హృదయవిదారకంగా ఉన్న సమకాలీన దేశ పరిస్థితులను కనుల ముందు కట్టినట్లుగా రాశారు. ప్రపంచంలో

బయట కనిపించే ఆకలి, స్వార్థం, అమాయకత్వం, మోసం, రాజకీయం ఒక ఎత్తైతే, బాధపడే వారి స్థానంలోకి తనను పెట్టుకొని అంతటి బాధను తన లోపల అనుభవించి కవిత్వం ద్వారా వ్యక్తపరచి అదే భావోద్వేగం పాఠకులను అనుభూతివాదంతో తీసుకు వచ్చాడు.

**ప్రపంచ యుద్ధాలు, తిలక్ కవిత్వం**

రెండు పెద్ద ప్రపంచయుద్ధాలతో మనుషులు విసుగెత్తి పోయారు. మనిషికి మానవుని ఆలోచనా శక్తిపైన, విచక్షణా శక్తిపైన, శాస్త్రీయ ఉపయోగాలపైన నమ్మకం చెదిరింది. రక్తపాతం భయభ్రాంతులను సృష్టించింది. ప్రపంచం అంతా ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంది, ముఖ్యంగా ఐరోపా ఖండంలోని దేశాలు బాగా ఇబ్బంది పడ్డాయి. ఈ పరిస్థితులకు ఆధునిక కవిత్వం అద్దం పట్టింది. రైలు, ఓడలు, విమనాలు కనిపెట్టి పరుగెడుతున్న మానవుని మేధాశక్తిని చూసి అబ్బురపడి కవిత్వం రాసే కాలం (Stephen Spendour's The Express) రెండు ప్రపంచ యుద్ధాలలోని రక్తపాతంతో మానవుడిలోని విధ్వంసాల కోణం చూసి భయభ్రాంతులై War poets Wilfred Owen, Robert Graves, Siegfried Sassoonలు వాళ్ళ చేదు అనుభవాలను కవిత్వంలో పెట్టారు. తిలక్ కూడ మానవ జీవితంపై యుద్ధ ప్రభావం చూపెడుతూ కవిత్వం రాశారు. ఉదాహరణకు అమ్మ నాన్న ఎక్కడికి వెళ్ళాడు, యుద్ధంలో రేవు పట్టణం, ఖాళీ చేసిన, సైనికుడి ఉత్తరం, టూటాన్, న్యూసిలబస్, ఈ రాత్రి, పిలుపు, భూలోకం మొదలైన కవితలలో ఈ యుద్ధ ధ్వని వినిపిస్తుంది.

**దేశభక్తి, జాతీయవాదం**

NewYorkలో Harlem Renaissance (1918–37)తో అమెరికాలోని నల్లజాతివారి సంగీతం, సాహిత్యం, సంస్కృతి ముందుకువచ్చాయి. తెల్లవారి విలువలకు ఆనకట్టకడుతూ 1940–1950లోని Civil Rights Movements కి దారి తీసింది, నల్లజాతివారికి ఎన్నడూలేని గుర్తింపు తెచ్చుకున్నారు. బ్రిటన్ కవులవలె, అమెరికాలో కవులు వాళ్ళ, వాతావరణం, జీవన విధానం, ప్రజాస్వామ్య సూత్రాలు, ప్రపంచానికి తెలుపుతూ Robert Frost, Walt Whitman, Emerson, Thorou వంటి రచయితలు రచనలు చేశారు. John Millington Synge, W.B Yeats Ireland భాష folk tales, ballads, legends లలో వారి చరిత్రతో, జాతి గర్వించే రచనలు చేశారు. ఇలా ప్రపంచం నలుమూలలనుండి, మానవ విలువలను తెలిపే కవిత్వం

వచ్చింది. తిలక్ భారతదేశంలో ప్రజలు మేలు కోవాలని ఆశించాడు. భారతీయులు అంత చైతన్యంగా లేరని 'అమృతం కురిసిన రాత్రి'లో "అనంత చైతనోత్సవాహ్వానాన్ని వినిపించుకోలేక పోయారు" అని రాశాడు. 'నీడలు' లో కూడా ఇదే విధంగా "బరువుగా బెదురుగా బతుకుతున్న వీళ్ళమధ్య/డైనమైట్ పేలాలి" అని తిలక్ రాశాడు. తనకాలంలో Nationalism, Patriotism కవిత్వంలో మారుమ్రోగుతుంటే Cosmopolitanism అని సరిహద్దులు చెరిపివేస్తూ మానవత్వంతో తన కవిత్వాన్ని చెప్పాడు కవి తిలక్. ఇంతటి విశాల దృక్పథం తిలక్ కవిత్వంలోను గురజాడ గారి కవిత్వం (దేశమును ప్రేమించు మన్నా...) లోను కనిపిస్తుంది. బ్రిటిష్ వారి కవిత్వంలో జాతీయవాదమే ఎక్కువగా కనిపిస్తుంది.

తిలక్ గారి తండ్రి, ఆనాటి భారత స్వతంత్ర పోరాట యోధులలో ఒక ముఖ్యుడైన బాలగంగాధర తిలక్ గారి పేరు తిలక్‌కు పెట్టుకున్నారు. దేశం గురించి, దేశ ప్రజలను మేల్కొలపటానికి ఆరాటపడటం అతని కవిత్వంలో బాగా కనిపిస్తుంది. అప్పుడు బ్రిటిష్ కాలనీలలో ప్రపంచంలో స్వతంత్ర పోరాటానికి సాహిత్యాన్ని బాగా ఉపయోగించారు. భారత దేశంలో సంఘంలోని దురాచారాలను ఖండించడానికి కూడ ఆ సమయములో వాడారు.

నోబెల్ బహుమతి పొందిన బెంగాల్ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలతో తిలక్ ప్రభావితుడు అయ్యాడు. గీతాంజలిలోని 35వ ఖండికను అనుసరిస్తూ ప్రార్థన రాశాడు. దేవుడిని, తనదేశం ఎలా ఉంటే బాగుంటుందనిపించిందో అలా కావాలని ప్రార్థించాడు. ఈ పద్యంలో తిలక్‌లో ఉన్న దేశభక్తి కనిపిస్తుంది.

Where the mind is without fear and the
Head is held high
Where knowledge is free
Where the world has not been broken up
Into fragments
By narrow domestic walls…..
Where the mind is led forward by thee
Into ever-widening thought and action
Into that heaven of freedom, my father let my County awake!

దేవుడా
రక్షించు నాదేశాన్ని
పవిత్రుల నుండి పతివ్రతలనుండి
......
కొంచెం పుణ్యం కించిత్ పాపం
కాస్త కన్నీరూ మరికాస్త సంతోషపు తేనీరూ
చాలు మాకుతండ్రీ
.....
సరదాగా నిజాయితీగా జాలీ జాలీగా
హాయి హాయిగా బ్రతుకుతాం
మాకు నటనలు వద్దు, మా చుట్టూ కటకటాలు వద్దు,
ఆదమరచి కాసేపు విశ్రమంచటానికి కనుమతించు తండ్రీ! (ప్రార్థన)

**Bengal Renaissance**

కలకత్తాలో 1778 నాటికి రెండు ప్రింటింగ్ ప్రెస్సులు అనువాద పుస్తకాలు, ఇంగ్లీష్ వ్యాకరణం, నిఘంటువులను ఎక్కువగా ముద్రించారు. 1779లో Hicky అని ఒక Irishman Hicky's Bengal Gazette అని ఆంగ్ల భాషలో దినప్రతిక మొదలు పెట్టినప్పుడు ప్రతి రోజూ వస్తున్న ఆంగ్లవారి జీవన విధానం, పద్ధతులతో బెంగాలీ యువకులతో పాటు భారత దేశంలో అనేకమంది ప్రభావితం అయ్యారు. ఎక్కువ మంది పేరుగాంచిన బెంగాలీ కుటుంబాల నుంచి వచ్చినవారు కాబట్టి వారి నోటి నుండి వచ్చిన మాటలు సామాన్యుడిని కూడా ప్రభావితం చేశాయి. జె.సి.ఘూస్ (ఇతడు Oxford లో చదివిన మొదటి వ్యక్తి) బ్రిటిష్ వారి నాగరికత గొప్పదని భావించాడు. మరి బెంగాలీ సాహిత్యంలో మానవత లోపించిందని, ఆంగ్ల సాహిత్యం వైపు మళ్ళాడు.

ప్రఖ్యాత Kenyan రచయిత గూగి ఇలా అన్నారు:

A is sitting on B ......what kind of education will A want B to set? In otherwords, education what kind of culture and consciousness? 'A' will want 'B' to believe that he, B has no culture or his culture is inferior. 'A' will want 'B' to imbibe a culture which inculcates in his

values self-doubt and self-denigration, in a word a slave consciousness. He will now look up to A, a superior culture.

కలకత్తాలోని Fort William కాలేజి లోని అధ్యాపకులు పశ్చిమ సాహిత్యాలతో ప్రభావితం అయిన వారు. వీరి రచనలు మిగతా భారతీయులకు రోల్ మాడల్స్ అయ్యాయి. కాని వీరి నమ్మకాలను ప్రతి ఘటిస్తూ కొందరు రాయటం మొదలుపెట్టారు. ఈ తూర్పు-పడమర కలయిక సాహిత్యంలో క్లిష్ట పరిస్థితిగా మారింది. ఆత్మ పరిశీలనా కాలం మొదలైనది. ఈ తరుణంలో వచ్చిన సాహిత్యం పలు రూపాలు దాల్చింది. పశ్చిమ ప్రభావంతో కథానికలు, వ్యాసాలు, జీవిత చరిత్రలు, స్వీయచరిత్రలు లాంటి క్రొత్త ప్రక్రియలు వచ్చాయి. తిలక్ తన సాహిత్య నైపుణ్యాన్ని ఈ ప్రక్రియల ద్వారా ప్రదర్శించాడు.

ఇప్పటి వరకు పాశ్చాత్య, దేశ పరిస్థితుల ప్రభావం పరోక్షంగా తిలక్ జీవితంపైన, రచనలపైన ఎలా పడిందో గమనించాము. ఇప్పుడు పలు రూపాలలో నేరుగా బ్రిటిష్ వారి ప్రభావం తిలక్ సాహిత్యంపై ఎలా పడిందో క్లుప్తంగా గమనించాల్సి ఉంది.

**పదాలు - పదబంధాలు (Words and phrases)**

తిలక్ తన సమకాలికులలాగే ఆంగ్ల పదాలను, పదబంధాలను ఎక్కువగానే వాడాడు. భావకవిత్వంలో సంస్కృతపదాలు ఎక్కువగా ఉంటే, అభ్యుదయ కవిత్వంలో ఆంగ్ల పదాలు ఎక్కువగా ఉన్నాయి. అవి చరిత్ర, గణిత శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, యుద్ధం, మిలటరీ మొదలగు వాటి నుండి విరివిగా స్వీకరించాడు. కొన్ని కవితలకు టైటిల్స్‌కూడా ఆంగ్లభాషలో పెట్టాడు. ఉదాహరణకు మేగ్నకార్టా, టులాన్, ప్లస్ యింటూ మైనస్ , మైనస్ యింటూ ప్లస్, కాస్మోపొలిటనిజమ్ ఆంగ్ల పదబంధాలు తిలక్ అభ్యుదయ కవిత్వంలో శీర్షికలయ్యాయి. ఉదాహరణకు మిజరబుల్ పెయిల్యూర్ (కాస్మోపొలిటనిజమ్), నో కాజువాలిటీస్ (ఖాళీ చేసీన.....) అల్టిమేటమ్ సబ్జెక్ట్ (నా కవిత్వం) వంటివి కవిత్వంలో చాలా ఉన్నాయి.

భారతదేశానికి మొదటిగా పోర్చుగీసు వచ్చినప్పుడు వారి పదాల కొన్ని-వేలం, మోస్తరు, బటువ, అనాస వంటివి వచ్చాయి. వారు అంత దగ్గరగా ప్రజలచెంతకు వచ్చినట్లు లేరు. కాబట్టి డచ్ వారి పదాలు చాల తక్కువగా తెలుగులో ఉన్నాయి. వారి కంటే తరవాత వచ్చిన ఫ్రెంచ్ వారి పదాలు ఎక్కువగానే ఉన్నాయి. కాని వీరందరి కంటే ఎక్కువ బ్రిటిష్ వారి భాష నుండే వచ్చాయి. ఆంగ్లం నేర్చుకోవడం

అప్పుడు ఫ్యాషన్, నాగరికతతో ముడిపడినది కావున గౌరవం వస్తుందని కవులు కూడా నేర్చుకొని ఉపయోగించడానికి ప్రయత్నించారు. వారిలో ఎక్కువమంది అభ్యుదయ కవులు. పట్టాభి గారు తనకు ఆంగ్ల పదాలు వాడాలన్న కోరిక గట్టిగా వుందని తన కవిత్వంలో చెప్పుకున్నాడు. తిలక్ కూడా భావ కవిత్వంలో సంస్కృత పదాలను, అభ్యుదయ కవిత్వంలో ఆంగ్ల పదాలను ఎక్కువగా వాడాడు.

బ్రిటిష్ వారి పరిపాలన సమయంలో వారి ప్రభావంతో వాడుకలోకి వచ్చిన పదాలను అలాగే వాడుకోగలిగాడు. ఆ పదాలను తెలుగులోకి అనువదించాలన్న సాహసం చేయలేదు తిలక్. ఎందుకంటే చాలామందికి కొన్నిపదాలు ఆంగ్లంలోనే తెలుసుగాని, తెలుగులో తెలియదు. ఆ పదాలు వాటి అర్థాలు, ఒక వేళ అనువదించినా సామాన్యులకు అర్థం చేసుకోవటం కష్టం. ఉదాహరణకు, టికెట్, లైటు, స్టేషన్, లైట్ హౌస్, ప్లాట్‌ఫారం – ఇలాంటివి అలాగే వాడారు. నామవాచకాలు అనగా నదులు, కొండలు, దేశాలు, ఖండాలు, ఊర్లు, మనుషుల పేర్లు. ఎక్కువ ఇంగ్లీషులోనే వాడాడు. ఆల్ప్స్, సైబీరియా, అంటార్కిటిక్, ఆస్ట్రేలియన్ స్టెప్పీలు (మంచు) ఎక్కువగా వాడతాడు. కొన్నిసార్లు దీర్ఘ పదబందాలు వాడాడు. ఉదాహరణకు : ప్రిన్స్ ఛార్మింగ్ డార్లింగ్ ఆఫ్ ది మిలియన్స్ (నెహ్రు), స్నో, పాగ్‌సెలెంట్ సార్, వెరీ అర్జంట్, హార్ట్ అటాక్, సీక్రట్, టెన్నిక్ – ఇలా ఆంగ్ల శబ్దాలు కవిత్వంలో ఎక్కువగా ఉన్నాయి. మై డియర్ సుబ్బారావు అని మొదలు పెడతాడు బంట్రోతు కవితలో. అలాగే హలో! హలో! అని మొదలు పెట్టాడు. యుద్ధపదాలను అలాగే వాడాడు – డైనమైట్, సోల్జర్, గన్, ఫిరంగ్ – సామాన్యంగా వాడే పదాలివి. బేస్, సిన్సీయారిటీ (కొన కళ్ళకు అక్షరాంజలి). అల్టిమేట్ సబ్జెక్టివ్ (నా కవిత్వంలో నేను దొరుకుతాను) ఆల్కెమీ, అబ్స్‌కూరిటి, ట్రాన్స్‌పరెంట్, ప్రొసైక్, పొయెట్రీ (నవత–కవిత). కొన్ని పదాలు యద్ధ భయం కలిగించేవైతే, కొన్ని పదాలు సులభంగా అర్థం కావటానికైతే, కొన్ని వ్యంగ్యంగా మరికొన్ని హాస్యానికి, లయ తేవడానికి వాడాడు తిలక్. ఉదాహరణకు, అమెరికాలో డాలర్లు పండును / ఇండియాలో సంతానం పండును (న్యూసిలబస్). లయ, అర్థం రెండు నింపి కొత్తగా అనిపిస్తూ పాఠకులను మురిపించ గలిగాడు పాఠకులను. ఉదాహరణకు "ఇజంలో యింప్రిజన్ అయితే యింగిత జ్ఞానం నశిస్తుంది. ప్రిజమ్ లాంటి జీవితం, వేర్వేరు కోణాలను ప్రదర్శిస్తుంది" (నవత – కవిత).

తెలుగు–ఇంగ్లీష్ పదాలను, పదబంధాలను విచిత్రంగా కలబోసి చమత్కారంగా, వ్యంగ్యంగా ప్రయోగించాడు. హాస్యానికి, లయబద్ధంగా, ఆలోచనలని కలిగించే వింత

కలయికలతో, మరిచిపోని విధంగా, వివిధరంగాలనుండి తెచ్చిన, బాగా వాడుకలో నిత్యం వాడే పదాలను ఇలా ఇంగ్లీష్ పదాలతో కలిపి కవితలు రాసే శ్రీశ్రీ, పట్టాభి లాంటి ఆధునిక కవులలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నాడు తిలక్.

**స్వీకరణ (adoption)**

ఇంగ్లాండులో Victorian period లో Alfred Lord Tennyson మరియు Browning రాసిన Dramatic Monologues ప్రఖ్యాతిగాంచాయి. ఈ కవితల్లో నాటకాలలో లాగా పాత్రలు ఉంటాయి, క్లిష్ట పరిస్థితులలో ఒక ముఖ్యమైన పాత్ర మాట్లాడుతుంది. మిగతావాళ్ళు మాట్లాడకుండా వింటూ ఉంటారు. ఈకోవలో Tennyson రాసిన Ulysses (1833) ప్రఖ్యాతి గాంచినది. Homer రాసిన Iiad and Odyssey (8th century B.C.) నుండి ఈ ప్రఖ్యాత ఖశ్రీఎంంవం పాత్రను తీసుకొని ఆ పాత్రకు Vicotorian spirit అంటే అంతులేని జ్ఞానాన్ని ప్రసాదించాలని, ఏవైనా కనుగొనాలనే తపనలతో నింపి చిత్రీకరించాడు Tennyson. ఈ కవితలో Trojan War తరువాత ఇరవై ఏళ్ళకు తన ఇథేకా రాజ్యానికి తిరిగి వచ్చాడు Ulysses. కొత్త దేశాలను కనుగొనడానికి తిరిగి వెళ్ళాలని నిర్ణయించుకొని, తన కొడుకైన Telemachus ని రాజుగా పెడతానని తన ప్రజలతో Ulysses మట్లాడే సందర్భంలోనిది.

ఈ పద్ధతిలో నీడలు అనే కవితలో చిన్నమ్మతో మాట్లాడతాడు. తిలక్.

చిన్నమ్మా
వీళ్ళమీద కోపగించకు
వీళ్ళ నసహ్యించుకోకు.....
..................
వీళ్లందరూ సగం సగం మనుష్యులు
మరోసగం మరుగునపడిన భయస్థులు బాధాగ్రస్తులు....
.................
చిన్నమ్మా
నేను వెళ్ళొస్తాను
చీకటి పడుతోంది.....
................
చేతిలో దీపంలేదు, ధైర్యమే ఒక కవచం

చావులేనిపాట కవితలో అన్నతో మాట్లాడుతున్నట్లుగా రాశాడు తిలక్. ఇది కూడా డ్రమటిక్ మోనోలాగే. నాటకాలలో Soliloquy వేరు, అదికూడా పొడవుగానే ఉంటుంది. కానీ అందులో ఇతర పాత్రలు ఎవరూ లేనప్పుడు, ఒక ముఖ్యపాత్ర తన మనసులోనిది, ప్రేక్షకులకు అర్థం కావడానికి మాట్లాడేది. మయసభలో దుర్యోధనునికి ఏక పాత్రాభినయం లాగా అన్న మాట. కానీ తిలక్ రాసిన యిడిపస్, నీడలు, చావులేనిపాట వంటి కవితలు ఈ కోవలోకి రావు. ఇందులో పాత్ర లేదా పాత్రలు ఉంటాయి.

సి.ఐ.డి రిపోర్టు
అయినాపురం కోటేశ్వరరావు
ఆకాలంలో కాలధర్మం చెందడంలో
అంత రహస్యంగాని, కుట్రగాని, శత్రు ప్రయోగంగాని లేవని
రూఢిగా తెలివస్తోంది పరిశోధనల ఫలితంగా .....
...........
రాజకీయ సాహిత్య, సాంఘిక సంస్థలలో దేనికీ సభ్యుడు కాడు
ఎన్నికలలో వోటుపై ఆఫీస రెవరికిమ్మంటే వారికిస్తాడు
ప్రతి శనివారం దేవుడు పటాన్ని పూజిస్తాడు, పటికబెల్లం ప్రసాదం తింటాడు.
లంచాలు పట్టడు, ఎవర్నీ తిట్టడు ఎవరేమన్నా పట్టించుకోడు
నీతి నిజాయితీ ఉన్నవాడు, నిర్మలమైన దేశభక్తి ఉన్నవాడు
కానీ చనిపోయే ముందురోజునే కనకయ్యా అనే మిత్రుడిని కలుసుకుని
సుఖం అంటే ఏమిటి? ఎలా ఉంటుంది? ఎక్కడ దొరుకుతుంది? అని అడిగాట్ట
ఈ సందేహం అతని జీవితానికే మచ్చ
ఇంకా పెరిగిపెద్దవ్వకుండా అతను మరణించడం దేశానికే రక్ష

ఈ పద్యం సింబాలిస్టిక్ కవి అయిన డబ్ల్యూ.హెచ్. ఆడన్ వ్రాసిన ది అన్నోన్ సిటిజన్‌తో పోలి ఉంటుంది. మామూలుగా ఎవరైనా చనిపోయినప్పుడు వారి కుటుంబంవారో, బంధువులో, దగ్గరి స్నేహితులో ఇలాంటి ఎపిటాప్ రాస్తారు. ఈ ఆధునిక యుగంలో మానవుడు తన ఉనికి కోల్పోయాడు. ఇతనికి స్టేటు సమాధిని కడుతుంది. అతని పేరుతో కాకుండా ఒక రిజిష్టర్డ్ నంబర్‌తో అతడు గుర్తింపబడతాడు. కాబట్టే అతడు 'అన్నోన్ సిటిజన్' అయ్యాడు. స్టేట్ విధించిన ఆంక్షల ప్రకారం

బ్రతికిన ఇతడికి సుఖం అంటే ఏమిటో, స్వేచ్ఛ అంటే ఏమిటో, తెలియకుండా బ్రతికే పరిస్థితిని ఇక్కడ కవి వర్ణిస్తారు. ఈ కవిత వ్యంగ్యంతో కూడి ఉంది. ఈ వ్యంగ్య రచన హాస్యాస్ఫోరకంగా ఉంటూ ప్రాశ్చాత్య సాహిత్యం ప్రభావంతో వచ్చినట్టు కనిపిస్తుంది. పై ఉన్న కవితాశైలిలో క్రింద కవిత కనిపిస్తుంది.

The Unknown Citizen by W.H. Auden – (To JS/07 M378)
(This Marble Monument Is Erected by the State)
He was found by the Bureau of Statistics to be
One against whom there was no official complaint,
And all the reports on his conduct agree
That, in the modern sense of an old-fashioned word,
..................................................................................
.........................................................
And our Social Psychology workers found
That he was popular with
His mates and liked a drink
The Press are convinced that he bought a paper
Every day
And that his reactions to advertisements were normal in ever way.
Policies taken out in his
Name prove that he was fully insured.
And his Health-card shows he was once in hospital but left it cured.
Both Producers Research and High-Grade Living declare
He was fully sensible to the advantages of the Instalment Plan
And has everything
Necessary to the Modern Man,
A phonograph, a radio, car and a fridgidaire
Our researchers into Public Opinion are content
That he held the proper

Opinions for the time of year; ….
Was he free? Was he happy?
The question is absurd
Had anything been wrong,
We should certainly have heard.

**రొమాంటిసిజమ్ ప్రభావితం (Influence and Imitation)**

రొమాంటిసిజమ్ ప్రపంచమంతా సాహిత్యపరంగా ఎంతో కొంత ప్రభావితం చూపించింది. భారతదేశంలో దీని ప్రభావం ఎక్కువగా ఉండేది. ఠాగూర్, సరోజినీ నాయుడు మొదలగువారు దీనితో ప్రభావితం అయినవారే. Neo-Classical poets – John Dryden మరియు Alexander Pope వారి వక్తిగత భావాలను నేరుగా వారి కవిత్వంలో లేకుండా జాగ్రత్త పడ్డారు. కాని Romantic Poets వాళ్ల భావోద్వేగాలను అంగీకరించి వారి కవిత్వంలో వ్యక్త పరిచారు. అదే విధంగా తిలక్ కూడా "తనని తన కవిత్వంలో చూడవచ్చు" అన్నారు.

ఫ్రెంచ్ విప్లవం (1789) ద్వారా వెలువడిన Democratic Principles తో ఒకటైన 'స్వేచ్ఛా భావం'తో ప్రభావితమైనారు ఆనాటి బ్రిటిష్ Romantic Poets. 1798 (క్రీ.శ.) లో William Wordsworth, Coleridge ఇద్దరు కలసి లిరికల్ బాలడ్స్ రాశారు, అందులోని ముందు మాట లో కవిత్వం వచనంలో ఉంటే ప్రజలకు చేరువౌతుందని అభిప్రాయ పడ్డారు. ఈ మాట ఐరోపా ఖండమంతా వ్యాపించింది. భారత దేశంలో కూడా ఈ ప్రభావం పడింది. తిలక్ వ్రాసిన తరువాత వచన కవిత్వం ప్రాముఖ్యత పెరిగింది.

తెలుగు భావకవిత్వంలో కనిపించే Romantic Poetry కవిత్వపు లక్షణాలు: భావకవిత్వం సమాజం బదులుగా ఏకాంతం, ఆలోచనల బదులుగా భావోద్వేగం, పట్టణ జీవితం బదులుగా గ్రామీణ జీవితం, ప్రకృతి ఆరాధన, కల్పన, చరిత్ర, ఆధ్యాత్మికత, ఒకొంతు బాధ, ఇంద్రియాలతో స్పష్టమైన వివరణ, వ్యక్తివాదం, ఆదర్శవాదం, అన్నింటిని మించి మానవతావాదం కలిగి ఉంది. భావ కవిత్వం ప్రజాభిమత ప్రాయమైనది. ఈ లక్షణాలన్ని తిలక్ కవిత్వంలో బాగా కనిపిస్తాయి. తిలక్ తను భావకవిత్వం రాసే రోజుల్లో జాన్ కీట్స్ బైరన్ కవిత్వంతో ఎక్కువ ప్రభావితుడు అయ్యాడు, కీట్స్‌లాగా అందంగా ఉన్న ప్రకృతిని అన్వేషించాడు,

ఆరాధించాడు, మతంగా భావించాడు. కీట్స్ ఇన్‌డిమిమాన్ (Endymion) ని "A thing of beauty is joy fer ever" అని మొదలు పెట్టాడు. "Ode on a Grecian urn"తో తన Philosophy ని వివరించాడు. Beauty is truth, truth beauty - that is all ye know on earth and all ye need to know. ఈ వాస్తవ ప్రపంచాన్ని వదలి అందమైన రంగుల ప్రంపంచాన్ని తన ఊహలతో నిర్మించాడు. Heard Melodies are sweet, but those unheard are sweater, అన్నాడు (ode on Grecian Urn) కాని వస్తువులు మాత్రం వాస్తవ ప్రపంచం నుండి తీసుకున్నాడు. పండు వెన్నెల చంద్రుడు, రంగుల రుతువులు, నీలి ఆకాశం, మెరిసే తారలు, చల్లని పచ్చని చెట్లు, సువాసభరితమైన మెత్తని రంగు రంగులు పువ్వులు, రాగాలాపన చేసే పక్షులతో నింపాడు. ఇతడు సందేశం ఇవ్వడానికో, తన తత్వాన్ని వక్తపరచటానికో కవిత్వం రాయలేదు, ఆనందిచడానికి రాశాడు, కాని స్వతహాగా విలువలు కలిగినవాడు. తిలక్ భావ కవిత్వం రాసినప్పుడు అలాగే గోచరిస్తాడు.తిలక్ సంస్కృత పదాలను వాడినట్లు, Keats అప్పుడు వాడుకలోలేని thy, thou, thee అని archaic పదాలు వాడాడు. కీట్స్ పదాలను కొత్తగా వాడడంలో Shakespeare అంతటివాడని పేరు తెచ్చుకున్నాడు. అందరి Romantic Poets కన్న ఎక్కువగా ఐదు ఇంద్రియాలను కలపోసి (Sensuousness) కనులకు కట్టినట్లుగా దృశ్యాలను చిత్రీకరిస్తాడు. (Pictutorial quality) పదాలకు కొత్త అందాన్ని, అర్థాన్ని ఇస్తాడు. కాబట్టే ఇతనిని "The most Romantic of the Romantic Poets" అంటారు. ఉదాహరణకు "Season of mist and Mellow fruitfulness" అని Autumn season ని "That thou, light-winged Dryad of the trees" అని Nightingale ని సంభోదించాడు. ఎంత ఊహాలోకాలలో విహరించినా కీట్స్ వాస్తవాన్ని మరవదు.

Away! away! for I will fly to thee
Not Charioted by Bacchus and his pards
But on the viewless wings of Poesy (Ode to a Nightingale)

తిలక్ కూడా అంతే. అనుభూతిని తారాస్థాయికి చేర్చిన ఆధునిక కవులో తిలక్ ముఖ్యమైనవాడు.

కవిత్వాన్ని చిత్రించడంలో ఎక్కువగా దగ్గరి Shot Keats దైతే, Long Shot Wordsworth ది. ఐదు ఇంద్రియాలో కళ్ళు, చెవులు ఎక్కువగా వాడతాడు

Wordsworth. ఎక్కువసార్లు తిలక్ Land scape Wordsworthకి దగ్గర అనిపిస్తుంది. Wordsworth కి ప్రకృతి లోని రాయి, రప్ప, గడ్డి పువ్వు అన్నీ ఆరాధ్యమైనవే, అతనికి ప్రకృతి జీవిత పాఠాలును నేర్పించే గురువు. జీవిత చివరి దశలో మనిషి తన ఆత్మను ప్రకృతి లోని భాగంగా భావిస్తాడు (Pantheism) ఇలా ప్రకృతిని ఆరాధించి భావించాడు కాబట్టి Keats ని కాకుండా Wordsworth 'the Great Worshipper of Nature', 'High Priest of Nature' అన్నారు. కాని Keats, తిలక్ ఇరువురు ప్రకృతిలోని అందాన్ని మాత్రం ఆరాధించే అంత చిన్న వయసులోనే మరణించారు. ఎక్కువ కాలం బ్రతికి ఉంటే Wordsworth లా ఎక్కువ ఆధ్యాత్మికంగా కూడ ఆలోచించే వారేమే.

ఖమ్మం నిలకడగా ఉండే ప్రతీకలు వాడాడు. ("Bright star, would I were steadfast as thee Art" "To Autumn") కాని Revolt స్వభావం కలిగిన Shelley తన ఆలోచనల లాగానే వేగంగా కదిలే ప్రతీకలువాడాడు తన కవిత్వంలో (The Clond, The West Wind, Sky Lark) వీటితో కంటే ప్రొఫెటిక్ విజన్, పద్యంలో లయతో తిలక్‌కి ఎక్కువ పోలిక వుంది. Shelley కి Demoeratre Principles పైన నమ్మకం. అవి ప్రపంచం అంతా త్వరగా వ్యాపిస్తాయని, నియంతృత్వ పాలన నసిస్తుందని, ముందు చూపుతో Shelley, Ode to the West Wind లో చెప్పాడు. అమెరికాలో Walt Whitman రాసిన "Song of Myself" లో Demoeratre Principles పైన అతనికి ఉన్న నమ్మకం కనిపిస్తుంది. తిలక్ కవిత్వంలో ఎక్కువ ప్రజాస్వామ్యవాదం ఉంది.

19వ శతాబ్దపు రొమాంటిక్ పొయట్రి లక్షణాలను 20వ శతాబ్దంలో కొనసాగించినవాడు వేల్స్, ప్రసిద్ధ కవి డైలాన్ థామస్, తిలక్ ఇతడి లాగే ఏ సాహిత్య Movement తో 'isms' తో తన కవిత్వాన్ని ముడిపెట్టుకోలేదు. జేమ్స్ జాయిస్ లా, డైలాన్ థామస్‌లా పదాలను, వాటి ధ్వని, నానా అర్థాల ఉపయోగంతో ప్రభావితుడైయాడు తిలక్.

కవి అనగానే చెట్టు కింద, నది గట్టున కూర్చొని ఏదో రాతలు రాసేవాడు అని William Wordsworthని చూసి భాతీయులు ఇరవైయ్యవ శతాబ్దంలో అభిప్రాయపడ్డారు, ప్రభావితమయ్యారు, ఠాగూర్, తిలక్ లాంటి వారిలో ఆ ప్రభావం మంచి కవిత్యం రాయగలనిస్తే, సామాన్యులు కవులనిపించు కోవాలని అర్థంలేని

పదాలను వాడి వ్యర్థ కవిత్వాన్ని రాస్తున్నప్పుడు, తిలక్ ఖండించారు.

అసలు కవితలోనే నవత కూడ వుంది
కాని మోడరన్‌గా వుందామనీ, ఏదో అందామనీ
తనకే తెలియని అస్పష్టపు అనుభూతిని
అర్థం లేని ఇమేజరీతో కలగా పులగపు వర్ణనలతో
డిలాన్ థామస్‌కు చేతగాని అనుకరణలతో
ఒక దేశం, నిర్దేశం లేని వాక్యాల వికారంతో
ఎందుకు బాధిస్తావు నన్ను, బాధపడతావు నువ్వు! (నవత-కవిత)అంటాడు.

'ప్రొసైక్ భావం పొయెట్రీ అవద'ంటాడు. "నీవు చెప్పేదేదైనా నీదై వుండాలి, నీలోంచి రావాలి" అని చైతన్యంతో నింపినా, అగ్ని జల్లినా, అమృతం కురిసినా "అందం, ఆనందం దాని పరమావధి (నవత-కవిత) అంటాడు.

**అనుసృజన (Transcreation)**

ప్రఖ్యాత గ్రీకు నాటకంలోని exposition లో ఒక భాగాన్ని తెలుగులో అనుసృజన చేశారు తిలక్. ప్రఖ్యాత గ్రీకు నాటక రచయిత సోఫోక్లిస్ (4 బి.సి.) యిడిపస్ అనే విషాదాంత నాటకం రాశాడు. మానవుడు ఎంత ప్రయత్నించినా దేవుని రాత నుండి తప్పించుకోలేడని యిడిపస్ నాటకం చెబుతుంది. గ్రీకు విమర్శకుడు, బహు ప్రజ్ఞాశాలైన Aristotle దీనిని గొప్పనాటకం అని అప్పుడు తలిచాడు, ప్రపంచమంతా ఇప్పటికీ గొప్పనాటకంగా దీనిని గుర్తిస్తారు. యిడిపస్, స్ఫినెక్స్ అనే రాక్షసి ప్రశ్నలకు తెలివైన సమాధానం ఇచ్చి, థెబ్స్‌కి రాజైనాడు కావున, ఆ దేశపు కరువు కాటకాలు తీర్చ గలిగిన యుక్తి యిడిపస్‌కు ఉందని నమ్మిన ఆ దేశ ప్రజలు ఆ రాజుతో మొరపెట్టుకొనే మొదటి భాగంలోనిది తిలక్ రచించిన యిడిపస్ Dramatic Monologue కాకుండా Dramatic dialogue తో మలచుకున్నాడు ఈ కవితను. True translation కష్టం కాబట్టి అనుసృజనతో భావం చక్కగా ఇమిడింది.

**Translation and Inter-textuality**

20వ శతాబ్దంలో శ్రీశ్రీ వంటి ఆధునిక తెలుగుకవులు వారి కవిత్వాన్ని వారే ఆంగ్లంలోకి అనువదించే ప్రయత్నం చేశారు. ఇలా ఒక సంస్కృతిని ఇంకోభాషలో రాసినప్పుడు దానిని "ఇంటర్ టెక్స్టువాలిటీ" అంటారు. "ఊరిచివరి యిల్లు" అనే కథను తిలక్ "The Shadows" అనే పేరుతో స్వయంగా ఆంగ్లంలోకి అనువదించి,

Tribune అనే అమెరికన్ పత్రిక జరిపే ప్రపంచ కథల పోటీకి పంపించాడు. అంతకు మునుపు తన స్నేహితుడైన పాలగుమ్మి పద్మరాజుగారికి ఇదే పోటీలో గాలి వానకు ద్వితీయ బహుమతి వచ్చింది.

**ముగింపు**

తనకున్న నిశిత పరిశీలనా శక్తికి, విభిన్న ఆలోచనాతీరుకి, వాక్చాతుర్యానికి, కళాత్మకమైన హృదయానికి, విశాల దృక్పథానికి, పాశ్చాత్య ప్రభావం కొత్త కోణం ఇచ్చింది. ప్రత్యేక శైలి, వ్యక్తిత్వం తిలక్‌లో ఏర్పడింది. ఆనాటి పాశ్చాత్య సాహిత్యంలో విరివిగా ఉపయోగించబడిన హాస్యం, వ్యంగ్యం, వచన కవితా ప్రయోగాలు చేశాడు. పాత కొత్త విధానాలు ఉపయోగించి, భాషలను కలపోసి సమకాలీన సంఘ పరిస్థితులు, సామాన్యుల జీవితం గురించి రాశాడు. మృగ్యమైపోతున్న మానవత్వానికి అద్దం పట్టగలిగాడు. అదేవిధంగా వాటిని ఉపయోగించడంలో ఉత్సాహంతో, ఉత్తేజంతో తన కవిత్వం చదవడానికి పాఠకులకు ప్రోత్సాహం కలిగించే శైలిని ఉపయోగించాడు. అధిక సంఖ్యలో ఉన్న సామాన్యులు తమని తాము ఎంతో కొంత తిలక్ సాహిత్యంలో చూసుకోగలగడం వల్ల అతనికి పాఠకులు పెరిగారు. పాఠకుల నాడిని ఎరిగినవాడు కాబట్టి వారిని అలరించి, మేల్కొల్పి, దారి చూపి, సిద్ధాంతాలతో వారిని బంధింపక స్వేచ్ఛా జీవితం వైపు నడిపించగలిగాడు. శ్రీశ్రీ వంటి కవుల అభిమానం పొందాడు. తోటి కవులకు మార్గాన్ని నిర్దేశించాడు. తనిని అనుకరించాలన్న చిగురుటాశను తన తరవాత కవులకు కలిగించి, కవులకే కవి అయ్యాడు తిలక్. ఈ విధంగా తిలక్ విషయంలో పాశ్చాత్య ప్రభావం మంచికే జరిగిందని చెప్పుకోవచ్చు.

ఏ 'ఇజం' తోను తన గుర్తింపు కోరని తిలక్, ఏ ఉద్యమాలలో ఉన్న స్నేహితుల ప్రభావాలకు తల వంచని తిలక్, త్రిమూర్తులుగా ఆరాధించిన కవులకు కూడ పూర్తి అనుచరుడు కాని తిలక్, పాశ్చాత్య సాహిత్య మోజులో పడి తన ఉనికిని కోల్పోలేదు. పాశ్చాత్య సాహిత్యం ఎంత కొత్తగా అనిపించినా, వారి పదాలను, పదబంధాలను అరువు తెచ్చుకున్నా, వారి కవిత్వ రూపాలను, శిల్పాలను స్వీకరించినా, వారి ఆలోచనలను, భావజాలాలను వడపోసినా, వారి ప్రతీకలు, అలంకారాల వంటి వాటిని తన కవిత్వంలో ప్రతి సృష్టించినా, పాశ్చాత్యుల అంశాలు ఎన్నో ఆస్వాదించినా, ఎన్నో విధాల అనుకరించినా, అనుసరించినా, వారి కవిత్వాన్ని మన భాషలోకి అనువదించినా, తన కవిత్వాన్ని వారి భాషలోకి అనువదించి Inter-texuality తో

పాశ్చాత్య ప్రభావాన్ని చాటుకున్నా, 'పరదేశ స్తుతితో స్వకీయ సంస్కృతి విస్మరించ కూడదని" (కవివాక్కు) తిలక్ నిర్ణయించుకున్నాడు.

భారత స్వాతంత్ర్యోద్యమం, జాతీయవాదం, దేశభక్తి, తత్వశాస్త్రం, గాంధీ, వివేకానందుల బోధనలు మరవలేని భారతదేశపు చరిత్ర, సంస్కృతి ఆధునిక సాహిత్యంలో "భారతీయతను" శక్తివంతంగా రచనల్లో ఉంచగలిగాడు తిలక్.

తూర్పు-పశ్చిమ సాహిత్యాలలో ఉన్న గొప్పదనాలను తన కవిత్వంలో ఇమడ్చుకొని, తన కాలంలో అందరికంటే ముందుకు నడిచిన తిలక్, ముందుగానే గతించినా, ఎల్లప్పుడు కొత్తగా అనిపించే తన కవిత్వంతో సమకాలీనత సంతరించుకొని అమరుడైనాడు.

**ఆధార గ్రంథాలు:**


1. Prof. G.N. Reddy, The **Influence of English on Telugu literature** (1800 - 1950), unpublished thesis from S.V. University, (A.P.)
2. N'gugi Wa Thiongo **Education for a National Culture** UFAHAMU Vol. XII, No. 2 (1983) P 24.
3. T.S. Eliot, "Tradition and Individual Talent". **The Sacred Wood,** 1920
4. Dr. Velchala Konda Rao, **The Night Nectar Rained;** Viswanadha Sahithya Peetam, 2005, (A Translation of Tilak's "Amrutham Kurisinia Ratri, 90 poems into English)
5. దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్య రచనల సంకలనం – ఎమెస్కో, 2013.

# 13. తిలక్ కథలు - మానవీయత

- డా॥ ఎల్.విజయ కృష్ణా రెడ్డి

తెలుగు సాహిత్యంలో మానవత్వాన్ని వస్తువుగా తీసుకొని తిలక్ కవిత్వం రాశాడని విమర్శలోకం ముక్తకంఠంతో అంగీకరించింది. అయితే, కవిత్వంలోనేకాదు, కథల్లో కూడా మానవత్వపు గుభాళింపు కనిపిస్తూ ఉంటుంది. తిలక్ ప్రతి కథలోనూ రెండు ప్రపంచాలను చూపించాడు. ఒకటి మానవీయత విలువలు కలిగిన ప్రపంచం. రెండోది అమానవీయతతో మానవత్వంవైపు దాడిచేసే ప్రపంచం. ఈ రెండింటి మధ్య జరిగిన సంఘర్షణను చిత్రించే క్రమంలో తిలక్ ఒక వ్యాఖ్యాతలాగా కనిపిస్తాడు. తాత్వికుడిలాగా దర్శనమిస్తాడు. ఎలాంటి సమాజాన్ని కోరుకుంటున్నాడో పరోక్షంగా కథల రూపంలో తెలిజేస్తాడు. తిలక్ రాసిన కథలుగానీ, స్కెచ్‌లుగానీ మొత్తం కలిపి 30 ఉన్నాయి. అవి - 1. లిబియా ఎడారిలో, 2. కదిలే నీడలు, 3. అద్దంలో జిన్నా, 4. హొటెల్లో (ఐదు రోజులు దినచర్య), 5. ఆశాకిరణం, 6. బాబు, 7. యవ్వనం, 8. గడియారపు గుండెలు, 9. ఫలితకేశం, 10. తీవ్రవాద నాయకుడు, 11. కవుల రైలు, 12. బొమ్మ, 13. దొంగ, 14. నల్లజర్ల రోడ్డు, 15. మణి ప్రవాళం, 16. ఓడిపోయిన మనిషి, 17. సీతాపతి కథ, 18. అతని కోరిక, 19. ఊరి చివరఇల్లు, 20. సుందరీ - సుబ్బారావు, 21. సముద్రపు అంచులు, 22. జీవితం, 23. ఉంగరం, 24. నిర్మల మొగుడు, 25. పరివర్తన, 26. దేవుణ్ణి చూసినవాడు, 27. నవ్వు, 28. రాత్రి 9 గంటలకు, 29. ఏమీలేదు, 30. మీరేనా-నీవేనా. ఈ కథల్లోని మానవీయతను రచయిత ఎలా ఆవిష్కరించాడో చూపడమే ఈ వ్యాసోద్దేశం.

'Man is born free but every where he was in chains' అంటాడు రూసో. మనిషి స్వేచ్ఛగా పుట్టినా అతణ్ణి సంకెళ్ళతో బంధిస్తున్నది ఎవరు? వ్యవస్థా? పాలకులా? తోటి మనుషులా? అనే ప్రశ్నలకు సమాధానాలను కొంతవరకు తిలక్ కథలు చూపిస్తాయి. ప్రతిసమస్యకు మనిషే కేంద్రబిందువు అంటాడు తిలక్. మనిషి రూపొందించుకున్న వ్యవస్థలో కనిపిస్తున్న అవశేష రూపాలు కూడా మనిషిచేత రూపొందించబడ్డవేనంటాడు. 'అద్దంలో జిన్నా' కథ కాకపోయినప్పటికీ, ఒక మనిషిలోని

అమానవీయ ఆలోచన మనుషుల మధ్య పశుతత్వాన్ని ప్రేరేపించిందని సిద్ధాంతీకరించాడు తిలక్. స్వార్థ పూరిత ఆలోచనలతో జిన్నా తనలోని అహాన్ని సంతృప్తిపరచుకోవడం కోసం అలెగ్జాండర్‌లా, ఘజనీలా, నాదిర్షాలా ప్రవర్తించాడని కొంతమందిలో మానవీయతను చంపేశాడని తిలక్ వ్యాఖ్యానించాడు. జిన్నా దేశ విభజన తర్వాత జరిగిన రక్తపాతాన్ని చూసి పశ్చాత్తాపం చెందినా, అతని హృదయంలో పడిన రక్తపు మరకను చెరపడం సాధ్యం కాదంటాడు రచయిత. అన్నదమ్ముల మధ్య మతం పేరుతో మానవీయతను లేకుండా చేసిన వ్యక్తి భావన ఎప్పటికీ తప్పేనని ప్రతిపాదించాడు తిలక్.

'హొటెల్లో' అనేది కూడా కథ కాదు. ఒక స్కెచ్. ఐదురోజుల దినచర్యను చూపిస్తూ మానవత్వం, అమానత్వ పాత్రలమధ్య సంఘర్షణను కళ్ళముందు ఉంచాడు. హొటల్ పక్క గదిలో ఉన్న వ్యక్తి వచ్చి 'అతడి'ని 5 రూపాయలు అప్పు అడిగినప్పుడు 'అతడు' ఇచ్చివుంటే మానవత్వం బతికుండేదని, అలా ఇవ్వకుండా పంపివేయడం వల్ల మానవత్వపు హత్యకు 'అతడు' కారకుడయ్యాడని ఈ స్కెచ్ ద్వారా తెలియజేశాడు. దుర్భర దారిద్ర్యం వల్ల ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను పోషించుకోవడం కోసం 5 రూపాయలు అప్పుజేయడం, దాన్ని తీర్చలేక ఒత్తిడికి గురై ఆమెను అప్పిచ్చినవాడికి అప్పగించడం, చివరకు ఆమె కోరికపై ఆమెను చంపేయడం వంటి సంఘటనలతో సాగిన ఈ స్కెచ్‌లో ఎవరిలో మానవత్వం లోపించిందో అర్థం చేసుకోమంటాడు తిలక్. అప్పు చేసిన వ్యక్తిలో మానవత్వం లోపించి ఉంటే అప్పు కట్టడానికి తన భార్య శీలాన్ని అప్పగించేవాడు కాదు, వారిని చంపేవాడు. ఆ స్త్రీలో మానవత్వం లోపించి ఉంటే భర్త మానసిక సంఘర్షణను తొలగించడానికి తాను వేరొకరికి వశమై చివరికి శవమై ఉండేది కాదు. 'అతను' మానవత్వంతో ఆలోచించి 5 రూపాయలు సాయంచేసి వుంటే అలాంటి అమానవీయ సంఘటన జరిగి ఉండేది కాదు. వ్యవస్థలో ఎప్పుడూ అవకాశవాదులైన కొందరు వ్యక్తులు మానవీయతను లొంగదీసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఆ ప్రయత్నంలో భాగంగా అప్పు తీసుకున్న వ్యక్తులు విజయవంతంగా ఆ పని పూర్తి చేశారు. దానిని అడ్డుకునే అవకాశం ఉన్నప్పటికీ 'అతను' ఆ సమస్యపైన దృష్టి పెట్టకుండా ఉదాసీనంగా ఉండిపోయాడు. ఇదే అసలైన అమానవీయ స్వభావంగా తిలక్ నిర్ధారించాడు.

'ఆశాకిరణం' కథలో వెంకటేశ్వర్లు పాత్రలో మానవత్వం ఉందా? లేదా? ఉంటే దరిద్రం ముందు మోకరిల్లిందా? అవకాశవాదంగా మారిపోయిందా? అనేవి

పాఠకుడిలో మిగిలిపోయే ప్రశ్నలు. టీచరుగా ఉంటూ, అనుకోని పొరపాటుకు ఉద్యోగాన్ని పోగొట్టుకుని కుటుంబాన్ని నెట్టుకురాలేకపోవడం అతనిలో అసమర్థత. అయితే, ఏ పనిచేసినా బతుకు సాగకపోవడంతో ఆత్మాభిమానాన్ని చంపేసుకున్నాడు. భార్య పాచీపని చేసి పోషిస్తుంటే తిని మౌనంగా ఉండిపోయాడు. ఇక్కడ వెంకటేశ్వర్లు పాత్రలో మానవత్వాన్ని వెదకడం కంటే, ఆత్మాభిమానాన్ని, బాధ్యతను విడిచిపెట్టిన నిర్లిప్త వ్యక్తిగా అర్థం చేసుకోవాలి. భార్య బిడ్డల్ని, భర్తను పోషించడానికి పడుతున్న పాట్లను మానవత్వపు గుర్తులుగా అర్థం చేసుకోవాలి. పక్కింటివాళ్లు నోములకోసం పిలిచినప్పుడు వెళ్లి చీరకొంగులో నాలుగు అట్లు రహస్యంగా తెచ్చే భార్యలో మానవత్వం ఉందని గుర్తించాలి. పస్తులతో చస్తున్న ఇంట్లోని వారిని చూడలేక అతని పెద్దకూతురు పడుపు వృత్తిలోకి దిగడం మానవత్వపు కోణంతోనే చూడాలి. వ్యక్తిత్వాన్ని చంపుకున్న వ్యక్తి మానవత్వాన్ని కూడా చంపుకున్నట్లే. అలా చంపుకోవడం వల్లనే వెంకటేశ్వర్లు తాను ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్తూ, తెలిసిన వ్యక్తి కూతురు చేస్తున్న పని గురించి చెప్పినప్పుడు "ఇక నేను చావనక్కర్లేదు" అంటూ కులాసాగ వెనుదిరగడం మానవత్వాన్ని పాతర వేయడంగా మనం అర్థం చేసుకోవాలి. అర్ధరాత్రి ఒంటరిగా ఏడుస్తున్న కూతుర్ని ఓదార్చలేక ఆ తండ్రిలోని మానవత్వం గడ్డకట్టి పోయిందో చూపించాడు తిలక్.

'యవ్వనం' కథలో భార్య చేసిన తప్పును చూపిస్తూ, భర్త ఆమెను వదలి వేయడంలో మానవత్వం ఉందా? అనే ప్రశ్న రచయిత పాఠకులకే వదిలేస్తాడు. భార్య ఆగిపొమ్మంటున్నా తప్పని పరిస్థితుల్లో డ్యూటీకి వెళ్లిన వ్యక్తి ప్రేమలో అల్పత్వం లేదు. అయితే, మనసు పెట్టే కోరికలను అణచుకోలేక బలహీనమైన క్షణంలో పరపురుషుడికి వశమైన స్త్రీలో అల్పత్వం లేదంటారా? అనే ప్రశ్నను వేస్తాడు రచయిత. అయితే, ఆమె తాను చేసిన పొరపాటును పశ్చాత్తాపంతో భర్తకు చెప్పుకుంటుంది. కాబట్టి ఆమెలో మానవీయత ఉన్నట్లుగానే భావించాలని, పరోక్షంగా అంటాడు తిలక్. అయితే, ముగింపులో మానవత్వం ఎవరిలో లోపించిందో చెప్పడానికి భార్య రాసిన ఉత్తరం ద్వారా చూపిస్తాడు రచయిత. గతంలో ఎన్నో తప్పులు చేసి, ఎందరో స్త్రీలతో గడపిన పురుషుడు ఒక పొరపాటు చేసిన స్త్రీని క్షమించలేకపోవడం మానవత్వం అవుతుందా? అనే ప్రశ్నను సంధించడంలో సరికొత్త మానవీయ విలువలు రూపొందించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాడు తిలక్. అలాగే, 'గడియారపు గుండెలు' కథ మనిషిని, మానవత్వాన్ని యంత్రమే శాసిస్తుందనే దృక్పథంతో సాగింది. శర్మ వేసిన బొమ్మల్ని, రాజు రాసిన పద్యాల్ని, గోపాలం చేసే సామాజిక సేవల్ని, లలిత

రూపురేఖల్ని ఇష్టపడే రాఘవయ్య గోడ గడియారం కొన్న తర్వాత పూర్తిగా మారిపోయాడు. ఆ సమయాన్ని చూస్తూ తన సంపదను పెంచుకోవడంపై దృష్టి పెద్దాడు. ఆ కాలాన్ని డబ్బురూపంలోకి మార్చుకునే క్రమంలో ఇష్టమయిన అమ్మాయిని, పక్కనున్న స్నేహితుల్ని, మనసుకి నచ్చిన పనుల్ని వదిలేసి అమానవీయంగా బతక సాగడాన్ని తిలక్ చూపించాడు. వడ్డీ డబ్బు వసూలు వంటి వ్యాపకంలో మానవత్వం బొగ్గులా తయారైపోయిందని చెప్పడం రచయిత ఉద్దేశం.

'ఫలితకేశం' కథలో ప్రసాదరావు మనస్తత్వమే అతని పతనానికి కారణమైంది. తెల్లబడ్డ వెంట్రుకని జీవితానికి వచ్చిన పెద్ద ముప్పుగా భావించడం, మనిషి లక్షణం కాదని ప్రతిపాదించడానికి తిలక్ ఈ కథ రాశాడు. కేవలం తెల్లబడ్డ ఒక్క వెంట్రుకకోసం తాను దిగులుతో బాధతో భార్యను తిట్టడం, కసరడం వంటి అవమానత్వపు పనులు చేయడాన్ని రచయిత కళ్ళ ముందుంచాడు. అదే సమయంలో అతని మానసిక స్థితిని అర్థం చేసుకున్న మానవీయమూర్తిగా భార్య కామేశ్వరిని రూపు కట్టించాడు తిలక్. భర్తకోసం, అతని ఆరోగ్యం కోసం తన ఆరోగ్యాన్ని పాడు చేసుకొని చివరకు భర్త కంటే ముందు తన ప్రాణాల్ని పోగొట్టుకున్న ఆమె నిజమైన మానవీయమూర్తి అంటూ ముగింపునిస్తాడు తిలక్. 'ఓడిపోయిన మనిషి' కథలో పైకి మనిషిలా, ఆదర్శాలున్న వ్యక్తిలా నటిస్తూ లోపల డొల్లతనాన్ని కలిగిన మనుషుల తీరును చిత్రించాడు తిలక్. 'నా లోపల ఎవరో పెద్ద మనిషి బుద్ధిమంతుడైనవాడు పరివ్యాప్తమౌతున్నాడు. మెడ చుట్టూ కండువా వేసుకొని కొంచెం వంగి కర్రనుఆనుకొని జీవితాన్ని భద్రంగా ఇటూఅటూ చెదరిపోకుండా దారి వేసుకుంటున్నాడు' అని ఆ పాత్ర అనడంలో మనిషిలా చెలామణి అవ్వటానికి ఎంత ప్రయత్నిస్తున్నాడో అర్థమౌతుంది. సమాజంలో మంచి వ్యక్తిగా అనిపించుకునేందుకు ప్రేమించిన పల్లెటూరి అమ్మాయిని కుంటిసాకులు చెప్పి వదిలించుకోవడం, ఆమె చివరికి జబ్బుచేసి మరణిస్తుందని తెలుసుకుని, ఆమెను పలకరించడానికి వెళ్ళడం వంటివి మనిషిగా కన్పించడానికి అతడు చేసిన ప్రయత్నమేనని రచయిత పాత్ర నిర్మాణంలో భాగంగా చూపించాడు. అతనికంటే స్వచ్ఛమైన మనసున్న సుబ్బులు మానవత్వం కలిగిందని, ఇష్టంలేని భర్తతో విడిపోయి మనిషితనంతో స్వేచ్ఛగా నచ్చినవాడితో కాపురం చేస్తుందని వివరించాడు రచయిత.

'అతని కోరిక' కథ మనిషితనాన్ని తాకట్టు పెట్టేసి, మత్తులో జీవితాన్ని కొనసాగించాలనే ఒక స్వార్థపరుడి పయనం. లక్ష్మీ మోహనరావు దరిద్రంతో

మగ్గుతున్నా పలాయనవాదిగా జీవితాన్ని సాగిస్తుంటాడు. నాలుగేళ్ళ కొడుకు మందులు కూడా తెచ్చివ్వలేక లాటరీలను నమ్ముకొని బతకటం, చివరికి కొడుకు పోయాడని ఎవరిద్వారారో తెలుసుకొని ఇళ్లు చేరడం, భార్య మంగళ సూత్రాలను వేశ్యా సుఖాల కోసం తాకట్టుపెట్టే ప్రయత్నం చేయడం వంటివి మానవత్వాన్ని చంపేస్తున్న మనుషుల జీవిత క్రమాన్ని చూపించడానికి తిలక్ ప్రయత్నం చేశాడు. చివరకు పడుపువృత్తిలో ఉన్న స్త్రీచేత అతనికి పదిరూపాయలు ఇప్పించి, పుష్టిగా భోజనం పెట్టించి పంపించడం మానవత్వపు రుచిని పాఠకుడికి తెలియజేయడానికేనని మనం అర్థం చేసుకోవాలి.

'ఊరి చివరి ఇల్లు' కథలో రమ తాను ప్రేమించిన వ్యక్తికోసం ఎదురు చూస్తున్న క్రమంలో మానవత్వం లేని ముసలి అవ్వచేతిలో మోసగించబడటం, అదే మురికి కూపపు జీవితంలో చిక్కుకుపోవడాన్ని చిత్రించాడు తిలక్. అవ్వ మానవత్వంతో సాయం చేసిందని భ్రమపడిందేగానీ, ఆమె జీవితాన్ని ఊరి చివరి ఇంటికే శాశ్వితం చేస్తుందని గ్రహించలేకపోయిన మానవతామూర్తి రమ. ఒక అమాయకురాలి జీవితాన్ని వ్యాపార వస్తువుగా మార్చే మానవత్వం నశించిన మనుషులు అవ్వ రూపంలో చెలామణి అవుతుంటారని చూపించడానికే మానవీయ, అమానవీయ పాత్రల మధ్య సంఘర్షణ చూపించాడు రచయిత. 'దేవుడిని చూసినవాడు' కథలో గవర్రాజు కఠినాత్ముడిగా, మానవత్వం శూన్యమైన మనిషిగా, పాపపు వ్యాపారంచేసి సంపాదించిన ధనవంతుడిగా కనిపిస్తాడు. అయితే, అతను అలా మారడానికి, కరడుగట్టిన అమానవీయవాదిగా దర్శనమివ్వడానికి కారణాన్ని రచయిత వివరిస్తాడు. బాల్యంలో తండ్రి హింసలకు తట్టుకోలేక తల్లి చనిపోవడం, తండ్రి దుర్మార్గం వంటి కారణాల వల్ల గవరయ్య మొండిగా మారడానికి కారణాలవుతాయి. అయితే, ఎవరికీ పైసా రాల్చని గవరయ్య, పరుషంగా మాట్లాడే గవరయ్య, లేచిపోయిన పెళ్లాం బిడ్డతో తిరిగివచ్చి పాడుబడిన ఇంటిలో బతుకుతుందని తెలిసినప్పుడు మనిషిగా ఆలోచిస్తాడు. ఊరికి భయపడకుండా మానవత్వంతో తన ఇంటికి తీసుకొస్తాడు. 'నాకంటే సగం చిన్న దాన్ని పెళ్లి చేసుకుంటే లేచిపోక ఏమి చేస్తది. ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోతది. తిండి బట్టా ఇస్తే కుర్రాణ్ణి సాకుతూ ఇక్కడే పడివుంటుంది' అనడంలో మానవత్వపు ద్వారాలు మూసుకుపోయాయని భావించిన వ్యక్తిలో మానవత్వపు పరిమళాలు కనిపిస్తాయి.

తిలక్ కథల్లో చాలా ప్రసిద్ధి పొందినదిగా చెప్పుకునే 'నల్లజర్ల రోడ్డు' లో మానవత్వం కలిగిన పాత్రలు, మానవత్వం లేని పాత్రలు నేరుగా ఎదురుపడతాయి.

అడవిలో అపాయకరమైన పాముకాటుకు గురై చావు బతుకుల మధ్య కొట్లాడిన వ్యక్తిని అతనికి ప్రాణం పోయడానికి తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి ఆకుపసరు తెచ్చిన స్త్రీని కళ్ళ ముందు చూపించాడు తిలక్. సాయం పొందేంత వరకు కృతజ్ఞతతో చూసిన కళ్ళు అవసరం తీరాక సాయం చేసిన వ్యక్తిని కామంతో చూడటం మనిషిలోని అమానవీయ చేష్టలకు ప్రతిఫలనంగా చూపిస్తాడు తిలక్. అయితే, పాము విషాన్ని కరిగించి కాపాడిన వ్యక్తి, మరోపాము కరచి ఆపదలో ఉన్నాడని తెలిసి కూడా, అతణ్ణి రక్షించాలనే మానవధర్మాన్ని విడిచిపెట్టి, అవసరంగా పనుందని వెళ్లిపోయిన స్వార్థపు మనుషుల తత్వాన్ని కూడా రకరకాల మలుపుల ద్వారా కథలో చూపించాడు తిలక్.

ఈ విధంగా తిలక్ కథల్లో సమకాలీన సమాజంలోని వ్యక్తుల మనస్తత్వాలు కళ్లముందు దృశ్యమానం అవుతాయి. వ్యవస్థలో నానాటికీ మానవీయత లోపిస్తుందనడానికి మనిషి ప్రవర్తనే కారణమనే విషయాన్ని తిలక్ అనేక కథల్లో నిరూపించాడు.

**ఆధార గ్రంథాలు**

1. దేవరకొండ బాలగంగాధర తిలక్ కవిత్వం - కథాసాహిత్యం - వై.కామేశ్వరి.
2. తిలక్ సాహితీ సందర్శనం - కె. శరశ్చంద్ర జ్యోతిశ్రీ.
3. మనం మరిచిపోతున్న మంచి కథకుడు తిలక్ (వ్యాసం) - అంపశయ్య నవీన్.
4. తిలక్ కథలు - దేవరకొండ బాలగంగాధర తిలక్.

# 14. నవనవాలైన ఊహోవర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు తిలక్

**– డాక్టర్ వైదేహి శశిధర్, M.D.**

శ్రీ దేవరకొండ బాల గంగాధర తిలక్ అమృతం కురిసిన రాత్రి నేను మొట్టమొదటి సారిగా చదివింది– To be precise – మా నాన్నగారు గొంతెత్తి చదవగా విన్నది  బహుశా నా 9–10 సంవత్సరాల వయసులో. తిలక్ కవిత్వం వినగానే / చదవగానే ఒక గాఢమైన అబ్బురానికి ,ఆనందపు విభ్రాంతికి లోనయ్యాను. I was struck by the sheer beauty of it. ఆ వయసు లో నాకు ఆయన కవిత్వం ఎంతవరకు అర్ధం అయ్యింది అన్నది పక్కకు బెడితే – కవిత్వం,పూర్తిగా అర్ధం కాకముందే ఒక గొప్ప సౌందర్యానుభవాన్ని అందిస్తుందని నా స్వానుభవం లో తెలుసుకున్నాను. కారణం కవిత్వం హృదయ సంబంధి. T.S. Elliot అంటారు poetry can be enjoyed even before it is understood అని. గొప్ప కవిత్వం, సంగీతం లానే అర్ధంతో సంబంధం లేకుండా ఆనందాన్ని కలుగజేసే స్థాయి కలిగి ఉంటుంది. నిజానికి గొప్ప కవిత్వం లోనే సంగీతం కూడా ఇమిడి ఉంటుంది. అయితే అన్ని సంవత్సరాల క్రితం ఆయన కవిత్వం చదివినప్పుడు ఎటువంటి ఆశ్చర్యానందాలకి లోనయ్యానో ఇన్నేళ్ల తర్వాత కూడా అదే రసానందం విభ్రాంతి నేను పొందుతాను. కవిత్వానికి ఇంతకంటే లిట్మస్ టెస్ట్ మరేం ఉంటుంది? అసలు ఇన్నేళ్లుగా అవే కవితల్ని అంతే rapture తో పదే పదే చదవకుండా ఉండలేకపోవడం కూడా గొప్ప కవిత్వాన్ని నిర్ధారించే డయగ్నోస్టిక్ టెస్ట్ అని నా ఉద్దేశ్యం. Aesthetic enjoyment (రసానందం)లో  అప్పటికీ ఇప్పటికీ తేడా లేకపోయినా, ఇప్పుడు, అంటే కవిత్వం అర్ధం అయినపుడు అదనంగా critical appreciation –విశ్లేషణలో కలిగే ఆనందం కలుగుతుంది. అయితే aesthetic enjoyment కలగజేయటంలో ప్రధాన పాత్ర కవిది అయితే, critical appreciationకు పాఠకుడి వివేచన అవసరం.

ఎందుకని తిలక్‌కవిత్వాన్ని మనం ఇన్నేళ్లుగా మరలామరలాచదువుకుంటున్నాం? ఏ లక్షణంవల్ల ఈయన కవిత్వం మనపై  ఇంతటి ప్రగాఢమైన ముద్రవేయడం జరిగింది?

ఆలోచిస్తే, ఆయనకు చాలా సునాయాసంగా పట్టుబడ్డ ఈ రసవిద్య-ఆల్కెమీ మూలకారణం నిస్సందేహంగా ఆయన అద్వితీయమైన కవితీకరణ. ఈ కవితీకరణ కి మాధ్యమం ఆయన అద్వితీయమైన శిల్పం. ఈ శిల్పాన్ని ఆయన గొప్ప బావ సాంద్రత, అందమైన మెటఫర్స్, లయ, లాలిత్యం, ఔచిత్యం ఉన్న భాషతో పరిపుష్టం చేసి, తన అనుభూతిని పాఠకుడి అనుభవంలోకి అందజేసే సార్వజనీనతను కవిత్వంలో సాధించారు. కవి ప్రధానలక్ష్యం ఆ సార్వజనీనత సాధించటమే. సార్వజనీనత ఉత్తమ కవిత్వానికి గీటురాయి.

తిలక్‌లో నన్ను అబ్బురపరిచేది ఆయన కవితీకరణ తో పాటు, కవిత్వంలో వైవిధ్యం. భావసాంద్రత లేని  వైవిధ్యం మనల్ని ఎప్పుడూ ఆకట్టుకోదు. ఏ కవి కైనా, ప్రతి కవితావస్తువు నీ ఒకే భావసాంద్రతతో నిర్వహించడం చాలా కష్టమైన, అరుదైన విషయం. సాధారణంగా కవులకి ఒక comfort zone  ఉంటుంది. చాలామంది కవులు ఒక నిర్దుష్టమైన భావజాలానికి కానీ సాహితీవాదానికి కానీ నిబద్ధులై వాటిపై మాత్రమే ప్రతిభా వంతమైన కవితలు వ్రాయడం మనం చూస్తూ ఉంటాం. తిలక్ విభిన్న కవితా  వస్తువుల పై స్వేచ్ఛగా అద్భుతమైన కవిత్వం వ్రాసారు . దానికి ఒక కారణం తనని తాను ఏ ఇజానికి భావజాలానికి imprison చేసుకోకుండా తన కవిత్వపరిధిని నియంత్రించక పోవడం ఒక కారణం అవవచ్చు. అంతకంటే ముఖ్యమైన మౌలికమైన కారణం, ఆయన గొప్ప మానవతావాది. ఆయన కవిత్వ పరిభాషలో చెప్పాలంటే-అనంత మానవ హృదయ స్పందనం. ఈ అనంత మానవహృదయ స్పందనమే ఆయన ఆర్ద్రమైన రసహృదయం, కారుణ్యంతో చలించే హృదయ సౌకుమార్యం. ఇదే ఆయన extraordinary and exquisite artistic sensibility. అందుకే ఆయన ప్రకృతి, ప్రణయం, సౌందర్యం సంతోషం, సమాజం, వేదన, వైఫల్యం, నిరాశ, యుద్ధం – ఇలా వస్తువు ఏదైనా అద్భుతమైన కవిత్వం వ్రాసారు. ఆనందంతో మయూరబర్హంలా విరిసినా, శోకగీతికలా కన్నీరు మున్నీరుగా కరిగినా, ఆర్తితో కాగితపు పేలికలై రాలిన కలలైనా  అంతా  కవితామయమే.

ఒక కవితలో తిలక్ అంటారు– నా కవిత్వం లో నేను దొరుకుతాను అని. నిజాయితీ నిబద్ధత ఉన్న కవులు వారి కవిత్వంలో దొరుకుతారు,వారి కవిత్వానికి

వ్యక్తిత్వానికి వైరుధ్యాలు ఉండవు. The taste of pudding is in the eating అన్నట్లు ఆయన కవితలు చదివితే ఆయన కవిత్వతత్వం మనకి అందుతుంది. ముఖ్యంగా ఆయన శతజయంతి సందర్భంగా జరుగుతున్న ఈ సభలో ఆయన కవితలలోని కొన్ని భాగాలను చదవగల్గటం ఆయన స్మృతి కి అర్పించే నివాళి గా భావిస్తున్నాను .

ముందుగా "వానలో నీతో" అన్న కవిత లోంచి అక్కడక్కడ కొన్ని భాగాలు

"ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది
ఆనందం మనసులో మయూరబర్హంలా విప్పుకుంది
.....చినుకుల కలనేత వస్త్రాన్ని సింగారించుకుంది ధరిత్రి
సింధువారం పులకరించి చిరుసిగ్గు పూలను పూసింది
....అరటితోట నడుం చుట్టి కాలువ ఏటవాలుగా మలుపు తిరిగింది
నారికేళ వనాంతాన ప్లాటినం సంకేతంలా మెరుపు మెరిసింది
నీ వంటి మీద చిరుగంధం సువాసన నా మనస్సును చుట్టుకుంది
నిర్ణిద్ర కాంక్షా రమ్యమై నీపమై నా జీవితం విరిసింది"

ఎంత సౌందర్యం చిప్పిల్లే దృశ్యభావాలు! ప్రకృతి ద్వారా ప్రణయ భావాన్ని ఎంత అందంగా స్ఫురింప జేశారు! ఈ కవితలో ప్రకృతి ప్రణయం దృశ్యాదృశ్యంగా కలసి పోవడం మనం చూస్తాం.

తిలక్ కవిత్వం గురించి మాట్లాడినప్పుడు ప్రస్తావించి తీరాల్సిన మరో కవిత నువ్వు లేవు నీ పాట ఉంది. కవిగా తిలక్ అస్తిత్వాన్ని, కవితాత్మకతను, హృదయ సౌకుమార్యాన్ని అసలు the very essence of his poetryని అందంగా ఒడిసి పట్టిన కవిత. ప్రణయానందాన్ని వేదనను ఒకేసారి అద్భుతంగా కవిత్వీకరించిన కవిత "నువ్వు లేవు నీ పాట ఉంది."

ఈ కవితలో కొన్ని భాగాలు.

"నలుపు చారలు లేని తెల్లని సూర్యకాంతి పడిన పాలరాతి గచ్చులా ప్రతిఫలించి
నీ వడిలో నా తల పెట్టుకుని అభ్యంగనావిష్కృత త్వదీయ
వినీల శిరోజ తమస్సముద్రాలు పొంగి
నీ భుజాలు దాటి నా ముఖాన్ని కప్పి
ఒక్కటే ఒక్క స్వప్నాన్ని కంటున్నవేళ
చంద్రికాస్నపిత సంగీతం వింటున్నవేళ ....."

(ఇదే కవితలో మరి కొన్ని వాక్యాలు )

"నా లోపలలోపల ఆరినకుంపటిలో రగులుతున్న ఒకే ఒక స్మృత్యాగ్ని కణంలాగా
క్రమక్రమ జరారుజాగ్రస్తమైన వయస్సనే పాడింటి మూల గదిలో
కుండీలో ఇంకా వాడకుండా నిలిచిన పువ్వుల గుత్తి లాగా
....నా ఏడుపు నాకు తప్ప లోకానికి వినిపించని వేళ
నే కూరుకుపోతున్న చాతకానితనపు వానాకాలపు బురద మధ్య
నీ పాట ఒక్కటే నిజం లాగా నిర్మలమైన గాలిలాగా
నిశ్శబ్ద నాడీ తీరాన్ని పలుకరించే శుక్తిగత మౌక్తికం లాగా
ఇంటిముందు జూకామల్లే తీగల్లో అల్లుకుని
లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని
నాగుండెల్లో చుట్టుకుని గాలిలో ఆకాశంలో
నక్షత్రం చివరి మెరుపు లో దాక్కుని నీరవంగా నిజంగా ఉంది
జాలిగా హాయిగా వినబడుతుంది
శిశిర వసంతాల మధ్య వచ్చే విచిత్ర మధురమైన మార్పును
గుర్తుకు తెస్తుంది ఇన్నేళ్ల తర్వాత"

ఈ కవితలలో ప్రకృతిని, ప్రణయాన్ని, వైయక్తిక వేదనను ఎంత అందంగా చెప్తారో సమాజంలోని అసమానత, దైన్యం,అన్యాయాలపట్ల ఆయన నిరసనని, దుఃఖాన్ని కూడా అంతే సాంద్రతతో చెపుతారు, కఠినోపనిషత్, అదృష్టాధ్వగమనం కవితలలో.

**కఠినోపనిషత్‌లో**

నీడల కొండ చిలువలు వెలుతురు కుందేళ్ళను మింగి
సంఘపు మఱ్ఱి చెట్టును చుట్టుకుని మత్తుగా నిద్రపోయే సమయాన
మానవారణ్యం లోని పెద్దపులులు
జరీకండువాలు బిరుదాంకితమైన సువర్ణపతకాలు ధరించి
సిటీలో సభావేదిక మీద కథాకళి నృత్యం చేస్తున్న కాలాన
......అతగాడు ఒక్కడూ ఊపిరాడని గదిలో
జిడ్డుతేరిన తన ముఖాన్ని కన్నీళ్లతో టాయిలేట్ చేసుకుంటున్నాడు.

**అదృష్టాధ్వగమనంలో**

ఊరవతల సందులలో
దుమ్ము కొట్టుకుపోయిన పిల్లల కళ్లలో ఆరిపోతున్న వెలుగులో

కాలవ వడ్డున వంకర తిరిగిన తుమ్మచెట్టు కొమ్మ లోంచి
కాలి మసయి పోతున్న పశ్చిమ దిశా గగనం లో
ఒక భయంకర సృష్టి క్రమాన్ని మానవ యత్న వైఫల్యాన్ని
ఊహించుకుని వణికి పోయేవాణ్ణి- అంటారు.

ఇదే కవితలో చివరి వాక్యాలలో గొప్ప ఆశావాదాన్ని ఆనందాన్నీ కూడా ప్రకటిస్తారు

ఇప్పటికీ మధుమాసం లొ
సహకార తరువుల క్రింద పవ్వళించిన వేళ
నా గళాన సౌందర్య మధూళి చిందుతుంది..
ఇప్పటికీ దిగులునీరు నిండిన
కోటి మనస్సరస్తీరాల నా కవిత
కోరికల కోణాకారపు కొత్తచెట్లను నాటుతుంది
ఇప్పటికీ ఈ చీకటి మొగలో
నిలచి పాడుతున్న నాకోసం
కుబుసం విప్పిన గోధుమ వన్నె తాచు
మొగలి పొదల నుండి పడగ విప్పి ఆడుతుంది

ఒకే కవితలో రెండు విభిన్నమైన భావాల్ని/మూడ్స్‌ని అదే intensityతో చెప్పటం ఆయన mastery of poetic craftని సూచిస్తుంది

అలాగే చావులేని పాట లో-నేను నిర్మించుకున్న ఆశా చంద్రశాలలో

కాలం కరిగి వెన్నెలయింది అంటారు- కాలం కరిగి వెన్నెలవడం -ఎంత హృద్యమైన ఆనంద ప్రకటన !

ఉత్తమ కవిత్వం వ్రాయడమే కాదు, కవిత్వాన్ని తిలక్ నిర్వచించినట్లు మరే ఆధునిక కవి నిర్వచించలేదని నా అభిప్రాయం. అందులోనూ ఒక కవితలో భాగంగా. తన నవత కవితాఖండికలో ఆయన కవిత్వంగురించి చెప్పినవాక్యాలు కవులమనుకునే వాళ్లూ, కవిత్వం రాయాలనుకునే వాళ్ళూ మళ్ళీ మళ్ళీ చదవాల్సిన వాక్యాలు.

కవిత్వంలో అబ్స్క్యూరిటీ కొన్ని సందర్భాలలో ఉండవచ్చు
కానీ పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాలి హత్తుకోవాలి
అది ట్రాన్స్పరెంట్ చీకటై ఉండాలి ,నిన్ను పలకరించాలి
కవిత్వం కొత్త అనుభవాల కాంతి పేటికను తెరవాలి కదలించాలి

.........కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేయాలి
విస్తరించాలి చైతన్య పరిధి
అగ్ని జల్లినా అమృతం కురిసినా
అందం ఆనందం దాని పరమావధి !

శిఖరారోహణ కవితలో –రెండు కవిత పంక్తులు నాకెంతో ఇష్టమైనవి.

ఎవరూ చూడటం లేదు క్షితిజ రేఖ వెనక నిలచి పిలిచే రత్న కంకణ హస్తాన్ని

ఎవరూ వినడం లేదు నిద్రకు మెలకువకు మధ్య ఒక్ క్షణం మ్రోగిన జంత్ర సంగీతాన్ని!–

ఈ వాక్యాలలో ఎంతటి మార్మికత సొగసు సౌందర్యం ఉన్నాయో చూడండి

తిలక్ వ్రాసిన మరో మంచి కవిత నెహ్రూ. నాయకుడిగా ప్రధానమంత్రిగా నెహ్రూజీ పట్ల మనకు భిన్న దృక్పధాలు ఉండవచ్చు.ఇక్కడ కవి తన ప్రియతమ నాయకుడి పట్ల తనకు గల అభిమానానికి ఇచ్చిన కవితారూపం నిస్సందేహంగా ఉత్తమ కవితావిష్కరణ అని నా అభిప్రాయం.

చరన్మౌఢ్య క్రూరమృగాల సంకులారణ్యంలో
సహేతుక సాహసం కవచంగా ధరించిన అఖేటకుడు
చలజ్జీవన దైనందిన కోలాహల పాంసుప రాగం లో తనలో తానొక ఏకాంత సౌందర్యం రచించుకున్న స్వాప్నికుడు –

అద్భుతమైన వాక్యాలు!

**సైనికుడి ఉత్తరంలో**

దూరంగా ఆల్ప్సు మీద మంచు దుఃఖంలా కరుగుతుంది
ప్రభాతమ్ సముద్రం మీద వెండి నౌకలా ఊగుతుంది– అంటారు

అందమైన పదచిత్రాలు ! దృశ్యభావాలు !

ఇంకా ఎన్నో మంచి కవితలు ఎన్నో వైవిధ్యమైన కవితావస్తువులపై అప్పటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, రాజకీయాలు, యుద్ధాలు ఎన్నిటి గురించో చక్కని కవితలు వ్రాసారు. Fashion కోసం కాదు, passionతో, నిజాయితీతో.

యుద్ధంపట్ల అది కలిగించే మానవ వినాశనంపట్ల ఆయన ఆవేదన నిరసన ఎన్నో కవితల్లో మనకి ప్రస్ఫుటం గా కనబడుతుంది.రెండవ ప్రపంచ యుద్ధ సమయం లో ఫ్రెంచి పట్టణమైన TOULAANపై జర్మనీ చేసిన దాడి గురించి ఒక మంచి

కవిత వ్రాసారు.

నిశ్శబ్దపు మెత్తని పరుపులపైన
నిదురించేను పట్టణమంతా
కొండ చివర ఎర్రని నక్షత్రం
రాలి పడింది సముద్రపు నీలంలో
చీకటి కుంపటిలో అస్పష్ట భవిష్యత్తు
రాజుకుంటున్నది రవ్వలు రవ్వలై చుక్కలు చుక్కలై – అని

కవిత్వం కూడా జీవితం లాంటిదే. ఏదో ఒక కోణంలోంచి దర్శిస్తే జీవితానికి కానీ కవిత్వానికి కానీ పరిపూర్ణత లేదు. జీవితంలోని అన్ని కోణాలని కవిత్వంలో ప్రతిఫలిస్తూ అటువంటి పరిపూర్ణతను సాధించగలగటం బహుశా కవి అందుకోగలిగిన అత్యున్నత శిఖరం కావచ్చునేమో. తిలక్, జీవితంలోని, సమాజంలోని దాదాపు అన్ని కోణాలను తన కవిత్వంలో స్పృశించారనే చెప్పాలి. యవ్వనాన్ని, ఉద్వేగాన్ని, మాధుర్యాన్ని, సౌందర్యాన్ని ఎంతఅందంగా చిత్రీకరించారో అంతే గాఢంగా నైరాశ్యాన్ని, జీవనవైఫల్యాన్ని, వేదనను, భయాన్ని, తప్పించుకోలేని మరణాన్ని కూడా చిత్రీకరించటం మనం ఆయన కవితలలో చూస్తాం.

తిలక్ నా కవిత్వం అనే ఖండికలో తన కవిత్వం గురించి చెప్పుకుంటారు.

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు
నా అక్షరాలు  ప్రజాశక్తుల వహించే విజయ ఐరావటాలు
నా అక్షరాలు  వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అని.

ఆయన కవిత్వంలోని కారుణ్యం, ఆర్ద్రత, ఔచిత్యం అందమైన శైలికి ఈ వాక్యాలు చక్కని ప్రతీకలు. కవిగా తిలక్ గురించి ఒక్కవాక్యంలో చెప్పాలంటే మనం మళ్ళీ ఆయన కవిత వాక్యాలనే ఆశ్రయించాల్సి ఉంటుంది – నవనవాలైన ఊహా వర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు తిలక్. తెలుగు కవిత్వాభిమానుల దురదృష్టంవల్ల ఆయన ఆకాలంగా అస్తమించారు. లేకపోతే తెలుగు వచనకవిత్వం మరింత తేజోవంతం, శోభాయమానం, రసదీప్తం అయిఉండేదని నా ప్రగాఢమైన నమ్మకం.

# 15. తిలక్ కథలు - పాత్రచిత్రణ

- డా॥ పాలెం రమాదేవి

దేవరకొండ బాలగంగాధర తిలక్ కవిత్వంతో పాటు కథలు, నాటకాలు, నాటికలు, లేఖలు, లఘు వ్యాసాలు రచించాడు. తిలక్ తన కవిత్వం ద్వారా పాఠకుల్ని ఎంత మెప్పించాడో కథల ద్వారా కూడా అంతే మెప్పించాడు. పరిపక్వత, నిపుణత, సంపూర్ణత ఈ మూడు పుష్కలంగా ఉన్న కథకుడు తిలక్ అని విమర్శకుల అభిప్రాయం. తిలక్ తన కథల ద్వారా సమాజంలో మృగ్యమైపోతున్న మానవతా విలువల్ని, మనిషిలోని దురాశ, మోసం, స్వార్థం మొదలైన గుణాల్ని, సాంప్రదాయానికి మతానికి ఇచ్చిన ప్రాధాన్యం ఈ సమాజం మానవత్వానికి ఇవ్వడం లేదన్న సత్యాన్ని తెలియజేశాడు. సమకాలీన సమస్యలను కథల్లో ఎంతో ఉదాత్తంగా ప్రస్తావిస్తాడు.

కథకు శీర్షిక, ఎత్తుగడ, ముగింపు, సంభాషణలు ఎంత ముఖ్యమో పాత్రచిత్రణ కూడా అంతే ముఖ్యం. కథల్లో రెండు రకాలుంటాయి. 1) నిర్మాణం ప్రధానం నడిచే కథలు 2) పాత్రచిత్రణ మీద శ్రద్ధ పెట్టే కథలు. కథ ఈ రెండింటిలో ఏ కోవకు చెందినదైనా ఆ కథలో కొన్ని మానవ పాత్రలు ఉండడం తప్పనిసరి. మనుష్యుల సంతోషాలు, భయాలు, బాధలు, కోపాలు, పరాజయాలు, ఆశలు, అనుభూతులు, ఉద్వేగాలు, స్వార్థం మొదలైన లక్షణాలతో కూడిన పాత్రచిత్రణ పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. కథకు మానవీయ కోణం అద్ది, పాఠకులను కథలో లీనమయ్యేలా చేసేవి అందులోని పాత్రలే.

పాత్ర చిత్రణకు రెండు పద్ధతులున్నాయి. ఒకటి కథకుడు తనకు తెలిసిన వ్యక్తుల ఆధారంగా పాత్రల్ని రూపొందించడం, రెండవది పూర్తిగా కథకుడి ఊహ నుండి పాత్రలను రూపొందించడం. వీటిలో ఏ పద్ధతి అవలంభించినా చివరికా పాత్ర ఎలా రూపొందిదన్నదే ముఖ్యం.

తిలక్ ఏ రచన తీసుకొన్నా మౌలికంగా ఆయన హృదయంలో, ఆలోచనలలో నిరంతరం స్రవించే కవితాధార అంతర్లీనంగా స్రవిస్తుంటుంది. తిలక్ కథలలో మంచి

మనుషులు, చెడ్డ మనుషులు అని ఉండరు. పరిస్థితులను బట్టి ఒక మనిషి స్వభావం ఎలా మారుతుందో చిత్రిస్తాడు. ప్రతి కథలో మంచి–చెడు, త్యాగం–స్వార్థం, తెలుపు–నలుపు ఈ భావాలను ప్రక్క ప్రక్కన పట్టి చూపిస్తారు. ఒక మనిషి ఆలోచనలు అతనికి ఎదురైన అనుభవాలను బట్టి, చూసిన సన్నివేశాలను బట్టి, ఎలా మారిపోతుంటాయో ఈ కథల్లో చిత్రీకరిస్తారు. తిలక్ కథలలోని పాత్రలన్నీ అనేకానేక, సామాజిక వలయాల్లో తమ తమ వ్యక్తిత్వాలను సందర్భానుసారంగా ప్రకటిస్తూ మానవత్వపు భిన్న కోణాలను ప్రదర్శిస్తాయి. తిలక్ కథలలో పాత్రల స్వభావాన్ని ప్రతిబింబించే సన్నివేశాల్ని సృష్టించి వాటి అల్లికవి మన మనస్సుకు హత్తుకునే లాగా కథారూపంలో చిత్రీకరిస్తారు. మన ఆలోచనలకు కొన్ని విషయాలు మిగులుస్తారు. కథలలో అంశాలు ఎంత భిన్నంగా ఉంటాయో ఆ అంశాలను బట్టి తిలక్ ఎంచుకున్న రచనాశైలి కూడా అంతే భిన్నంగా ఉంటుంది. తిలక్ కథలు చదవగానే పాఠకులకు మిగిలే అనుభూతి ఏమిటంటే ఆర్ద్రత, మనసు తడి కావడం, కళ్ళు చెమ్మగిల్లడం. కథలో తిలక్ గారు ఎంత చెప్తారో ఇంకా అంత పాఠకుని ఊహకు వదిలిపెడ్తాడు. తిలక్ గారు 31 కథలు రాశారు. ఈ కథలలోని పాత్రలన్నీ కూడా భిన్న మనస్తత్వాలు కలవి. తిలక్ పాత్రచిత్రణ చేసిన తీరు అద్భుతం. తిలక్ కథలలోని పాత్రలన్నీ మనం నిత్యం చూస్తున్న సమాజంలోని వ్యక్తులే. వారిలోని బలహీనతలు, స్వార్థం, ద్వేషం, దురాశ, చేతగానితనం మొదలైన గుణాలన్నీ యథాతథంగా చిత్రించారు.

'ఆశాకిరణం' అనే కథలో ప్రధాన పాత్ర వెంకటేశ్వర్లు అనే ఓ స్కూలు టీచరు. ఈ కథ చదువుతున్న కొద్దీ మనకు అసమర్థుని జీవయాత్రలోని సీతారామారావు గుర్తుకు వస్తాడు. వెంకటేశ్వర్లు తన తెలివితక్కువ తనంతో ఉద్యోగం పోగొట్టుకుంటాడు. అతని చేతకానితనం వల్ల, కుటుంబాన్ని పోషించడానికి కావల్సిన తెలివితేటలు లేకపోవడం వల్ల ఆ కుటుంబం దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించవలసి వచ్చింది. భార్య సూటిపోటి మాటలు భరించలేక వెంకటేశ్వర్లు తన సభ్యతకు, సంస్కారానికి విరుద్ధమైన దొంగతనం చేయడానికి కూడా సిద్ధపడ్డాడు. ఏదో ఒక పనిచేసి కుటుంబాన్ని పోషించాలన్న తపన, ఏపనీ సక్రమంగా చేయలేని అసమర్థత మనకు వెంకటేశ్వర్లు పాత్రలో కన్పిస్తాయి. ఏం చేయాలో తోచని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్తున్న వెంకటేశ్వర్లుకి అతని కోలీగ్ కనిపించి వెంకటేశ్వర్లు కూతురు వ్యభిచారం చేస్తున్న విషయం చెప్పి, అతని చేతకానితనాన్ని నిందిస్తాడు. ఒక్క క్షణం నిశ్చేష్టుడైనా వెంటనే తేరుకొని తాను చనిపోనక్కర లేదని ఇంటికెళ్లి కడుపునిండా అన్నం తిని

ఆకుటుంబాన్ని దేవతలా ఆదుకున్న పెద్దకూతురిని అభినందించబోతాడు. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగి కేవలం తన కుటుంబాన్ని ఆదుకోవాలన్న తపనతో తన్నుతాను అంగడి వస్తువుగా మార్చుకున్న వెంకటేశ్వర్లు కూతురు జయ (అతని ఆశాకిరణం) వెక్కి వెక్కి ఏడువడం చూసి ఏడుపు ఆపేశాక చెప్తాలే అనుకుంటాడు. ఇది మనిషిగా వెంకటేశ్వర్లు పతనానికి పరాకాష్టనా? లేక బలీయమైన పరిస్థితుల ప్రభావమా? మనిషి ఇంతలా పతనమై పోవడానికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నలు కలుగుతాయి.

తిలక్ సృష్టించిన పాత్రలలో మరొక అద్భుతమైన పాత్ర 'దొంగ' కథలోని గోపాలం. ఈ కథలో తిలక్ గోపాలం పాత్రను స్వాభావికమైన వివేకం ఉన్న వ్యక్తిగా తీర్చిదిద్దారు. గోపాలంతోపాటు రత్తయ్య, సోములు అనే పాత్రల పేర్లు వినిపిస్తాయే తప్ప కథలో వారెక్కడా కనిపించరు. గోపాలం దొంగతనం చేయడానికి వెళ్ళిన ఇంట్లో ఉన్న ఆవిడ, ఆవిడ భర్త అంతే వాళ్ళ పేర్లు ఉండవు. గోపాలం దొంగతనం వృత్తిగా చేసుకున్న వ్యక్తి. గోపాలం చేసే వృత్తి దొంగతనమే అయినా, చదువు రానివాడైనా ప్రతీది ఒక ప్లాన్ ప్రకారం చేయడం అలవాటు. గోపాలనికి తను చేసే పని మీద నైతిక సందేహాలు ఏమీ లేవు. దొంగతనం తప్పని, పాపమని అతను అనుకోలేదు. ఎందరో తమ అవసరానికి ఎన్నో వృత్తులూ, ఉద్యోగాలు చేసినట్లుగా అతను దొంగతనం చేస్తున్నాడే తప్ప, ఆ పనిలోని మంచిచెడులు విచారణ చేసే ఆలోచన కాని, అవసరం కాని అతనికి లేదు. పట్టు పడితే జైలుకు వెళ్లాలన్న భయం, జ్ఞానం మాత్రం ఉన్నాయి. గోపాలానికి ఏ పనిచేసినా ముందు వెనక ఆలోచించి బేరీజు వేసే అలవాటు ఉంది. ఆ అలవాటు ప్రకారమే ఊరికి దూరంగా ఉన్న ఇంటిని, ఇంట్లో వారి దినచర్యను రెండు వారాల పాటు గమనించి దొంగతనానికి వెళ్తాడు. అర్ధరాత్రి గోపాలం దొంగతనానికి వెళ్లే సరికి ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతుంటుంది. భర్త భార్య మెడలోని గొలుసు కోసం ఆమెను హింసించడమే కాక కన్నకొడుకును చంపడానికి కూడా వెనుకాడడు. ఆ దృశ్యం చూసిన గోపాలం కోపంతో భర్తను కొట్టి భార్య గొలుసును ఆమె చేతిలో పెట్టి ఆమెకు ధైర్యం చెప్తాడు. దొంగతనం చేయడానికి వచ్చిన గోపాలానికి అక్కడ తనకు ఎదురైన సంఘటన అతడి ఆలోచనను మార్చివేసింది. పరిస్థితులను బట్టి మనిషి స్వభావం మారుతుందనే దానికి గోపాలం ప్రవర్తనే ఉదాహరణ.

"దేవున్ని చూసిన వాడు" కథలో గవరయ్య, అవధాని, మున్సబు, చిట్టీ మొదలైన పాత్రలు ప్రభావమైనవి. ఈ కథలో గవరయ్య పాత్రను చిత్రించిన తీరు తిలక్ రచనా నైపుణ్యానికి, అతనిలోని అభ్యుదయ భావాలకు ఉదాహరణగా చెప్పవచ్చు. గవరయ్య చదువు సంధ్యలు లేనివాడే కాక తల్లిదండ్రుల ఆలనా పాలనా కూడా లేనివాడు. తండ్రి జూదరి, వ్యసనపరుడు, తల్లి రోగిష్టి. తల్లి చనిపోవడం, తండ్రి జైలుకెళ్లడంతో గవరయ్యను సవతి తల్లి పెంచి పెళ్లి చేస్తుంది. ఆమె చనిపోవడంతో గవరయ్యను పిల్లలు లేని మేనత్త చేరదీస్తుంది. గవరయ్య చిన్నప్పటి నుండి ఎవరితోను ఎక్కువగా కలిసేవాడు కాదు. మేనత్త ఊరికి చేరుకున్న గవరయ్య వ్యాపారం చేస్తూ బాగా సంపాదించాడు. భార్య కాలుజరి నూతిలో పడి చనిపోవడంతో గవరయ్య తన కంటే 15 సంవత్సరాలు చిన్నదైన చిట్టిని వివాహం చేసుకుంటాడు. చిట్టి ఎదురింటి అరుగు మీద మిషనకుట్టే టైలర్‌తో లేచిపోతుంది. దీన్ని అవకాశంగా తీసుకొని మున్సబు, కరణం, అవధాని గవరయ్య ఇంటికి రాకపోకలు కొనసాగిస్తారు. అతడిని ఆస్తికుడిగా మార్చి తద్వారా స్వలాభం చూసుకోవాలన్న స్వార్థపు ఆలోచన వారిది. లేచిపోయిన గవరయ్య భార్య చిట్టి ఓ రాత్రివేళ దీని స్థితిలో గర్భవతిగా ఇంటికి తిరిగి వచ్చి పాకలో ఉంటుంది. చిట్టి వచ్చిన విషయం తెలుసుకొని గునపం పట్టుకుని కోపంగా వెళ్లిన గవరయ్యను దీనంగా చూస్తూ చిట్టి రెండు చేతులెత్తి దండం పెడ్తుంది. అది చూసిన గవరయ్యకు తన తల్లి గుర్తుకు వస్తుంది. ఎంతో కోపంతో వచ్చిన గవరయ్య చిట్టికి అన్నం, నీళ్లు తెచ్చి ఇచ్చి ఉదయాన్నే వెళ్లి పొమ్మని చెప్తాడు. ఇంట్లోకి వెళ్లి పడుకున్న గవరయ్యకు ఓ పీడకల రావడంతో ఉలిక్కి పడి లేస్తాడు. వర్షం కురుస్తున్న ఆ చీకట్లో గవరయ్యకు ఏదో సత్యం గోచరించినట్లైంది. చిట్టి పరిస్థితి ఎలా ఉందో చూద్దామని వెళ్లిన గవరయ్య చిట్టి పురిటి నొప్పులతో బాధపడడం చూసి దిక్కు తోచని స్థితిలో ఉంటాడు. కాసేపటికి చిట్టి అరుపుతో పాటు బిడ్డ ఏడుపు వినిపించడంతో సంతోషించి ఆ చీకట్లో వర్షంలో మంత్రసాని కోసం వెళ్తాడు.

తెల్లారి మున్సబు, అవధాని వచ్చి లేచిపోయినదాన్ని ఇంట్లో పెట్టుకుంటావా? సిగ్గులేదా? అని ప్రశ్నిస్తారు. ఆ పిల్లాన్ని నేను పెంచుకుంటాను. ఆ పిల్ల ఇంట్లో పడి ఉంటుంది అని సమాదనమిస్తాడు గవరయ్య. లేచిపోయిన దాన్ని ఏలుకుంటావా? అని వాళ్లు ప్రశ్నించడంతో నా వయసులో సగం ఉన్న దాన్ని పెళ్ళి చేసుకుంటే లేచిపోక ఏం చేస్తుంది? ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోతుంది? తిండి, బట్ట ఇస్తే పిల్లాన్ని చూసుకుంటూ ఇక్కడే ఉంటుంది? అంటాడు. ఊరంతా వెలివేస్తారన్న భయపడకుండా ఇలాంటి వెదవలున్న ఊళ్లో ఉండమన్నా ఉండను. నా పిల్లాన్ని ఈ

వెధవల మధ్య తిరగనివ్వనని చెప్పి చిట్టిని, ఆమె కొడుకుని తీసుకొని ఊరు వదలి వెళ్తాడు. ఈ కథలో తిలక్ గవరయ్య పాత్రను మలిచిన తీరు అద్భుతం. 60 సంవత్సరాల క్రితమే తిలక్ ఇలాంటి సున్నితమైన అంశాన్ని తీసుకొని దానికి ఇత చక్కటి పరిష్కారాన్ని చూపడం ఆయనలోని అభ్యుదయ భావాలకు ప్రతీకగా చెప్పవచ్చు.

మనుసు చేసే మాయాజాలన్నంతటిని తిలక్ 'పరివర్తన' కథలో తెలియజేశాడు. ఈ కథను దాదాపు 55 సంవత్సరాల క్రితం రాశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే ఆరోజుల్లోనే తిలక్ ఎంత సున్నితమైన అంశాన్ని, సున్నితమైన భావాల్ని సృజించారో ఆలోచిస్తే ఆశ్చర్యం కలగక మానదు. మనుషుల మీద మనకున్న అభిప్రాయం ఒక సంఘటన తర్వాత మారిపోవచ్చు. కొన్ని పాత్రలు ఉదాత్తంగా చిత్రింపబడి తర్వాత పథనమైపోతాయేమో అనుకొనే సమయంలో తిరిగి ఆ పాత్రలను ఉదాత్తమైన మానవత్వంవైపు మళ్లిస్తారు.

శంకరం, రాజేశ్వరి ఒకప్పటి స్నేహితులు రాజేశ్వరి వేరొక వ్యక్తిని పెళ్లి చేసుకుంటుంది. చాలా సంవత్సరాల తర్వాత సినిమా హాలులో కలుసుకున్న రాజేశ్వరి, శంకరం బీచ్‌కెళ్లి మాట్లాడుకునే సందర్భంలో శంకరం రాజేశ్వరి పట్ల తనకు గల ప్రేమను తెలియజేస్తాడు. అంతేకాదు ఆమెను ఓ రాత్రి తనతో ఉండమని అర్థిస్తాడు. రాజేశ్వరి అతని కోరిక ఎంత అసమంజమైందో, అనుచితమైందో తెలియ చెప్పి సున్నితంగా తిరస్కరిస్తుంది. రాజేశ్వరి ఇంటికి వెళ్లి పడుకున్నా ఆలోచనలతో నిద్రపట్టదు. శంకరం కోరిన కోరిక గుర్తుకు వస్తుంది. నా భర్త నన్ను ప్రేమిస్తున్నాడు, గౌరవిస్తున్నాడు. అతన్ని మోసం చేయడం తప్పకదా అనుకుంటుంది. కానీ వెంటనే శంకరం కూడా నా వివాహానికి ముందు నుంచే నన్ను ప్రేమిస్తున్నాడు. ఇప్పటికీ ఆ ప్రేమ అలాగే ఉంది. మరి అతని కోరిక కూడా తీర్చాలి కదా అనుకొని మర్నాడు అతనికి లేఖ ద్వారా తన అంగీకారాన్ని తెలుపుతుంది. మరుసటిరోజు రాజేశ్వరి ఇంటికి వచ్చిన శంకరం రాజేశ్వరి తన కోరికను తీర్చడానికి అంగీకరించినందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తాడు. రాజేశ్వరి అతనికి ఇల్లంతా చూపుతూ ఆ ఇంటిని తీర్చిదిద్దడంలో తన భర్త శ్రద్ధను, అతనికి తన మీదగల ప్రేమను ..... తెలియజేస్తుంది. రాజేశ్వరి మాటలు విన్న శంకరానికి తన కోరిక ఎంత అసమంజసమైందో, ఎంత అర్థరహితమైందో అర్థమవుతుంది. తన పొరపాటును గ్రహించి ఆమె మేడ మీద నుంచి దిగి వచ్చేలోపు ఓ ఉత్తరం రాసి వాచ్‌మెన్ కిచ్చి వెళ్లిపోయాడు. తిలక్ పరివర్తన

కథలో శంకరం పాత్రను అద్భుతంగా తీర్చిదిద్దాడు. తప్పులెవరైనా చేస్తారు కానీ తన తప్పు తెలుసుకొని దాన్ని సరిదిద్దుకునే వాడే ఉత్తముడు. శంకరం అకోవకి చెందినవాడు.

తిలక్ కథలలో మరో అత్యుత్తమ కథ 'నల్లజర్లగొడ్డు'. అవధాని, నాగభూషణం, రామచంద్రం, సిద్ధయ్య, సూరీడు ఇందులోని పాత్రలు. అవధాని తన 18 ఏళ్ళ వయసులో జరిగిన సంఘటన గురించి దాదాపు 50 సంవత్సరాల తర్వాత తన స్నేహితులకు చెప్పడంతో కథ ప్రారంభమవుతుంది. అవధాని, భూషణం, రామచంద్రం రాత్రి పూట కారులో ఏలూరు నుండి నల్లజర్ల అడవి గుండా తణకు వెళ్తుండగా కారు చెడిపోతుంది. ఆ కారు రిపేరు చేయడానికి అవసరమైన కర్ర కోసం వెతుకుతున్న రామచంద్రాన్ని పాము కాటేస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రామచంద్రాన్ని ఎలా రక్షించాలో తెలియక నాగభూషణం బాధపడుతున్న సమయంలో పాములు పట్టే సిద్ధయ్య ఆ దారిలో వస్తాడు. అపస్మారక స్థితిలో రామచంద్రాన్ని నాగభూషణం, అవధాని సాయంతో తన గుడిసెకు తీసుకొని వెళ్తాడు. గుడిసెలో సిద్ధయ్య కూతురు సూరీడ ఉంటుంది. విరుగుడు మంత్రం వేయడానికి కావలసిన వేరు గుడిసలో లేకపోవడంతో అర్ధరాత్రివేళ సూరీడు ప్రాణాలకు తెగించి అడవిలోకి వెళ్లి ఆ వేరును తీసుకొని వస్తుంది. ఆ వేరు సాయంతో సిద్ధయ్య విరుగుడు మంత్రం వేయడంతో రామచంద్రం మెల్లిగా కోలుకోసాగాడు. ఆ రాత్రి వేళ రామచంద్రునికి మిరయాల పొడిలేసిన పాలు, భూషణానికి అవధానికి జామపళ్ళు పెట్టి ఆకలి తీర్చారు. రామచంద్రం కోలుకొగానే సూరీడు కాళ్ళకు నమస్కరించిన నాగభూషణం వారు చేసిన మేలు మరిచిపోయి. ఆ రాత్రి తమకు ఆశ్రయమిచ్చి ఆదుకున్న సిద్ధయ్య కూతురిని తన కోరిక తీర్చమని అడుగుతాడు. మనషులే నీతి నిజాయితీ లేని పశు వులనే సత్యాన్ని నాగభూషణం నిరూపిస్తాడు. సూరీడు అతని కోరికను తిరస్కరిస్తుంది. తెల్లవారుజామున వాళ్లని బస్సు ఎక్కించడానికి వచ్చి తిరిగి వెళ్ళే సమయంలో సిద్ధయ్యను పాము కాటేస్తుంది.

సిద్ధయ్య కూతురు సూరీడు ఏడుస్తూ తన తండ్రిని కాపాడమని అర్థిస్తుంది. ఏమాత్రం మానవత్వం ఉన్న వాళ్లైనా ఆ సమయంలో వెనక్కి వెళ్లి సిద్ధయ్య ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసేవాళ్లు, కానీ వీళ్లు అలా చేయలేదు సరికదా మేం వచ్చి ఏం చేయగలం పైగా రేపు పొద్దున్నే మాకు కలెక్టర్ గారింట్లో పెళ్లి ఉంది. మేం వెళ్లాలి అని అంటారు. అపకారికి ఉపకారం నెపమెన్నక చేయువాడే నేర్పరి అన్నాడు సుమతి శతక కారుడు. కానీ ఈ కథలో అర్ధరాత్రి అడవిలో ప్రాణాలు కాపాడిన వ్యక్తికి

ఆపద వస్తే ఆదుకోవాలన్న కనీసం మానవత్వం కూడా మరిచి పోయిన విశ్వాసహీనులు రామచంద్రం, నాగభూషణం. మంచి, చెడు అనేది మనిషికి సంఘంలో ఉన్న హెూదాన బట్టిరాదు. వ్యక్తి ప్రవర్తనని బట్టి నిర్ణయం అవుతుంది. సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నవారు నలుపుకు ప్రతి నిధులైతే అడవిలో జీవిస్తున్న ఆ అమాయకులు తెలుపుకు ప్రతినిధులుగా చెప్పవచ్చు.

"ఊరి చివర ఇల్లు" కథలో రమ, జగన్నాథం, ముసలామె అనే మూడుపాత్రలు ఈ కథలో తిలక్ పాత్రలు, పాత్రలస్వభావాలు, పరిసరాలు, వేషధారణ కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. ఊరి చివర ఉన్న పాత ఇంటిలో మూడుపాత్రల మధ్య ఓ వర్షాకాలపు రాత్రి జరిగిన సంఘటనల సమాహారమే ఈ కథ. ఒక కథ పాఠకుల్ని ఆకర్షించాలంటే రచయిత ఆ కథ జరిగే పరిసరాల్ని, పాత్రల వేషభాషల్ని వర్ణిస్తే కథ చదివేవారు ఆ పరిసరాలలోకి వెళ్ళి కథలో మమేకం అవుతారు. ఈ కథ మొదట్లో ఊరి చివర ఉన్న ఇంటిని, ఆ ఇంటటి పరిసరాలను, ఆ యింటి మండులాలో కూర్చోని ఉన్న యువతిని ఆ అమ్మాయి ప్రవర్తనను వర్ణించిన తీరు ఆమె మీద పాఠకులకు గౌరవం ఏర్పడే విధంగా ఉంటుంది. కథలో తిలక్ ఎంత చెప్పాడో ఇంకా అంత పాఠకుల ఊహకు వదిలేస్తాడు. ఈ కథలో రమ పాత్రపై గౌరవభావం ఉండేలా తీర్చిదిద్దారు. ముసలామె మాటల ద్వారా రమ ఏ విధంగా జీవిస్తుందో మనకు అర్థమవుతుంది. వర్షంలో ఆదారిన వెళ్తున్న జగన్నాథాన్ని పిలిచి ఆదరించి ఆశ్రయమిస్తుంది. ఆ రాత్రి వారి మధ్య జరిగిన సంభాషణ ద్వారా రమ జీవితంలో జరిగిన సంఘటనల గురించి తెలుసుకున్న జగన్నాథం. ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. కానీ ఆ మాటలన్నీ చాటుగా విన్న ముసల్ది రమ పెళ్లి చేసుకొని వెళ్లిపోతే తనకు ఆధారం ఉండదన్న ఆలోచనలో జగన్నాథం మనసు విరిచేస్తుంది. కానీ చివరికి జగన్నాథం రమ మంచితనం తెలుసుకుంటాడు. ఇవన్నీ రచయిత ఎక్కడా చెప్పదు. పాఠకుడి ఊహకే వదిలిపెట్టాడు. ఈ కథ, ఈ కథలోని పాత్రలు కొన్న రోజులు పాటు మనలను వెంటాడుతూనే ఉంటాయి. తిలక్ గారి కథలు చదివాక మనసు కదలక పోవడం గాని, కథ గురించి మళ్లీ ఆలోచించకపోవడం గాని ఉండదు. కథ, కథలోని పాత్రలు కొన్ని రోజులపాటు మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. అది కథకుడిగా తిలక్ విశిష్టత.

**ఆధార గ్రంథాలు**

1. దేవరకొండ బాలగంగాధర్ తిలక్-లభ్య రచనల సంకలనం.

# 16. తిలక్ నాటికలు - సామాజిక నేపథ్యం

- డా॥ మూల మల్లికార్జునరెడ్డి

దేవరకొండ బాలగంగాధర్ తిలక్ రూపొందించిన ఇరుగు-పొరుగు, పొగ అనే రెండు నాటికల గురించి సంక్షిప్తంగా విశ్లేషణ చేస్తాను. ఆయన సాలెగూడు, సుశీలపెళ్లి అనే నాటకాలు, ఇరుగు-పొరుగు, సుచిత్ర ప్రణయం, సప్తశిల, పొగ అనే నాటికలు, భరతుడు (ఏకపాత్రాభినయం) రాశారు. మరికొన్ని నాటికల్ని కూడా రాసినట్లు అర్థమవుతుంది. వాటిలో సప్తశిల, భరతుని ఏకపాత్ర ఈ రెండు పౌరాణికాలు కాగా, మిగిలినవన్నీ సాంఘిక నాటకాలు, నాటికలు. అందువల్ల సాంఘిక నాటకంపై కొంత ఉపోద్ఘాతం అవసరం.

వాస్తవ దృక్పథానికి, సాంఘిక చైతన్యానికి మూలమైంది సాంఘికనాటకం. సమకాలీన సమాజంలో ప్రతి సమస్యకు ప్రతిస్పందించేది, ప్రతి సంఘటనను ప్రతిస్పందింపజేసేది సాంఘిక నాటకమే! సాంఘిక నాటకమెప్పుడూ సమకాలీన సమాజాన్ని అన్వేషిస్తూనే సమాజ శ్రేయస్సుకు పాటు పడుతుంది. స్వాతంత్ర్యానికి ముందు సంఘ సమస్యలను ప్రతిపాదించిన సాంఘిక నాటకం స్వాతంత్ర్యం తర్వాత మధ్యతరగతి వ్యక్తుల జీవన సమస్యలను చిత్రించింది. రానురాను సాంఘిక నాటకాల్లో పెక్కు సమస్యలు ప్రస్తావించబడ్డాయి.

1928-29 సంవత్సరాల్లో బళ్లారి రాఘవ విదేశీపర్యటన చేసి పాశ్చాత్య నాటక రీతుల్ని ఆకళింపు చేసుకొని తెలుగు నాటకరంగంలో కూడా నూతనమైన విధానాన్ని ఆవిష్కరించారు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడానికి సాంఘిక నాటకాలే ఉపకరిస్తాయని ఉద్ఘాటించారు. అప్పటినుండి సాంఘికనాటకాల్ని ఎక్కువగా రాశారు. ఆక్రమంలో ఇప్పటిదాకా సంఘసంస్కరణ, దేశభక్తి, హేతువాదం, మూఢ విశ్వాసాలు, బాల్య, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం, స్త్రీ అభ్యున్నతి, లంచగొండితనం, కులమతాల ప్రసక్తి, వేశ్యావృత్తి, మద్యపానం, నిరుద్యోగం, రైతు సమస్యలు, ఆర్థిక అసమానతలు, భూస్వామిక వ్యవస్థ, విద్య, వైద్య, న్యాయ, పోలీస్ వ్యవస్థలు, స్త్రీ, దళిత, మైనారిటీ

వాదాలు.. ఇలా భిన్నమైన అంశాలపై సాంఘిక నాటకాలు, నాటికలు విపరీతంగా వచ్చాయి.

తెలుగు నాటక చరిత్రను మనం ఒక్కసారి పరిశీలిస్తే రాను రాను నాటక రచనలో, ప్రదర్శనలో, శిల్పంలో చాలా మార్పులు చోటు చేసుకొన్నాయి. సంప్రదాయం నుండి కొత్త పుంతలు తొక్కి నాటకరంగంలో ఎన్నో నూతన, వినూత్న ప్రయోగాలు వచ్చాయి. ఇవన్నీ పాశ్చాత్య ధోరణులే. అబ్సర్డ్ థియేటర్, సింబాలిజం, ఎక్స్‌ప్రెషనిజం, ఎపిక్ థియేటర్, రివ్యూ థియేటర్, అస్తిత్వవాదం, మైమ్, పాంటో మైమ్, ఎన్విరాన్మెంటల్ థియేటర్, డాక్యుమెంటరీ థియేటర్, ఫ్రీజ్, ఛాయా నాటిక... ఇలా కొత్త కొత్త ధోరణులు పుట్టుకొచ్చాయి.

ఈ నేపథ్యంగా చూస్తే మనకు తిలక్‌గారి ఇరుగు-పొరుగు నాటికలో కూడా సింబాలిజం అంటే ప్రత్యేకవాదం కన్పిస్తుంది. ఒక సందేశాన్ని లేక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఆసాంతం నాటిక రచనలో ప్రత్యేక ధోరణిని ప్రతిబించించే నాటకాలు చాలా వున్నాయి. ఉదాహరణకు ఆత్రేయగారి 'కప్పలు', గొల్లపూడివారి 'కళ్లు', దివాకర్‌బాబు 'కుందేటి కొమ్ము', తనికెళ్ల భరణి 'గో(గ్రహణం', 'కొక్కొరొకో' మొదలైనవి ప్రత్యేకధోరణితో రాయబడిన నాటకాలు, నాటికలు. దానికి ఆద్యుడు ఆత్రేయ. ఈ సింబాలిజం ఆత్రేయ చేతిలో ఫలవంతం, విజయవంతమైందని చెప్పవచ్చు. నాటక రచయిత ఒక అంశాన్ని నేరుగా చెబితే అది అంతగా రాణించదు. ఆ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీకలుగా ఒక ఇతివృత్తాన్ని ఎన్నుకొంటారు. దానిచుట్టూ పాత్రల్ని, సంభాషణల్ని, సన్నివేశాల్ని పేర్చుతారు. ఇరుగు-పొరుగు నాటికకూడా అటువంటిదే. తిలక్ ఒక ఉద్దేశ్యాన్ని దృష్టిలో పెట్టుకొనే ఈ నాటిక రాశారు. ఆ ఉద్దేశ్యానికి వేరేరంగు బట్టలు తొడిగాడంతే! మొదట కాసేపు ప్రేక్షకునికి ఆ రంగులు కన్పించినా తర్వాత రచయిత భావమేమిటో చాలా సులభంగా గ్రహిస్తాడు. వెంటనే తాను చూసేది కాకుండా గోప్యంగా ఉన్న విషయం ప్రేక్షకునికి ప్రత్యక్షమవుతుంది.

1959లో చైనాదేశం భారత భూభాగంలోకి 40మైళ్లు దురాక్రమణతో చొచ్చుకొని వచ్చింది. యావద్భారతం అట్టుడికి పోతుంటే అప్పటి మన దేశ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారు చాలా ఓర్పును, సహనాన్ని పాటించారు. అప్పట్లో మన దేశంలో ఉన్న కమ్యూనిస్టు నేతలు కూడా చైనావారినే సమర్థించడం మరో విశేషం. ఇంత జరుగుతున్నా నెహ్రూగారి నోటి వెంట యుద్ధం చేయాలనే మాటే రాలేదు. ఈ

పరిస్థితిని గమనించి తిలక్ చలించిపోయారు. ఆవిషయాన్నే ప్రతీకాత్మక ధోరణితో 1960లో ఈ నాటిక రాశారు. నాటికలో నెహ్రూగారి పంచశీల సిద్ధాంతాలకు ప్రతీకగా 'సిద్ధాంతం' అనే పాత్రను సృష్టించారు. భారతప్రజలకు ప్రతీకలుగా సిద్ధాంతం భార్య, రాద్ధాంతం, నారాయణ, నరసింహం పాత్రలను, భారత సి.ఐ.డి వ్యవస్థకు ఎరకయ్య, కమ్యూనిజానికి ఎర్రయ్య, సైన్యాధ్యక్ష స్థానంలో డి.యస్.పి., మన సైన్యానికి పోలీసులను ప్రతీకలుగా తీసుకొన్నారు. ఇరుగు అంటే మన దేశం, పొరుగు అంటే చైనా. సిద్ధాంతం గారి వెనకాల ఇల్లే చౌడయ్యది. చౌడయ్య చైనా ప్రధానికి ప్రతీక. నారాయణ, నరసింహులు వచ్చి "అయ్యా సిద్ధాంతంగారు! చౌడయ్యగారి మనుష్యులు మీ పెరటి గోడ తవ్వుతున్నార"ని చెబుతారు. అప్పుడు సిద్ధాంతం భార్యకు, రాద్ధాంతానికి, నారాయణ, నరసింహాలకు గొప్ప సందేశం ఇస్తాడు.

"సహనం, విశ్వాసం, స్నేహం యివన్నీ ఉన్నప్పుడే ప్రపంచంలో యుద్ధాలు, బాధలు ఉండవని, నా సిద్ధాంతం ప్రపంచం అనుసరిస్తుందని, ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే రాతియుగంనుంచి మనిషి మనిషిని నమ్మకపోవడం, ఒక తెగ మరొక తెగని, ఒక దేశం మరొక దేశాన్ని అనుమానించడం, ద్వేషించడం" అంటూ ఊకదంపుడు ఉపన్యాసమిచ్చి "సరిహద్దు దాటి మన భారతంలోకి ఒక నలభై మైళ్లు లోపలికి వచ్చినంత మాత్రాన మనం కంగారుపడి యుద్ధానికి దిగకూడదని, నిదానం, నిగ్రహం ఉండాలని, పరిస్థితుల్ని అవగాహన చేసుకోవాలని, వేచి చూడాలని, చూస్తూ ఉండాలని, చర్చలద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాల"ని ఉద్బోధిస్తాడు. ఎవరెన్ని చెప్పినా వినడు. చివరకు చౌడయ్య మనుషులు ఇల్లు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశిస్తే అప్పుడు జ్ఞానోదయమవుతుంది. "చౌడయ్య ఇంత కపటనాటకమాడతాడని అనుకోలేదు. స్నేహం, శాంతిని కోరినందుకు ఇదా ప్రతిఫలం. నాకు బలమూ, బలగమూ లేదనుకోకండి. అనవసరంగా రక్తపాతం జరుగుతుంది. ద్వేషం విజృంభిస్తుంది. పండంటి జీవితాలు పాడయిపోతాయి. ఒక మానవున్ని చంపడం సులభం. ద్వేషాన్ని, స్వార్థాన్ని రెచ్చగొట్టడం సులభం. కాని మనుషుల్లో పోయిన స్నేహాన్ని, ఆనందాన్ని సృష్టించడం కష్టం. ఇది నా ఆదర్శం. అందుకోసమే నేను తొందరపడి ఏ చర్య తీసుకోలేదు. ఒక్కటి జ్ఞాపకముంచుకోండి. మా ప్రజలు మిమ్మల్ని, మీ చౌడయ్యని ఇక్కడ బ్రతకనివ్వరు. హతమార్చి తీరుతారు. మా జన్మహక్కైన స్వాతంత్ర్యాన్ని మేం వదులుకుంటామని మీరు మనసులలో కూడా అనుకోకండి" అని సిద్ధాంతం చౌడయ్య మనుషుల్ని హెచ్చరిస్తాడు.

హాస్యధోరణిలో సాగిన ఈ నాటికలో చైనా ప్రదర్శించిన ద్వంద్వవైఖరిని, జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన ఉదారవైఖరిని, శాంతిమంత్రాన్ని, పంచశీల సిద్ధాంతాలను తిలక్ నిశితంగా విమర్శించాడు. అదే తిలక్ నెహ్రూగారు దివంగతులైనప్పుడు విపరీతంగా విలపించి 'నెహ్రూ' అనే పేరుతోనే గొప్ప కవిత రాశారు. అది ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రత్యేకవాద ధోరణితో సాగిన ఈ నాటిక ఎక్కడా ప్రదర్శింపబడలేదు. ఇదే కాదు. ఆయన రాసిన నాటకాలు, నాటికలు గొప్పగా ప్రదర్శింపబడిన దాఖలాలు లేవు.

తర్వాత నాటిక 'పొగ'. ఈ నాటికలో ధనం వల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలను, అవాంతరాలను, అనర్థాలను ప్రస్తావించారు. ఇది చాలా చిన్న నాటిక. ప్రియంవద, కవి నాయికా నాయికలు. బన్సీలాల్, అవ్వ ఇతర పాత్రలు. చిన్నప్పటినుండి ప్రియంవదకు కవిత్వమంటే పిచ్చి. ఆ పిచ్చితోనే కవిని ప్రేమిస్తుంది. తండ్రి చెప్పినా వినదు. కవి చెప్పే కవిత్వానికి, అతని తీయని మాటలకు మోసపోయి పెళ్లి చేసుకుంటుంది. తర్వాత అతడొక తాగుబోతు, తిరుగుబోతు, జూదరి అని తెలుస్తుంది. మొదటినుండి ధనవంతురాలైన ఆమె ఆస్తిని కవి సర్వనాశనం చేస్తాడు. చివరకు ప్రియంవద ఆభరణాలను కూడా తెగ నమ్ముతాడు. ఆమె తండ్రి సంపాదించిన ఇల్లు కూడా వేలంపాటకు వస్తుంది. దాన్ని కాపాడుకోవాలంటే పదివేలు కావాలి. చాలామందిని అప్పు అడిగినా ఎవ్వరూ ఇవ్వరు. ఆ సమయంలో ఆమె యుక్తాయుక్త వివేచన కోల్పోతుంది. హీనంగా బ్రతకడంకంటే మానం కోల్పోవడంలో తప్పేమిటనే నిర్ణయానికొస్తుంది. అంతవరకు ఐశ్వర్యవంతమైన జీవితమనుభవించిన ప్రియంవదకు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించడం కష్టమనిపించింది. "నిశ్చింతగా నీ వళ్లో పడుకుంటే చాలు. ఈ ప్రపంచాన్నే మరచిపోతానని, భగవంతుడు కరుణిస్తే నీ వొళ్లోనే చనిపోతానని, నీవు లేని నా జీవితమే వ్యర్థమని కవిపై ఎన్నో కలలు కన్న ప్రియంవద కుమిలి కుమిలి ఏడుస్తుంది. ఆర్థికంగా చితికిపోయి చివరకు తనను పోషించి, తన జల్సాలకు డబ్బులియ్యగలవాడే తనకు సరియైన వాడని నిర్ణయించు కొంటుంది. ఆమె అందం జూచి ఎన్నో రోజులుగా కాచుకున్న బన్సీలాల్ ఆమె దగ్గర పనిమనిషిగా ఉన్న అవ్వతో ప్రియంవద తన కోరిక తీరిస్తే పన్నెండు వేలిస్తానని ఆశ చూపిస్తాడు. ఇంటిని కాపాడుకోవాలనే తాపత్రయంతో ప్రియంవద బన్సీలాల్‌కు దగ్గరవుతుంది.

ఇద్దరూ గదిలో ఉన్న సమయంలో కవి వస్తాడు. విషయం అర్థమవుతుంది. తన తప్పేమిటో తెలిసొస్తుంది. చివరకు పశ్చాత్తాపపడి ప్రియంవదను దగ్గరకు తీసుకొంటాడు.

ఎక్కడికైనా వెళ్లి కష్టపడి బ్రతుకుదామంటాడు. ప్రియంవద సరేననడంతో నాటిక ముగుస్తుంది.

ఏ రచయితైనా ఒక నాటకాన్నో, నాటికనో రాసేటప్పుడు సమకాలీన వ్యవస్థలో ఉన్న రుగ్మతల్ని, లోపాల్ని ప్రతిబింబింపజేసే ప్రయత్నం చేస్తాడు. ఒక అంశాన్ని దృష్టిపథంలో ఉంచుకొనే పాత్రను సృష్టిస్తాడు. తిలక్ ఈ నాటికలో ప్రియంవద పాత్రద్వారా విలాస జీవితానికలవాటు పడితే జరగబోయే పరిణామాన్ని చిత్రించారు. త్రాగుడు, వ్యభిచారం, జూదం ఈ మూడూ ఎంతటి మేధాసంపన్నుడినైనా ఏ స్థితికి తీసుకొస్తాయో కవి పాత్రద్వారా విశదపరిచాడు.

ఆధునిక మానవుని అంతరంగానికి, చిత్రమైన వ్యక్తిత్వానికి, అల్లకల్లోల జీవితానికి ఈ నాటిక దర్పణంవంటిది. ఆర్థిక అంతరాలు, విపరీత వైరుధ్యాలు, ఉన్నత వర్గాలవారి వ్యక్తిత్వాలను నిశితంగా పరిశీలించి తిలక్ 'పొగ' నాటిక రాశారు. ఈ సమాజాన్ని ధనమే శాసిస్తుందని, అది పొగలా కమ్ముకొని మానవత్వమే లేకుండా చేస్తుందనే ధ్వనితోనే 'పొగ' అనే పేరు పెట్టారని మనకు తెలుస్తుంది.

ఏ నాటకానికైనా బలమైనశక్తినిచ్చేది సంఘర్షణే! ఈ సంఘర్షణకు ప్రాణం పోసేది సమస్య. కొంతమంది రచయితలు ఈ సమస్యకు పరిష్కారాన్ని అన్వేషిస్తే మరికొంతమంది సమస్యను సమస్యగానే ఉంచి సమాజానికే వదిలి వేస్తారు. తిలక్ ఈ నాటికలో పరిష్కారాన్నిచూపించి ప్రబోధాత్మకంగా తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారు.

నాటిక ప్రారంభంలో తిలక్ " ఈ నాటిక ప్రదర్శనకు వీలుగా ఉంటుందని నాకు నమ్మకం లేదు. వీలుగాఉన్నా వేయగల సాహసం ఎవరికైనా ఉంటుందన్న నమ్మకం అసలే లేదు" అన్నారు. నాటికలో సుదీర్ఘమైన సంభాషణలున్నాయి. అవి పాత్రోచితంగా, సంక్షిప్తంగా ఉండి ఉంటే ఈ నాటికను అద్భుతంగా ప్రదర్శించవచ్చు. ఏమైనా సరే ఇంతమంచి నాటికలు రచించిన తిలక్‌గారికి కవిగా, కథా రచయితగా వచ్చినంత గుర్తింపు ఆయన నాటికలకు రాకపోవడం శోచనీయం.

# 17. తిలక్ నాటికలు - వస్తు విశ్లేషణ

- డా॥ జి. పార్వతి

ఆధునిక తెలుగు సాహిత్యంలో విరబూసిన మల్లెపువ్వులాంటి స్వచ్ఛమైన కవిత్వాన్ని అందించిన కవి దేవరకొండ బాలగంగాధర్ తిలక్. అందుకే కుందుర్తి ఆంజనేయులు "మావాడు మహాగట్టవాడు" అని తిలక్‌ను గురించి అభిప్రాయపడుతాడు. దానికి కారణం తాను జీవించింది కొంతకాలమే. అయితే అందులోను సగభాగమే కవిగా సాహిత్యాన్ని సృష్టించాడు. ఆ సాహిత్యం తెలుగు భాష నిలిచి ఉన్నంత దాకా నిలిచి ఉంటుంది. ఆధునిక పాఠకునికి ఏంకావాలో పట్టుకొన్నాడు. అందుకే ఛందస్సులోనే కవిత్వానికి అందం ఉందని భ్రమపడే లోకానికి వచన కవితా రచనలు రాసి వాటిలో అనుభూతి తత్వాన్ని దర్శింపజేసి విజయం సాధించాడు. ఆయన నాటకాలు, నాటికలు, కథలు, కవిత్వం, లేఖా సాహిత్యం, వ్యాసాల ఉన్నా ఆయన కవితలకు అధిక ప్రాధాన్యం తెలుగు సాహితీలోకంలో ఉంది. ఆయన రాసిన అమృతం కురిసిన రాత్రిలో ఒక్క వాక్యమైనా రాన సాహితీకారుడు గానీ, సాహిత్య విద్యార్థిగానీ ఉండదు. ఆయన అచ్చమైన భావకవి. అసలు సిసలైన అభ్యుదయ కవి. రెండూఉద్యమాలు ఆయన సృజన సాహిత్యం సాక్షీభూతంగా నిలుస్తుంది. ఆయన రాసిన కవిత్వంలో భావకవితా భావన ఎక్కువగా ఉంటూ, అనుభూతి సాంద్రత అధికంగా ఉంటే, ఆయన రాసిన నాటకాల్లో, నాటికల్లో అభ్యుదయ భావనాజాలం కొబ్బరాకుల మాటున సూర్యకాంతిలాగా ప్రతి చోట దోబూచులాడుతోంటుంది. ఈ ప్రస్తుత పరిశోధన పత్రంలో తిలక్ నాటికల్లో వస్తు విశ్లేషణకు పరిమితమై ఈ వ్యాసం ముందుకు సాగుతుంది.

తిలక్ నాటికల్లో సుచిత్ర ప్రణయం, సుప్తశిల, పొగ, పాదుకా పట్టాభిషకమందలి "భరతుని ఏకపాత్రాభినయం", ఇరుగు పొరుగు అనే ఐదునాటికలను ఈ వ్యాసంలో విశ్లేషించడం జరిగించే ఈ ఐదు నాటికలను కూడా రెండు కోణాల్లో అధ్యయనం చేయవచ్చు.

1. సాంఘిక నాటికలు
2. పౌరాణిక నాటికలు.

ఆ రెండు కోణాల్లో తిలక్ నాటికలను పరిశీలిద్దాం.

**1. సాంఘిక నాటికలు**

సమాజం తీరు తెన్నులను సాంఘిక నాటికలు ప్రతిఫలిస్తున్నాయి. నేడు ఈ సాంఘిక నాటికలు అత్యంత ప్రజాదరణ పొందుతున్నాయి. ఈ తరాహా నాటికలు తిలక్‌వి. సుచిత్ర ప్రణయం, పొగ, ఇరుగు పొరుగులను అధ్యయనం చేయవచ్చు. తిలక్ రాసిన ఈ మూడు నాటికల్లో ధనవంతుల జీవితాలు ఉన్నాయి. అయితే అందులో సామాన్యుల జీవితం కూడా కనిపిస్తుంది. అభ్యుదయమే ఆయన ఆశయం.

మొదటి నాటిక 'సుచిత్ర ప్రణయం' పరిశీలిస్తే ఇది 1957-61లో తిలక్ రాసిన మొదటి నాటిక ఇది. ఒక పేదవాడైన యువకుడి ఆశలు, ఆశయాలు ఎలా ఉంటాయో, పగలే పగటికలలు ఎలా ఆ యువకుడు కంటాడో, కళ్ళకు కట్టేటట్లు చూపించాడు. అంతేకాకుండా అందం, చలాకీతనం, తెలివితేటలు ఆ యువకుడికి ఉన్న సుగుణాలు. దానితో జమిందారు కూతురిని ఎలా వెంటపడి ప్రేమించి, ఆ అమ్మాయి మనసు గెలుచుకున్నాడో విరచించే నాటికది.

బి.ఎ.ప్యాసయ్యిన అందమైన, తెలివితేటలు గలిగిన యువకుడు శేఖర్. తనుంటున్న గదికి అద్దె కూడ కట్టలేని దీనావస్థుడైతే పగటికళలు కనడంలో మాత్రం ఊహా లోకంలో విహరించడంలో మాత్రం మహామేధావి. అతడి వ్యక్తిత్వమేందో అతని మాటల్లోనే "జీవించడమనేది ఒక కళ. ఆ కళను ఆధారం చేసుకొని మూడు ఉప కళలున్నాయి. ఒకటి అప్పు చెయ్యడం, రెండు అబద్దాలు ఆడటం, మూడు వేషభాషలు" అంటాడు. బాగా చదువుకున్నా బలాదూర్ తిరిగే యువకుడుగా శేఖర్ కనిపిస్తాడు. అతడు సుచిత్ర అనే జమిందారు కూతురిని ముగ్గులోకి దింపడానికి ప్రయత్నం చేస్తాడు. అందు కోసం నానాతంటాలు పడుతాడు. సుచిత్ర పైకి ఛీకొట్టినా శేఖర్ అంటే మనసులో ప్రేమ ఉంది. శేఖర్ తన తెలివితేటలతో సుచిత్ర తండ్రి రామనాథం దగ్గరి కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించడం, గుమస్తా సోమయాజులతో సంభాషణ ఇవన్నీ చాలా హాస్యాన్ని కల్గిస్తాయి. చివరికి తాను సుచిత్రను ప్రేమించానని నిర్భయంగా చెప్పగలగడం శేఖర్ తెలివితేటలను మెచ్చుకొని వివాహానికి ముహూర్తం నిర్ణయించడం చకచక జరిగిపోతాయి. శేఖర్ కూడా తను చేసిన అప్పులను అకారాది క్రమంలో తీర్చడం అతడి బుద్ధిమంతుడి లక్షణాన్ని తెలియజేస్తుంది.

ఈ నాటికలో హాస్య రసపోషణ, ప్రేమ ఫలించడం నాటకీయతకు నూటికి నూరుపాళ్ళు న్యాయం జరిగించి, సముచిత పాత్ర పోషణ కన్పిస్తుంది. శేఖర్ వ్యక్తిత్వం మధ్యతరగతి యువకుల అగచాట్లు, టీనేజీలో ఉన్న వారి మనస్తత్వాన్నిన పరిచయం చేస్తుంది.

తిలక్ సాంఘిక నాటికల్లో రెండోది 'పొగ' అనే నాటిక. ఇక ఇంగ్లీషు నాటికలోని రంగస్థలాన్ని కొంత మార్చి ఈ వ్యాసంలో కథావస్తువును తీసుకున్నానని తిలక్ స్వయంగా చెప్పాడు. 'పొగ' అనే నాటిక శీర్షిక చూస్తూనే ఇదేదో వాతావరణ కాలుష్యంకు సంబంధించినదిగా పొరపాటుపడే అవకాశం ఉంది. 'పొగ' నాటికలో అందరి జీవితాల్లో ముఖ్యంగా ధనవంతులు జీవితాల్లో ధనదాహం ఒకపొగలా కమ్మేసింది. ఆ పొగ తెరచాటున వారి ఆలోచన సరళి ఎలా ఉంటుంది అనే తీరు కన్పిస్తుంది. ఈ విషయాన్నే తంగిరాల వెంకటసుబ్బారావు గారి మాటల్లో చెప్పాలంటే స్త్రీ విషయంలో "శీలం" "పాతివ్రత్యం" అనే సామాజిక భావనలను, పాతపద్ధతిలో కాకుండా, ఆధునిక నాగరిక సమాజంలో క్రొత్తగా నిర్వచించవలసి ఉంటుందని తిలక్ ఈనాటికలో సూచిస్తున్నాడని" అంటారు ఆయన.

ఈ నాటికలో ప్రియంవద చదువుకునే రోజుల్లో అందగాడైన సహచరి విద్యార్థిని ప్రేమించి తండ్రి వారించినా వినకుండా పెళ్ళి చేసుకోవడం జరుగుతుంది. అతడు వ్యసనాలు గలిగిన భావలోకంలో విహరించే కవి. అతడు గొప్పకవే గానీ పేకాట, త్రాగుబోతు, తిరుగుబోతు. ప్రియంవద ఆస్తులను, ఆభరణాలను కరిగించి వేస్తాడు. ఆఖరికి ఉన్న ఇల్లు వేలం వేసే పరిస్థితి. బన్సీలాల్ అనే సేటు ప్రియంవద పనిమనిషి. అవ్వనుమచ్చిక చేసుకొని తనకోరిక ప్రియంవద తీరిస్తే 12,000 రూపాయలు ఇస్తానని ఎరవేస్తాడు. ప్రియంవద విధిలేనిపరిస్థితుల్లో అయిష్టంగానే బన్సీలాల్‌కు లొంగిపోతుంది. ఇద్దరూ గదిలో ఉండగానే ప్రియంవద భర్త 'కవి' వస్తాడు. విషయం గ్రహిస్తాడు. తన భార్య తనను ఛీకొట్టినా బాధపడడు. తాను తనభార్య మనస్సు అర్థం చేసుకోకుండా వ్యసనాలకు ధనాన్ని తగలేసి నందుకు ఇంత పని జరిగిందని గ్రహించి ధనానికి ప్రాధాన్యమిచ్చే ఈ సమాజం నుండి దూరంగా వెళ్ళిపోయి కష్టపడి బ్రతుకుదామని, అంగీకరించమని ప్రియంవదని బ్రతిమాలుతాడు. భర్త మీద ఉన్న గాఢమైన ప్రేమ కోసం ఆమె అంగీకరిస్తుంది. భర్తతో కలసి ఇల్లు వదలి వెళ్ళిపోతుంది.

ఈ నాటికలో వస్తువు చాలా విచిత్రమైంది. ఒకకవి జీవితం గురించి మరోకవి రచించాడు. ఎంతటి గొప్పకవి అయినా, ఎంతటి గొప్ప భార్యా విధేయభగ్న

ప్రేమికుడైనా, భావనాలోకాల్లో విహరిస్తుంటే, దురవ్యసనాల పాలైతే, ధనాన్ని దుర్వినియోగంచేస్తే కలిగే ఫలాల్ని గురించి చర్చించాడు. ప్రియంవద లాంటి స్త్రీలకు డబ్బు కోసం ప్రాతివృత్యాన్ని పోగొట్టుకోవచ్చు కానీ ఆ డబ్బు శాశ్వతమని, ఎలా చెప్పగలం. తద్వారా నిజమైన ప్రేమను పొందలేము అనే సత్యాన్ని ఎరుక పరిచాడు. ఇంకా ఈ నాటికలో ప్రియంవద పనిమనిషి 'అవ్వ' అని పెట్టాడు. అది ముసలావిడ అని పాఠకులు తటుక్కున అనుకునే అవకాశం ఉంది. అందుకే తిలక్ క్లారిటీ ఇస్తూ ఆమెకు 25, 28 వయస్సు ఉంటుందని సూచించాడు. ఇప్పటికీ తెలంగాణ ప్రాంతంలో కొందరి పేర్లు కనకవ్వ, గరిగవ్వ, నరసవ్వ అని పెట్టుకొనే సంప్రదాయం ఉంది. అవ్వ అంటే అమ్మ అని అర్థం. కథ చివర బన్సీలాల్‌ను 'అవ్వ' కన్ను గీటడంకూడా ఆమె యుక్త వయస్సునే తెలుపుతోంది.

తిలక్ రాసిన మరొక సాంఘిక నాటిక ఇరుగు పొరుగు. ఇందులో పాత్రలుబట్టి వ్యంగ్యాత్మక రచనగా తెలుస్తుంది. సిద్ధాంతం, సిద్ధాంతం అనీ వేలాడితే వచ్చే కష్టాలు ఇందులో వర్ణించబడ్డాయి. 1959లో చైనా భారత్ సరిహద్దు రేఖ దాటి వచ్చి 1962లో భారత్‌పై దాడి చేయడాన్ని తిలక్ జీర్ణించుకోలేక పోయాడు. పంచశీల సిద్ధాంతాన్ని నమ్మిన నెహ్రూ అసమర్థత అని భావించాడు. ఈ నాటికలో 'సిద్ధాంతం' అనే పాత్ర ఆద్యంతం నెహ్రూను విమర్శించడానికే వాడుకున్నాడు. చుట్టు పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టలేదని తన ఇంట్లో ఉన్న వాళ్ళందరూ హెచ్చరిస్తూ ఉన్న దాన్ని లెక్క చేయకుండా ఏం జరగదులే, అదంతా ఇరుగు పొరుగువాళ్ళని అనుమానించడం మంచిది కాదని హితవు పల్కుతాడు. చివరికి జరగాల్సిన నష్టం జరిగాక చేతులు కాలాకాకులు పట్టుకుంటే లాభమేముంటుంది అన్న చందాన నాటకం ముగుస్తుంది.

ఈనాటిక ఆద్యంతం హాస్యస్ఫోరకం. నాటకీయత గొప్పగా ఉంది. నెహ్రూను ఎద్దేవా చేస్తూ తిలక్ ఈ నాటిక రాసిన నెహ్రూ అంటే తిలక్‌కు ఎనలేని భక్తి. అందుకే 1964లో నెహ్రూ మరణిస్తే గుండెలవిసేలా కవిత రాస్తాడు.

అంసపూర్ణ చిత్రాన్ని వదలి
అనిబద్ధ మాలికలను వదలి
ఎలాగ కనుగిలికి తెర తొలగించి
నిశ్శబ్దంగా నిష్క్రమించావు.

అంటూ నెహ్రూ మరణాన్ని మాత్రం జీర్ణించు కోలేకపోతాడు. అంతటి .....

ఈ ఇరుగు పొరుగు నాటకంలో చైనా మెక్‌మోహ రేఖను అతిక్రమించి వచ్చినందుకు ఆవేదన చెందుతూ రాసిన తీరు ఆయనకు భారతదేశంపట్ల ఉన్న అఖండమైన దేశభక్తిని చాటుతుంది. ఆయన భారతదేవ సమగ్రతకు భంగం వాటిల్లినప్పుడు దాని సార్వభౌమత్వం ఏ తీరులో ఉందో నాటిక ద్వారా వ్యక్తీకరించాడు. ఈ నాటికలో ప్రధానపాత్ర సిద్ధాంతం. ఆనాటి దేశ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూని, సిద్ధాంత భార్య, రాద్ధాంతం, నారాయణ, నరసింహం అనే పాత్రలు భారతప్రజలకు ప్రతీకలు. ఎంకయ్య పాత్ర సిఐడికి ప్రతీక. ఎర్రయ్య పాత్ర కమ్యూనిస్టులను, డి.ఎస్.పి. మన సైన్యాధక్షులకు, పోలీసులకు, సైన్యాలకు ప్రతీకగా తీసుకున్నాడు. ఇంటి వెనుక గల యిల్లు చైనాకు ప్రతీక. సీనారేకుల చౌదయ్య పాత్ర 'చేన్‌వన్‌లే!'' చైనా అధ్యక్షుడు. పంచశీల సిద్ధాంతాన్ని, శాంతియుత సహజీవన సూత్రాన్ని తిలక్ ఈనాటికలో నిశితంగా విమర్శిస్తూ, హాస్యరస గర్భితంగా ఎద్దేవా చేశారు. ఈనాటికలో కాల్పనిక ధోరణిలో ప్రతీకంగా పాత్రలను నిర్మించారు.

**2. పౌరాణిక నాటకాలు**

తిలక్ రాసిన పాదుకా పట్టాభిషేకము నందలి భరతుడు, సుప్తశిలను పౌరాణిక నాటకాల కోణంలో అధ్యయనం చేయవచ్చు.

'పాదుకా పట్టాభిషేకమునందలి భరతుడు' అనే ఏకపాత్రాభినయ నాటిక నిడివిలో చాలా చిన్నది.

1957–61 ప్రాంతంలో తణుకు బోర్డు హైస్కూల్లో "వైరాగ్యం" అనే గుమస్తా కోసం రాసింది అని తంగిరాల సుబ్బారావుగారు పేర్కొన్నారు. ఇది ఒక ఏక పాత్రాభినయ నాటిక.

శ్రీరాముడు వనవాసం, దశరథుడు మరణం తర్వాత భరతుడు అయోధ్యలోకి ప్రవేశించింది. శోభలేనిదైన అయోధ్యను చూసి నెవ్వెరపోతాడు. తన తండ్రి దశరథుడు మరణవార్త తెలుసుకొని గుండెలు బాధుకొని దుఃఖిస్తాడు.

పసుపు కుంకుమలేక, పైడి చేలములేక
భూషణములు లేక పొలుపుదక్కి
అశ్రుమలినమైన అమ్మల నెటుగాంచు
కాంచి ఎట్లు బ్రతక గలను నేను

అంటూ ఆవేదన చెందుతాడు. ఇంతటి ఉద్పాతానికి కారణమైన తనతల్లి కైకేయిని "ఓ మహారాజమాత! అన్నమిడిన కుక్కకు విశ్వాసమున్నది. గడ్డి తినెడి పశువునకు విశ్వాసమున్నది. నీవు కుక్కవు కావు. పశువు కావు" అంటూ నిందిస్తాడు.

"భరతుడు తల్లితో కలిసి పన్నెను వ్యూహమటంచు, లోకమే
ల్లరు నను నిందచేసెదరు. లక్ష్మణదాగ్రహవృత్తి, నాపయిన్
దొరకొను యీ కళద మిది దుర్భరమయ్యెను కాని గుండెలన్
పరపరకోపి మట; బంగరు రాముని బొమ్మయుండెరా!"

అంటూ ఈ పాతకంలో నాకు భాగముందని లోకులు నిందిస్తారు అని వాపోతాడు. శ్రీరాముని లేని చోట భరతుడు ఉండరాదని, ఆ శ్రీరామచంద్రమూర్తి ఎంతదూరం వెళ్ళి ఉన్నా తనూ అక్కడికే వెళతాను. అతణ్ణి తీసుకువస్తాను. ఒక వేళరాకున్నా వచ్చే అతని పాదుకలు తీసుకొచ్చి సింహాసనంపై ప్రతిష్టాస్తానని ప్రతిన బూనటంలో నాటిక ముగుస్తుంది.

ఈ ఏకపాత్రాభినయ నాటిక అంతసులువు కాదు. ఎదురుగా పాత్రలు ఉండవు. కొన్ని సంభాషణలు తెరచాటు నుండి చెప్పించాలి. కొన్నింటిని ఊహించుకోవాలి. అ జాగ్రత్తల నంతా తిలక్ తీసుకున్నాడు. దశరథుని మరణవార్తను, దానికిగల కారణాలను, రాముడి వనవాస విషయాన్ని తెరలోంచి చెప్పించాడు. భరతుడు కైకను చంపబోగా రాముడు వారించినట్లు ఊహించుకొని విరమిస్తున్నట్లు చూపించాడు.

తిలక్ రాసిన మరొక ఏకపాత్రాభినయ నాటిక సుప్తశిల. అంటే అచేతనంగా పడిన ఉన్న రాయి అని అర్థం. నాటకం పేరు వినగానే ఇది అహల్య జీవితం అని ఇట్టే స్ఫురిస్తుంది.

కథ పౌరాణికం. కథా బలం గల నాటిక ఇది. పౌరాణిక నాటిక అయినప్పటికీ సంభాషణలు మాత్రం వ్యావహారికంలో రాశారు. కత జగద్విదితం. కానీ రామాయణంలో, తద్వితర ఈ కథగల కావ్యాల్లో అహల్య ఇంద్రుల వృత్తాంతాన్ని రహస్య సంబంధంగా చిత్రిస్తే తిలక్ మాత్రం వారిని వెన్నెలలో విహరించి పరిష్వంగం చేసుకున్న స్వేచ్ఛా జీవులుగా వర్ణించాడు. తిలక్‌కు వెన్నెలన్నా, స్వేచ్ఛా జీవన మన్నా మక్కువ ఎక్కువ అని ఆయన కవితలు స్పష్టం చేస్తాయి. అదే ఆలోచన ఈనాటికలో అడుగడుగున కన్పిస్తుంది. ఇతరకవులు వర్ణించినట్టు అహల్యను మోహితురాలిగా

కాకుండా సౌందర్య పిపాసిగా చూపించాడు. కఠోర నియమాలు కలిగిన తాపస జీవనం కన్న స్వేచ్ఛ, సౌందర్య ఆరాధన ముఖ్యమని అహల్య గుణాలుగా వర్ణించాడు. నాగరిక మానవులకన్నా, గిరిజనులు ఇంకా స్వేచ్ఛగా బ్రతుకుతున్నారని చూపాడు.

అహల్య, ఇంద్రుల పరిష్వంగాన్ని, చూసిన గౌతముడు ఆమెనుశిలగా అయిపొమ్మని శపించి తర్వాత "అమూల్యమైన ఒక రత్నాన్ని రాయిగా మార్చివేశానా?" అని పశ్చాత్తాప పడతాడు. ఇంద్రుడు కూడా 'ఈ నిర్భాగ్య నిర్భర ప్రియుడు మాత్రం వేయి కళ్ళతో నిరంతాశ్రు సేచనతో నిన్నెల్ల వేళలా అభిషేకిస్తాడని" పశ్చాత్తాప పడుతాడు. అహల్య జీవితం అలా ఇద్దరికీ దూరం అయింది.

తిలక్ రాసిన 'సుశీల పెళ్ళి' అనే నాటికలో కూడా ఇలాంటి కథా వస్తువు అంటే ఆధునిక కాలంలో భర్తకు, ప్రియుడికి దూరం అయిన సుశీల వ్యక్తిత్వం కూడా కనిపిస్తుంది.

ఈ విధంగా తిలక్ నాటికల్లో కథావస్తువు విశ్లేషణ సాగుతుంది. అన్ని నాటికల్లో కూడా నాటిక లక్షణాలు సంపూర్ణంగా ఉన్నాయి. ప్రతి నాటిక కూడా ఏదో ఒక చక్కటి సందేశాన్ని ఇస్తుంది. ప్రతి పాత్ర సజీవ శిల్పంలా భాసిస్తుంది. అభ్యుదయాన్ని ప్రతి నాటికలో కనబరిచాడు తిలక్.

# 18. తిలక్ "అమృతం కురిసిన రాత్రి" అనుభూతి-అభివ్యక్తి

**- డా॥ పి. విజయకుమార్**

సాహిత్యంలో వస్తువు, అభివ్యక్తి, ధోరణులలో మార్పు సహజం. అన్నీ మారుతూనే ఉన్నాయి, మారనిది మార్పొక్కటే. కొన్ని యుగాలలో మార్పులు సంభవించి కొత్త ధోరణులు రావడం దానికో పేరు పెట్టుకొని పిలవడం పరిపాటి. వీటన్నిటికి ప్రధాన కారణం చారిత్రక స్పృహే. ఆధునిక కాలంలో భావకవిత్వం, అనుభూతి కవిత్వం లాంటివి సామాజికుల హృదయాలకు హత్తుకొని ప్రాచుర్యంలోకి వచ్చినవే. ఇవి ప్రజల అంతశ్చైతన్యాల స్పందనకు కామనలకు సమస్పందనలుగా, ప్రతీకలుగా ఉంటాయి. అవి ప్రజాహృదయాల ప్రతిధ్వనులు. భావకవిత్వం వచ్చినపుడు వాడిగా వేడిగా విమర్శకులు విమర్శించారు. దానిని పులుముడు కవిత్వమని వెక్కిరించినవారున్నారు. అపస్మారక కవిత్వం అని అధిక్షేపించిన వారూ ఉన్నారు. అసలు భావం లేకుండా కవిత్వం ఉంటుందా! ఇది అసలు అర్థం లేని అభివ్యక్తి అన్నవారున్నారు. కాని ప్రజలు ఆ వాదాలు విమర్శలపట్ల అనంగీకారాన్ని వ్యక్తం చేసి 'భావకవిత్వం' అని మనసారా పిలుచుకుని తనివితీరా వ్యాఖ్యానాలు చెప్పుకున్నారు. అలాగే అనుభూతి లేకుండా కవిత్వం ఉంటుందా. ఇది భావకవిత్వంలో భాగమే అనే విమర్శలు వచ్చాయి. విమర్శలు ఎన్ని చేసినా అనుభూతి కవిత్వం ఒక కవితా ధోరణిగా కొనసాగుతూనే ఉంది.

'అనుభూతి' అంటే అనుభుక్తి, అనుభవం, ప్రత్యక్షాధి ప్రమాణ జన్యుజ్ఞానం' అని నైఘంటుకార్థం. దీన్నే "ఇంద్రియముల ద్వారమున అంతఃకరణము పదార్థములపై వ్యాపించి ఆ పదార్థముల స్వరూపమును గ్రహించుట" అని వావిళ్ల వారు అభిప్రాయపడ్డారు.

ఈ అనుభూతులు ప్రపంచదర్శనం వల్ల కలుగుతాయి. అవి రెండు రకాలుగా వెలువడుతాయి. అవి - 1. లోకానుభూతులు, 2. ఆత్మానుభూతులు.

ఒక వ్యక్తి చైతన్యం సమాజవృత్తం చుట్టూ నిండి ఉన్న అనుభవాల్ని సమగ్రంగా దర్శించినపుడు సామాజికాను భూతలుగా బయటపడతాయి. అలాకాక ప్రకృతి వ్యక్తి ద్వారా అంతస్సీమల్లోకి ఇంకిపోయినపుడు స్వాప్నికానుభూతులుగా వెలువడతాయి. రెండు రకాలుగా వెలువడే అనుభూతులూ కవిత్వంగా వికసించడానికి అవకాశముంది. కాని కవి యొక్క అనుభూతి చైతన్యాన్ని బట్టి కవితా కళ వర్గీకరించబడుతుంది. అనుభూతి వైరుధ్యాలను బట్టి కవితా కళ వర్గీకరించబడుతుంది. అనుభూతి వైరుధ్యాలను బట్టి కవిత్వంలో భిన్నత్వం గోచరిస్తుంది. ఉదాహరణకు ఒకే వస్తువు, అవగాహనస్థాయినీ, మానసిక స్థితినీ పురస్కరించుకొని భిన్న అనుభూతులను అందిస్తుంది. సముద్రం ఒకరికి 'వేయి కల్ల సముద్రం'గా కన్పిస్తుంది. ఒకరికి 'వీరుని నేత్రం'లా కనిపిస్తుంది అని నందిని సిధారెడ్డి గారు అనుభూతివాదం' అనే వ్యాసంలో పేర్కొన్నారు.

Poetry is spontaneous overflow of powerful fellings అని words worth కవిత్వాన్ని నిర్వచించాడు. A vent for over charged - fellings అని Kebel పేర్కొన్నాడు. బాహ్య ప్రపంచదృశ్యాలు అంతరంగ ప్రపంచంలో దృశ్యత్వాన్ని కోల్పోయి కేవల అనుభూతిగా మిగుల్తాయని శ్రీకాంతశర్మ భావన. "అనుభూతి కళను అభ్యసించడమంటే సచేతనంగా, సబుద్ధికంగా, సంకల్ప సహితంగా జీవితాన్ని ఆచమనం చెయ్యటం అని గుంటూరు శేషేంద్రశర్మ భావించాడు.

అనుభూతివాదం తలెత్తటానికి దోహదం చేసిన స్థితిగతులను నందిని సిద్దారెడ్డి కొన్ని అంశాలుగా పేర్కొన్నారు.

1. మధ్యతరగతి మనస్తత్వం, 2. వ్యక్తివాదం, 3. శుద్ధ కళావాదం, 4. ఆనంద లక్ష్యం, 5. ఉనికి లేదా మేధావివాసనలు, 6. అత్యాధునికులమనిపించుకోవడం, 7.పరిస్థితుల సానుకూల్యం, 8. పత్రికల ప్రోత్సాహం, 9. శిల్పదృష్టి.

తెలుగులో భావకవిత్వం తరువాత వ్యక్తివాదాన్ని ప్రతిఫలించే ధోరణులుగా అస్తిత్వవాద అనుభూతివాద ధోరణులు వచ్చాయి. అస్తిత్వవాద ధోరణి పాశ్చాత్యదేశాల నుంచి దిగుమతి అయితే అనుభూతివాదం మధ్యతరగతి అసమాజికత నుంచి అనాసక్తత నుంచి వచ్చింది. అభ్యుదయ కవిత్వం స్తబ్దతలో ఉన్నదశలో భావకవిత్వానికి అంతగా భేదం లేకుండా అవతరించిన ధోరణి అనుభూతివాదం. భావకవిత్వంలో లాగే అనేక రకాల ధోరణులు మానవకారుణ్యవాదం, ఇజాల వ్యతిరేకత, మార్మికత,

'నేను' ప్రాధాన్యం మొదలైన ధోరణుల సముదాయమే అనుభూతివాదం. అనుభూతివాద కవులుగా పేర్కొన్న వారి రచనలకు సమానమైన తాత్త్విక ప్రాతిపదిక లేదు. ఒకేరకమైన దృక్పథం లేదు. ఒకరకంగా అభ్యుదయ కవిత్వానికి పూర్వరంగం భావకవిత్వం అయితే విప్లవ కవిత్వానికి పూర్వరంగం అనుభూతి కవిత్వం అని చెప్పవచ్చు.

విప్లవ ఉద్యమ ఆవిర్భావం తరువాత కూడా అనుభూతివాద ధోరణి కొనసాగింది. ఇటీవలనే అనుభూతి వాదాన్ని ఒక వాదంగా నిలబెట్టే ప్రయత్నం జరుగుతున్నది. బాహ్యప్రపంచ దృశ్యాలు అంతరంగ ప్రపంచంలో దృశ్యత్వాన్ని కోల్పోయి కేవల అనుభూతిగా మిగలటమే అనుభూతి వాదమని ఈ ఉద్యమానికి సంబంధించిన వారు నిర్వచిస్తున్నారు. అస్తిత్వవాదం ఎక్కువగా వచన రచనలోనూ, అనుభూతివాదం కవిత్వంలోను కనిపిస్తుంది" అని ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు గారు పేర్కొన్నారు. వీరి భావనలో ప్రధానంగా అస్తిత్వవాదం పాశ్చాత్యం, అనుభూతివాదం దేశీయం అనే కోణం కన్పిస్తుంది.

'అనుభూతివాదం' పేరు దగ్గర నుండే వ్యతిరేకించినవారున్నారు. "అనుభూతి వాదం అనేది ఒక నాన్సెన్సికల్ టరమ్. ఇది కవిత్వంలో ఒక వాదం ఎప్పుడూ కానేకాదు. అనుభూతి లేకుండా కవిత్వం ఎప్పుడూ లేదు. అయితే ఈ అనుభూతి వ్యక్తికి పరిమితమా? వ్యక్తులకు పరిమితమా" అన్నవే ప్రశ్నలు అని టి.యల్. కాంతారావు తనదైన విమర్శక కోణాన్ని ఆవిష్కరించారు.

అనుభూతి కవిత్వం, భావకవిత్వమనే పాత క్రీమ్‌కి కొత్త లేబుల్ మాత్రమే అన్న విమర్శక కోణం వినిపించింది. అందుకే కుందుర్తి 'అనుభూతివాదం ఇటీవలి కాలంలో భావకవితాయుగ సంబంధి' అని ఆనాడే పేర్కొన్నారు. ఈ తత్త్వాన్ని 'భావకవిత్వ చ్ఛాయ'గానే రాచమల్లు రామచంద్రారెడ్డిగారు విడమరచి చూపారు. భావకవిత్వ పోకడలను వ్యక్తిగత అనుభూతివాదం పేరుతో మళ్లీ ప్రవేశపెట్టారని ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు విశ్లేషించారు. సమాజంలో భుక్తమౌతున్న అనుభూతులను సాహిత్యం ద్వారా నెమరుకు తెచ్చి అనుభోక్తవ్యాలుగా చేసేవాడు రచయిత. అనుభోగమే అనుభూతి. అనుభూతికి ప్రేరణం కవిత; అభివ్యక్తి ప్రక్రియ; అభివ్యక్తమైన కవితా ప్రక్రియ కవికెంత అనుభవసిద్ధమో సహృదయ సమాజానికంత అనుభవ సాధ్యం.

ఆధునికాంధ్ర సాహిత్య ప్రయోగాలను సమీక్షిస్తే అనుభూతిని ఆస్వాదయోగ్యంగా చెయ్యడానికి రచయితలు, సామాజికులు పాటించే పద్ధతులు ప్రధానంగా మూడు

రకాలుగా వివేచించవచ్చు.

1. సాధారణీకరణం, 2. సామాజికీకరణం, 3. స్వాత్మీయీకరణం అని జి.వి. సుబ్రహ్మణ్యంగారు విభజించారు. పై మూడు లక్షణాలలో స్వాత్మీయీకరణం ప్రధానంగా ఆత్మాశ్రయ కవిత్వం చదివి లోకం అనుభూతి చెందే విధానంగా భావించవచ్చు. చలం అన్నట్లుగా "లోకం బాధ కవి తనదిగా వ్యక్తంచేసినా, తన బాధే లోకం బాధగా వ్యక్తంచేసినా ఆత్మాశ్రయస్వభావం మాత్రంతప్పదు. కవి స్వీయానుభూతిని ఆత్మ నాయకంగా, స్వాత్మీయీకరణంలో వ్యక్తీకరిస్తాడు. సామాజికునికి అనుభవయోగ్యమైన స్వీయానుభవాన్ని కవితలో కవి వ్యక్తీకరించడం, దాన్ని సామాజికుడు ఆత్మీకరించుకొని తాదాత్మ్యంతో కవి వ్యక్తీకరించడం. దాన్ని సామాజికుడు ఆత్మీకరించుకొని తాదాత్మ్యంతో అనుభవించడం అనే ప్రక్రియ ఇందులో గాఢంగా కనబడుతుంది. అందుకే స్వాత్మీయీకరణం అనుభూతి కవిత్వానికి కూడా వర్తిస్తుంది. అనుభూతి కవిత్వం ప్రధానంగా జీవచైతన్య ప్రవృత్తికి సంబంధించింది. భావకవిత్వయుగం కాల్పనిక ప్రవృత్తి ప్రధానంగా సమాజ సమగ్రానుభూతిని సాధించాలని ప్రయత్నిస్తే అనుభూతి కవిత్వధోరణి ఉద్యమచైతన్యాన్ని నంతరించుకుని జీవచైతన్య ప్రవృత్తి ప్రధానమైన సమగ్రానుభవ స్ఫూర్తిని సమాజానికి అందించే ప్రయత్నం చేస్తున్నదని నిస్సంశయంగా చెప్పవచ్చు. సమాజ సమగ్రానుభూతి నందింపగల్గిన సాహితీ ప్రక్రియావిష్కారం సామాజిక చైతన్యంలోని పంచవిధ ప్రవృత్తులకు అనుభవాన్ని అందింపగల్గిన సాహితీస్పృహను, నవీన ప్రయోగాలను సాహిత్యరంగంలో సాధించటమే అనుభూతి కవితోద్యమ గమ్యం అంటారు ఆచార్య జి.వి. సుబ్రమణ్యం. అంతరిస్తున్న అనుభవ స్పృహని పునరుజ్జీవింప చేయడానికి అనుభూతివాదం తలఎత్తింది. అనుభూతి సమగ్రత కోసం సాహిత్యం ఉద్యమించడమే యుగధర్మం. 'ఆధునికాంధ్ర సాహిత్యంలో నవ్యకవిత్వయుగం విభిన్న ప్రక్రియల ద్వారా అనుభవాన్ని సాధించింది అని కూడా జి.వి. సుబ్రహ్మణ్యం గారు తన భావనను వెలిబుచ్చారు.

ఆధునిక సాహిత్యయుగంలో భావకవిత్వం తరువాత ఒకవిధమైన స్తబ్ధత ఏర్పడటం, పాఠకుడు ఉత్తమ సాహిత్యం కోసం అన్వేషణ మొదలుపెట్టడం, ఆ అన్వేషణ అనుభావం వైపు మళ్ళడం, అనుభావం క్రమక్రమంగా విస్తృతిచెంది అనుభూతివాదంగా మారింది. ఆర్.ఎస్. సుదర్శనంగారు 'అనుభూతి కవిత్వం' గూర్చి పేర్కొన్న భావనలను పరిశీలిద్దాం.

1. అనుభూతి కవితగా గుర్తు పట్టడానికి ప్రధానమైన లక్షణం కవిత. చదివిన తర్వాత మిగిలేది ఒక సందేశం. ఒక భావం, ఒక దృక్పథం, కాకుండా కేవలం అనిర్దిష్టమైన అనుభూతి కావాలి. అది పోలికల ద్వారా ఊహల అల్లికల ద్వారా ఇంద్రియ సంవేదన రేకెత్తించే వర్ణనల ద్వారా కావచ్చు. కానీ అందులోని నవ్యత హృదయానికి హత్తుకొనే అనిర్వచనీయమైన అనిర్దిష్టమైన అనుభూతిగా మిగలాలి.

2. అనుభూతి బుద్ధితో అర్థం చేసుకునేది కాదు. కొన్ని పరిస్థితుల్ని కల్పించి, ఇతరుల్లో అనుభూతి కలిగే ప్రయత్నం వరకూ మనం చేయవచ్చు. అప్పుడు కూడా వాళ్ళు పొందినట్లు నమ్మి ఊరుకుంటే మనం ఏమి చెయ్యలేం. అది నమ్మకమే అవుతుంది తప్ప అనుభూతి కాదు. కవిత్వాస్వాదనం కూడా అంతే.

3. అనుభూతి కవిత్వానికి సంగీతంతో అవసరంలేదు.

4. కాల్పనిక వాదకవుల్లో శృంగారం, కరుణలాంటి సాంప్రదాయికంగా గుర్తించదగిన రసపోషణ, పాత్రపోషణ, సన్నివేశ చిత్రణ ఉంటాయి. అనుభూతి కవిత్వంలో అనుభూతి నిర్దేశం పాఠకుడికే వదలిపెడుతుంది.

5. కాల్పనిక కవిత్వంలో సెంటిమెంటలిజమ్‌లోకి దిగజారిపోవడం కన్పిస్తుంది. అనుభూతి కవిత్వంలో అది కన్పించకూడదు. కన్పిస్తే అనుభూతి భంగమౌతుంది. ఆ అనుభూతికి అవరోధమయ్యే ఆలోచనా సామగ్రిని వర్జించడమే అనుభూతి కవి లక్ష్యం.

ఆధునిక కవిత్వంలో 'అనుభూతి' కవిగా ముద్రవేసుకున్న మొట్టమొదటి కవి తిలక్. ఏ అనుభూతిని ఎంత పరిమాణంలో ఏ తీవ్రతతో తాను పొందాడో అతని మాటల ద్వారా మనకి అందివ్వగలిగిన వాడు నిజమైన కవి అన్నాడు తిలక్. "తిలక్ తాను ప్రధానంగా అనుభూతి వాదినని బల్లగుద్ది చెప్పుకున్నాడు. ఈ అనుభూతివాదం ఇటీవలికాలంలో భావకవితా సంబంధి. ఇది వ్యక్తివాదమునకు మరియొక పేరు అని మొదటిగా తిలక్‌లోని అనుభూతిని గుర్తించి 'కుందుర్తి ఆంజనేయులు' 'అమృతం కురిసినరాత్రి' కి రాసిన పీఠికలో పేర్కొన్నాడు. వినూత్న అనుభవాలు అక్షరరూపం దాల్చడం, పాఠకుని కవి యొక్క అనుభూతి హృదయానికి పట్టి వేసేదిగా హత్తుకోవడం అన్నవి తిలక్ అనుభూతివాదంలో కనిపించే రెండు ప్రత్యేక దృక్పథాలు. భావుకతలో నవకవితా యాత్రికుడు తిలక్. భావకవితలో కలం పట్టి అభ్యుదయ కవిత మీదుగా అనుభూతి కవితాప్రస్థానం సాగించిన కవి తిలక్. సంప్రదాయ సాహిత్యాన్ని జీర్ణం చేసుకొని నవకవితా సృజన చేసిన కవి తిలక్. వచన కవితకు ఒక విలువను కల్పించి స్వంత గొంతుక వినిపించి తనదైన శైలితో తనకొక స్థానాన్ని పదిలపరుచుకున్న

మేటికవి తిలక్. తిలక్ అక్షరాలు వచన కవితలోని సమగ్రాంగాల సౌందర్యాన్ని సమ్మిళితం చేసుకున్నాయి.

"ప్రాణానికి ఏ రూపం కావాలో, ఏ రూపం సరిపోతుందో ప్రాణమే నిర్ణయించు కుంటుంది" అంటాడు తిలక్. తిలక్ తాను పొందిన అనుభూతిని పాఠకులకు అదే అనుభూతిని అందించాడు. అమృతం కురిసిన రాత్రి నవత – కవిత' ఖండికలో తిలక్ పేర్కొన్న కవితలో పరిశీలిద్దాం.

మిత్రమా!

కవిత వున్నప్పుడే నవత రాణిస్తుంది
అసలు కవితలోనే నవత కూడా వుంది
కాని, మోడరన్‌గా వుందామనీ, ఏదో అందామనీ
తనకే తెలియని అస్పష్టపు అనుభూతిని
అర్థంలేని ఇమేజరీతో కలగాపులగపు వర్ణనలతో
డిలాన్ థామస్‌కు చేతకాని అనుకరణలతో
ఒక దేశం నిర్దేశించలేని వాక్యాల వికారంతో
ఎందుకు బాధిస్తావు నన్ను, బాధపడతావు నువ్వు.
కవిత్వంలో అబ్స్‌క్యూరిటీ కొన్ని సందర్భాలలో వుండొచ్చును.
కానీ పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాలి. హత్తుకోవాలి.
అది ట్రాన్స్‌పరెంట్ చీకటై వుండాలి. నిన్ను పలకరించాలి.
కవిత కొత్త అనుభవాల కాంతి పేటికను తెరవాలి. కదిలించాలి.

లోలోపల అనుభూతులకు అక్షరరూపాల్నివ్వడం, అక్షరకల్పన చెయ్యడంలో తిలక్ అందెవేసిన చెయ్యి. చేతకాని అనుకరణలతో అయోమయం సృష్టించే వారిని దృష్టిలో ఉంచుకొని 'కవిత' ఉంటేనే నవ్యతాకోణం ఆవిష్కరిస్తుందని పాఠకులకు కొత్త అనుభూతిని అందించాలంటాడు. పై కవితలో తిలక్ స్పష్టం చేసిన ప్రధాన అంశాలు రెండు.

1. కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి, కదిలించాలి.

2. పాఠకుడికి కవి అనుభూతి ఆకారం అందాలి. హత్తుకునేలా చేయాలి అనే పల్కులు కవిత్వానికి అనుభూతి ప్రాధాన్యత ఎంతటిదో వ్యక్తం చేశాడు.

తన కవితా తీరును తానే 'నా కవిత్వం' కవిత ద్వారా వ్యక్తం చేశారు.

"నా కవిత్వం కాదొక తత్త్వం
మరి కాదు మీరనే మనస్తత్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం
కాదయ్యా అయోమయం, జరామయం,
గాజుకెరటాల వెన్నెల సముద్రాలూ
జాజిపువ్వుల అత్తరు దీపాలూ
మంత్రలోకపు మణిస్తంభాలూ
నా కవిత చందనశాలా సుందరచిత్ర విచిత్రాలు.
అగాధ బాధా పాథః పతంగాలూ
ధర్మవీరులకృత రక్తనాళాలూ
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతి సూక్తి
నా కళాకరవాల ధగద్ధగ రవాలు
నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు

పదచిత్రాలతో లోతైన భావుకత, అందమైన అనుభూతిని అభివ్యక్తం చెయ్యడంలో తిలక్ నేర్పరి; కూర్పరి. గాజుకెరటాల వెన్నెల సముద్రాలు అన్న భావనలో కాంతిని వెదజల్లే తత్త్వాన్ని 'గాజు', భావాల వెల్లువను 'కెరటాలు', ప్రకాశవంతమైన గుణాన్ని 'వెన్నెల' అనే పదాలతో గుణాల్ని తెలియజేసారు.

తిలక్ కవిత అభ్యుదయ కవిత్వం కొన్నిపాళ్ళు. భావకవిత్వం కొన్ని పాళ్ళు కలిసిన మిశ్రమరూపం. అందుకే "నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు" "నా అక్షరాలు వెన్నెలలో ఆడుగునే అందమయిన ఆడపిల్లలు" అని తిలక్ చెప్పుకున్నారు. ఇందులో తిలక్ భావమేదైనా మొదటిది కావ్యవస్తువును గురించి, రెండవది తనశైలిని గురించి చెప్పినట్లు స్ఫురిస్తుంది. ''భావన ఎంత అభ్యుదయకరమైనదైనా సుందరంగా వ్యంగ్య విలసితంగా చెప్పలేకపోతే రాణించదు. అభ్యుదయ కవిత్వాన్ని కూడా పేలవంగా కాకుండా అందంగా చెప్పుదాం అన్నదే తిలక్ ఆచరణ ద్వారా చేసిన సూచన అని కుందుర్తి ఆంజనేయులు భావన సమంజసమైనది.

"నా అనుభూతి నాది – దానిని నేను ఆవిష్కరిస్తాను" అనే తత్త్వం కవి పొందిన ప్రధాన అనుభూతుల ఆకృతిలో కవిత్వం దర్శనమిచ్చే ఏర్పాటు; ఇంతవరకైతే ఎవ్వరికీ ప్రమాదం ఉండదు. ఎందుకంటే వస్త్వాశ్రయ కవితలో కూడా పాత్రలస్వభావ, స్వరూప చిత్రణ, వివిధ రసముల నిర్వహణ మొదలగు వాటిలో కవి యొక్క అనుభూతి ప్రధాన పాత్ర వహిస్తూనే వుంటుంది. కాని యీ అనుభూతి వాదం ఈ వ్యక్తివాద ప్రాబల్యం సమాజాన్ని మింగేదిగా వున్నప్పుడే చిక్కు వస్తుంది. కవి భావనలో సామాజిక ప్రయోజన చైతన్యం మృగమయ్యేటంత వరకు వ్యక్తిత్వం విసృతమైతే ఆ కవి ప్రజలకు పూర్తిగా దూరమైపోక తప్పదు. దీనిని తిలక్‌కు అన్వయించి చూసినప్పుదు తిలక్ తన కవితను గురించి తానేవిధంగా నిర్వచించుకొన్నప్పటికీ అతని ఊహలో అడుగడుగునా అభ్యుదయ భావావేశం తొంగిచూస్తూనే వుంటుంది అని కుందుర్తి భావన. భావ, అభ్యుదయ సౌందర్య దృక్పథాలు అక్షరాలలో ఒదిగి పాఠకులకు అనిర్వచనీయమైన అలౌకిక అనుభూతిని కల్గించాయని చెప్పవచ్చు.

అమృతం కురిసిన రాత్రిలో అందరూ నిద్రపోతుంటే తాను మాత్రం ఎక్కడికో దూరంగా వెన్నెల మైదానంలో వెళ్ళి నిలుచున్నాడట. అక్కడ తన అనుభూతి తనదైన అభివ్యక్తితో ఎంత సౌందర్యాత్మకంగా వర్ణించాడో పరిశీలిద్దాం.

"ఆకాశం మీద అప్సరసలు
ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు
వారి పాదాల తారామంజీరాలు
ఘల్లు ఘల్లని మ్రోగుతున్నాయి
వారి ధమ్మిల్లాల పారిజాతాలు
గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి
వారు పృధు వక్షోజ నితంబ భారలై
యౌవనధనుస్సుల్లా వంగిపోతున్నారు"

ఈ అనుభూతి అనుభవిస్తే గాని అవగతమవ్వదు. అప్సరసలు తనని చూసి కిలకిలా నవ్వి

"చూడు వీడు
అందమైన వాడు
ఆనందం మనిషైన వాడు

కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం ధరించాడు
కళ్ళ చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు
ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు
ఎవరికి దొరకని రహస్యాన్ని వశపరచుకున్నాడు
జీవితాన్ని ప్రేమించినవాడు జీవించడం తెలిసినవాడు
నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు
ఇతడేసుమీ మన ప్రియుడు నరుడు మనకి వరుడు"

తనను గురించి తాను ఎంత అందమైన అభివ్యక్తితో తన అనుభూతిని అప్సరసల అనుభూతిగా వర్ణించడంలో ఎంత నిష్ణాతుడో పై కవితోక్తుల ద్వారా స్పష్టమవుతుంది.

"జలజలమని కురిసింది వాన
జాల్వారింది  అమృతంపుసోన
దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చాను
దుఃఖాన్నీ చావునీ వెళ్ళిపోమ్మన్నాను
కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను
జైత్రయాత్రా పథంలో తొలిఅడుగు పెట్టాను"

కవిత చదువుతున్నప్పుడు అనుభూతి కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది. కళ్ళు మూస్తే ఆ దృశ్యం మన ముందు సాక్షాత్కరిస్తుంది. ఆ అభివ్యక్తిలో అనుభూతి అణువణువు దర్శనమిస్తుంది.

తన జీవితంలో ఎన్నో హృదయవిదారకమైన సంఘటనలను చూసి ఆర్తితో 'ఆర్తగీతం' రాశాడు. "నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు / కింద మరణించిన ముసలివాణ్ణి / నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెన కింద / నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిలిన దృశ్యాన్ని / నేను చూశాను నిజంగా తల్లి లేక, తండ్రిలేక, తిండిలేక / ఏడుస్తూ ఏడుస్తూ / ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికికాల్వ / పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి / నేను చూశాను నిజంగా పిల్లలకు గంజికాచిపోసి / తాను నిరాహారుడై / రుద్ధ భాష్పాకులిత నయనుడై ఆఫీసుకు వచ్చిన వృద్ధుని / ప్యూన్ వీరన్నని; / నేను చూశాను నిజంగా క్షయగ్రస్త భార్య యిక బతకదని / డాక్టరు చెప్పినపుడు / ప్రపంచ వాతూలహత నీపశాఖవలె గజగజ /

వణికిపోయిన అరక్త అశక్త గుమాస్తాని / అయిదారుగురు పిల్లలు గలవాణ్ణి / నేను చూశాను నిజంగా మూర్తీభవత దైన్యాన్ని, హైన్యాన్ని / క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛత శవాకార వికారుల్ని / ఇది ఏ నాగరికతకు ఫలశృతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి? / ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి?" ఇలాంటి దయనీయమైన పరిస్థితులను చూసి స్పందించి "నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను సిగ్గుతో రెండుగా చీలిన వెదురుబొంగును మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను" అని నాపైన బాధ్యత ఉందని "పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్పవలసినవాణ్ణి రసాతల మంట శిరస్సు వంచినవాణ్ణి అంటాడు.

ఎంతో బాధను అనుభవించి "నా దేశాన్ని గూర్చి పాడలేను, నీ ఆదేశాన్ని మన్నించలేను అంటాడు తిలక్. మానవ సమాజంలో మానవత్వం కనుమరుగయ్యిందని, "మానవతలేని లోకాన్ని స్తుతింపలేను, మానవునిగా శిరసెత్తుకు తిరగలేను. ఈ నాగరికతారణ్యవాసం భరించలేనంటాడు. తన గుండె గూడుపట్లు ఎక్కడో కదిలాయని, తన కనులు వరదలైపారాయని, తన కలలు కాగితపు పేలికలై రాలాయంటాడు.

"ఒక్క నిరుపేద వున్నంతవరకు, ఒక్క మలినాశ్రు
బిందు వొరిగినంత వరకు,
ఒక ప్రేగు ఆకలి కనలినంత వరకు
ఒక్క శుష్క స్తన్య సన్నిధిని క్షుధార్తి నేడ్చు పసిపాప
ఉన్నంతవరకు
ఒక తల్లి నీరవాక్రోశ రవమ్ము విన్నంత వరకు
ఒక క్షత దుఃఖిత
హృదయ మూరడిల్లనంత వరకు,
ఓ నేస్తమా! నాకు శాంతి కలగదని, నేను నిగర్వినయ్యానని,
ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేనంటాడు తిలక్"

"ఒక్క దుఃఖితుడు నవ్వినపుడు / ఒక్క పతితుడు కన్విప్పినప్పుడు / అక్కడ నా అడుగుజాడ గుర్తించగలవు అంటూ తన కవిత్వ పరమార్థం తెలియజేశాడు తిలక్. మధ్యతరగతి కుటుంబాలలో గల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చక్కని అనుభూతితో కవిత్వీకరించాడు. ముత్తాత, తాత, తండ్రి, గుమాస్తాలుగా గల కుటుంబంలో పుట్టిన

అయినాపురం కోటేశ్వరరావు అకాలంలో కాలధర్మం చెందడాన్ని చక్కని అభివ్యక్తితో 'సిఐడి రిపోర్టు'ద్వారా విశిష్టమైన అనుభూతిని మిగిల్చాడు. అయినాపురం కోటేశ్వరరావు కుటుంబం సాంప్రదాయకమైన వినయ విధేయతలకీ, గౌరవప్రదమైన దరిద్రానికీ వాళ్ళవంశం ఒక రాస్తాలాంటిదంటాడు. వీళ్లింట్లో ఆరుగురు పిల్లలూ, ఒక ముసలితల్లీ, ఒక్క పిల్లీ, ఒక్కర్తే నీరసంగా ఉన్న భార్య, కేవలం రెండున్నర గదుల్లో నివాసం, టెలివిజన్ లాంటి బాత్‌రూము ఒక అటకా అంటాడు.

"ఇతను ఎర్రచొక్కాలు ధరిస్తాడు. కాని కమ్యూనిస్టుకాదు
ఇతను సందుల్లోంచి నడుస్తాడు, కాని సర్రియలిస్టు కాదు
నడుస్తూ నడుస్తూ నవ్వుతాడు, గొణుక్కుంటాడు, కాని యోగి కాదు
అలా ఆకాశంకేసి వెర్రిగా చూస్తాడు, కాని అసలు కవే కాదు
ప్రతినెలా పాలబాకీ, కిరాణా కొట్టు బాకీ అణాపైసలతో ఇచ్చేస్తాడు
అందుకని ఆఖరి వారంలో భార్యతో కలిసి రాత్రుళ్ళు వస్తుంటాడు
హరికథలకీ, వీధినాటకాలకీ అప్పుడప్పుడూ వెళుతుంటాడు
లంచాలుపట్టడు, ఎవర్నీ తిట్టడు, ఎవరేమన్నా పట్టించుకోడు
నీతి నిజాయితీ వున్నవాడు, నిర్మలమైన దైవభక్తి వున్నవాడు

కాని చనిపోయేముందు రోజునే కనకయ్య అనే మిత్రుణ్ణి కలుసుకుని సుఖమంటే ఏమిటి? ఎలా వుంటుంది? ఎక్కడ దొరుకుతుంది? అని అడిగాట్ట.

ఈ సందేహం అతని జీవితానికే మచ్చ. ఇంకా పెరిగి పెద్దదవకుండా అతను మరణించడం దేశానికే రక్ష. జీవితాలు ఎంత బాధాతప్తంగా దర్శనమిస్తున్నాయో 'సుఖం' అంటే ఏమిటో తెలియకుండానే పరమపదియైన కోటేశ్వరరావు నిజజీవితంలో ఎన్నో జీవితాలకు ప్రతీకగా నిల్చిందని చెప్పవచ్చు. సమాజంలో ఎన్నో పరిస్థితులు, వేదనలు, తిలక్‌ను ప్రభావితం చేసాయి.

"చీకటి పడేవేళ / చిరుతపులులు పశువుల్ని నోట కరుచుకొనిపోయే వేళ / పాడుబావిలోకి పడుచు విధవలు దూకే వేళ / చచ్చిన చరిత్ర బొమికలు కోసం కుక్కలు కొట్లాడుకునేవేళ / దెయ్యపు మర్రిచెట్టు మీద దీపంగా అరుస్తూ పిట్టలు కళ్ళు/ తేలవేసే వేళ/ఏదో భయంభయం / చుట్టూ నురగవిషం / ఉరగ విషం/ మృషా విషం / బాధావిషం / దుఃఖ విషం / పొర్లి పొర్లి పొంగి పొంగివస్తున్నది" అంటూ "అమ్మా వెళ్ళండమ్మా / ఎందుకిలా వొంగివొంగి కుంగికుంగి / ఈ సమాధుల చుట్టూ

వెతుక్కుంటూ తిరుగుతారు / శవాలు మాట్లాడవు / సమాధులు చూపించవు / మృత్తిక గుర్తించదు / మిత్తికి దయ వుండదు / మీ రోదన మీలోనే అణచుకుని / మీ కళ్ళను మీరే పొడుచుకుని/అంటూ వెళ్ళిపొండి వెళిలపొండి" అంటూ తన ఆవేదనను వెలిబుచ్చారు.

కాలం విరిగిన బండి చక్రంలా కదలలేక పడిపోతే / మొండిచేతుల మానవత్వం తెల్లబోయిన దీనదృశ్యం / మీరెపుడైనా చూశారా / కన్నీరైనా విడిచారా / ముడుచుకున్న కాగితపు గుండెలు చిరిగిపోకపోతే / అణచుకున్న నల్లని మంటలు ఆకాశానికి రేగకముందే / మీరిపుడైనా మేల్కొంటారా / చీకటి తెరలను చీలుస్తారా / ప్రభాత విపంచిక పలికిస్తారా?" అని పిలుపునిచ్చి ప్రశ్నిస్తున్నాడు తిలక్. సైనికుడి ఉత్తరంలో "తెల్లని దళసరి మంచు రాత్రిచీకటికి అంచు" అనే ఊహాచిత్రాన్ని అందమైన అభివ్యక్తితో వ్యక్తీకరించారు.

"అబ్బ, వణికించే చలి
అందరూ నిద్రపోతున్నారు
అందరూ చచ్చిపోతున్నారు
అర్ధరాత్రి దాటిందని మోగిన ఒంటిగంట
మంటలా మొహాన్ని కొట్టింది
నేనిదివరకటి నేను కాను
నాకు విలువల్లేవు
నాకు అనుభూతుల్లేవు
చంపడం, చావడం

మీసం దువ్వడం లాంటి అలవాటయ్యింది" అని సైనికుడి అనుభూతులుల్లేవని అతని అనుభూతిని తన అనుభూతి కవిత్వం ద్వారా అభివ్యక్తం చేశాడు.

తెల్లవారేటప్పుడు "దూరంగా ఆల్ప్సు మీద మంచు, దుఃఖంలా కరుగుతోంది / ప్రభాతం, సముద్రం మీద వెండినౌకలా ఊగుతోంది" అని "చలి గుండెల మీద కత్తిలా తెగింది / నీ రూపం నా దేహానికి వెచ్చగా తగిలింది'' అంటాడు. "అందమైన తెల్లని నవ్వు నీ మెడలో / గొలుసు గొలుసులుగా కదిలినప్పుడు / అదోవిధమైన చెమ్మగిల్లిన చూపు / నెమలి రెక్కలా విప్పుకున్నప్పుడు'' అంటూ ఎన్నాళ్ళకి / ఎన్నాళ్ళకి కొన్ని వేలమైళ్ళ దూరం మన మధ్య ఒక యుగంలా అడ్డుపడింది అంటాడు సైనికుడి మాటల్లో.

"కాలానికి ఒక రూపం లేదు / దానికి పాపం లేదు / కాలం అద్దం లాంటిది.

"అంధయుగమైనా స్వర్ణయుగమైనా అది మన ప్రతిబింబం
కాలం వలయం లాంటిది దానికి కేంద్రం లేదు
కాలం జాలం వంటిది
కళ్ళు మూసుకుని నడిస్తే ఉచ్చులో పడుతాడు
శక్తిపరుడు యుక్తిపరుడు దాన్ని ఛేదిస్తాడు" అంటాడు.

కాలం సవాల్ వంటిది / సాహసవంతుడందుకొని ముందు సాగిపోతాడు / చప్పబడిన పెద్దన్నయ్య చతికిల బడిపోతాడు అంటాడు. మురికి కాల్వమీద ముసలితనం మీద మృషాజగతి మీద / మృషాజగతిమీద / మహోదయం వికసించదు, వసంతం హసించదు అంటాడు. "సాహసికానివాడు జీవన సమరానికి స్వర్గానికి పనికిరాడు. ఇలా స్పష్టమైన అభివ్యక్తి చేయడంలో తిలక్ సిద్ధహస్తుడు.

అస్థిమూల పంజరాలు/ఆర్తరావమందిరాలు/ఏ లోకంతల్లీ, యిట ఏవో భాష్పజలాలు/కూడులేని లోకం యిది/గుండెలోతు తాపం యిది / సోమయాజి శాపం యిది/భూమి అడుగులోకం ఇది/అంటూ భూలోకం స్థితిగతులను అభివ్యక్తం చేశాడు.

"వంగదేశ క్షామం యిది
వ్యంగ్య భాష క్షేమం యిది
పర ప్రభుత్వ దానం యిది
ధనికలోక ధర్మం యిది
కాలు కడుపు యిమ్మన్నది
గాజు మేడ లేదన్నది
అన్నపూర్ణ కంటి ముందు
కనపడినది రక్తబిందు
ఇది కలికాలం అబ్బీ – యిట
కళ్లు లేని పాపం యిది"

అని ఈ భూలోకంలో అస్థిమూల పంజరాలు, ఆర్తరావ మందిరాలు పలకలేని గులకరాళ్లు అంటూ సమాజస్థితిని కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

చీకట్లో చీకటి కనపడదు / దీపం పాపం వంటి చీకటిని చూపెడుతుంది / దీపాల మధ్య చీకటి దివ్యంగా మెరిసిపోతుంది / అని "దీపం ఆసరాతో చీకటి నిజాన్ని తెలుసుకో / పాపం ఆసరాతో మానవుడి నైజాన్ని తెలుసుకో" అంటూ చక్కని

ఊహాచిత్రాలు, పదబంధాలతో అందమైన భావాలతో పాఠకులకు చక్కని అనుభూతిని మిగిల్చాడు.

"ప్రతి మాటకీ శక్తి వుంది, పదును వుంది
ప్రతి చిత్రణకీ అర్థం వుంది, ఔచిత్యంవుంది
గులకరాళ్ళ డబ్బా మోగించి గొప్ప సంగీతం అని దబాయించకు
అలిగి నన్ను శపించకు, అన్నా నీ మీద నాకు కోపం లేదు"
"గంతలు కట్టినంత మాత్రాన గాడిద గుర్రం కాదు
ఖద్దరు ధరించిన ప్రతివాడూ గాంధేయుడు కాదు
ఆధునికత వున్నంత మాత్రాన ప్రతిదీ శిరోధార్యం కాదు
ఆహార్యం మార్చినంత మాత్రాన సామాన్యుడు మహారాజవదు
అంత్యప్రాసలు వేసినంత మాత్రాన ప్రాసైక భావం పొయెట్రీ అవదు
"కవిత్వం ఒక అల్కెమీ దాని రహస్యం కవికే తెలుసును" అంటాడు.

ఈ కాలంలో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించమంటాడు. నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి, నీలోంచి రావాలి, చించుకుని రావాలి గాని ఎవరిదో అయి ఉండకూడదు నీదైన అభివ్యక్తి ప్రత్యేకంగా ఉండాలంటాడు.

"మాటలు పేర్చడం కవిత కాదు, మంత్రం తంత్రం అసలే కాదు
మళ్ళీ యీనాడు చిత్రకవితల్నీ, అయోమయబంధాల్నీ పునరుద్ధరించకు
నిగ్రహప్రగ్రహాలు లేని భావాశ్వాలని బరి మీద వదలకు
అన్నా! కవితవం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి"

అని కవిత్వంలో అగ్ని జల్లడం, అమృతం కురిపించడం అవలీలగా చేయగలిగిన తిలక్ అందం, ఆనందం కవిత్వం పరమావధిగా పేర్కొన్నాడు.

ఒకనాడు నే ప్రొఫెసర్ని / సామ్యవాదిని / గ్రంథకర్తని / అపుడు భవిష్యత్తు రంగు రంగులవల / ఈనాడు గుండెలో మెదిలే పీడకల / నేడు కనుల సందుల నిరాశ / మసిమసిగ పాకిపోయె / కసికసిగ / ముసలివాణ్ణి నాయనలారా / ముసలివాణ్ణి" అని నాడు, నేడులను / బేరీజు వేసి కవిత్వీకరించాడు.

ఏ నిశ్శబ్ద ప్రపంచాల మధ్య / ఏమిటీ నా కళ్లు మాట్లాడుతున్నాయి / ఉత్తర ధృవంలో మంచువంటి తెల్లని / హృదయం గలదానా ఆడదానా / ఎన్ని పూర్వజన్మల

స్మృతుల జాడలు / ఈ క్షణంలో నీకనురెప్పల నీలినీడలు / నక్షత్రాల మధ్య ఆకాశం వంటి / నల్లని కళ్ళదానా ఓ ఆడదానా / సృష్టి ముందటి చీకటిలోంచి ఏరుకున్న / సౌందర్యాన్ని నీ కళ్ళలో నింపుకున్నావు / సృష్టి చివరి లయలోని శూన్యాన్ని నన్ను / స్పష్టమవని కామంలో బంధించుకున్నావు / చీకటి వంటి నీ విచిత్ర వీక్షణార్షణకి / సంధ్యా గగనం మీద ఎర్రని ఆందోళనని / క్షితిజ రేఖలా వంగిన నీ భుజాల వొంపు దగ్గర / చెదరి విరిగిన సముద్రపు కెరటాన్ని నేను / ఆడదానా అద్భుతమైన దానా నిక్వణత్ వీణా / అర్థంలేని నన్ను చుట్టుకున్న పరమార్థానివి నువ్వు" అని "స్వర్గనరకాల సరిహద్దుల మధ్య నిలిచి నీవు సమ్మోహమంత్రం జపించే శృంగారావధీ విధీ / నాకు తల్లివి, నెచ్చెలివి, చెలివి, నన్ను కౌగిలించుకున్న పెద్ద పులివి" అని 'ప్రవహ్లిక'లో వ్యక్తం చేశాడు.

యుద్ధం మీద యుద్ధం వచ్చినా మనిషి గుండెరుగలలేదు / మనిషి మీద మనిషి చచ్చినా కన్ను తుదల జాలిలేదని మనిషితనాన్ని స్పష్టం చేశాడు. "ఆ రోజు సాయంత్ర మమ్మిన మల్లెపూలు / ఆమె సిగదాల్చి నవ్వినటు / నా యొడలు తగిలినటు / కాలమే కరిగినటు / ఆకసము వణకినటు / ఏదో అనిపించి సగము తెరచిన కనుల/కెదురుగా / గదిలోన దీప శిఖ కదలు నీడల నడుమ / మదిలోన తొలి కోర్కె మసక నిద్దుర నడుమ / చినుకు చినుకుగ వాన కురిసినటు" అని అందమైన ఊహను 'వానకురిసిన రాత్రి'లో అభివ్యక్తం చేశాడు.

"ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది. ఆనందం మనసులో మయూరబర్హంలా విప్పుకుంది'' అంటాడు. ''చినుకుల కలనేత్ర వస్త్రాన్ని సింగారించుకుంది ధరిత్రి / సిందువారం పులకరించి చిరుసిగ్గుపూలని పూసింది / ఆకుపచ్చని ఉత్సాహంతో విజృంభించింది ప్రాణశక్తి / ఆనందవల్లరీ! ప్రేయసీ! అందించు నీ అధరామృతసూక్తి" అని 'వానలోనీతో' కవితలో అభివ్యక్తం చేస్తాడు.

"తాను లేనిదే దేవుడిని తలచేవాడెవడూ లేడంటాడు మానవుడు
తాను లేనిదే మనిషికి ఆలంబన ఏదంటాడు సదరు దేవుడు
ఈ రహస్యం రహస్యంగా వుంచకండి, అందరికి చెప్పెయ్యండి
దేవుడిని తిరగేస్తే మానవుడు, మానవుణ్ణి తలక్రిందు చేస్తే దానవుడు
దేవుడికీ మానవుడికీ యెప్పుడూ సరిపడని దాంపత్యం
ఇద్దరికీ విడాకులు ఏ కోర్టూ యివ్వలేదు విచిత్రం

సుదీర్ఘ వలయం లాంటి కాలం చుట్టూ ఒకరినొకరు
అదే పనిగా తడుముకుంటూ తిరుగుతుంటారు

గుండ్రంగా, గుండ్రంగా, గుండ్రంగా అంటూ "ప్లస్ యింటూ మైనస్" కవితలో అభివ్యక్తం చేశారు.

"జడంగా వున్న శాంతి నుండి / ఎడంగా తప్పుకుంటాడు మానవుడు / సంచలనం కలిగించే / సమరాంగణాన్నే కోరుకుంటాడు / అందుకే మానవచరిత్ర అంతా యుద్ధమయం" అని "మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందే ఈ ప్రయాణం/ అనంతదీర్ఘం పునః పునర్వ్యర్థం బహుయుగ విస్తీర్ణం అంటూ 'మైనస్ యింటూ ప్లస్' కవిత్వాన్ని అభివ్యక్తం చేశారు. 'అమెరికాలో డాలర్లు పండును / ఇండియాలో సంతానం పండును / భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది" అని "ఆశ ఉత్తరధ్రువం / విధి దక్షిణ ధ్రువం / మనిషి రెండింటి మధ్య బంతిలా ఎగిరిపడే ప్రహసనం అని 'న్యూసిలబస్' కవిత సృష్టించారు. "ఇజంలో ఇంప్రిజన్ అయితే యింగిత జ్ఞానం నశిస్తుంది / ప్రిజమ్ లాంటిది జీవితం. వేర్వేరు కోణాలు ప్రదర్శిస్తుంది అంటారు. "మాలిన్యం మనసులో వున్నా మల్లెపువ్వులా నవ్వగల్గడం యీనాటి తెలివి" అని యీనాటి వైఖరిని స్పష్టం చేశారు.

"ఆలోచనల జెట్ విమానాలకి భయపడి
అలవాటు మట్టి రోడ్ల మీద కుంటుతుంది ముసలితనం
పృథ్వ్యాకాశాల మధ్య గాండీవ ధనుష్టంకారం లాగ
నా పాట విప్లవానికి విశ్వశాంతికీ నాంది అన్నాడొక అధునాతన సాహసికుడు
నా మాట చీకటికి శ్లేష, కవిత్వానికీ శ్లేష్మ జీవితానికి బాట అన్నాడొక ప్లవంగుడు
ఆగామి ఆశల వర్షాగగనం మీద అదిగో ఆనందం అనే యింద్రధనుస్సు
అలమటించే లోకానికి అండగా నిలుస్తుంది నవకవి వచస్సుధా మనస్సు"

ఇలా ఎన్నో ఊహాచిత్రాలతో, చక్కని పదబంధాలతో తనదైన విలక్షణ అభివ్యక్తితో వ్యక్తీకరిస్తాడు తిలక్. అందుకే "ఎవరెస్టుకన్నా ఎత్తైన నా ఊహాశిఖరాల్ని వాళ్ళెక్కలేరు. సింధూరం కన్నవారు పైన నా హృదయాన్ని వీళ్ళు చదవలేరు" అంటాడు. "ఆ రోజుల్ని తలచుకున్నప్పుడల్లా/ఆనందం లాంటి విచారం కలుగుతుంది/నేటి హేమంత శిథిల పత్రాల మధ్య నిలిచి/ నాటి వాసంత సమీర ప్రసారాల తలచి / ఇంతేగదా జీవితం అన్న చింత / ఇంతలోనే ముగిసిందన్న వంత" అంటూ ఆ రోజుల్ని

తలచుకున్నాడు.

"దేవుడా
రక్షించు నా దేశాన్ని
పవిత్రుల నుండి, పతివ్రతల నుండి
పెద్ద మనుషుల నుండి, పెద్ద పులుల నుండి
నీతుల రెండు నాల్కలు సాచి బుసలుకొట్టే
నిర్హేతుక కృపాసర్పాల నుండి
లక్షలాది దేవుళ్ళ నుండి, వారి పూజారుల నుండి
వారి వారి ప్రతినిధుల నుండి
సిద్ధాంత కేసరుల నుండి, సిద్ధుల నుండి
శ్రీమన్మద్గురు పరంపర నుండి"

అని ప్రార్థించాడు. దేవుడా / నలభై కోట్ల మనుష్యుల నిజమైన ప్రాణం వున్న / మనుష్యులతో నిండిన దేశం నాది / ఆకలీ బాధలూ ఆందోళనలూ సమస్యలూ / విరివిరి వున్న విచిత్ర సౌధం మాది / కడుపునిండుగా ఆహారం గుండె నిండుగా ఆశ్లేషం / బ్రతుకు పొడుగునా స్వతంత్రం / కొంచెం పుణ్యం కించిత్ పాపం / కాస్త కన్నీరూ మరికాస్త సంతోషపు తేనీరు / అని విన్నవిస్తాడు.

"చావుపుట్టుకల మధ్య సందేహం లాంటి జీవితంలో నలువైపులా అంధకారం / మంచి గంధం లాగ పరిమళించే మానవత్వం / మాకున్న ఒకే ఒక అలంకారం / మజిలీ మజిలీకి అలిసిపోతున్నాం / మలుపు మలుపుకీ రాలిపోతున్నాం / ఆశల వెచ్చని పాన్పు మీద స్వప్నాల పుష్పాలు జల్లుకుని / ఆదమరచి కాసేపు విశ్రమించదాని కనుమతించు తండ్రీ" అని వేడుకుంటాడు. చివరలో 'తపాలా బంట్రోతుని గూర్చి తొలిసారి కవిత్వీకరించి ఉత్తరం యిచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్ళిపోయే నిన్ను చూసినపుడు తీరం వదలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు" అంటే చక్కని భావనను వ్యక్తం చేశాడు. అందమైన అనుభూతి, అభివ్యక్తులతో కోకిల వలె కూచే కలధ్వనిగా కేసరి వలె గర్జించే రణధ్వనిగా భావ, అభ్యుదయాల మేళవింపుగా, కవితాసతి నొసట నిత్య రసగంగాధర తిలకంగా, సమకాలిక సమస్యలకు స్వచ్ఛ స్ఫాటిక ఫలకంగా దర్శనమిస్తాడు మన కవితామిత్రుడు, కదనక్ష్మాత్రుడు, సకల జగన్మిత్రుడు తిలక్. నిజంగా శ్రీశ్రీ గారన్నట్లు 'వయస్సు సగం తీరక ముందే అంతరించిన ప్రజాకవి /

నభస్సు సగం చేరకముందే అస్తమించిన ప్రభారవి' తిలక్. తిలక్ లేక ఆనాదు గాలి మూగదయిపోయింది. పాట బూడిదయిపోయింది. తిలక్ ఇలా భావాభ్యుదయ కవిగా అనుభూతులకు అక్షర రూపాన్నిచ్చి తనదైన అభివ్యక్తి విధానంతో కవిత్వీకరించారు.

**ఉపయుక్త గ్రంథ సూచి**


1. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు (సం) : కె.కె. రంగనాథాచార్యులు
2. సాహిత్యం – మౌలిక భావనలు – పాపినేని శివశంకర్
3. జీవియస్ వ్యాసాలు – జి.వి. సుబ్రహ్మణ్యం
4. శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్ కవిత్వం–కథాసాహిత్యం – వై. కామేశ్వరి.

# 19. సాలెగూడు సామాజిక గోడు

- డా॥ డి. నల్లన్న

ఆధునిక యుగంలో అవతరించిన ఆంధ్ర సాహితీ స్రష్టల్లో దేవరకొండ బాలగంగాధర్ తిలక్ గారికి ప్రత్యేకమైన స్థానముంది. వీరు నలభై ఆరు సంవత్సరాలు జీవించినప్పటికి ముప్పై ఆరు సంవత్సరాలు రచనా వ్యాసంగంలోనే గడపడం చాలా గొప్ప సంగతి. సాహితీ వ్యవసాయం పట్ల వీరి నిబద్ధత, ఆసక్తి దీన్ని బట్టి వెల్లడవుతుంది.

తిలక్‌గారు సంస్కృతాంధ్రాల మీద, ఆంగ్ల భాష మీద కావలసినంత పట్టు సాధించారు. ఆయా భాషల్లో వచ్చిన ముఖ్య రచనలను చదివారు. వాటి చేత ప్రభావితులయ్యారు, ఆయన ప్రమేయం లేకుండానే వారు పదకొండవ సంవత్సరంలోనే రచనా వ్యాసంగం తనంతట తానే ప్రారంభమైపోయింది.

తిలక్ గారు కవిగా పేరు తెచ్చుకున్నారు. పద్యాలు రాశారు, వచన కవితలు వెలయించారు. "ప్రభాతము-సంధ్య", "గోరువంకలు", "అమృతం కురిసిన రాత్రి" వీరి కవితా సంపుటాలు. అమృతం కురిసిన రాత్రి సంపుటానికి కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీల పురస్కారం లభించడం గమనార్హం.

తిలక్ గారు కథకుడుగా కూడా సాహిత్యం మీద గట్టి ముద్ర వేశారు. దాదాపు ముప్పై కథలు రాశారు. మొదట రెండు సంపుటాలుగా వెలువడిన అవి 1067లో తిలక్ కథలు అనే పేరుతో ఒక సంపుటంగానే వెలువడింది. వీరి కథల్లో సమకాలీన సమాజం అడుగడుగునా సాక్షాత్కరిస్తుంది.

తిలక్ గారు శ్రవ్య రచనలలో తృప్తి పడలేదు. దృశ్య రచనలు కూడా చేపట్టి శభాష్ అనిపించుకున్నారు. వీరి కలం నుంచి రెండు నాటకాలు, నాలుగు నాటికలు, ఒక ఏకపాత్రాభినయం వెలువడ్డాయి. అవి ఇరుగు పొరుగు (1960), సుచిత్ర పరిణయం (1961), సుప్తశిల (1967), పొగ (1968), సుశీలపెళ్ళి (1961) సాలెగూడు (1968), భరతుడు (ఏకపాత్రాభినయం).

తిలక్ గారిలో రూపుదిద్దుకొన్న సృజన విమర్శగా విస్తరల్లింది. విశ్లేషణాత్మకమైన వ్యాసాలు వీరి మేధో వైభవాన్ని పూసుకొని ఆంధ్ర పాఠకలోకాన్ని అలరిస్తున్నాయి. ప్రస్తుతం వీరి "సాలెగూడు" నాటకాన్ని స్థూలంగా పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను.

సాలెగూడు 48 పుటల నాటకం. దీనిలో తొమ్మిది పాత్రలున్నాయి. ఒకటి స్త్రీ పాత్ర. తక్కిన ఎనిమిది పురుష పాత్రలు, తన నాటి సమాజానికి అద్దం పట్టే ఉద్దేశంతో అలకగారు ఈ నాటకాన్ని రా బారు. ఈ నాటకాన్ని సమీక్షిస్తూ "పుట్టుకను, తల్లిదండ్రులను, పుట్టి పెరిగిన పరిసరాలను ఆధారం చేసుకొని ఒక వ్యక్తి యొక్క విలువను అంచనా వెయ్యడం, ఆ వ్యక్తి పవిత్రుడనీ, అపవిత్రుడనీ నిర్ణయించడం సమంజసం కాదనీ అది నిర్హేతుకవాదం కాగలదనీ (ఆధునిత తెలుగు నాటకం – రెండవ భాగం పుట – 133) ప్రసిద్ధ నాటక విమర్శకుడు గండవరం సుబ్బరామిరెడ్డిగారి అభిప్రాయం. తిలక్ ఈ నాటకంలో సమాజంలో కనిపించే. వివిధ మనస్తత్వాలను వివిధ పాత్రల ద్వారా ప్రేక్షకులకు లేదా పాఠకులకు పరిచయం చేశారు. తద్వారా అనుక్షణం అప్రమత్తంగా ఉండవలసిన అవశ్యకతను ధ్వనింపజేశారు.

ప్రొఫెసర్ విశ్వనాథం కుమార్తె సావిత్రి. ఆయన అమెను అల్లారు ముద్దుగా పెంచాడు. ఆమె పట్ల అతిగా వ్యామోహం పెంచుకున్నాడు. ఆమె తోడిదేలోకంగా జీవించాడు. అందుకు అతని మాటలే తార్కాణాలు "అమ్మడూ నువ్వు తల్చుకోగానే ఎక్కడ వున్నా వచ్చేస్తాను. నీ ఆనందం కన్న నాకు జీవితంలో కావలసినదేమిటి తల్లీ?" (దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్య రచనల సంకలనం – పుట. 827) విశ్వనాథం సావిత్రికి చాలినంత స్వేచ్ఛనిచ్చినప్పటికి సంస్కారవలిగానే తీర్చిదిద్దాడు. ఆమెకు చాలామంది పురుషమిత్రులు. వాళ్ళలో ముగ్గురామెను. ప్రేమించారు కూడా. సావిత్రి మాత్రం డాక్టర్ ప్రసాద్‌ను ప్రేమించింది. శేషగిరి, నరసింహం అసూయ పడ్డారు.

సావిత్రికి అవినీతి పడదు, అవినీతిపరులను బాగా అసహ్యించుకుంటుంది. ఎక్కడా రాజీపడదు. ప్రసాద్ ఎవరో కాలుజారిన కామినికి సహాయం చేసినందుకు మందలించింది. ఆమెను ఏవగించుకుంది. ఆమె చెప్పిన ఈ మాటలే ఆమె మనస్సును ఆవిష్కరిస్తాయి. "అటువంటి ఆడది చచ్చిపోవడమే మంచిది... పాపానికి అవినీతికి దయ చూపించడమా నాన్నా" (దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్య రచనల సంకలనం – పుట. 838) సావిత్రి ఒకరోజు తమ ఇంట్లోనే పుట్టినరోజు పార్టీని

ఏర్పాటు చేసింది. మిత్రులందరినీ ఆహ్వానించింది. పిలిచిన అందరూ వచ్చారు. తమకు వీలైన బహుమతులు తెచ్చారు.

రామయ్యతో గొడవ పడుతూ ప్రసాద్ దూరంగా వెళ్ళినప్పుడు నరసింహం ప్రసాద్ గురించి సావిత్రిలో విషబీజాలు వేసేందుకు ప్రయత్నించాడు. తాగుబోతు రామయ్యకు ప్రసాద్‌కు సన్నిహిత సంబంధమున్నట్లు చెప్పాడు. తనకు దొరికిన చీటి ద్వారా "ప్రసాద్ ఒక కులటకి, ఒక విధవరాలికి పుట్టినవాడు" (దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్యరచనల సంకలనం – పుట, 854) అని నిరూపించే ప్రయత్నం చేశాడు. దానితో సావిత్రి ప్రసాద్‌ను అసహ్యించుకుంది. తిరస్కరించింది. వెళ్ళిపొమ్మని నిష్ఠూరంగా మాట్లాడింది. "పో! పో! – నా ఎదురుగుండా నిలువకు, పో! పో!.. దేవుడు సాక్షిగా నీకూ నాకూ ఏ సంబంధమూ యిక వుండబోదు" (దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్య రచనల సంకలనం – పుట. 862) దయచేయి అంది. ప్రసాద్ వెళ్ళిపోయాడు. ప్రసాద్ ను కారు ఢీకొంది. తలకు గాయాలు తగిలాయి. మిత్రులతన్నీ సావిత్రి ఇంటికే చేర్చారు. బయటికి వెళ్ళిన విశ్వనాథం వచ్చాడు. జరిగిన దానికి చింతించాడు. సావిత్రి తొందరపాటును మందలించాడు. ఉత్తరంలో సూచించబడిన బిడ్డ సావిత్రేననీ వాస్తవం ఆమెకు తెలియజేశారు. సావిత్రి వాస్తవం తెలుసుకొని బాధపడింది. తన తొందరపాటుకు పశ్చాత్తాపపడింది. ప్రసాద్ ఓదార్చుడు. "సావిత్రీ! నీ తల్లి చేసిన తప్పుకు నువ్వు బాధ్యురాలివి కావు. నీ హృదయంలో కల్మషం లేదని నీ జీవితంలో మధ్యలేదని మాకు తెలుసు". (దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్య రచనల సంకలనం – పుట, 873) విశ్వనాథం. ప్రసాద్‌లు ఆమె అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని తొలగింపజేసేందుకు ప్రయత్నించారు. కథ సుఖాంతమయ్యింది.

ఈ నాటకంలో రచయిత కవి పాత్ర, యాజులు పాత్ర అదనంగా రూపొందింప బడ్డాయి. కవికి ఎప్పుడూ ప్రేమపిచ్చి, ప్రియురాంధ్ర పిచ్చి, వాళ్ళమీద పద్యాలు, కావ్యాలు రాసుకుంటూ గడపడమే అతని పని. భావకవిత్వం యుగం తాలూకు ప్రతినిధిగా ఇతడు కనిపిస్తాడు. యాజులు తెలుగుదనం మీద మోజుపడిన మనిషి ప్రతిదీ అచ్చ తెనుగుదనంతో ఉండాలనీ అతని అభిప్రాయం. తెలుగు కానీ పరాయి వాటి పట్ల అతనికి అంగీకారం ఉండేది కాదు. తిలక్ నాటి సమాజంలో ఇటువంటి వాళ్ళు ఎక్కువగానే ఉండేవారని తెలియజేసేందుకు ఈ పాత్రను సృజించి ఉండవచ్చు. రామయ్య, నౌకరు అదనపు పాత్రలు, ఈ నాటకంలోని కథానాయిక పాత్ర గురించి

గండవరం సుబ్బరామిరెడ్డి ప్రస్తావిస్తూ "రవీంద్రనాథ్ ఠాగూరు 'గోరా' నవలలోను, బుచ్చిబాబు గారి చివరికి మిగిలేది నవలలో ఆత్మన్యూనతతో బాధపడే దయానిధి పాత్రలోనూ సావిత్ర మనస్తత్వంలోని రాయలు కనిపిస్తాయన్నారు. (ఆధునిక తెలుగు నాటకం, రెండవ భాగం పుట - 134).

సాలెగూడు నాటకంలో సన్నివేశాలు సముచితంగా ఉన్నాయి. కథ తక్కువ, సస్పెన్సు అడుగడుగునా పోషింపబడింది. నాటకంలోని సంభాషణలు కూడా సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తున్నాయి. భాషలో ఆనాడు సహజంగా చోటుచేసుకొనే ఆంగ్ల పదాలకు స్థానం లభించింది.

నరసింహం సాలెపురుగు వంటివాడు. సాలెపురుగు ఒక గూటిలో ప్రవేశిస్తుంది. ఆ గూడు పాడుకాగానే మరొక గూటికి వెలుతుంది. ఆ విధంగానే నరసింహం కూడా సావిత్రి ప్రేమను దెబ్బతీయాలని ప్రయత్నించాడు. ఆమెను కైవసం చేసుకోవాలనుకున్నాడు. అయితే ఆ ప్రయత్నం వమ్మయిపోయింది. అందువల్ల అతడు మరొక గూటికి వెళతాడనీ శేషగిరి చెప్పాడు. ఈ నేపథ్యంలో రచయిత నాటకానికి "సాలెగూడు" అనే పేరు పెట్టాడు.

ఈ నాటకంలో పరోపకారమే ప్రధాన అంశంగా కనిపిస్తుంది. ప్రొఫెసరు విశ్వనాథం అవివాహితుడు రామయ్య ద్వారా తన ఇంటికి చేరిన మిత్రుడి భార్య అక్రమ సంతానాన్ని ఆదరించాడు. స్వంత బిడ్డగా పెంచి పెద్ద చేశాడు. తల్లిదండ్రులు పోయి అనాథ ఆశ్రమంలో వున్న ప్రసాద్‌ను చదివించాడు. డాక్టర్ను చేశాడు. విద్యార్థులకు చక్కగా చదువు చెప్పాడు. ఆదర్శ ఉపాధ్యాయుడు అనిపించుకున్నాడు.

ప్రసాద్ కుర్రవాడు. ఎం.బి.బి.ఎస్ చేస్తున్నాడు. హౌస్ సర్జన్ ఇంకా పూర్తి కాలేదు. అయినప్పటికి సహాయంకోసం పిలిచిన ఎవరిని కాదనలేదు. అవినీతిపరులకు వైద్యం చేయడానికి వెళ్ళవద్దని గట్టిగా సావిత్రి వాదించిన కూడా తన వృత్తి ధర్మాన్ని నిర్లక్షించలేనని సమాధానం చెప్పాడు. ప్రియురాలి నిర్బంధనను కూడా ప్రక్కనబెట్టి వైద్య సేవలందించి వచ్చాడు. ఇక్కడ ప్రసాద్‌లోని పరోపకార స్వభావం, స్వధర్మ నిర్వహణ, దీక్షాదక్షతలు వెల్లడవుతున్నాయి.

ప్రొఫెసర్ విశ్వనాథం సావిత్రి జన్మరహస్యం చెప్పినప్పుడు కూడా అతడు చలించలేదు. విశాల హృదయంతో ఆమెను అంగీకరించాడు. పైగా ఆమె విశ్వాసానికి విరుద్ధంగానే ఆమె జన్మ ఏర్పడినందుకు ఏదైనా అఘాయిత్యం చేసుకుంటుందేమోనని

భయపడ్డాడు. అందువల్ల ప్రొఫెసర్ విశ్వనాథం దగ్గర ఉన్న ఉత్తరాన్ని ఫోటోను తీసి తన దగ్గర భద్రంగా దాచాడు. తానే కులట కుమారుడని సావిత్రి తూలనాడి తిరస్కరించి పంపివేసినప్పుడు కూడా ప్రసాద్ వాస్తవాన్ని ఆమెకు చెప్పలేదు. పైగా బాధపడుతూ వెళ్ళిపోయాడు. అది అతని ఉదాత్త మనస్తత్వాన్ని ఉటంకిస్తుంది.

శేషగిరిలో స్వార్థం ఉన్నప్పటికి కాస్తా ఉపకారి బుద్ధి కూడా ఉన్నట్లు అతని ప్రవర్తనను బట్టి ప్రస్ఫుటమౌతుంది. ఈ విధంగా ఒకటి రెండు పాత్రలు మినహాఇస్తే దాదాపు అన్ని పాత్రల ద్వారానూ ఉపకారమే ఉత్కృష్టమని తిలక్ పాఠకుల నుదుట తిలకం దిద్దినట్టనిపిస్తుంది.

దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన 'సాలెగూడు' నాటకం పాఠకలోకాన్ని పరవశింపచేస్తూ ఉంది. సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ ఉంది. పుట్టిన రోజు ఆడంబరంగా జరుపుకోవడం వంటి కృత్రిమ లాంఛనాలకు ఆనాడే బీజం పడినట్లు ఈ నాటకం తెలియజేస్తూ ఉంది. దీనిలోని సంభాషణలు చక్కగా ఉన్నాయి. ఎత్తుగడలు కూడా చక్కగా కుదిరాయి. ఇటువంటి నాటకాలను పఠించి స్ఫూర్తి పొందవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందనిపిస్తుంది.

**ఆధారగ్రంథాలు**

1. ఆంధ్ర నాటక దర్శిని (1860–1962). శ్రీనివాస చక్రవర్తి (సంకలనకర్త). గోపాలరెడ్డి రోడ్, విజయవాడ–2 ప్రథమ ముద్రణ: 1963.
2. ఆంధ్ర నాటక రంగం (రెండవ భాగం) – గండవరం సుబ్బరామిరెడ్డి. ప్రవీణ్ పబ్లికేషన్స్ సికింద్రాబాద్ ప్రచురణ – 1991
3. దేవరకొండ బాలగంగాధరతిలక్ లభ్య రచనల సంకలనం – తంగిరాల వెంకట సుబ్బారావు & డి. చంద్రశేఖరరెడ్డి (సంపాదకవర్గం) ఎమెస్కో బుక్స్ హైదరాబాద్ – ప్రచురణ – 2013.

# 20. తిలక్ రచనలు - ఏకపాత్ర

- డా॥ తోట వెంకటస్వామి

తిలక్ సాహిత్యం మొత్తం అంటే లభ్యమైన రచనలనన్నీ మనసు ఫౌండేషన్ వాళ్లు వేశారు. ఇక ఏకపాత్ర అన్నారు కాబట్టి, తిలక్ రాసిన నాటికలు, నాటకాలలో చూస్తే పాదుకా పట్టాభిషేకంలోని 'భరతుని ఏకపాత్రాభినయము' ఒక్కటే కనిపిస్తుంది. దానిపైననే నేను ప్రసంగిస్తాను.

పూర్వం ఏకపాత్రాభినయాలు బహుళంగా వేసేవారు. ఆ పాత్రే కథను మొత్తం నడుపుకుంటూ తెర వెనుక నుండి అవసరమైన కథా సూచనతో, పాత్ర సంబంధమైన వ్యవహారాన్నో, కథతో ముడివడిన ఒకటిరెండు సంభాషణలో చేస్తుండగా, తెరమీది పాత్ర భావోద్వేగాన్ని ప్రదర్శించటం ఈ ఏకపాత్రలోని విశిష్టత.

ఇక ప్రస్తుతానికి వస్తే శ్రీరామపట్టాభిషేకం జరుగనీయకుండా కైక దశరథుని వరాలడిగి, వనవాసాలకు రాముని పంపే సందర్భంలో భరతుడు లేడు. తన మేనమామగారి ఇంట్లో ఉన్నాడు. దశరథ మరణానంతరం, వశిష్ఠులవారి ఆనతి మేరకు భరతుడిని అయోధ్యకు రప్పిస్తారు. దశరథుని మరణవార్త అయోధ్యాపుర మందిరానికి వచ్చేవరకు భరతునికి తెలియదు వచ్చి తెలుసుకున్నాక, దెబ్బమీద దెబ్బలా శ్రీరాముని వనవాసము, తల్లి వరాలు, తండ్రిమరణం భరతుని హృదయాన్ని పీడించాయి. అప్పటి భరతుని భావోద్వేగాలే ఈ పాదుకా పట్టాభిషేకంలోని భరతుని ఏకపాత్రాభినయం.

అయోధ్యానగర ప్రవేశం చేసిన భరతుడు "సూతుడా! రథమును ఆపుము. నా అయోధ్య వచ్చినది. ఇచట దిగి నా నగరభూమిపై పాదములాని నడువనిమ్ము. అయోధ్య ఎంత సుందరమైనది" - అనే వాక్యంతో ఈ ఏకపాత్ర ప్రారంభమవుతుంది. భరతునికి తన అయోధ్యపై ఎనలేని ప్రేమ. అందుకే తాను నడచి పాదచారియై నగరంలోకి ప్రవేశించాలని కోరుకున్నాడు. అయోధ్య అంటే వట్టి ప్రేమేకాదు. అందులో శ్రీరాముని మూర్తిమత్వాన్ని కూడ దర్శించిన భావుకుడు భరతుడు. చూడండి -

"అయోధ్య ఎంత సుందరమైనది, ఎంతగంభీరమైనది ప్రౌఢాంగనవలె, హిమావృతమైన పర్వతశిఖరమువలె, నవ్వుచున్న శ్రీరామచంద్రుని మూర్తివలె" ఈ మాటలలో ఎంతటి అనురాగం రాముని పట్ల భరతునికి ఉన్నదో తెలుస్తుంది. అంతేకాదు సౌధంపై నున్న మేఘాలలో, తెల్లని సుందరి ధరించిన నీలిమేలిముసుగుతో పాటు, తన అన్న నీలమేఘశ్యాముడు కావటం వలననే మేఘాలంటే తనకు ఇష్ట మంటాడు. పువ్వుల్లో రాముడి నవ్వులే ఉన్నాయని, రాముడు అయోధ్య ఒడిలో జన్మించటం వలననే అయోధ్యకు అంతటి ప్రతిష్ఠ దక్కిందని నగరిలోకి ప్రవేశిస్తూ పలు విధాలుగా అయోధ్యానగరాన్ని గురించి భావన చేస్తాడు.

రాముడు భరతుడు ఏకాత్మలేననటానికి నిదర్శనంగా భరతుడు తన అన్న గురించిన ఎన్నో విధాలుగా భావన చేస్తాడు. "నా అగ్రజుని కౌగిలించి కాంతి మంతములైన వాని కన్నులలోనికి చూసి ఒక్కసారిగా పులకరించవలెగదా!" – అంటాడు. ఎంతటి భక్తో తన అన్నపట్ల అనిపిస్తుంది.

నగరిలోనికి ప్రవేశించిన భరతుడు క్రమంగా అంతఃపురప్రవేశం చేస్తాడు. కళతప్పిన రాజమందిరాన్ని నిరానంద సూచికంగా ఉన్న వాతావరణాన్ని చూచి, అయోధ్యా ప్రజలకు రాజులతో, రాణులతో, సైనికులతో కలసి ఒక్కసారిగా ఏ పుణ్యక్షేత్ర దర్శనానికైనా వెళ్లారా? అంటూ పలకరిస్తాడు. సేవకుల్ని పిలుస్తాడు. ఎవరూ స్పందించరు.

**"నగరమే కాదు, రాజభవనమ్ముకూడ**
**విధవ వోలె, కళాహీన విధి, చెలంగె**
**మనసు, మనసులోనిల్వదు మామకీన**
**గాత్రము కంపించె, ప్రాణము కళవళించు"** అని తల్లడిల్లుతాడు.

ఇంతలో  నేపథ్యం నుండి దశరథుని మరణవార్త వినిపిస్తుంది. తండ్రి గుణగణాలను, రామభద్రునిపై ఆయనకున్న ప్రేమను, రామపట్టాభిషేకం కోసం ఆయన కన్న కలలను, తండ్రి మరణ సమయంలో తాను అక్కడ లేకపోవటాన్ని తలచి తలచి వగచి విలవిలలాడి పోతాడు. అంతలో దశరథుని మరణానికి కారణమైన కైక వరాలు, రామ వనవాస గమనము క్రమంగా తెలిసి తల్లిని, విధిని నిందిస్తాడు.

తల్లీ కైకేయీ! మహాసాధ్వీ, ఎంత గొప్పదానివమ్మా! ఎంత యుక్తిపరురాలవమ్మా! ఈ సమ్రాట్ పదవిని నాకిచ్చి, నువ్వు రాజమాతవై ఓహో... నేను యిక్కడ యింద్రుడను, దేవేంద్రుడను. నా ఆజ్ఞనెల్లరు శిరసావహింపవలెను. ఎవరురా అక్కడ?

ఒరే సేవకాధమా! ఎవరనుకొంటివిరా! మహారాజునురా! నా శాసనమున వాయువు కూడా కదలకూడదు. నేను కనురెప్ప కదిపినంతమాత్రాన యీ ప్రజానీకమెల్ల గజ గజ వణికిపోవలెను. అదిగో. నా తల్లి వచ్చుచున్నది. సాష్టాంగప్రణతుడై యిదే భరతుడు నీకు మ్రొక్కుచున్నాడు. భర్త పోయినను చిరునవ్వు ధరించి – నీ కుమారునకు స్వాగతమిచ్చుచున్నావా, మాతా! ఎంత ప్రేమ నీది! నీ విశాల హృదయమును మూర్ఖుడైన భరతడు తెలిసికొనలేకపోయెనుగదా! అని అంటున్న సందర్భంలో భరతుడు చేసిన ట్విస్ట్‌ను మనం గమనించాలి. ఉన్మత్తుడై, భరతుడు పిచ్చివానిలాగా తన తల్లిని గురించి ఇలా సేవకుల్ని ఆదేశిస్తాడు.

"ఓరీ రాజమాతకు రత్న ఖచితాసనము తీసికొనిరండు. ఆమె దీవెనలీయగా చెలికత్తెలను పిలుచుకు రండు. ఏదిరా రాజమాతకు పానీయము? ఆమె అలసి ఉన్నదని తెలియదా? మూర్ఖులారా! – కౌసల్యా సుమిత్రాదేవులను చంపి, వారిరక్తమున చక్కెరవేసి బంగరు పాత్రలతో తీసికొని రండు. అప్పటికిగాని నా ప్రియజనని దాహముతీరదు" – అని ఇంకా ఇలా అంటున్నాడు భరతుడు

"ఓ మహారాజమాతా! అన్నమిడిన కుక్కకు విశ్వాసమున్నది. గడ్డి తినెడి పశువునకు విశ్వాసమున్నది. నీవు కుక్కవు కావు. పశువు కావు. నిన్ను ముద్దుల భార్యగా, తనహృదయరాణిగా ప్రేమించి, గౌరవించి సకలభోగ భాగ్యములను చేకూర్చిన పతి ప్రాణములను గొన్న నిన్నేమని పిలువవలెను" – అంటూ తల్లిని పతిప్రాణాలు తీసిన రాక్షసిగా, పిశాచిగా, దూషించి, చంపటానికి ఉద్యుక్తుడవుతాడు.

రాముడిని తలచుకొని ఆయన గుణగణాలను ఇలా కీర్తిస్తాడు.

"పదముల చిరుచీమ వడి నశియించెనా
కన్నీరు విడచెడి కరుణమూర్తి
కలలోన కూడ నిక్కము నాడతప్పని
పరమ సత్యవ్రతా చరణశీలి
అర్థి కెన్నడును లేదనక కాదనక ప్రా
ణములైన నిచ్చెడి త్యాగశీలి
ఆడి వెను తిరుగనట్టి మహావీరు
డ ద్భుతాస్త్ర కళాధురంధరుండు
తల్లిదండ్రుల నిజదైవతముల యట్ల
సతము భావించు రఘువంశ చంద్రుడతని

అడవులకు పంప నెట్లు నోరాడె నీకు,

తల్లివా – పెద్దపులివా – త్రాచుపాము వేమో!”

అంటూ రాముడిని, సీతమ్మను వాళ్ల సుకుమారత్వాన్ని ప్రస్తుతం అడవిలోని కాఠిన్యాన్ని తలచుకొని విలపిస్తాడు.

చివరకు నాకీ రాజ్యం వద్దు రామపాదాలే కావాలి. అడవికి వెళ్లి, తన తలను రాముడి పాదాలపై మోపి, కన్నీరు కురిపించి, ఆ రామపాదుకలను తీసుకవచ్చి, పూజచేస్తానని ఆయనవచ్చి రాజ్యపట్టాభిషేకం చేసుకునే వరకు పాదుకాపట్టాభిషేకం చేసి, పూజిస్తానని, నిరంతర ప్రతీక్షణతో శ్రీరామునికై ఎదురుచూస్తూ ఉంటానని శపథం చేస్తాడు.

ఏ దురాశ కైకేయిని యిలా తప్పుదారి పట్టించిందో, ఆ దురాశే తన ఆమె గుండలలె పుండుగా మారి బాధపెట్టాలని కోరుకున్నాడు. సిగ్గుతో, అవమానంతో కొంచెం కొంచెం చావాలని, అలా చస్తూ కూడా రామభద్రుడినే తలచుకుంటూ ఉండాలని చెప్పి సీతారాములకై అడవికి పోతున్నానని వెళ్లతంటో పాత్ర ముగుస్తుంది.

ఇందులో కూడ తిలక్ భావుకత్వం స్పష్టంగా కనిపిస్తుంది. అయోధ్యను వర్ణించినప్పుడుగాని, సీతారాముల్ని గురించి చెప్పినప్పుడుగాని కవిపరవశుడై చెప్పినట్లు కనిపిస్తుంది. ఏకపాత్రలో కూడా పద్యాలను, పెట్టటం, పద్యనాటకాల ప్రభావమే అని చెప్పవచ్చు. పాత్ర పరిణామాల్ని స్పష్టంగా చూపిస్తూ, భావోద్వేగాలను మాటలతో బొమ్మకట్టి చూపించాడు ఈ పాత్ర ద్వారా తిలక్ మహాశయుడు.

**ఆధార గ్రంథాలు**

వెంకట సుబ్బారావు, తంగిరాల & డి. చంద్రశేఖరరెడ్డి, (సంపాదకులు) 2013. *దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్యరచనల సంకలనం.* హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.

# 21. తిలక్ వ్యాసాలు - సాహిత్య సైద్ధాంతిక ప్రతిపాదనలు

- డా॥ టి. రాజశేఖర్

"లోకమాన్య" బాలగంగాధర్ తిలక్‌ను అందరూ ఎరుగుదురు. మన తెలుగు తిలక్‌ను తెలుగు వారిలోనే ఎంతమంది ఎరుగుదురో చెప్పలేను అని అభిప్రాయ పడుతాడు మహాకవి శ్రీశ్రీ. తిలక్ చనిపోయిన తర్వాత ఆనందవాణి – తిలక్ ప్రత్యేక సంచికకు శ్రీశ్రీ సంపాదకీయ వ్యాసంలో అన్న మాటలివి. దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన నాటకాలు, నాటికలు, కవిత్వం, లేఖాసాహిత్యం, వ్యాసాలు, కథలు లాంటి ఆధునిక ప్రక్రియల్లో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించినా, ఆయన తెలుగువారికి పెద్దగా పరిచయం కాకపోవడానికి కారణాలు అనేకం. ఆయన సాహిత్యాన్ని చదివి అర్థంచేసుకున్న వారు మాత్రం ఆయనకు అభిమానులుగా మారిపోతారు అన్న మాటలు యదార్థాలుగా అనిపిస్తాయి. తిలక్ సాహిత్యం భావ, అభ్యుదయాల మేళవింపు. దాన్ని తెలుగు పాఠకుల మస్తిష్కాల్లోకి చేర్చాల్సిన ఆవశ్యకత పరిశోధకులపై ఉందని చెప్పవచ్చు.

తిలక్ సాహిత్యాన్ని సంపూర్ణంగా పరిశీలిస్తే ఆయన రాసిన నాటికలు, కవిత్వం, కథ, లేఖలు ఆయన భావ, అభ్యుదయ ప్రక్రియల్లో సవ్యసాచిగా నిలిపితే, ఆయన వ్యాసాల్లో మాత్రం సాహిత్యానికి సంబంధించి సైద్ధాంతిక ప్రతిపాదనలు మనకు గోచరిస్తాయి. ఆయన రాసిన ఒక్కొక్క వ్యాసం ఒక్కొక్క ఆణిముత్యం. కథాకావ్యం, కావ్య సృష్టి, గాంధీ జీవితం ఒక మహాకావ్యం, హేమంత హసంతిక, కృష్ణశాస్త్రి, కవిత్వం అంటే, కథలు వ్రాయడం ఎలా? అనే ఏడువ్యాసాల్లో ఆయన చేసిన సాహిత్య సిద్ధాంతపరమైన ప్రతిపాదనలు ఆధునిక కవులకు, భావి పరిశోధకులకు నిర్దిష్టమైన దిశానిర్దేశం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తిలక్ వ్యాసాల్లోని వైదుష్యాన్ని, దృక్పథాన్ని, సిద్ధాంతపరమైన ప్రతిపాదనలను తెలుసుకునే ముందు వ్యాస పూర్వాపరాలు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

గద్యం, వచనం అనే రెండు పదాలను ఒకే అర్థంతో నేడు చాలామంది చూస్తున్నారు. గద్యానికి, వచనానికి రూపంలో పోలిక ఉన్నప్పటికీ, స్వభావంలో తేడా ఉంది. "పద్యం వాసనతో నడిచేది గద్యం. ఆ వాసనను పూర్తిగా వదిలించుకున్నది గద్యం. పద్యం వాసన లేని వచనం సామాన్యులకు దగ్గరయ్యే స్వభావం కలిగి ఉంటుంది" అని వి.చెంచయ్య చెప్పిన మాటలు వాస్తవాలు. ఆ వచనం వ్యాసానికి ప్రాణాధారం. వ్యాసం అనే పదాన్ని మొదట సి.పి.బ్రౌన్ తన నిఘంటువుల్లో ఇచ్చాడు. 'యాన్ ఎస్సే' అనే పదానికి వ్యాసం అనే అర్థాన్ని ఆయన సూచించాడు. ఈ పదం 1853లో వచ్చిన బ్రౌన్ నిఘంటువులో కనిపిస్తుంది. తెలుగులో 16వ శతాబ్దం నుండి వ్యాసరచన లాంటి రచనలు కనిపిస్తున్నాయని, ప్రతాపరుద్ర చరిత్ర, రాయవాచకం వంటి వాటిలో వ్యాసలక్షణాలున్నాయని 'తెలుగు వ్యాస పరిణామం'లో ఇనాక్ వివరించారు. అయితే వీరేశలింగం పంతులుగారు వ్యాసం, ఉపన్యాసంకు పెద్ద తేడా లేకుండా ప్రయోగిస్తే, గురజాడ మాత్రం ఆ తేడాను స్పష్టంగా గుర్తించాడు. వ్యాసం అనేది వచన ప్రక్రియకు సంబంధించిన సృజన మరియు విమర్శ రెండింటి సాహితీ ధర్మాల మేళవింపు కలిగి ఉంటుంది. "వ్యాసం ప్రధానంగా చదువబడేందుకు ఉద్దేశించబడితే, ఉపన్యాసం వినపడడానికి ఉద్దిష్టమైనదిన్న" ఇనాక్ మాటలను గుర్తుచేసుకోవాలి. కాబట్టి వ్యాసం పాఠకులు చదవడానికి విషయజ్ఞానం పొందడానికి నిర్దేశించబడిందిగా గుర్తించవచ్చు.

సాహిత్యాన్ని ఆనందంకోసం, వ్యాసాన్ని విషయజ్ఞానం కోసం పాఠకులు చదువుతారనే స్పష్టమైన ఆలోచన తిలక్‌కు ఉంది. అందుకే వ్యాసాల్లో చెప్పదలచుకున్న విషయాన్ని సుదీర్ఘంగా లేకుండా సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా తిలక్ చెప్పాడు. రచయిత ఎంతో కష్టపడి రాసినా దాన్ని పాఠకుడు సులభంగా అర్థంచేసుకునేటట్లు ఉండాలి. ఆ విషయాన్ని తిలక్ గుర్తించాడు. అందుకే తిలక్ భాషా శైలి కూడా సరళంగా సాగడంతో, సుదీర్ఘ ఉపన్యాసం లాగా, అనేక సోదాహరణలు లేకపోవడంతో పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. చదివిన దానికి తృప్తితో పాటు, ఆనందం కూడా లభిస్తుంది. విషయ పరిజ్ఞానం లభిస్తుంది. ఈ వ్యాసం తిలక్ వ్యాసాల్లో ప్రతిపాదించిన సిద్ధాంతాలను పరిమితమై విశ్లేషించబడుతుంది. ఈయన రాసిన అంశాల్లో వైవిధ్యం ఉన్నా సునిశిత పరిశీలన, నూతనాంశ వ్యక్తీకరణ, విశ్లేషణ, భావి పరిశోధకులకు మార్గదర్శకత, స్వీయాభిప్రాయ ప్రకటన, ప్రమాణాత్మకత, సైద్ధాంతిక ప్రతిపాదనలు ప్రధాన లక్షణాలువ ఉన్నాయి.

తిలక్ వ్యాసాలు పరిశీలించే ముందు ఆయన రాసిన ఏడు వ్యాసాలకు మూడు శీర్షికల కింద విభజన చేసుకొని విశ్లేషించవచ్చు. అవి 1. కవిత్వ విమర్శ వ్యాసాలు, 2.కథావిమర్శ వ్యాసాలు, 3.జీవిత చిత్రణ వ్యాసాలు.

**1. కవిత్వ విమర్శ వ్యాసాలు**

కవిత్వ విమర్శ వ్యాసాలకు సంబంధించినవి కథాకావ్యం, కావ్య సృష్టి, కవిత్వమంటే, హేమంత హసంతిక. ఈ నాలుగు వ్యాసాలు కూడా కవిత్వం మీద తిలక్ కున్న దృక్పథాన్ని తెలియజేస్తాయి. వీటి అధ్యయనం ద్వారా కవిత్వంపై ఆయన సాహిత్య సిద్ధాంత ప్రతిపాదనలు గుర్తించవచ్చు.

1964 సెప్టెంబరు, 'నవత' త్రైమాసిక పత్రిక మూడవ సంచికలో 'హృదయం విప్పి' శీర్షికతో కథాకావ్యాలపై తనకున్న దృక్పథాన్ని స్పష్టంగా చెప్పాడు. అదే పత్రికలో ద్వితీయ సంచికలో 'వచన గేయం కవితా ఖండికల రూపంలోనే ఉంది. సంపూర్ణ కథా కావ్యదృష్టి అలవరచుకోలేదన్న' కుందుర్తి ఆంజనేయులు అభిప్రాయానికి సమాధానంగా ఈ వ్యాసం రాశాడు తిలక్. ప్రాచీన కావ్యాలైన భారత, రామాయణాల్లో కథావస్తువు బలంగా ఉండడంవల్ల అవి వచనంలో రాసినప్పటికీ ప్రజాదరణ పొందుతాయని అభిప్రాయపడ్డాడు తిలక్. నేడు అవి కథావస్తువు ప్రాబల్యం తగ్గి వర్ణనలకు ప్రాధాన్యం పెరిగింది. ఆధునిక కాలంలో కవిత్వం నుండి కథ విడిపోయి కథానిక, నవల, సాంఘిక నాటకాల్లోకి వెళ్ళిపోయిందని తిలక్ అభిప్రాయపడ్డాడు. వచనగేయంలో కథాకావ్యం వస్తే తాను ఆనందిస్తానని, కానీ నేడు కథాకావ్యాల ఆవశ్యకత తగ్గిపోయిందని చురక అంటించాడు. తిలక్ దృష్టిలో వచన కవిత, ఒక కవితా పరిణామంగా, అభివృద్ధి దశ కవిత యొక్క నిర్వచనము, తత్త్వ స్వరూపము ఎప్పటికప్పుడు మారుతోంది. విస్తృతమౌతుంది. గంభీరమౌతుంది అంటాడు తిలక్. "నేటి వరకు వచన గేయం కవితా ఖండికల రూపంలోనే కాలం గడుపుతోంది సంపూర్ణ కావ్యదృష్టి అలవరచుకోలేదు" అని చెపుతూ వచన కవిత్వం సమగ్ర రూపం ధరించాలంటే, దానిలో కథానికలు, నాటికలు, మహాకావ్యాలు రావాలని తిలక్ ఆశించాడు. ఈ విషయాన్ని ఇంకా వివరిస్తూ మన ఇతిహాసాల్లో కథ, కవిత్వం రెండూ కలసి ఉండేవని ప్రబంధ కాలం వచ్చేసరికి కథా ప్రాముఖ్యం తగ్గిపోయి వర్ణనలు ఎక్కువైపోయాయనీ, ఆధునిక కాలం వచ్చేసరికి కథా ప్రాధాన్యం పూర్తిగా పోయింది. కవిత్వం నుండి కథ విడిపోయి కథల్లోకి నవలల్లోకి వెళ్ళిపోయిందని తిలక్ చక్కటి విశ్లేషణ చేశాడు. సాహిత్యరంగంలో విధినిషేధాలు చెల్లవు అని, ఈనాటి

కవిత్వం కథ జోలికి వెళ్ళకుండా "వస్తుస్వరూపాలకు, సంఘర్షణలకు, శక్తులకు మూలమైన కీలకస్థానం మీద శక్తివంతమైన బ్యాట్రీలైటు ఫోకస్ చెయ్యడం లాంటిది" అని స్పష్టమైన ప్రతిపాదన చేశాడు.

కవిత్వంలో వర్ణనలు ప్రాధాన్యాన్ని సోదాహరణంగా తిలక్ వివరించిన వ్యాసం "కావ్య సృష్టి". కావ్య సృష్టికి భావం, అనుభూతి ప్రధానాలు. అవ్యక్తమైన అనుభూతి కవి పొందగానే దానికి అక్షరరూపం ఇస్తాడు కవి. అనుభూతి అనేది అవ్యక్తం. దానిని వ్యక్తం చేయాలంటే వర్ణనలతో విడమరచి చెబుతాడు కవి. ఆ అనుభూతిని కొన్ని దృశ్యాల కలయికతో చెబుతాడు. అలా చెప్పే సందర్భంలో కవుల కావ్య సృష్టిలో ఒకటి పాఠకుణ్ణి దృష్టిలో రెండోది తను పొందిన అనుభూతినీ సరిగ్గా ప్రకటించాలి. రెండూ లేని పక్షంలో కవి కవిత్వానికి భిన్నమైనదీ, తనకే ఆందోళన కలిగించే కావ్యం రచిస్తాడని తిలక్ అభిప్రాయపడ్డాడు. ప్రతికవి రచనలో అతడి అనుభవం ఉంటుందని, దాన్ని సంపూర్ణంగా పాఠకుడు గ్రహించలేక పోవచ్చు. కానీ విరుద్ధంగా అర్థంచేసుకుంటే మాత్రం అది పాఠకుని లోపమే అవుతుంది అంటాడు తిలక్. అలాగే వర్ణనలు కవి మనస్థితికి లొంగి ఉండాలని, వర్ణనా విధానానికి కవి లొంగిపోతే నిర్జీవమైన కవిత వస్తుందని అభిప్రాయపడ్డాడు. ఈ వర్ణన కూడా కొన్నిసార్లు కవి అనుభూతిని సంపూర్ణంగా ప్రకటించలేనప్పుడు కవి దృశ్యం మీద దృశ్యం చూపిస్తాడు. అవ్యక్తమైన కవి అనుభూతిని పాఠకుడు తిరిగి అనుభవిస్తాడు. ఈ అనుభూతిని తిరిగి పాఠకునిలో కలిగించే సామర్థ్యమే కవి ప్రతిభ అన్నది తిలక్ సిద్ధాంతం. అదే కవిత్వానికి గీటురాయి అని ప్రతిపాదించాడు తిలక్. అయితే ఈ వర్ణన రాను రాను క్షీణదశకు చేరుకొందని ఆవేదన వ్యక్తం చేస్తాడు తిలక్. ఈ వ్యాసంలో కాళిదాసు నుండి కృష్ణశాస్త్రి వరకు వివిధ కవుల ప్రయోగాలను ఉదాహరణలుగా చూపించి మరీ వివరించాడు.

'కవిత్వమంటే' అనే శీర్షికలో రాసిన వ్యాసం అసంపూర్తిగా మిగిలిపోయింది. కవిత్వమంటే ఎలా ఉండాలో తిలక్ తెలిపాడు. ఈ వ్యాసంలో కవిత్వ తత్వాన్ని గురించి అన్నిభాషల్లో ఎన్నో పుస్తకాలు వచ్చినా, ఎన్నో చర్చలు జరిగినా అందరూ అంగీకరించే, అన్నికాలాలకు సరిపోయే నిర్వచనం ఇంతవరకు రాలేదంటాడు తిలక్. కవిత్వం ఒక బ్రహ్మ పదార్థం అనీ, అది ఏ నిర్వచనానికి లొంగదు. కవిత్వం మనస్సుకు ఉద్రేకాలకు సంబంధించినదని ఆయన భావన. "అందరి జీవితాల్లో అనుభవాలు అనుభూతులు ఉన్నప్పటికీ వారి చిత్త ప్రవృత్తుల్లోని బేధాల్ని బట్టి వైవిధ్యం కనిపిస్తుంది.

ఏ అనుభూతి ఎంతపరిమాణంలో, ఏ తీవ్రతతో తాను పొందుతాడో అతని మాటల ద్వారా పాఠకులకు అందివ్వగలడో అతడే నిజమైన కవి. అతడు రాసిందే కవిత్వమని తీర్మానించాడు తిలక్. కవిత కొత్తఅనుభవాల కాంతిపేటికను తెరవాలి, కదలించాలి. ఈ కాలంలో బ్రతుకు యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు ఇంటికున్న కిటికీలన్నీ తెరిచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు నువ్వు చెప్పేదేమైనా నీదై ఉండాలి నీలోంచి రావాలి, చించుకొని రావాలి, మళ్ళీ యీనాడు చిత్రకవితల్ని అయోమయ బంధాల్ని పునరుద్ధరించుకు" అంటాడాయన. కవిత్వం అనుభవైక వేద్యం అన్న తిలక్ మాటలు అక్షర సత్యాలు. కవి తన అనుభవం ద్వారా వచ్చిన అనుభూతిని అదే పాళ్ళలో పాఠకుడికి అందించాలని సూచిస్తాడు. కవిత్వం అంటే ఒక విశిష్టానుభూతిని కవి పాఠకుడికి సరఫరాచేసే శక్తి అక్షరాల కూర్పు అని నిర్వచించాడు తిలక్. అయితే అన్ని అనుభూతులు అక్షరబద్ధం కాకపోవచ్చు. కానీ ఏవి సృష్టి రహస్యాన్నీ, సౌందర్యాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయో అవి విశిష్ట్యానుభూతి రక్తి కట్టాలంటే మాటల్ని యుక్తితో వైచిత్రితో చెప్పాలని మౌళికమైన సూచనలు చేశాడు రచయిత.

ఇంతకన్నా ఆధునిక కవిత్వ దృక్పథం ఏం ఉంటుంది. ఆయన రాసిన కవితల్లో కూడా కవిత్వం గురించి నిర్వచిస్తూ చాలా ఖండికలున్నాయి.

"కవిత అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి.
విస్తరించాలి చైతన్య పరిధి
అగ్ని జల్లినా, అమృతం కురిసినా
అందం, ఆనందం దాని పరమావధి"

ఇది ఒకమాటలో తిలక్‌కి కవిత్వం గురించి ఉన్న విశాల అభిప్రాయంగా చెప్పవచ్చు. ఈ ఖండికలోని వాక్యాలు ఏ కవిత్వానికైనా, ఏ కాలానికైనా శిరోధార్యమైన సత్యాలు. అందుకే ఆయన కవిత్వం పరిణామశీలి అని సిద్ధాంతీకరిస్తాడు.

అలాగే తిలక్ రాసిన 'హేమంత హసంతిక' అసంపూర్తి వ్యాసం. ఇందులో ఆయన కవిత్వం మీద ఉన్న స్వీయ అనుభూతుల్ని సంభాషణ రూపంలో పంచుకోవడం కనిపిస్తుంది. కవిత్వం ఫీలింగ్‌కు సంబంధించిందని వ్యాఖ్యానిస్తాడు తిలక్. ఇంద్రియాలు ఉద్రేకాలు కవి విహరించే క్షేత్రాలుగా చెబుతాడు. కవి ప్రకృతి నుండి ఎలా అనుభూతి చెందుతాడో, ఆ అనుభూతి ఎలా వ్యక్తీకరించాలో వివరించాడు. 'గొప్ప కవిత్వం మధువు లాంటిదని' అనే కీట్సు అభిప్రాయాలను సమర్థిస్తాడు తిలక్. ఇది భావ కవిత్వ పోకడ. భావ కవిత్వంలో ఛందస్సు, శబ్ద లలితంగా ఉంటాయి. వీనులవిందుగా

ఉంటాయి. అలాగే భావనాలోకంలో విహరింపజేస్తాయి. కలిగే అనుభూతి లలితంగా, అందంగా ఉంటుంది. హృదయంగమంగా ఉండే భావ కవిత్వం, మధువును సేవిస్తే తనివి తీననట్లు ఎంత ఆస్వాదించినా కొరతగానే ఉంటుంది. కీట్సు కవిత్వంలో అమరత్వాన్ని అనుభవించాడు కాబట్టే అలా అనగలిగాడని కితాబిచ్చాడు తిలక్.

ఈ వ్యాసంలో పద్యాల్లోని అసందర్భ ప్రయోగాల మీద వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. 'దేవుడా, నువ్వు మా యింటికొస్తే కూర్చొనేందుకు కుర్చీలు లేవు' అనే అర్థంవచ్చే ఆధ్యాత్మిక రచనలు, చేసిన కొందరు తెలుగు కవుల పేర్లు చెప్పకుండా వారి కవిత్వంలోని ఉదాహరణలు చూపి వ్యగ్యంగా విమర్శించాడు. వాస్తవాలు కాని విషయాలను దేవుడికి విన్నవించుకుంటూ సాగిన అనేక శతకరచనలను కూడా వదల్లేదు తిలక్. 'నేను చాలా పాపాలు చేశాను. వయస్సు ముసలిదై పోతోంది. మా ఆవిడికి పదకొండో కాన్పు, ఇంక నాకు మోక్షం ఎలాగ ప్రభూ' అనే ధోరణిలో వచ్చిన శతకాలను ఎక్కిరింపుగా విమర్శించాడు. ఇలా వచ్చిన రచనల్లో పారమార్థిక చింత, సత్యాన్వేషణ, దైవం మీద తపన కంటే పాపభీతి, సమీప మృత్యుభయం వీరిని తొందరపెట్టి ఇలా రాయిస్తుందని ఎద్దేవా చేశాడు. ఇలా చతికిలపడిపోయిన మాటలను ఛందస్సుతో కూర్చి చెబితే సత్యమైన కవితా కంఠం అక్కడ వినిపించదని సూటిగా దెప్పి పొడిచాడు. బహిరంతరాత్మ మధ్య కలిగే సంయోగాన్ని కవి గుర్తించ గలిగినపుడు మాత్రమే నిజమైన ఆధ్యాత్మిక రచన రావడానికి వీలుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

'The best poetry should not be finally understood' అని ఒకానొక అమెరికా సాహిత్య కారుడున్న మాటలను పూర్తిగా సమర్ధిస్తాడు తిలక్. ఆ మాటలు అసంబద్ధంగా, అవివేకంగా కనిపించినప్పటికీ ఇందులో నిజం ఉందని ఆయన భావన. ఇది కవిత్వంలో గారడీ అంటాడు రచయి.

ఓ యనగ ఓహహోయన బోయవాండ్రు
నీటి వెలుపుల మేల్కొనె తోట తెరువు
ఓ యనగ ఓహహోయన బోయవాడు
తోట వెలుపల కాలువ తొనకె నిదుర

అనే పద్యం చదివిన పాఠకుడు ఆహా అని ఆనందాన్ని సూచిస్తాడు అందమైన పెళ్ళికూతురు పల్లకీలో వెళుతుంటే ప్రకృతి అంతాపులకరించిందనీ, అందగించిందని తాత్పర్యం. కానీ తోట చెరువు మేల్కొనడం, కాలువ నిదురలో తొనకడం ఎలా సాధ్యమనేది గారడీగా కనిపిస్తుందని తిలక్ సోదాహరణంగా వివరించాడు. ఈ

అనుభూతి పాఠకుడిలో విశ్వజనీనమైన సౌందర్య భావనను సాక్షాత్కరింపజేస్తుందని తెలిపాడు.

**2. కథా విమర్శ వ్యాసాలు**

'కథలు వ్రాయడం ఎలా?' అనే శీర్షికలో కథా విమర్శ వ్యాసం రాశాడు తిలక్. 'కథలు రాయడమెలాగో చెప్పడం కన్నా ఒక కథ రాయడమే సులభమంటాడు' తిలక్. కథ రాయడానికి ఒక నిర్దిష్టమైన పద్ధతీ ప్రకారం ఉంటాయని చెప్పలేమంటూనే కథ ఎలా రాయాలో మెళకువలు ఈ వ్యాసంలో పాఠకునికి నేర్పుతాడు. ఊరికే ఉబుసుపోక కథలకు మనగడు, సాహిత్య విలువ వుండదని అభిప్రాయపడ్డాడు.

కథ ఒక మనస్తత్వానికి, చిన్న సంఘటనకు, ఒక స్వభావానికి సంబంధించిన దైనప్పటికీ ఆ పరిధిలోనే ఒక విశిష్టతను ప్రదర్శించాలని తీర్మానించాడాయన. తనకు పరిచయమున్న ఒక కథకుని పేరు చెప్పకనే అతని కథలను ఉదాహరణలుగా చెబుతూ సుమారు డెబ్బై ఐదు కథలు రాసి అల్మారాలో సర్దిపెట్టుకున్నాడని, బియ్యే పాసై విద్యార్థి దశలో నుంచి అవిద్యా దశలోకి వెళ్ళబోయే స్థితిలో ఉన్నాడని వ్యంగ్యాస్త్రాన్ని సంధించాడు. ఆ కథల్లో మొత్తం కొన్ని పడికట్టు మాటల్ని వాడి అనవసర వర్ణనలు చెస్తున్నాడని ఇలాంటి కథలు మనకు ఏమీ తెలియజెయ్యలేవని నిర్మొహమాటంగా చెప్పేశాడు. అంటే కథకుడు విశిష్టార్థ ప్రతిపాదకమైన ఇతివృత్తాన్ని కానీ సంఘటనను కానీ చిత్రిస్తే ప్రయోజనం అంటూనే, ఉన్నదున్నట్లు రాస్తే రిపోర్టింగ్ అవుతుందని వాస్తవికతకు వ్యాఖ్యానం చేయాలని సూచించాడు. “కాలు విరిగిన కుక్కపిల్లా, మూడో పెళ్ళిచేసుకున్న ముసలివాడూ పక్కింటి దర్జీవాడితో హఠాత్తుగా లేచిపోయిన పతివ్రతా, న్యూరోసిస్‌తో ఆత్మహత్య చేసుకున్న యువకుడూ, డాంబికుడూ, అమాయకుడూ.....” వంటివే కథా వస్తువుకి అందరూ ఉపయోగిస్తారని అవి భయంకరంగా కర్ణకఠోరంగా రచయితలు ఊహిస్తున్నారని ఆ ఆలోచనలను మానుకొని చెప్పే పద్ధతి మార్చుకోమని తిలక్ హితువు పలికాడు. వాటిలో కొత్త పరిచయం కలగదు. కొత్త సానుభూతి కలగదని రచయిత ఆలోచన. ఇలా ఆయన వాడిన హాస్యోక్తులు, వ్యంగ్యోక్తులు వక్రమార్గంలో వెళుతున్న కథా రచయితలు సక్రమమార్గంలోకి తీసుకురావడానికే నని మనం గుర్తించాలి. అలాగే కథకుడికి జీవితమే ఒక లేబరేటరీ అనీ జీవిత వర్ణనల్లో శోధించిన కొద్దీ తరగని విశేషాలు దొరుకుతాయని సూచించాడు.

రచయిత తన వ్యక్తిగత సిద్ధాంతాలను బేరీజు వేసుకొని తన కథల్లో మనుష్యుల్ని కేటాయించ కూడదని హెచ్చరించాడు. కథకునికి అన్నిరకాల మనుషులు ఆప్తులేనని

గుర్తుచేశాడు. ప్రతిమనిషిలోను గొప్పతనం ఉంటుంది. ఆ నిశ్చితత్వమే కథకుడికి కుతూహలాన్ని, ఇతివృత్తాన్ని సంపాదించి పెడుతుందని సూచించాడు.

కథ చెప్పే విధానమే కథకు అందాన్ని, బలాన్ని ఇస్తుందని దీన్నే శైలి, శిల్పం అంటారని అప్పుడే అది ఉత్తమ కథగా భాసిస్తుందని సూచించాడు.

**3. జీవిత చిత్రణ వ్యాసాలు**

తిలక్ రాసిన జీవిత చిత్రణ వ్యాసాల్లో గాంధీ జీవితం ఒక మహాకావ్యం, కృష్ణశాస్త్రి అనే వ్యాసాలను జీవిత చిత్రణ వ్యాసాల కింద చర్చించుకోవచ్చు. ఈ రెండు వ్యాసాలు కూడా ఆయనకు గాంధీజీపైన, కృష్ణశాస్త్రిల పైన భక్తిని అభిమానాన్ని ఆవిష్కృతం చేస్తాయి.

'గాంధీ జీవితం ఒక మహాకావ్యం' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో గాంధీని విడదీసి భారతదేశాన్ని చూస్తే అంతా కొత్తగా, మనది కాదన్నట్టుగా కనిపిస్తుందని అభిప్రాయపడ్డాడు తిలక్. గాంధీ మరణవార్త, రేడియోల్లో గుంపులు గుంపులుగా వినడం గుర్తుచేసుకుంటూ, ఆయన మరణం పరమితిలేని దుఃఖాన్ని గుండెల నిండా నింపిందని ఆవేదన వ్యక్తంచేశాడు. గాంధీజీ గురించి విదేశీ ప్రముఖుల అభిప్రాయాలను కూడా ఈ వ్యాసంలో తెలియజేశాడు తిలక్. రాముడికన్నా, కృష్ణుడు కన్నా కూడా గాంధీజీ దైవీయుడనీ, ఆయన ప్రపంచపౌరుడని కీర్తిస్తూ, ఆయన నాదేశం వాడు కావడం తనకు గర్వం కలిగిస్తుందని అంటాడు తిలక్.

"గాంధీ మతవిశ్వాసమూ, దైవభక్తీ యీనాడు విద్యాధికులలో ఒక భాగానికి రుచించవు. అర్థము కావు. కానీ అదే విశ్వాసంతో ఎన్నో పురాతన సంప్రదాయాల మీద, విశ్వాసం మీద దాడి సలిపాడు. రామనామ సంకీర్తన గావిస్తూనే హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించాడు. వనితాలోకాన్ని స్వేచ్ఛలోకి యుద్ధరంగంలోకి ఆహ్వానించాడు. హరిజనులు స్త్రీలు – ఈ రెండు జాతుల దుస్థితిని గుర్తించిన ధీశాలి గాంధీ" అని మరెవ్వరైనా ఈ ప్రయత్నం చేసి ఉంటే విజయం చేకూరేది కాదని గాంధీ వృత్తిరేకులు ఆయన్ను సరిగ్గా అర్థంచేసుకోవాలని చెప్పకనే చెప్పాడు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీని సరిగ్గా అర్థంచేసుకొని వాళ్ళు యం.ఎన్. రాయ్, జిన్నా అనీ అంటాడు తిలక్. యం.ఎన్. రాయ్ యొక్క వ్యతిరేకత జిన్నాది మాత్రం పాలుతాగి విషాన్ని ఇచ్చే చాతుర్యం గలవాడని తూర్పారా పట్టాడు.

సత్యమూ, అహింసా గాంధీజీ ప్రతిపాదించిన కొత్తవిషయాలు కావనీ కానీ వీటికి కొన్ని వేల వోట్టుల చైతన్యాన్ని కలిగించింది మాత్రం గాంధీనేనని అభిప్రాయ

చైతన్యాన్ని కలిగించింది మాత్రం గాంధీనేనని అభిప్రాయపడ్డాడు. గాంధీజీ చెప్పిన దానికన్నా చేసిన దానికన్నా గొప్పవాడని, ఏసుక్రీస్తు, బుద్ధుడు లాంటి త్యాగధనుడని కీర్తించాడు. అయితే గాంధీజీ ఉద్దేశాలు, సూత్రాల్లో ఖద్దరు, బ్రహ్మచర్యం, పరిశ్రమలు, పాప పుణ్యాలు విషయంలో హేతువుకీ, చరిత్రకీ దూరంగా ఉన్నట్టు తోస్తాయి అని తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు.

వ్యక్తి జీవిత చిత్రణలో తిలక్ రాసిన మరో అసంపూర్తి వ్యాసం కృష్ణశాస్త్రి. కృష్ణ శాస్త్రి రచనలు ఈ వ్యాసం రాసేనాటికే ముడు దశాబ్దాల కాలం నుండే ప్రచారంలో ఉన్నాయనీ, దాదాపు తెలుగు కవులందరి మీద ఆయన ప్రభావం చూపారని విశ్లేషించాడు తిలక్. తిలక్ దస్తూరీతో ఉన్న ఒరిజినల్ వ్యాసాన్ని శ్రీపాద కృష్ణమూర్తి దగ్గర ఉంటే తంగిరాల వెంకట సుబ్బారావు సేకరించి ప్రచురించారు. “ఇంతవరకు కృష్ణశాస్త్రి అంటే పెద్ద సమస్య లాంటివాడు. ఆయన జుట్టును కూడా తమ కవిత్వంలో ఒక ప్రధానమైన భాంగా జమకట్టిన వాళ్ళు లేకపోలేదు” అంటూ తన మనసులోని మాట నిర్మొహమాటంగా చెప్పడంలో కృష్ణశాస్త్రి మీద ఆయన కవిత్వం మీద తిలక్ కున్న గౌరవం ప్రస్ఫుటమౌతుంది.

ఈ సమయంలో శ్రీశ్రీ సిరిసిరి మువ్వ శతకంలో ‘విగ్గేల కృష్ణశాస్త్రికి’ అన్న మాటలు గుర్తుకొస్తాయి. ప్రతిభావంతుడైన కవి పరిసరాల్ని, పరిసర ప్రాంతాలను అతిక్రమిస్తాడని ఉన్న పరిస్థితికి, కవిలోని నిశిత చైతన్యానికి మధ్య సంఘర్షణ ఎప్పుడూ జరుగుతున్నా కవే విజయం సాధిస్తాడని వాస్తవాన్ని తెలిపాడు. అలాంటి ప్రతిభావంతమైన కవి కృష్ణశాస్త్రి అని కొనియాడాడు. ఈ సందర్భంలో “కవిత్వం కృష్ణశాస్త్రి ఊపిరి” అన్న ముద్దుకృష్ణ మాటల్ని ఉటంకించాడు. కృష్ణశాస్త్రి అంటే ఇంతటి అభిమానం కలిగిన వాడు కనుకనే

“కవిత్వం ఒక అల్కెమీ,
దాని రహస్యం కవికే తెలుసును
కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు
కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు” అని కితాబిచ్చాడు.

“నవ్యసాహిత్యంలో కృష్ణశాస్త్రి కున్న స్థానం అతి విచిత్రమైనది అతి విశిష్టమైనదని అందరిలోనూ అతని స్థానం ప్రత్యేకమే”అని తీర్మానించాడు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఈ వ్యాసంలో కొనసాగి ఉంటే కృష్ణశాస్త్రి కవిత్వాలను ఉత్తమ కవిత్వాలుగా నిరూపించేవాడు తిలక్.

### ముగింపు

దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన వ్యాసాల్లో ఏ వ్యాసాన్ని చూసినా లోతైన పరిశీలన చేయనిదే వ్యాసరచనకు పూనుకోడని స్పష్టమవుతుంది. కవిత్వానికుండాల్సిన తీరును నిశితంగా తన వ్యాసాల్లో విడమరచి చెప్పాడు. "కేవలం ఉపన్యాసాలిచ్చి లాభంలేదు. నాకొక లక్షణం ఉంది. సభలో ఉపన్యసిస్తున్నప్పుడు శ్రోతలు సరిగ్గా వినడం లేదని ఏమాత్రం అనిపించినా ఉపన్యాసం సగంలో ఆపి వచ్చేస్తాను. అందు వల్ల వ్యాసాల్లో అయితేనే ఈ విషయం గురించి కూలంకుషంగా చర్చించడానికి వీలవుతుందని అన్నారు" ఆయన అన్న వాసమూర్తి మాటలను బట్టి వ్యాసరచనపట్ల తిలక్ కున్న నిబద్ధత అర్థమవుతుంది.

### ఆధార గ్రంథాలు

1. దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్యరచనల సంకలనం – ఎమెస్కో ప్రచురణ.
2. తిలక్ సాహితీ సందర్శనం – కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ
3. గురజాడ వ్యాస రచన – ఆధునికత (వ్యాసం) – డా॥ పి.సి. వెంకటేశ్వర్లు
4. వ్యాస పరిణామం – ఆచార్య కొలకలూరి ఇనాక్
5. వ్యాస వివేచనం – వి. చెంచయ్య

# 22. తిలక్ లేఖా సాహిత్యం

**- ఎ. రాజయ్య**

లేఖలను జాబులు,ఉత్తరాలు అని కూడా పిలుస్తారు.మూడు దశాబ్దాల ముందుకూడా లేఖలు సమాచార ప్రసారానికి ప్రధానమైన భూమికను పోషించాయి. ఆధునిక సాంకేతిక యుగం లేఖలను దూరంచేసింది. ఆ లేఖలే రూపం మార్చుకొని మెసేజస్,ఇ-మెయిల్స్ రూపంలో మనమధ్య తిరుగుతూ ఉన్నాయి.కానీ లేఖలు అందించిన అనుభూతులు,ఆనందాలు అనుపమానమైనవి. వ్యక్తులమధ్య కలయిక జరగలేని, జరగడానికి వీలులేని ప్రదేశాలలో లేఖలు మనుషుల మనసులనుదగ్గరచేస్తూ బంధాలను కలిపి ఉంచాయి. అందుకే హిందీలో లేఖను ఖత్ అధీములాఖత్ అంటారు. అంటే ఉత్తరాలు సగం మనుష్యుల కలయిక అని అర్థం. ఉత్తరాలు ప్రేమను, ఆత్మీయతను పంచుతూ ఒకప్పుడు లోకమంతా విహరిస్తూ ఉండేవి. ఉత్తరాలు రాయడం కూడా ఒక కళగా గుర్తింపబడింది. కలం స్నేహం లాంటి శీర్షికలను పత్రికలు నిర్వహిస్తూ లేఖారచనను ప్రోత్సహించాయి. అలా లేఖా రచన బహుముఖాలుగా విస్తరించి నేడు దాదాపుగా కనుమరుగైపోయింది.

ప్రపంచంలో లేఖారచన లిపి పుట్టుకతోనే ప్రారంభమై ఉండవచ్చు. లిపికి ఆధారం భాష. భాష మానవుడు ఎలానేర్చుకున్నాడు, ఇన్ని భాషలు ఎలా ఏర్పడ్డాయి అనే విషయంపై నేటికీ పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. క్రమ పరిణామ వికాసం వలననే భాష రూపొందిందనేది ఎక్కువమంది శాస్త్రవేత్తల అభిప్రాయం. భాషకు సంకేతంగా మానవుడు లిపిని రూపొందించుకున్నాడు. లిపి రూపొందిన తరువాత లేఖారచన ప్రారంభమై ఉండవచ్చు.

లేఖలు వాగ్రూప లేఖలని, లిఖిత రూప లేఖలని రెండు రకాలు. విద్యలేని సామాన్య జనులు వాగ్రూప లేఖలనే తమ దైనందిన జీవితంలో ఉపయోగించేవారు. చెప్పదలచుకొన్న విషయాన్ని మనుషుల ద్వారా చెప్పి పంపడాన్ని వాగ్రూప లేఖ అంటారు. లేఖన సాధనాలు పరిమితంగా ఉన్న రోజుల్లో ఈ పద్ధతినే ఎక్కువగా

ఉపయోగించేవారు. తాళపత్రాలు,భూర్జ బోదెలు తయారు చేయడం ఉపయోగించడం శ్రమతో కూడుకొన్న పని కావడంవల్ల విద్యావంతులు సైతం వాగ్రూపలేఖలకే ప్రాధాన్యమిచ్చేవారు. లేఖన సాధనాలు విరివిగా వాడుకలోకి వచ్చిన తరువాత లిఖిత రూప లేఖలకు ప్రాధాన్యత పెరిగింది.

తెలుగు భాషలో లేఖలు తెలుగు లిపితో పాటుగా ప్రారంభమై ఉంటాయి.తెలుగు భాష క్రీ.పూ 1 వ శతాబ్దంనుండి జనవ్యవహారంలో ఉన్నట్లుగా ఆధారాలున్నాయి. తెలుగు లిపి క్రీ.శ 5 వ శతాబ్దినుండి అమలులో ఉన్నట్లు గుణగ విజయాదిత్యుని శాసనాల ద్వారా తెలుస్తుంది. తెలుగు భాషలో మొదటి పద్యం క్రీ.శ 6 వ శతాబ్దంలో, మొదటి కావ్యం 11వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు మనకు ఆధారాలు లభిస్తున్నాయి. ప్రపంచంలో మొదటి లేఖ మెసపటోమియా నాగరికతలో భాగంగా సెమటిక్ భాషలో ఎండు మట్టి పలకపై రాయబడింది.ఇది క్రీ.పూ 1000 సంవత్సరాల నాటిది. రాజులు వేయించిన శిలా శాసనాలు, తామ్రశాసనాలు కూడా ఈ కోవకేచెందుతాయి.కవులు కావ్యాలలో వర్ణించిన సందేశాలు, రాయబారాలు కూడా లేఖలే. మేఘసందేశం వంటి సందేశ కావ్యాలు కూడా లేఖల కోవకే చెందుతాయి.భారతీయ సాహిత్యం ప్రకారం మొదటి పోస్టుమేన్ గా నారదమహర్షిని మనం పేర్కొనవచ్చు. అక్బర్‌కాలంలో భారత దేశంలో తపాలా వ్యవస్థ ప్రారంభమైంది. కాగితం వాడుకలోకి వచ్చిన తర్వాత, బ్రిటీష్‌వారి పాలనా కాలంలో తపాలా వ్యవస్థ భారత దేశంలో విస్తృతంగా ఉపయోగించ బడింది. లేఖలు సాధారణ,లౌకిక విషయాల చేరవేతకు ఉపయోగించబడినా వాటిలోని సాహితీ విషయాలు,విలువలనుబట్టి లేఖలనుకూడా సాహిత్యంగా గుర్తించడం జరుగుతుంది. తెలుగు భాషలో ఆధునిక లేఖా సాహిత్యం సి.పి.బ్రౌన్ గారితో మొదలైందని చెప్పవచ్చు. వీరు ఆనాటి కవులు, సాహితీ దిగ్గజాలతో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలు ఎన్నో సాహిత్య విషయాలను నేటితరానికి అందిస్తున్నాయి. సి.పి.బ్రౌన్ తర్వాత కందుకూరి,గురజాడ,త్రిపురనేని రామస్వామి చౌదరి,కట్టమంచి రామలింగారెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, చలం, శ్రీశ్రీల లేఖలను అధ్యయనంచేస్తే సమకాలీన దేశ పరిస్థితులు, తెలుగు భాషాస్వరూపం,సాహిత్యాంశాలు మనకెన్నో తెలుస్తాయి.

తెలుగు సాహిత్యంలో దేవరకొండ బాలగంగాధరతిలక్ కు ఒక ప్రత్యేక స్థానముంది. వీరు తణుకులో సంపన్నకుటుంబంలో జన్మించారు. గోరువంకలు , ప్రభాతము–సంధ్య, అమృతంకురిసినరాత్రి లాంటి రచనలు చేశారు.ఈ రచనలన్నీ ఆయన విశిష్ట రచనా

శైలిని అవగతం చేస్తాయి. ఆయన రచనా వ్యాసంగం మొదలు పెట్టే సమయానికి భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం కొనసాగుతున్నాయి. ఈ రెండు కవిత్వోద్యమాలలో ఆయన చిక్కుకోకుండా రెండింటి ప్రభావంలో ఒక విశిష్ట కవిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆయన సమకాలీనులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలలో ఎన్నో సాహిత్య విషయాలు చర్చకు వచ్చాయి. ఈ వ్యాసంలో తిలక్ లేఖలను మాత్రమే స్వీకరించడం జరిగింది కాబట్టి ఆయన జీవిత విషయాలను,సాహిత్యాన్ని స్పృశించదలచుకోలేదు. తిలక్ తన జీవితకాలంలో ఎందరికో ఎన్నో లేఖలనురాసి ఉండవచ్చు. వాటన్నింటినీ అర్ధశతాబ్దం పాటు దాచి ఉంచడం అందరికీ సాధ్యంకాదు. వాటిలో దొరికిన లేఖలను మాత్రమే తీసుకొని వాటిద్వారా సమకాలీన పరిస్థితులను, సాహిత్యవిషయాలను పరిశీలించడం జరిగింది.

తిలక్ తన మిత్రులకు,సన్నిహితులకు రాసిన 74 లేఖలలోని సాహిత్యవిషయాలను పరిశీలించడం ద్వారా వారియొక్క మనస్తత్వం,కవిత్వంపై వారి అవగాహన, సమకాలీనులపై వారి దృక్పథం తెలుస్తున్నాయి. ఈ 74 లేఖలను తిలక్ 1959-1966 మధ్యకాలంలో రాశారు. తిలక్ ఈ లేఖలలో అనేక అంశాలను స్పృశించారు.సమకాలీన కవిత్వంపై తన అభిప్రాయాలను వెలిబుచ్చారు., భావకవిత్వంపై, అభ్యుదయకవిత్వంపై తనకుగల అభిప్రాయాలను వెల్లడించారు. తెలుగుసాహిత్యానికి షాక్ ట్రీట్‌మెంట్ లాంటి దిగంబర కవిత్వం గురించి చర్చించారు. ఆయన ఆలోచనలను అలవాట్లను నిక్కచ్చిగా తెలిపారు. తిలక్ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన ప్రముఖులలో నగ్నముని, నిఖిలేశ్వర్, శిష్టా జగన్నాథం, రెంటాల గోపాలకృష్ణ, ఆవత్స సోమసుందర్, వరవరరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, మిరియాల రామకృష్ణ,మోగంటి మాణిక్యాంబ, తంగిరాల వెంకట సుబ్బారావుగార్లు ఉన్నారు. వీరికి తన జీవిత కాలంలో అనేక మార్లు ఉత్తరాలు రాయడం జరిగింది. బాలగంగాధర్‌తిలక్ 45సంవత్సరాల వయస్సులో 1966వ సంవత్సరంలో మరణించారు. ఆయన జీవితం చివరి దశలో రాసిన లేఖలు ఇవి. ఆవత్స సోమసుందర్ ఛార్మింగ్ ప్రిన్స్ అని పిలుచుకొనే తిలక్ నిరంతరం ఏదో ఒక అనారోగ్యంతో బాధ పడుతున్నప్పటికీ, శరీరం సహకరించక పోయినప్పటికీ లేఖలలో ఆయన ఇతరులపై చూపే ఆత్మీయత తగ్గలేదు. లేఖారచనలో ఆయన శైలిలో కన్పించే మెరుగు దూరంకాలేదు.

1965 వ సంవత్సరంలో వినూత్నంగా దిగంబర కవిత్వం ప్రారంభమైంది. ఆరుగురు దిగంబర కవులు మారు పేర్లతో కవిత్వ రచన చేసి విలక్షణమైన శైలిని,

పదజాలాన్ని తెలుగు కవిత్వానికి పరిచయం చేశారు. వీరు పుస్తకావిష్కరణలోనూ విలక్షణత చూపుతూ వారి మొదటి సంపుటమైన ఇతిశాసనమ్ ను నాంపల్లి పాండు అనే రిక్షా కార్మికునిచేత ఆవిష్కరింపజేశారు. ఆ సందర్భంలో తిలక్ 21-6-1965 వ తేదీన నగ్నమునికి రాసిన ఉత్తరంలో వారి ఆవిష్కరణ విధానాన్ని గురించి రిక్షావాడు ఆవిష్కరించినా మంత్రిశేఖరుడు ఆవిష్కరించినా ఒకటే. ఇద్దరికీ కవిత్వమంటే ఏమిటో తెలియదు. అని అన్నాడు. అదేవిధంగా 8-7-1965న నిఖిలేశ్వర్‌కు రాసిన ఉత్తరంలో కూడా మీ ఆవిష్కరణ ఆత్మవంచన అని తెలిపాడు. దీనినిబట్టి దిగంబర కవులు నూతన సంప్రదాయాలను పాటిస్తున్నారని చెప్పినమాట ఆత్మవంచన వంటిదని ఆయన అభిప్రాయం. ఎందుకంటే ఆవిష్కరణ అనే సాంప్రదాయాన్ని వారుకూడా కొనసాగించారుకదా అని ఆయన ఉద్దేశం. కానీ మానేపల్లి హృషీకేశవరావుగారికి రాసిన ఉత్తరంలో మాత్రం దిగంబర కవులను ఆహ్వానిస్తున్నాను అని అనడాన్నిబట్టి తిలక్‌కు నూతనత్వాన్ని ఆహ్వానించే మనస్తత్వమని తెలుస్తుంది.

తిలక్ కు ఆయన కవిత్వంపైనా సమకాలీన కవిత్వంపైనా నిర్దిష్టమైన ఆలోచనలు ఉన్నాయి. 1965లో దిగంబర కవిత్వం రాకముందు తెలుగు సాహిత్యంలో ఏర్పడ్డ స్తబ్ధతను గురించి కాస్త లోతుగానే ఆలోచించినట్లుగా 31-07-1963న వరవరరావుకు రాసిన ఉత్తరంలో ప్రస్తుతం మారుతున్నకాలాన్ని విస్తృతమౌతున్న జాగృతిని ప్రతిబింబించే, అనువదించే ఫోరం చాలా అవసరం అనడాన్నిబట్టి నూతనత్వం అవసరంఅని భావిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఆ సమయంలో కవుల బాధ్యతను,అవసరాన్ని గురించి కూడా 27-5-1966 లో వరవరరావుకు రాసిన లేఖలో కవియొక్క అవసరం కవియొక్క ప్రేరణ ఈనాడే అవ్యవస్థలోనే ఎక్కువగా ఉంది. అని రాయడాన్నిబట్టి కవికి ఉండవలసిన సామాజిక బాధ్యతను నొక్కిచెప్పినట్లు తెలుస్తుంది. కవులు కూడా ముసుగు వేసుకొని కవిత్వరచన చేస్తున్నారని తెల్పుతూ 3-11-1963లో శ్రీమతి జానకీ జానీగారికి రాసిన ఉత్తరంలో తెలుగు సాహిత్యంలో వర్తమాన కాలాన్నిగురించి సంపూర్ణంగా తెలియపర్చడం ఖచ్చితమైన, నిర్మలమైన కొందరు వ్యక్తులకే సాధ్యమవుతుంది అనడాన్ని బట్టి పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని వేమన అన్నట్లుగా కవులలో నిబద్ధత గల కవులు వేరుగా ఉంటారని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తుంది.

ప్రాచీన సాహిత్య ధోరణులను విడిచి పెట్టని కవులపైన తిలక్‌కు కొంత వ్యతిరేక భావం ఉన్నట్లుగా ఆయన ఇంద్రగంటి శ్రీకాంత శర్మకు రాసిన లేఖలో గ్రాంథికాన్ని,

ఛందస్సునూ, ఆర్ష ధర్మాన్ని పట్టుకువేళ్ళాడే వీళ్ళని  చూస్తే జాలివేస్తుంది. అన్నారు. దీనిని బట్టి కవులు కాలానుగుణంగా మార్పుచెందాలని ఆయన అభిప్రాయంగా మనం గమనించాలి. సమకాలీన కవిత్వంపై కూడా తిలక్ తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పారు. 3-11-1963లో శాస్త్రిగారికి రాసిన లేఖలో మోడరన్ పొయిట్రీ పేరుతో పత్రికలలో ప్రకటితమయ్యే వాటిని చూసి విసుగు చెందాను అనడం,అదే లేఖలో మోడరన్ పొయిట్రీ ప్రబంధ యుగంలో చివరికాలంలో పోలికలు కన్పిస్తాయి అనడాన్నిబట్టి ఆధునిక కవిత్వంలోని విపరీత ధోరణులు మనకు అవగతం అవుతాయి. తిలక్ కాలంనాటి భావకవిత్వోద్యమం, అభ్యుదయ కవిత్వోద్యమం నీరసపడ్డాయి. ఈ ఉద్యమాలు ఇలా నీరసించిపోవడానికి గల కారణాన్ని తిలక్ ఎంతో స్పష్టంగా వరవరరావుగారికి రాసిన లేఖలో ఉద్యమం అనేది బలమైన నిజమైన కవులుంటేనే బతుకుతుంది నిలుస్తుంది అని రాశారు. దీనిని బట్టి 1963 కాలంలో నిజమైన,బలమైన కవులు ఈ ఉద్యమాలకు దూరంఅయ్యారనే చారిత్రక యథార్థం మనకు అర్థం అవుతుంది.

తిలక్ సమకాలీన కవులతో మంచి సంబంధాలున్నట్లు తెలుస్తుంది. ఆయన శ్రీ కనక్ ప్రవాసి, ఉషశ్రీ, రంధి సోమరాజు, ఆవత్స సోమసుందర్, నండూరి రామ మోహనరావు, మాదిరాజు రంగారావు, తెన్నేటి సూరి, తిరుమల రామచంద్ర, పిలకా గణపతి శాస్త్రి, యస్.వి.జోగారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బందా కనకలింగేశ్వరరావు, తల్లావఝ్జుల శివశంకరశాస్త్రి, కాటూరి వెంకటేశ్వరరావు వంటి కవులను గురించి తన లేఖలలో ప్రస్తావించారు.వీరి సాహచర్యంతోనే ఆయన అనారోగ్యమైనా ఆరోగ్యవంతునిగా జీవించగలిగాడని మనం గ్రహించాలి. అందులో చివరి నలుగురినీ దిగ్గజాలుఅని ఆయన ప్రశంసించడాన్ని బట్టి ఆయన మహోన్నత వ్యక్తిత్వం కనిపిస్తుంది. కృష్ణశాస్త్రి గారంటే తిలక్‌కు ఎక్కువ అభిమానం ఉన్నట్లుగా తోస్తుంది. 13-3-1961లో మాణిక్యాంబగారికి రాసిన ఉత్తరంలో  కృష్ణశాస్త్రిగార్ని జాగ్రత్తగా చదవండి,ఎన్నిసార్లు చదివితే అంత మాధుర్యాన్ని ప్రసాదిస్తుంది అని కృష్ణపక్షం గురించి చెప్పారు. దానిని బట్టి తిలక్‌కు ఆయన కవిత్వంపైగల అభిమానం అర్థమవుతుంది. విశ్వనాథ సత్యనారాయణగారిపై కూడా తిలక్‌కు కొంత అభిమానం ఎక్కువ అన్నది 5-12-1961న మిరియాల రామకృష్ణగారికి రాసిన లేఖలో విశ్వనాథ వారిమీద విరుచుకు పడుతున్న ప్రళయాన్ని తిలకిస్తున్నారా అనడాన్ని బట్టి విశ్వనాథ పై ఆయనకు

గల సానుకూల దృక్పథం తెలుస్తుంది. ఆకాలంలో సెవన్ స్టార్ సిండికేట్ సంస్థ ప్రచురించే నవత పత్రిక సంచలనాలకు నిలయంగా ఉండేది. తిలక్‌కు మొదట ఈ పత్రిక విషయంలో కొంత వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తుంది. 31-11-1963న శాస్త్రి గారికి రాసిన లేఖలో నవత పత్రికతో అసంతృప్తి చెందాను అని రాశారు. కానీ అదే తిలక్ 25-05-1964న శిష్టా జగన్నాథరావుగారికి రాసినలేఖలో నవత నిలబడాలి, స్థిరపడాలి నవ్యులకు నేడున్న ఒకే ఒక ఫోరం నవత అని రాశారు. ఆ సమయానికి ఆయన దృక్పథంలో మార్పుకు వరవరరావు లాంటి సన్నిహితులతో స్నేహం కారణం కావచ్చు. తిలక్ 18-07-1965న సోమసుందర్‌గారికి రాసినలేఖలో నవత ఆగిపోయినట్లేనా అని రాశారు. దానిని బట్టి కవులలో వచ్చిన మార్పువల్ల నవత పత్రిక 1965 నాటికి ఆగిపోయినట్లుగా తెలుస్తుంది. గ్రాంథిక భాషావాదులు నడిపినజయంతి పత్రిక పైకూడా తిలక్‌కు సదభిప్రాయం ఉన్నట్లు కనిపించదు. జయంతి పత్రిక సనాతనపు వాసన కొంచం ఎక్కువగానే కొడుతుంది అని 22-06-1959న సోమసుందర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. దానిని బట్టి జయంతి పత్రిక సాంప్రదాయ కవిత్వాన్ని ఎక్కువగా ప్రోత్సహించిన విషయం తెలుస్తుంది.

తిలక్ ఎంతగొప్ప కవి అయినా ఆయన స్నేహితులు కూడా కవులే అయినా వారికి రాసిన లేఖలలో అన్నీ సాహిత్య విషయాలే ఉండవు. కొన్ని వ్యక్తిగత విషయాలు కూడా ఉంటాయి. తిలక్‌కు వయస్సును గురించిన ఆలోచనలుకొంచెం ఎక్కువే. 27-05-1959 న సోమసుందర్‌కు రాసిన లేఖలో వేళ్ళ సందుల్లోంచి పొడి ఇసకలా జారిపోయే కాలాన్ని వయస్సును తలచుకొంటే భయమవుతుంది. అనడం, 26-02-1964న వరవరరావుకు రాసిన లేఖలో వయస్సు కౌమారం వైపూ వృద్ధాప్యంవైపూ పెరుగుతున్న మనస్సు యువకత్వంవైపూ లాగుతుంటుంది అని అనడాన్నిబట్టి 40 సంవత్సరాల వయస్సుకే ఆయన కొంత బాధతో ఉన్నట్లుగా భావించవలసి ఉంటుంది. కవిబాధ పడినా సమాజానికి ప్రయోజనమే అని 22-6-1959న సోమసుందర్‌కు రాసిన లేఖలో కవిహృదయం ఒక విషాదానుభూతివల్ల బరువెక్కినా బాధపడినా ప్రమాదమేమీ లేదు. పైగా లోకానికొక పద్యమో,గేయమో దొరకవచ్చుకూడా అని రాశాడు. దీనిని బట్టి కవి బాధకు కూడా ఒక ప్రయోజనం ఉన్నట్లుగా ఆయన భావిస్తున్నాడని అర్థమవుతుంది.

తిలక్ ప్రకృతి ప్రేమికుడు అని మనకందరకూ తెలుసు. ఆయనకు వర్షమంటే చాలా ఇష్టం. 18-7-1959న సోమసుందర్‌కు రాసిన లేఖలో వర్షం కరిసీ కురిసీ

భూమి తడిసీ తడిసీ పచ్చిబాలింతరాలులా అందంగా ఉంది. అని రాశారు. 18-08-1961 న మిరియాల రామకృష్ణకు రాసిన లేఖలో వర్షాకాలం స్నానం చేసి వచ్చిన యువతి శరీరంలాగా విచిత్రమైన అందం ఆకర్షణ అని రాశారు. 1957లో తంగిరాల వేంకటసుబ్బారావు గారికిరాసిన లేఖలో ప్రకృతి ఎలా ఉందంటే నూతి దగ్గర తలారా స్నానంచేసి నీళ్ళోడుతూ తడిబట్టలతో ఇంట్లోకి వస్తున్న అందమైన యువ గృహిణిలా ఉంది అని రాశారు. అలాగే 9-5-1961 న మాణిక్యాంబ గారికి రాసిన లేఖలో ఆకాశంలో అక్కడక్కడా ఒక మబ్బుతునక ఏ అప్సరస ఒంటి మీద నుండో జారిన చీరకొంగులా గాలిలో తేలిపోతుంది. అని రాశారు. ఈ భావకవిత్వ ధోరణులు ఉపమానాలను పరిశీలిస్తే వర్షమంటే ఆయనకు చాలా ఇష్టమని అర్థమవుతుంది. కవికి సాధారణంగా స్పందించే మనస్సు ఉంటుంది అందులోనూ తిలక్ లాంటి కవి చాలా సున్నిత హృదయుడు. 9-5-1961లో మాణిక్యాంబ గారికి రాసిన లేఖలో ధు:ఖానికి బాధకి కరగకపోతే ఈ బాల గంగాధరుడు తన కవిత్వాన్ని, ప్రాణాన్ని కూడా బంగాళాఖాతంలోకి  విసిరిపోతాడు అని రాశాడు. అదే లేఖలో మరో సందర్భంలో ఒక్క  నయనం నుండి ఉబికే బాష్పాన్ని తుడవ గలిగితే, ఒక్క అధరం మీదికి హాస్యాన్ని రప్పించగలిగితే జీవితం ధన్యమౌతుందని నా ఉద్దేశ్యం అని రాశారు. 16-9-1964లో వరవరరావుగారికి రాసిన లేఖలో కత్తి అంచుమీద నడిచిన వాడినే, కన్నీటి వానలో తడిచిన వాడినే అని రాశాడు. దీనిని బట్టి ఆయన ఎంత సున్నిత మనస్కుడో, దయార్ద్ర హృదయుడో అర్థమవుతుంది. తిలక్ కొన్నిసార్లు తీవ్రంగా ప్రతిస్పందించిన సందర్భాలు కూడా ఉన్నాయి 9-5-1961న మాణిక్యాంబ గారికి రాసిన సుదీర్ఘమైన లేఖలో భారత దేశ పరిస్థితులను గురించి నలభైకోట్లమంది నాదేశీయుల దరిద్రానికి నేను తల్లడిల్లిపోతాను అని,దేశంలోని అవినీతిపై స్పందిస్తూ అదే లేఖలో మనదేశంలో ఉన్నంత మంది ఫోర్జరీ ప్రవీణులు మరే దేశంలోనూ ఉండరేమో అని రాశాడు. అంతే కాకుండా దిగంబర కవుల ధోరణిలో కుళ్ళిన ముసలిదై పోయిన సంఘాన్ని, బూజు పట్టిన భావాన్ని, రూపుమాపే బాధ్యత కూడా రచయితదే అని రాశారు. దీనిని బట్టి కవికి ఉండవలసిన బాధ్యత అర్థమవుతుంది. మరొక చోట ఇక్కడి భార్యలు ఒక చీర కోసం, ఒక పకోడీ పొట్లం కోసం తమ భర్తలతో వ్యభిచరిస్తారు అని రాశాడు. దీనిని బట్టి సమాజంలో స్త్రీల దయనీయ పరిస్థితులను ఎత్తి చూపుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మాటలు పాటలు ఎల్లప్పుడూ ఇతరులను స్వాంతనపరచేవిగనే

ఉండేవి. ఆయన వద్దకు వచ్చి  ఊరట పొందని వారు లేరంటే అతిశయోక్తి కాదు. 28-2-1961లో మాణిక్యాంబకు రాసిన లేఖలో

ఇంత గ్రీష్మ దాహ మెగసిన నీ గుండె
మండి మండి మసిగా మారినపుడు
నా పాట నా మాట నవ పరిమళముల
వట్టివేళ్ళ తెరలను కట్టి చూడు

అని రాశాడు. దీనిని బట్టి తిలక్ మృదు స్వభావం, సానుభూతి తత్వం తెలుస్తున్నాయి. ఇలాంటి సున్నిత హృదయం కలవాడు కాబట్టే అమృతం కురిసిన రాత్రి లాంటి అద్భుత కావ్యం రాయగలిగారు. 9-5-1961 వ తేదీన మాణిక్యాంబ గారికి రాసిన సుదీర్ఘమైన లేఖలో ఒక అందమైన బిచ్చగత్తె గురించి తెలిపాడు. చిన్న వయస్సులో ఆయన ఆలోచనలు, ప్రవర్తనను గమనిస్తే ఆయన మనస్సులోని సున్నితత్వ కోణం అవగతమవుతుంది.

తిలక్ పదప్రయోగాలు చాలా విశిష్టంగా ఉంటాయి. స్నేహితులను కవినాయక బృందం అని(24-10-1959 సోమసుందర్‌కు రాసిన లేఖ), పేకాటను రాత్రిందివ కృత యజ సంరంభం అని(8-1-1965  న సోమసుందర్ కు రాసిన లేఖ) శతపత్ర గోష్ఠి అని(18-03-1961న మాణిక్యాంబకు రాసిన లేఖ),  నస్యం పీల్చడంవల్ల బంగురు పోయిన తన గొంతును కంఠ స్తంభిత నస్యధూళి కలుష బడం వాగ్విధం అని రాయడం ఆయనకే చెల్లుతుంది. తిలక్ కు కొన్ని ప్రత్యేకమైన అలవాట్లు కూడా ఉన్నాయి. లేఖలో పి.యస్. తలక్రిందులుగా రాయడం,  లేఖ రాయకుండా బద్ధకస్తులైన తన స్నేహితులకు రిప్లయి కార్డులను జతచేయడం లాంటివి కొన్ని. ఆవత్స సోమసుందర్‌గారు తిలక్ ను ఉద్దేశించి తిలక్ నూటికి తొంభైశాతం చాలా మంచివాడు అంటాడు. ఆ పదిశాతం ఆయన స్వభావం కాదు అలవాట్లు మాత్రమే. తిలక్‌కు నస్యం పీల్చడం అనే అలవాటు ఉంది. అలాగే ఆయన చాలా ఎక్కువగా శతపత్ర గోష్ఠిలో పాల్గనేవారు మన భాషలో చెప్పాలంటే పేకాట ఎక్కువగా ఆడేవారు. చాలా చాలా ఎక్కువగా ఆడేవారు. 8-1-1965న ఆవత్స సోమసుందర్ గారికి రాసిన లేఖలో రాత్రిందివకృత యజ సంరంభంలో ఉండిపోయి అనారోగ్యాన్ని, కంటిజబ్బును కొని తెచ్చుకున్నాను అని రాశారు. దీనిని బట్టి ఆయన ఎంతలా మునిగిపోయే వారో తెలుస్తుంది. చంద్రునిలో మచ్చ ఉన్నట్లుగానే మన ఛార్మింగ్ ప్రిన్స్ కి కూడా ఇది ఒక

దురలవాటు అంతే. 19-9-1964న వరవరరావుకు రాసిన లేఖలో సిరి తగ్గినా దాని తాలూకు దుర్లక్షణాలు అలానే ఉన్నాయి అని రాయడం వారి నిజాయితీకి నిదర్శనం. తిలక్ చాలా సరదా మనిషి ప్రతి లేఖలోను స్నేహితులను తన ఇంటికి ఆహ్వానించడం కనిపిస్తుంది. రాకూడదూ కొంతకాలం సరదాగా గడుపుదాం అని రాస్తారు. తిలక్ కు ఎందుకో తెలుగు దినపత్రికలను చూసే అలవాటు లేనట్లు కనిపిస్తుంది. ఆ విషయాన్ని రెండు మూడు సార్లు స్నేహితులకు రాసిన ఉత్తరాలలో చెప్పారు. తిలక్ లేఖలలో హాస్యం కూడా చోటుచేసుకుంది. 18-6-1961లో మిరియాల రామకృష్ణకు రాసిన లేఖలో విద్యాశాఖ అధికారులపై ఆయన కోపంతో రాసిన మాటలు నవ్వు తెప్పిస్తాయి. దరఖాస్తు పెట్టడం కూడా పర్వతారోహణంవంటి సాహసక్రియగా చేసిన మన విద్యాధికారుల మేధాసంపత్తికి ఏడవాలో నవ్వాలో తెలియడంలేదు. విశాఖపట్నం ఆసుపత్రి వాళ్ళకు ఎందుకు కేటాయించకూడదో అని రాశాడు. వారిని పిచ్చాసుపత్రిలో వేయాలని ఆయన ఉద్దేశ్యం.

తిలక్ రాసిన లేఖలను అవగాహన చేసుకొంటే ఆయన గొప్పకవిగా, విమర్శకుడిగా, గొప్ప మానవతా వాదిగా అంతకంటే ఎక్కువగా నిజాయితీ పరుడిగా కనిపిస్తాడు. గాంధీ జీవిత చరిత్ర చదివిన తరువాత ఆయన వ్యక్తిత్వం, గుణగణాలు ఎలా తెలుస్తాయో, తిలక్ లేఖలను చదివితేనే ఆయన వ్యక్తిత్వం, ఆత్మీయత ఉవ్వెత్తున ఎగిసి మేరుపర్వతంలా మనముందు సాక్షాత్కరిస్తాయి. విధి 45 సంవత్సరాల వయస్సుకే ఆయనను దూరం చేయకుండా ఉండి ఉంటే మరెన్నో ఉదాత్తమైన రచనలు అంతకంటే ఉదాత్తమైన లేఖలు మనకు లభించి ఉండేవి.

**ఆధార గ్రంథాలు**


1. తిలక్ సాహిత్య సర్వస్వం.
2. జీవిత యదార్థాలను కవితా రమణీయతను తిలకించిన కవి తిలక్ – ఆవత్స సోమసుందర్ గారి వ్యాసం.
3. తెలుగులో లేఖా సాహిత్యం
4. తెలుగు సాహిత్య సమీక్షా ప్రొ. జి. నాగయ్య
5. ఆధునిక తెలుగు సాహిత్యం-సాంప్రదాయాలు ప్రయోగాలు-డా॥ సి. నారాయణరెడ్డి

# 23. సౌందర్యానికి నిలువెత్తు నిదర్శనం తిలక్ కవిత్వం

– ఎస్.పి. యూసుఫ్, ఎం.సి.జె.

**ఉపోద్ఘాతం**

ప్రముఖ కవి శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు రాసిన కవిత్వం సౌందర్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఆయన భావ కవి, అభ్యుదయ కవి. ఊహకి అందని భావాలను వ్యక్తం చేశారు తిలక్ గారు. 'మనిషికి మనిషికి మధ్య అనుబంధం ఉండాలి, మనం చెట్లు, పుట్టలు కాదని, ఒక మనిషిని చూస్తే ప్రతిస్పందన ఉండాలి' అనుకునే రచయిత తిలక్ చాలా తేలికైన పదాలతో కవితలు, కథలు రాశారు. ఆయన కథలు, కవిత్వాల్లో మానవ సంబంధాలు, మనుషుల మధ్య ప్రేమకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆధునిక కవితా రంగంలో అంటే.. శ్రీశ్రీ యుగంలో తమ రచనలు గ్రంథంలోకి రాకపూర్వమే యావదాంధ్ర దేశంలో ఉత్తమ కవులుగా పేరు పొందిన వారు ముగ్గురున్నారు. వారిలో తిలక్ ఒకరు కాగా మిగిలిన ఇద్దరు శ్రీశ్రీ, అజంతాలు. నేను ఈ పత్రంలో దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసిన కవితల్లోని సౌందర్యాన్ని విశ్లేషణ చేస్తున్నాను.

**కవి పరిచయం**

కవి శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్‌గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలుకా మండపాకలో 1921 ఆగస్టు 1వ తేదీన జన్మించారు. ఆధునిక కవిగా పేరు పొందిన ఆయన "చరిత్ర రక్త జలధికి స్నేహ సేతువును నిర్మిస్తున్నాను రండి" అంటూ బలమైన కంఠంతో విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిబద్ధుడై మానవతా కేతాన్ని ఎగురవేయడమే ధ్యేయంగా, కరుణ కలికితురాయిగా తన అపురూపమైన అనుభూభూతుల్ని అక్షరబద్ధం చేస్తూ, అమృతమయమైన కవితా

ఝురిని ప్రవహింపజేసిన కవితా తపస్వి దేవరకొండ బాలగంగాధర తిలక్ గారు. ఆయన చివరకు 1966 జూలై 1వ తేదీన స్వర్గస్తులయ్యారు.

**విషయ విశ్లేషణ**

**కవితా మూలాలు – తిలక్ సాధించిన సౌందర్యం:** శ్రీ బాలగంగాధర తిలక్ గారు సాహితీ సృజన కేవలం వచన, కవితా రచనకు మాత్రమే పరిమితమైనది కాదు. ఇతర సాహితీ ప్రక్రియలలో కూడా విశేషమైన కృషి చేశారు. ఛందోబద్ధమైన కవిత్వ రచనలో, కథా రచనలో, నాటికా రచనలో తిలక్ అందిరిలో ఒకరు. కానీ, వచన కవితలో ఆయన అసమానమైన సౌంధర్యాన్ని సాధించారు. చాలా మంది వచన కవిత్వమంటూ శుష్కమైన వచనాన్ని రాయటం మాత్రమే చేశారు. కానీ, తిలక్ గొప్ప సౌందర్య సీమల్ని, వివిధ సాంధ్రమైన మానవానుభావాలను ఆవిష్కరించారు. సుకుమారమైన భావ సౌందర్యాన్ని, మధురనాధ ప్రధానమైన శైలీ రమ్యతను సాధించారు. చాలా మంది కవిత్వాన్ని, కవిత్వ తత్వాని గురించి రకరకాలుగా చెబుతారు. తిలక్ ఎంతో సూటిగా చెప్పారు. 'అందం, ఆనందం, దాని పరమావధి అన్నారు'. వచన, కవిత్వ లక్షణ గ్రంథం వ్రాయవలసి వస్తే ప్రధానంగా ఆయన 'అమృతం కురిసిన రాత్రి', మరి కొద్ది మంది ఇతర ప్రసిద్ధులైన వారి వచన కవిత్వాన్ని ఆధారం చేసుకొని వ్రాయాలేమో. అందం సాధించి ఆనందం అందివ్వని రచన కవితే కాదని ఆయన రూఢిగా చెప్పినట్లయింది. నిజానికి ఇజాలతో కవితకు సంబంధం లేదు. మరోక విషయం ఏమిటంటే సూక్తులన్నీ క్లుప్తతతో కూడి ఉండి వినడానికి ఆకర్షణీయంగానే ఉంటాయి. వాటిని కవితా పంక్తులుగా చలామణి చేయించాలనే ప్రయత్నం కవితా విరోధమౌతుంది. ప్రేమ, కరుణ, క్షమ, సత్యం, స్నేహం, సహకారం. ఇవన్నీ అందరికీ ఆనందాన్ని పంచే, పెంచే విలువలు. ఆ విలువలకే కవిత్వంలో చోటుంటుంది. వాటికుండే స్పందనలు లోతైనవిగా ఉంటాయి. కవి వాటినే ప్రేరేపిస్తారు. తిలక్ చేసింది అదే.

కవిత్వ పరామర్శ జరగవలసింది రెండు భూమికల మీద. మొదటిది భావ మధురోహాల మార్ధవం మీద, సాంధ్రత మీదు. రెండవది సంపూర్ణమైన సందర్భ శుద్ధి కలిగిన పదాల కూర్పులోని శబ్ద సారుప్యత వల్ల ధ్వణించే మనోహరమైన లయ మీద, శైలీ రమ్యత మీద, రాసపరాదర్శకత మీద, ఇంకా ఆ పదాల కూర్పులోంచి క్రమక్రమంగా ఉదయించే సూర్యనిలా ఆవిర్భవించి దృశ్య మానమయ్యే సజీవ చిత్రాల

మీద, పద చిత్రాల ప్రాదుర్భవానికి పాదుకొల్పేవి ముఖ్యంగా రూపకాలంకారాలు. వీటిని అంత సులభంగా, సుందరంగా, అంత విస్తృతంగా తిలక్‌లా వాడుకొన్న వారు చాలా కొద్ది మంది మాత్రమే ఉన్నారు. తిలక్ పంక్తుల అల్లికలలో రూపాలంకారాలు అంతర్భాగాలై కలిసిపోతాయి. ఆ రెండింటిని కూడా అద్భుతంగా వచన కవితలో తిలక్ సాధించారు.

కవిత్వానికి కంటావశమయ్యే గుణం ఎక్కువగా ఉంటుంది. ఆ కవి గొప్పవాడు కావచ్చు, కాకపోవచ్చు. ఆ పద్యం గొప్ప అవ్వొచ్చు. అవకపోవ్వచ్చు. చందోభంగం కాకుండా రాయబడితే చాలు కంట వశమవుతుంది. ఇది పద్యం గొప్పదనం. ఈ ఛందో రీతులను రూపొందించిన ఆది కవులు, అలంకారికుల గొప్పదం. కానీ వచన కవిత కంఠవశమవడానికి వచన కవి అద్భుతమైన ప్రతిభ కలవాడై ఉండాలి. అంత ప్రతిభను మనం తిలక్‌లో చూడగలం. ఆయన కవితలు పంక్తులకు పంక్తులు మధురక్షరాల ప్రవాహాలై ఆనందంలో మనల్ని ముంచెత్తుతాయి. వర్ణిత విషయాలు మెరుపు తీగల్లా సాగిన పద చిత్రాల ద్వారా దృశ్యమానమవుతాయి.

తిలక్ రాసిన ప్రతి గీతం మనసును కుదిపేస్తుంది. ఉదాహరణకు నీవు లేవు నీ పాట ఉంది, అమృతం కురిసిన రాత్రి, ఆర్థ గీతం, కఠినోపనిషత్, వసుధైక గీతం, అదృష్టాద్వగమనం, వీరహోత్కంఠిత, చావులేని పాట, నెహ్రూ, వెళ్లిపొండి వెళ్లిపొండి, మంచు, వెన్నెల, శిఖరరోహణ, వానలో నీతో, సైనికుడి ఉత్తరం... ఇలా ఎన్నో, ఎన్నెన్నో గొంత్తెత్తి పాడుకోవాలనిపిస్తుంది. ఒక 'ఇన్స్‌ప్రైడ్ స్టేట్ ఆఫ్ మైండ్'లో తిలక్ సున్నిత మనస్కులు, గొప్ప సౌందర్యారాధకులు. ఆయన ఆరాధించే సౌందర్యం శీలానికి సంబంధించినది, రూపానికి సంబంధించినది, శబ్ధానికి సంబంధించినది. శీలానికి సంబంధించిన సౌందర్యం కవిత వస్తువుకు సౌందర్యం. అంటే కవితకు ఆలంభనమైన కవి యొక్క సాంద్రమైన స్పందనలకు సబంధించిన సౌందర్యం. సకల లోక కళ్యాణం, సకల జనుల సౌభాగ్య, సంతోష కామన కలిగిన వస్తు విశేష ఔన్నత్యం. తోటి జనుల బాధలకు కన్నీటి గీతికై స్పందిచే దయాగుణానికి సంబంధించిన సౌందర్యం. కవిత్వీకరణకు మాధ్యమంగా ఉండే అలంకారం ముఖ్యంగా రూపకాలంకార ప్రయోగం ద్వారా సాధించే పదచిత్ర సృజనకు సంబంధించిన సౌందర్యం రూపానికి సంబంధించినది. అంతర్భావావేశం వ్యక్తీకరణకు మాధ్యమంగా, వాహికగా ఉండేది పద చిత్ర సమూహం. దానికి సంబంధించిన సౌందర్యాన్నే రూపానికి సంబంధించిన సౌందర్యంగా పరిగణించవలసి ఉంది. ఈ దృశ్య రూప సౌందర్యాన్ని స్థిరీకరించేది

నిర్మాణ ప్రౌఢిమ, శిల్పం. భావమేపుడు అమూర్తమే. అమూర్తమైన భావాన్ని, మూర్తమైన వస్తు లేదా దృశ్య లేదా ప్రాణి మాధ్యమంగా స్ఫూరింపచేయడం ప్రతీకాత్మక కథ.

శబ్దానికి సంబంధించిన సౌందర్యం ప్రధానంగా శైలీ రమ్యతకు సంబంధించినది. సందర్భ శుద్ధి కలిగి శబ్ద సారుప్యత కలిగిన పద ప్రయోగజనితమైన లయ విన్యాసానికి సంబంధించి చెవులకు ఇంపై మనసును అలరించే సౌందర్యం శబ్దానికి సంబంధించినది. విడమరిచి విశ్లేషిస్తున్నప్పుడు మూడుగా లేదా త్రిముఖంగా చెప్పుకుంటున్నాము కానీ ఈ మూడు చాలా అర్థవంతంగా సమగ్రంగా సమన్వయింప బడిన ఏకంగా సాగే రస ప్రవాహం. ప్రవాహంలో జలం ఉంటుంది. ఆ జలానికి రూపం, రంగు ఉంటుంది, వేగం ఉంటుంది. ఒక ప్రవాహం దర్శనానుభం మనకు కలిగినప్పుడు దాని రంగు, వేగం, రూపం మనకు విడివిడిగా అనుభూతమవవు. వాటిని మనం విడివిడిగా చూడం. మన అనుభవానికి సంబంధించి అక్కడ ఉన్నది ప్రవాహమొక్కటే. అలానే కవిత చరణం. దానిలో శబ్దార్థభావ రూప సౌందర్యాలు సమగ్రంగా సమన్వయింపబడినవన్న స్పృహ కూడా ఆ కవిత చరణ సౌందర్యానుభవంలో ఉండదు. కారణం, మనది పక్షిక దృష్టి కాదు, సమ్యక్‌దృష్టి. దాని వల్ల కలిగే రసానుభవం ఏకతానుభవం.

ఊరవతల సంధులలో.. దుమ్ము కొట్టుకుపోయిన పిల్లల కన్నులలో.. ఆరిపోతున్న వెలుగులలో..

కాలవ ఒడ్డున వంకర దిరిగిన తుమ్మ చెట్టు కొమ్మలోంచి కాలి మసైపోతున్న పశ్చిమ దిశ గగనంలో.. ఒక భయంకర సృష్టిక్రమాన్ని.. మానవయత్న వైఫల్యాన్ని.. ఊహించుకొని వొణికిపోయేవాణ్ణి.

శీల, రూప, శబ్ద సౌందర్యాల సమగ్ర సమన్వయత సాధించి పాఠకునికి రసానంద వాహికగా అస్తిత్వం కలిగి ఉంటాయి. ఈ పంక్తులు వర్గపు ప్రజల జీవితంలోని దైన్యాన్ని మన గుండె గూడు పట్ల ఎక్కడో కదిలినట్లు, మన కలలు కాగితపు పేలికలై రాలినట్లు, జాలిగా దు:ఖపు జాలుగా తాకుతాయి.

దిగులు నీరు నిండిన కోటి మనస్సరస్థిరాల నా కవిత కోరికల కోనకరపు కొత్త చెట్లను నాటుతుంది. అంటే శోకతప్తమైన హృదయ భారంలోంచి దు:ఖితుల కష్టాలు తీర్చగలిగే ప్రయత్నం తన కవిత ద్వారా చెయ్యాలనే ఆర్ద్రతతో కూడుకొనిన అచంచల విశ్వాసం మనకు అనుభూతమవుతుంది. అలా అనుభూతమయ్యేప్పుడు విడివిడిగా

మనం చూడం గానీ మన అనుభవాన్ని అర్థం చేసుకని విశ్లేషించేటప్పుడు దాని శబ్దానికి, రూపానికి, శీలానికి సంబంధించిన సౌందర్యాలతో సమన్వయింపబడిన మహా సౌందర్యంగా దానిని మనం గుర్తించగలం. శైలిలో అక్షర రమ్యత, రూపంలో కంటిని, మనస్సును వశపరుచుకోగల దృశ్య సౌందర్యం, వస్తు సాధుతత్వ సౌందర్యాల సమ్మేళనం తిలక్ కవిత చరణాలలో చూడగడం.

ఆకలికి, కష్టాలకు, దు:ఖాలకు కృంగి, కృషించిపోయిన దయనీయమైన బ్రతుకులకు అద్దం పట్టగలిగిన పద చిత్ర ప్రయోగంగా అది గొప్ప సౌందర్యం సంతరించుకుంటుంది. తిలక్‌లో ఈ సమన్వయత ప్రయత్నరహితంగా రూపుదిద్దుకుంటుంది. దానికి మూలం ఆయన స్పందనలలోని సమగ్రత, ఆయన కవిత్వీకరణలోని ఆర్కిటెక్ట్. ఇప్పుడు ఊటంకించిన కవితా చరణాలలో ఇంతకు క్రితం చెప్పుకున్నట్లు రూపకప్రతీకాత్మకతలు ఒకటై ఆ భావావిష్కరణలకు ఎలా సుందరమైన మాధ్యమాలుగా మారిపోయాయో చూడగలం.

**సౌందర్యానికి నిలువెత్తు నిదర్శనం తిలక్ కవిత్వం...**

తిలక్ గొప్ప సున్నిత మనస్కులు, గొప్ప సౌందర్యారాధకులు. విశ్వ వ్యాప్తమైన సౌందర్యం మొత్తం కుంచించుకొని సాంద్రమైన ఒక కేంద్ర స్థానం వైపు పరుగులెత్తి వస్తే ఆ పరిపూర్ణమైన సౌందర్యం మొత్తన్ని తన చైతన్యంలోకి దింపుకోవాలనేంత ఆర్తి కలిగిన సౌందర్యారాధకులు. అపరిమితమైన సౌందర్య కాంక్ష పరిమితమైన ఆనందానుభవం వలన జీవితంలో వీడని విషాదానికి ఉనికి, ఆనందం ఉంటుంది. దానిని అంటి పెట్టుకొనే విషాదం ఉంటుంది. అలానే ఆనంద విషాదాల మధ్య డోలాయమానమైంది ఆయన నలభై ఐదు సంవత్సరాల జీవితం.

తిలక్ కవిత్వ మూలాలను వెదకవలసింది అయన అనంతమైన సౌందర్య కాంక్ష దృష్టితో. మనిషికి కష్టాలు రెండు విధాలుగా ఉంటాయి. మొదటిది.. జీవన గమనరీతి. చూస్తు చూస్తుండగానే కనుమరుగైపోయే యవ్వనం, సౌందర్యం, ముంచుకొచ్చే మృత్యు స్థితి. రెండవది.. తిలక్ కోమలమైన అంతరంగం, జీవితంలోని సౌందర్యానికి, మధురిమలకు ఎంత ప్రాధన్యత ఇచ్చేవారు. జీవితంలోని అస్తిరత్వానికి, ఆశాశ్వతత్వనికి ఎంతగానో విలవిల్లాడిపోయారు. తిలక్ కవితా సంకలనం 'అమృతం కురిసిన రాత్రి'కి కుందూర్తి ఆంజనేయులు ముందు మాట రాస్తూ 'తిలక్ శైలి గ్రాంధిక భాష'తో మిళితమైనదని అసంతృప్తి వ్యక్త పరుస్తారు. సంస్కృత భాష ప్రభావానికి

వచన కవిత శైలిని దూరంగా ఉంచాలని భావిస్తారు. నోరు తిరగని సంస్కృతాన్ని వ్యతిరేకించవచ్చు. కానీ సరళ సుందర సంస్కృత పద సమ్మిళితమైన తెలుగు భాషను ఈసడించుకోవలసిన అవసరం లేదు. ప్రజల నానుడి భాష కావ్యంలో ఉండకూడదనడం లేదు. కానీ, అందమైన తేలిక సంస్కృత పదాల సంయోగంతో తెలుగు భాష వన్నెచిన్నెలు సంతరించుకుంటుందని మాత్రమే ఇక్కడ చెప్పడం నా అభిప్రాయం.

పూర్తిగా ప్రజలు మాట్లాడుకునే భాషే కావ్య భాషగా వాడాలని చెప్పే వారే అలా రాయకపోవడానికి, కారణం ఏమిటీ? రాద్దామనుకున్నా ఆ భాషలోనే పూర్తిగా కావ్యం రాయడం కుదరదు. కాబట్టేమో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు పెద్దలు. సందర్భం నుండి పెకలింపబడిన పాదబంధాలు, వాక్య భాగాలు కూడా తిలక్ కవిత్వంలో రసాత్మకమే 'అమృతం కురిసిన రాత్రి, వెన్నెల మైదానం, కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం, కాంతి సంగీత గీతం, కాంక్ష మాధుర కాశ్మీరాంబరం, పండు వెన్నెల మత్తు, ఏడుపింకిపోయిన ఏడారి రొమ్ములు, దిగులు నీరు నిండిన కోటి మనస్సరస్థిరాలు.. ఇటు వంటి పదబంధాలు ఎన్నో ఎన్నెన్నో. తిలక్ కవిత్వంలో పొయేట్రీ లేని పద బంధం ఎక్కడుంది? ఆయన వాక్యం సాయం సంధ్యలో మధుర ధ్వనులతో ముందుకు సాగే ప్రవాహ సౌందర్యాన్ని పునికిపుచ్చుకొని విస్తరిస్తుంది.

**ముగింపు**

శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్ సున్నిత మనస్కులు, మానవతావాది. మానవతా భావనకు, సమాజపరమైన మానవ కారుణ్య భావనకు చాలా తేడా ఉంటుంది. తిలక్ గారు నిశ్చయంగా ఈ రెండవ భావనకు చెందిన వారు. అభ్యుదయ కవితా యుగపు ప్రధాన లక్షణమైన అంతర్జాతీయ భావనా, "సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరిపివేసి" అకుంఠిత మానవీయ పతాకను ఎగురవేసే" తత్వమూగల అభ్యుదయ కవికంఠము అతనిది. అభ్యుదయ కవిత్వం కొన్ని పాళ్ళు, భావకవిత్వం కొన్ని పాళ్లు కలిసిన మిశ్రమ రూపం. "నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు.. నా అక్షరాలు వెన్నెలలో అడుకునే అందమైన ఆడపిల్లలు" అని తిలక్ చెప్పుకున్నాడు. ఇందులో అతని భావమేదైనా మొదటిది తన గురించి, రెండవది

తన శైలిని గురించి చెప్పుకున్నట్లు నేను అర్థం చేసుకున్నాను. తిలక్ గారు అభ్యుదయ భావనకు అందమైన శైలిని సమకూర్చి, అభ్యుదయ కవితా కాలంలో ఉన్న దోషాన్ని తొలగించడానికి ప్రయత్నించి చరిత్రలో గొప్ప కవిగా నిలిచిపోయారు.

**ఆధార గ్రంథాలు**


1. దేవరకొండ బాలగంగాధర తిలక్ రచనలు
2. ప్రభాతము – సంధ్య
3. గోరువంకలు
4. కఠినోపనిషత్తు
5. అమృతం కురిసిన రాత్రి
6. ఆశా కిరణం
7. ఊరి చివరి యిల్లు
8. సుశీల పెళ్లి

# 24. తిలక్ కథలు - కవితాత్మక శైలి

- డా॥ వినోదిని మదాసు

తిలక్ అనగానే తెలుగు పాఠకులకి 'అమృతం కురిసిన రాత్రి' గుర్తొస్తుంది. వచన కవితా ఉద్యమం బలంగా ఉన్న కాలంలో తెలుగు కవిత్వంలో ప్రవేశించి తెలుగు కవిత్వంపై తనదైన ముద్రవేసినవాడు తిలక్.

కవిత్వంలో తిలక్ మూడు ముఖాలతో కన్పిస్తాడు. ప్రక్రియ పరంగా ఆనాటికి తెలుగు కవిత్వాన్ని ఏలుతున్న ఆధునిక వచన కవిత్వాన్ని వాహికగా చేసుకున్నాడు.

భావజాలపరంగా ఆనాటికి దేశం మొత్తం మీద అత్యంత చైతన్యవంతమైన ఆలోచనలను విస్తరింపజేస్తున్న అభ్యుదయ భావజాలం అందిపుచ్చుకున్నాడు.

శిల్పపరంగా, అభివ్యక్తిపరంగా భావకవిత్వంలోని రమణీయతను, సొగసుని, లాలిత్యాన్ని తన కవిత్వ నైపుణ్యంగా చేసుకున్నాడు.

తిలక్ కవిత్వం తెలుగు పాఠకులకు అత్యంత చేరువయ్యింది. వచన కవిత్వంలో శ్రీశ్రీ తర్వాత ఎక్కువమంది పాఠకులకు తెల్సిన కవి తిలక్. అటువంటి తిలక్ కవిత్వంతోపాటు కథలు కూడా రాశాడు.

తిలక్ కవిత్వం రాసినా, కథ రాసినా మనిషిని కేంద్రం చేసుకున్నాడు. కవిత్వంలో కొంత రొమాంటిక్ మార్గాన్ని అనుసరించిన తిలక్ కథా సాహిత్యం దగ్గరకొచ్చేసరికి ఊహా ప్రపంచాన్ని వదిలి వాస్తవ ప్రపంచాన్ని ఆలంబనగా చేసుకున్నాడు.

తిలక్ కథలు పేద, మధ్య తరగతి జీవితాలకు సంబంధించిన సమస్యలను ప్రతిబింబించాయి. మధ్యతరగతి జీవితాలను ప్రధానంగా శాసించేది ఆర్థిక వ్యవస్థ. ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో కుటుంబాల్లో వచ్చే అనేక సమస్యలు కుటుంబ సభ్యుల మధ్య అశాంతిని, అలజడిని కలగజేస్తాయని - దీని పర్యవసానంగా మనుషుల ప్రవర్తన మారిపోతుందని తిలక్ తన కథల్లో పాత్రల ద్వారా చెప్పాడు.

తిలక్ కథలన్ని మనిషి, కుటుంబం, సమాజం మధ్య సమన్వయం కోసం వెతుకులాడినవి. పేదరికం, ఆకలి, నిరుద్యోగం, సమాజ నిర్లక్ష్యం లాంటి సామాజిక పరిస్థితులతోపాటు కొన్ని కథలు రాజకీయ అంశాలను కూడా చిత్రించాయి.

తిలక్ కవిగా ప్రదర్శించిన శిల్పనైపుణ్యం ఆయన కథల్లో కూడా కన్పిస్తుంది. తిలక్ రాసిన కథలు దాదాపు ముప్పై. దాదాపు అన్ని కథల్లోనూ నిర్మాణపరమైన వైవిధ్యం, శిల్ప పరమైన కొత్తదనం మనకు కనిపిస్తాయి. కథాశిల్పంలో తిలక్ ప్రయోగాలు చేశాడు. కవిత్వంలో అనుసరించిన భావుకత్వం, చిక్కటి లోతైన అభివ్యక్తి కథల్లో కూడా అనుసరించాడు. తిలక్ కథలన్నిటిలో కవితాత్మక వాక్యాలు అనేకం కనిపిస్తాయి. ఎత్తుగడ నించి ముగింపు వరకు నర్మగర్భ వ్యాఖ్యలు, మోటాఫర్లు, ఇమేజస్ అనేకం వుంటాయి. తిలక్ కథా వస్తువును నైపుణ్యత నిండిన శిల్పం నడిపించినట్లుగా ఉండి కథ ముందుకు సాగుతూ మనకు కన్పిస్తుంది.

తిలక్ కథాశిల్పం కవిత్వంతో ముడిపడి వుంటుంది అని చెప్పడానికి 'కవుల రైలు' కథ ఒక ఉదాహరణ. ఈ కథ అభ్యుదయ దృక్పథంనించి ఆనాటి సాహిత్యం మీద, కవుల మీద ఒక విమర్శ. 'తెలుగుదేశం కవులతో నిండి మూడవ తరగతి రైలు పెట్టెలాగా క్రిక్కిరిసిపోయింది' అంటాడు. మొదటే కవితాత్మకమైన ఈ ఒక్క వాక్యంతో చాలా లోతైన విషయాన్ని ఆవిష్కరిస్తాడు. మూడవ తరగతి రైలు పెట్టె ఈ దేశ పేదలు, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు సింబల్. ఎక్కువ జనాభా వుండటం, ఎవరి గోలలో వారు వుండటం, ఎవరికి వారు తోసుకుని ముందుకు వెళ్ళే ప్రయత్నం చేయటం – ఇవన్నీ దృశ్యీకరించే ప్రయత్నం ఈ వాక్యం. అంత క్రిక్కిరిసిన పెట్టెలోకి ఒకసౌందర్యవతి రావటం అక్కడి వాతావరణం బొగ్గుపులుసు, చుట్టగాలీ నిండి వుండి, వూపిరి సలపని పరిస్థితి. ఆ స్థితిలో వచ్చిన ఆ అందమైన అమ్మాయిని అక్కడవున్న కొందరు సహించలేక పోయారు. వాళ్లు సంప్రదాయవాదులు. అప్పకవీయాన్ని బట్టీవేసి మోస్తున్నవాళ్లు. ఆధునికతను సహించలేనివాళ్లు. మార్పుని భరించలేనివాళ్లు. ఆ బొగ్గుపులుసు వాయువులో, చుట్టపొగలో బతకడానికి అలవాటుపడినవాళ్లు. అది ఎంతో నేర్పుగా, పదునుగా చెప్పడం మనం చూడొచ్చు. కవితాత్మకంగా, రమణీయంగా రాసిన ఈ చిన్నకథ-సంప్రదాయవాదుల మీద, వారిభావజాలంమీద, వారి గుత్తాధి పత్యం మీద పెద్ద విమర్శ. నవయువకులు కూడా పాశ్చాత్య ధోరణులను అనుసరిస్తూ వెకిలి చేష్టలు చేస్తున్నారని చెప్పాడు. ఒక్కమాటలో

'ఎంగిలిబీడి' తాగతున్నారని చెప్పాడు. ఎంతో లోతైన విమర్శను ఎంతో చాకచక్యంగా చెప్పడం తిలక్ శైలిలోని గొప్పదనం.

యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రాసిన 'లిబియో యెడారిలో' కథ శిల్పపరంగా మరో భిన్నమైన కథ. ఈ కథ కూడా కవితాత్మకంగా సాగుతుంది. ప్రతి వాక్యం లోతైన రాజకీయ దృక్పథంతో, నిగూఢమైన అర్థాలతో కథ నడుస్తుంది. యుద్ధక్రౌర్యాన్ని, యుద్ధ నష్టాన్ని, యుద్ధ విధ్వంసాన్ని విమర్శించిన కథ ఇది. అత్యాధునిక వ్యక్తీకరణలో, యుద్ధ వాతావరణాన్ని ప్రతిబింబించే భాషలో చెప్పిన కథ. యుద్ధంలో సైనికులు గాయపడతారు. అవయవాలు కోల్పోయి వికలాంగులు అవుతారు, చచ్చిపోతారు. అది విషాదం. ఆ విషాదం వెనక వున్న కౌర్యం, రాజ్యకాంక్ష, ఆధిపత్యం, పాలకదుర్మార్గం ప్రతి వాక్యంలో ప్రతిఫలిస్తుంది. కథ మొత్తం ఒక యుద్ధ వ్యతిరేక దీర్ఘ కవితలా దృశ్యావిష్కరణతో, దుఃఖావిష్కరణతో నడుస్తుంది.

తిలక్ కథల శైలిలో కవిత్మాకత దారంలా ఇమిడిపోయి వుంటుంది. తిలక్ రచనా శైలి విభిన్నమైనది. ఒకవైపు ఆధునిక వ్యక్తీకరణ మరోవైపు భావజాల ఆధునికత తిలక్ కథలను నడిపిస్తాయి. తిలక్ తన కథలలో మనిషి పక్షం వహించిన వాడు. ప్రగతిని కాంక్షించినవాడు. శాంతిని కోరినవాడు. పేదలు, మధ్యతరగతి ప్రజల ఆకలి విలువ తెలిసినవాడు. అందుకే తిలక్ కథలు మనిషిని, మానవత్వాన్ని, శాంతిని కాంక్షిస్తూ వుంటాయి.

'అద్దంలో జిన్నా', 'కదిలే నీడలు' లాంటి కథలు కూడా యుద్ధాన్ని వ్యతిరేకించేవే. లోతైన భావం నిండిన కవితాత్మక శైలితో నిండిన శాంతికాముక కథలు తిలక్‌వి.

తిలక్ కథాశైలిని పట్టిచ్చే మరో కథ 'మణిప్రవాళం'. ప్రతి వాక్యం కవితాత్మకంగా కొన్ని చోట్ల లయాత్మకంగా నడిచే కథ ఇది. రమణీయంగా సాగే కథీ. ఈ కథలో చలం 'ఓ పువ్వు పూసింది' లాంటి 'పర్సోనిఫికేషన్' వుంటుంది. హృదయావిష్కరణ వుంటుంది. ప్రతి వాక్యంలో కవిత్వ నిగూఢత, లోతైన భావన చెప్పిన కథ ఇది. తిలక్ భావ వ్యక్తీకరణలో వాడే పదాలు, పదచిత్రాలు, అలంకారాలు అది కవితో కథో అర్థం కానంతగా పెనవేసుకొని సాగుతుంది. అయితే తిలక్ ఎక్కడా భావజాల పరమైన స్పష్టతను విస్మరించడు. ఎక్కడా సంక్లిష్టతగానీ, అస్పష్టతగానీ, అన్వయలోపం గానీ ఉన్నట్లు పాఠకులకు అనిపించదు. పైగా పాఠకులు ఆ కథను ఆస్వాదించడంలో

ఒక ఆహ్లాదాన్ని అనుభూతిస్తారు. ఇలా ప్రతీకాత్మకంగా చెప్పడంలో తిలక్ నైపుణ్యం కనిపిస్తుంది.

తిలక్ కథలు శిల్పపరంగా ప్రతిభావంతమైనవి. రమణీయ భాష, అద్భుతమైన భావుకతతో పాటు సామాజిక చింతన గలవి. శాంతిని కోరుకున్నవి.

నిజానికి తిలక్ కవిత్వం తిలక్ కథల గొప్పతనాన్ని మరుగున పరిచింది. తిలక్ కవిత్వాన్ని పక్కన పెట్టి కథకుడిగా గనక తిలక్‌ని చూసినట్లయితే తిలక్ ఉత్తమ కథకుడు. భావజాలపరంగా, శిల్పపరంగా ఉన్నతమైన ఆధునికమైన కథలు రాసినవాడని మనకు అర్థం అవుతుంది.

# 25. తిలక్ కథలు-శిల్పసౌందర్యం

- డా॥ పి.సి.వెంకటేశ్వర్లు

"కథను ఊహించడం ఒక ఎత్తు, దాన్ని చెప్పడం మరోఎత్తు. కథ చెప్పే విధానమే కథకి అందాన్ని, బలాన్ని ఇస్తుంది. దీనినే శైలి, శిల్పం అంటారు. ఉత్తమ కథలతోగల పరిచయంవల్ల తన కథలలో ప్రతిభావంతుడైన రచయిత శిల్పాన్నీ శైలినీ విస్పష్టంగా రూపొందించుకోగలడు.

"కథలో ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికో బలపరచడానికో చేసే ప్రయత్నం కథాశిల్పంలో ఒక ముఖ్యమైన దోషం"[1]

ఇవి కథాశిల్పం గురించి తిలక్ చేసిన స్పష్టమైన ఆలోచనలు. "కథలు వ్రాయడం ఎలా" అనే వ్యాసంలో ఆయనచెప్పిన కథానిర్మాణ విషయలు చాలా వున్నాయి. తిలక్ కథాశిల్పం విషయంలో లోతైన అవగాహన లేకుంటే, ఆయన కథలు అలాంటి సజీవ చిత్రాలుగా పాఠకుల్ని ఆకట్టుకునేవికావు. ఆయనే స్వయంగా చెప్పుకున్నట్టు ఉత్తమ కథల్ని చదవడం వల్ల అలాంటి శిల్ప నైపుణ్యం అలవడింది.

"అతని మీద ఎవరి ప్రభావమూ, ఎవరి వస్తు శిల్ప శైలీ ప్రభావమూ లేవని చెప్పలేం. అందర్ని ఊగించిన చలం, సోమర్సెట్ మామ్, మొపాసా ఎవర్ని వదలిపెట్టారు గనుక. అయినా ప్రత్యక్ష, బలోపేతమైన స్వకీయ ముద్ర. స్వతంత్రమైన అన్వేషణ, లోతూ, మెరుపూ అతను తిలక్"[2] అంటూ తిలక్ కథాశిల్పంపై ఎవరెవరి ప్రభావాలున్నాయో స్పష్టపరిచాడు మునిపల్లెరాజు. అదేవిధంగా కోడూరి శ్రీరామమూర్తి తిలక్ కథల తత్వాన్ని వివరిస్తూ ప్రేమ్‌చంద్ 'కఫన్' సోమర్‌సెట్ మామ్ 'Caker and Ale' వంటి కథల్లోని శిల్పం తిలక్ కథల్లో కన్పిస్తుందని చెప్పడంలో తిలక్ కథానిర్మాణంలో ఎవరి ప్రభావం వుందో తెలుస్తుంది. అంతేకాదు ఇంకా లోతుగా తిలక్ కథల్ని పరిశీలించి "శిల్పంలో మెపాసాకు దగ్గరగా కనపడతాడు తిలక్"[3] అని చెప్పాడు కోడూరి శ్రీరామమూర్తి. "ఆయన కథానికా ప్రక్రియ నియమాలను, పరిమితులను, లక్ష్యాలను అర్థం చేసుకోనే కథలు రాశాడు"[4] అని అంపశయ్య నవీన్

చెప్పడంలో తిలక్ కథలు కథానికా శిల్ప లక్ష్యాలను కొనసాగించాడని అర్థమౌతుంది. మేరుపర్వతం లాంటి తిలక్ సాహిత్య శిల్పాన్ని అంచనా వేయడం అంటే సముద్రపు తరంగాల్ని గుప్పెట్లో చూపాలని ప్రయత్నించడమే. నేను అర్థం చేసుకున్నంతమటుకు యువ పరిశోధకుల కోసం తిలక్ కథల్లోని కొన్ని శిల్పసౌందర్య విషయాల్ని చెప్పడం ఈ వ్యాసోద్దేశం.

శిల్పసౌందర్య విశిష్టతను గురించి వల్లంపాటి వారు "కథాసంవిధానం, పాత్రలు, నేపథ్యం, దృష్టికోణం, కంఠస్వరం"[5] అనేవి కథాంగాలుగా వుంటాయని, తన కథానికశిల్పం'లో చెప్పుకొచ్చారు. పోరంకి దక్షిణమూర్తి కథాశిల్పాన్ని "వస్తు విన్యాసం, పాత్రచిత్రణ, సంఘటన, సంఘర్షణ, సన్నివేశకల్పన, కథనం, శీర్షిక"[6] అనే విభాగాలుగా వర్గీకరించాడు. రచయిత కథలో చెప్పేదాన్ని వస్తువని, ఎందుకోసం చెప్తున్నాడో అది ఉద్దేశమని, ఒక విధమైన పద్ధతిలో చెప్తాడు దాన్నే శిల్పమని అంటాడు ఖదీర్‌బాబు[7] ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచించినపుడు గొప్పకథకుడైన తిలక్ తన కథలను ఒక పద్ధతిలో చెప్పాడు. ఒక ప్రత్యేకమైన శిల్ప నిర్మాణాన్ని ప్రదర్శించాడు. కథలకు పేర్లు పెట్టడంలో, కథల్ని ప్రారంభించడంలో, పాత్రల్ని నిర్మించడంలో, సంభాషణలు చేయించడంలో, కథనం చేయడంలో, వాక్యాల్ని నిర్మించడంలో, వర్ణనలు చేయడంలో, సాహిత్యపు సొబగులు అద్దడంలో, సంఘర్షణ, సంభావ్యత, స్థలకాలాదుల వంటి అంశాల నిర్వహణలో, తనదైన కంఠస్వరాన్ని వినిపించడంలో చివరికి కథా ముగింపులో తిలక్ కథాశిల్పం స్పష్టంగా కనిపిస్తుంది. కథ చదవడం ప్రారంభమైన కొద్దిసేపటికే అది తిలక్ కథ అని అర్థమైపోతుంది. అదే తిలక్ కథానిర్మాణపు ప్రత్యేకత.

**శీర్షికలు**

"మంచి శీర్షిక దొరికితే; దాని ఆధారంగా కథలు రాసే వారు వున్నారు. మంచి శీర్షిక దొరకనిదే కథారచన ఆరంభించని వారూ వున్నారు. కథ రాసినా, సరైన శీర్షిక దొరక్క నెలల తరబడి యోచించవలసిన అవసరం ఉంటుంది."[8] అంటాడు శార్వరి. ఈ మాటలు వెనుక అనేక మంది కథకుల అనుభవం ఉంది. కథకు పెట్టే పేరులోనే శిల్పానికి అంకురార్పణ జరుగుతుంది. కథకు శీర్షిక ఇంటికి గడపలాంటిది. అది ఎంత ఎత్తు, ఎంత వెడల్పు, అనేది నిర్మించబోయే ఇంటిని బట్టి వుంటుంది. అలాగే కథలో చెప్పబోయే వస్తువును గాని, సంఘటననుగాని, ఆధారంగా చేసుకొని

రచయిత శీర్షిక నిర్ణయిస్తాడు. శ్రీశ్రీ 'ఒసే తువాలందుకో', పద్మరాజు 'గాలివాన' వంటివి సంఘటనను ఆధారంగా చేసుకొని పెట్టిన శీర్షికలు. తిలక్ 'నలజర్ల రోడ్డు' కథా శీర్షిక అక్కడ జరిగిన సంఘటన ఆధారంగా పెట్టబడిందని కథ పూర్తయిన తర్వాత అర్థమౌతుంది. అలాగే 'రాత్రి 9 గంటలకు' అనే శీర్షిక ఆ సమయంలో నగరంలో జరుగుతున్న సన్నివేశాల్ని ప్రతిఫలింపజేస్తూ పెట్టబడింది.

కథలకు జంటపదాల శీర్షికల్ని పెట్టడం ఒక ప్రత్యేకత. అయితే తిలక్ కథా శీర్షికలు ఆ గాలివాటంలో పెట్టాడని ఖచ్చితంగా ధ్రువీకరించలేం గానీ ఆయన 'సుందరీ-సుబ్బారావు', 'మీరేనా-నీవేనా' కథా శీర్షికల్ని మాత్రం కథలోని సన్నివేశాల్నిబట్టి నిర్ణయించాడనిపిస్తుంది. అలాగే తిలక్ 'కదిలేనీడలు', 'ఏమీలేదు' వంటి ఆలోచనాత్మక కథా శీర్షికలను ఎంచుకున్నాడు. వీటిలోని పాత్రలతత్వం అర్థం చేసుకొనే విధంగా ఇలాంటి పేర్లు తిలక్ కథలకు పెట్టడం శిల్ప నిర్మాణంలో భాగమే. అదే విధంగా సామాజిక కోణం నుంచి సాగే కథలకు, మానవత్వం వాసనలతో నడిచే కథలకు 'ఓడిపోయిన మనిషి', 'అతనికోరిక' వంటి అర్థవంతమైన పేర్లు పెట్టాడు తిలక్. దొంగ ఎవరో తెలియపరిచే కథకు 'అసలు దొంగ' అని పేరు పెట్టాల్సిన అవసరం లేదు. డొంక తిరుగుడు కథా శీర్షికలు తిలక్ శిల్ప నిర్మాణంలో భాగం కాదు. అందుకే 'దొంగ' సంక్షిప్త శీర్షికను మంచి భావం కుదిరేలా ఇమిడ్చాడు. బొమ్మచుట్టూ అల్లబడిన కథకు 'బొమ్మ' అని, ఉంగరం చుట్టూ తిరిగిన వ్యక్తి జీవితాన్ని వర్ణించే కథకు 'ఉంగరం' అని, ఒక వ్యక్తి జీవితం ఎలా రంగులరాట్నంలా తిరిగిందో చెప్పేకథకు 'జీవితం' అని, రకరకాల సంక్షిప్త శీర్షికల ద్వారా కథా భావాన్ని పలికించాడు తిలక్. సహజంగా కవి అయిన తిలక్ కొన్ని కథలకు 'గడియారపు గుండెలు' 'మణి ప్రవాళం' 'సముద్రపు అంచులు' వంటి కవితాత్మక శీర్షికలను పెట్టి తన శిల్ప నిర్మాణానికి ప్రారంభం చేశాడు.

### కథా ప్రారంభాలు

"కథ అనేది గుర్రపు పరుగు వంటిది. ప్రారంభం, ముగింపు ముఖ్యం" అంటాడు మోపాసా. తిలక్ మొపాసా కథలతో ప్రేరణ పొందాడని ముందే చెప్పుకున్నాం. అందుకే తిలక్ కథల్లో ప్రారంభాలు నత్తనడకన వుండవు. కథకుణ్ణి నేరుగా కథలోకి ప్రవేశపెడ్తాయి. ఇది తిలక్ శిల్ప లక్షణం. ప్రకృతి వర్ణనలు, సుదీర్ఘ సన్నివేశాలు

వంటివి వెదకినా దొరకవు. పాఠకుడి దృష్టిని స్పష్టమైన ప్రదేశంలో, ఖచ్చితమైన సమయంలో, సరైన సందర్భంలో నిలబడేటట్లు వాక్యం ప్రారంభిస్తాడు. పాఠకుణ్ణి ప్రారంభపు మాటలతో బంధిస్తాడు. తానే చూసి నట్లు కథ చెప్పడం, పాత్రల చేత కథను చెప్పించడం వంటి ప్రారంభాలు వున్నా ఆసక్తిగా ఎత్తుగడ శిల్పాన్ని నిర్వహిస్తాడు తిలక్.

'నల్లజర్ల అడవి మీద చంద్రుడు భయంకరంగా ఉదయించాడు. అవధాని గారు ఇలా అనేటప్పటికి మేమందరం ఫక్కున నవ్వాం.' అని నల్లజర్ల రోడ్డు కథలోని ప్రారంభ వాక్యాలు వేరే పాత్ర చేత రచయిత కథ చెప్పిస్తున్నాడనే విషయాన్ని, అడవిలో జరగబోయే సంఘటనల స్వరూపాన్ని సూక్ష్మంగా తెలియజేస్తాయి.

'యవ్వనం' కథలో 'ఆ రోజు విశాలలో ఎప్పుడూ లేని ఉత్సాహం సముద్రపు కెరటాల్లా పొంగింది.' ప్రారంభ వాక్యాలు కథను సూచన ప్రాయంగా తడుముతూ సాగుతాయి. సముద్రపు కెరటపు పొంగు ఉపద్రవ సూచకంగా పాఠకుడికి అర్థమై, కథలోకి జొరబడేలా చేస్తాయి ప్రారంభవాక్యాలు. 'ఫలిత కేశం' కథలో "ప్రసాదరావు అద్దం ముందు నిలుచున్నాడు. అతనికి తనని తాను తీరికగా చూసుకోవాలనిపించింది. అందులో ఏదో తృప్తి వుంది. అహం వుంది. అనే ప్రారంభ వాక్యాలు ఎంతో హాయిగా ప్రశాంతంగా కథలోకి తీసుకెళ్తాయి. వివేచనా శక్తిగల పాఠకుడు తొలి వాక్యంలో తిలక్ భావాల లోతును తర్కించుకోవచ్చు. అద్దం నిజం చెప్తుంతుంది. వాస్తవాన్ని కాదు. నిజం వేరు వాస్తవం వేరు. ఉన్న రూపాన్ని ఉన్నట్టు చూపడం నిజం. కుడిని ఎడమగా చేసి చూపడం వాస్తవం. చిన్న తత్వాన్ని పట్టుకుంటే ప్రారంభ వాక్యాల్లో తిలక్ శిల్ప సౌదర్యం అర్థమౌతుంది. కథలో ప్రధాన పాత్ర నిజం గురించి ఆలోచించాడు. వాస్తవం గుర్తించలేక పోయాడు. 'బొమ్మ' కథలో ఎత్తుగడ శిల్పాన్ని వ్యాఖ్యానంలా చెప్తాడు తిలక్. 'ఆ పెద్దనగరంలో మార్కెట్టులో ఒకచోట బల్ల మీద ఓ ఆడది కూర్చుని వుంది. ఆమె చాలా అందమైనది. లావణ్యమైనది.......ఆమె ఎవరో ఎవరికీ తెలియదు' అంటూ సాగిన వాక్యాలు తాను చెప్పబోయే సమకాలీన సమాజంలోని వ్యక్తుల మానసిక స్థితిని పట్టి చూపిస్తాయి. కొందరు వ్యక్తులు ఆమెను ఉల్లేఖాలంకారంలో లాగా ఎలా ఊహించారో చెప్పడానికే కవి అలాంటి పెద్ద ప్రారంభం చేశాడు. 'ఓడిపోయిన మనిషి' కథను 'తెరచి ఉన్న కిటికీలోంచి వొంటిమీద జల్లుపడి చటుక్కున మెలకువ వచ్చింది కళ్ళు తెరచి కిటికీలోంచి చూశాను.' అనే

ఆలోచనాత్మకమైన ఎత్తుగడతో ఆరంభిస్తాడు తిలక్. 'కళ్ళు తెరచి చూశాను' అనడంలో అంతకుముందు కళ్ళు తెరవకుండా సమాజాన్ని చూసిన ఒక వ్యక్తిని పరిచయం చేయబోతున్న రచయిత శిల్ప నిర్మాణ దక్షత అర్థమౌతుంది.

**పాత్ర నిర్మాణ శిల్పం**

తిలక్ పాత్రకు పెట్టే పేర్ల విషయంలోను, పాత్రల నిర్మించే క్రమంలో ప్రత్యేక శిల్పాన్ని ప్రదర్శించాడు. లోకం పోకడ తెలియని పురుషులకు ఆ రోజుల్లో 'సుబ్బారావు' అనే పేరు పెట్టి వ్యంగ్యంగా పిలిచే పరిస్థితి. మునిమాణిక్యం వారి కథల్లో భర్త పాత్రలో అమాయకపు సుబ్బారావు కన్పిస్తాడు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి గురించి తెలిసిందే. అలాంటి ఉద్దేశంతోనే కాబోలు సెకండరీ గ్రేడు స్కూలు మాస్టరులోని అమాయకత్వాన్ని చెప్పడానికి 'సుబ్బారావు' అనే పేరు పెట్టాడు 'సుందరీ-సుబ్బారావు' కథలో అలాగే స్వచ్ఛమైన వ్యక్తిత్వంగల స్త్రీలకు నిర్మల (నిర్మల మొగుడు), స్వేచ్ఛా ప్రవృత్తిలో జీవించాలనుకొనే స్త్రీకి విశాల(యవ్వనం), ధైర్యం, చురుకుదనం గల యువతులకు సూర్యుడు( నల్లజర్ల రోడ్డు) వంటి పేర్లు పెట్టాడు.

ఇక పాత్రలను మలచిన పద్ధతిని తిలక్ కథల్లో ప్రత్యేకంగా గమనించాలి. పాశ్చాత్య పాత్ర నిర్మాణ పద్ధతి తిలక్‌లో కనిపిస్తుంది. ఫ్లాట్ క్యారక్టర్స్ ( సరళరేఖ పాత్రలు) రౌండ్ క్యారక్టర్స్ (గుండ్రని పాత్రలు) రెండూ తిలక్ కథల్లోవున్నాయి. మనిషి ఎంత ఉన్నతంగా వుండగలడో చూపిస్తాడు. ఎంత పతనమవుతాడో చూపిస్తాడు. ఎలాంటి ఒడిదుడుకులు లేని మనిషిని చూపిస్తాడు. అనైతికతతో పక్కవారిని నిరంతరం హింసించే మనిషిని రూపుకట్టిస్తాడు. ముసలి మనిషి (ఊరిచివర యిల్లు) , నరసమ్మ (సముద్రపు అంచులు) వంటి పాత్రలు స్వార్ధంతో, నమ్మిన మనిషిని వంచన చేయడంలో స్థిరంగా నిలబడిపోతాయి. వారి స్వభావంలో కథ ముగిసేవరకు మార్పురాదు. అలాగే వాస్తవికంగా పాత్రల్ని నిర్మించడం తిలక్ విలక్షణత. శంకరం (పరివర్తన), గవరయ్య (దేవుణ్ణి చూసిన వాడు), సీతాపతి (సీతాపతి), గోపాలం (దొంగ) వంటి పాత్రలు వాస్తవాల్ని గ్రహించి తాము మారాలని అర్థం చేసుకుంటాయి. గతంకంటే భిన్నంగా తమ దిశను మార్చుకుని జీవించడానికి సిద్ధపడుతాయి. వెంకటేశ్వర్లు (ఆశాకిరణం) లక్ష్మీమోహన్‌రావు (అతనికోరిక) వంటి పాత్రలు పలాయన వాదానికి, అసమర్థతకు శాశ్వత చిరునామాగా చూపిస్తాడు రచయిత. కూతురు వ్యభిచారిణిగా మారిందని తెలిసి, చావును వాయిదా వేసుకోనే తండ్రి, కొడుకు చనిపోయినాడని తెలిసి పెళ్ళాం

పుస్తెలతో వేశ్య సాంగత్యం కోసం వెళ్ళిన వ్యక్తి వంటి పాత్రలను నిర్మించడంలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు తిలక్.

**సంభాషణలు**

సంఘటనలు, పాత్రలు, మాటలు సమంగా ఉంటే కథ మంచి శిల్పాకృతిని పొందుతుంది. తొలి ఆధునిక కథ సంభాషణతో మొదలౌతుందని మనకు తెలిసిన విషయమే. ఆ నిర్మాణ పద్ధతిని తిలక్ కుడా కొనసాగించడం కథల్లో మనం చూడవచ్చు. ఈ సంభాషణ శిల్పం ప్రధానంగా ముడు రకాలుగా వుంటుంది. 1. కథకుడు తాను మాట్లాడుతూ పాత్రల చేత మాట్లాడించడం. 2. కథకుడే పాత్రల పక్షాన మాట్లాడడం. 3. కథకుణ్ణి దురంగా పెట్టి పాత్రలే మాట్లాడడం. ఈ ముడు రకాల పద్ధతుల్లో తిలక్ మొదటి రెండింటిని అనుసరించాడు. 'కదిలే నీడలు' కథలో స్త్రీ, పురుష పాత్రలే ఎక్కువగా మాట్లాడతాయి. అక్కడక్కడ వివరణల కోసం మాత్రమే కథకుడు జోక్యం చేసుకుంటాడు. 'బాబు' కథలో కూడా కొన్ని పాత్రలచేత సుభాషింప చేస్తూ, మధ్యలో వ్యాఖ్యానం చేస్తూ నడిపిస్తాడు. 'గడియారపు గుండెలు' కథలో రాఘవయ్య కథనంతా కథకుడే చెప్పుకుంటూ పోతాడు. అలాగే 'కవుల రైలు', 'బొమ్మ', 'నిర్మల మొగుడు', 'ఏమీలేదు' కథల్లో కూడా కథకుడు పాత్రల పక్షాన నిలబడి మాట్లాడుతాడు. ఇలా మూడవదైన పాత్రలే మాట్లాడుకుంటూ కథను పూర్తి చేసె టెక్నిక్‌ను తిలక్ పూర్తిగా ఉపయోగించ లేదు. కానీ మణి ప్రవాళం, రాత్రి 9 గంటలకు వంటి కథల్లో తొంబై శాతం సంభాషణలే వుంటాయి.

తిలక్ తన కథల్లో పాత్రల చేత చేయించిన సంభాషణలు కథను ఒక్కొక్క చోట ముడివేస్తాయి. మరొక చోట కథ వేగాన్ని పెంచుతాయి. జరిగిపోయిన గత కాలపు సంఘటనల్ని సూచిస్తాయి. పాఠకుణ్ణి ఆకట్టుకుని ఆలోచింపచేస్తాయి. ఇలాంటి సంభాషణలు చేయించాలంటే కథకునికి పాత్రలు కొట్టిన పిండై వుండాలి. 'ఓడిపోయిన మనిషి' కథలో సుబ్బులు, ఉత్తమ పురుష కథకుడికి మధ్యసాగిన సంభాషణ ఒక సంపూర్ణ జీవన భ్రమణాన్ని చూపిస్తుంది. ఒక స్త్రీ మనస్తత్వాన్ని, స్వేచ్ఛా జీవితాభిలాషను సూచిస్తుంది.

"రంగడా! ఇంకా ఆడెక్కడ?" అంది.

"ఏం రంగడు పోయాడా" ఆత్రంగా అన్నాను.

"ఛ ఛ - దుక్కలా వున్నాడు. నేనే వాడిని వొగ్గేశాను"

"ఏం"

"నా కిష్టం లేకపోయింది"

"ఇన్నాళ్ళు మరి ఏం చేస్తున్నావు"

"వీరాసామితో గుంటూరు వెళ్ళిపోయాను"

"అతన్ని పెళ్ళిచేసుకున్నావా"

"ఆ గుంటూరులో మా బలేగావుందిలే. వీరాసామి కూడా బాగుండేవాడు కాని..."

"అతనితోకూడా చెడిందా"

"అతను దేన్నో మరిగాడు. నాకు శానాకోపం వచ్చింది"

"ఇప్పుడు కలిసున్నారా?"

"ఆడిని ఒగ్గేశాను"

"మరి ఇప్పుడొక్కర్తెవే వున్నావా"

"నువ్వున్నావు కదయ్యా, నీకోసమే వచ్చినాను" గమ్మత్తుగా చూస్తూ పవిటకొంగు నోటికి అడ్డం పెట్టుకొని నవ్వుతోంది. (ఓడిపోయిన మనిషి)

'ఉంగరం' కథలో నిత్య దరిద్రాన్ని అనుభవిస్తున్న ఒక యువతి గొప్ప జీవితాన్ని గడపాలని ఉబలాట పడుతుంది. పెద్దింటి అబ్బాయి తనను చూసి పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని పగటి కలలు కంటుంది. తన లాగే పేదింటి సీతాలు ఒక గొప్పింటి అబ్బాయిని పెళ్ళి చేసుకుందని తెలుసుకొని ఆమెతో మాట కలుపుతుంది. 'నన్ను కూడా తీసుకుపోయేందుకు ఎవడినైనా చూసి పెట్టు సీతాలూ' అని మాట్లాడంలో పాత్ర అమాయకత్వాన్ని చూపించాడు రచయిత. 'దేవుణ్ణి చూసినవాడు' కథలో గవరయ్య పెళ్ళాం లేచిపోయిన వార్త ఊర్లో సంచారం చేస్తుంటుంది. ఆ సందర్భంలో తిలక్ కూర్చిన ఒక సంభాషణ గ్రామీణ పాత్రల తత్వాన్ని గొప్పశిల్పంలో ఆవిష్కరించింది.

'వాడిలో ఏం చూసి లేచిపోయిందత్తా' అని మూడోసారి అడిగింది. తన అత్తని ఒక పడచు తన కుతూహలం ఆపుకోలేక.

'పోనీ నువ్వే వాడితో లేచిపోక పోయావూ నీకు తెలిసొచ్చును.' అంది అత్తగారు విసుగుతో, కోపంతో కథలోని పాత్రలతో సంబంధం లేకపోయినా, ఇలాంటి సంభాషణ కథకు వ్యంగ్యాత్మక శిల్ప మర్మాల్ని అమరుస్తాయి.

సంభాషణల్లో వృత్తి, ప్రాంత మాండలికాల్ని ప్రయోగించడం ఒక శిల్పరీతి. తిలక్ కథల్లో ప్రాంతీయ మాండలికాల జోలికి వెళ్ళలేదు. అయితే 'సముద్రపు అంచులు'

కథలో బెస్తవారి మాండలిక సంభాషణలు  ఉపయోగించాడు.

'నీకోసం పల్లెకి యెల్లాను' అంది చంద్రి

వీరా దగ్గాడు.

'ఏమైపోయ్యావో అని అడిలిపోయాను'

'సముద్రంలో పడి సచ్చిపోదామనుకున్నాను. కాని సావలేదు'

'మరి మన ఇల్లు మాట ఏంటి యీరయ్య బావా' అంది చంద్రి గొంతులో వికారాన్ని అణుచుకుంటూ.

'ఉత్తది. అంతా ఉత్తది. మనం యింతే. ఇలాగే వుంటాం. యెదవ ఆశ...'

'అంతేనా' వెర్రిగా నవ్వింది చంద్రి

'మరి నేనేంటి సేసేదీ. ఎక్కడికి పోయేది'

ఇలాంటి సంభాషణల వల్ల పాఠకుల్లో హృదయ ద్రవీకరణ కల్గించడానికి భాష ఉపయోగపడుతుందని గ్రహించిన తిలక్ 1964లో చివరి కథల్లో ఈ శిల్పాన్ని ప్రయోగించి వుంటాడు. అలాగే 'రాత్రి 9 గంటలకు' స్కెచ్ నిండా సంభాషణా శిల్పాన్ని దృశ్యమానం చేశాడు తిలక్.

ఆశ్చర్యంతో నిశ్చేష్టులయ్యే సంభాషణా శిల్పాన్ని తిలక్ 'అతనికోరిక' కథలో చూడొచ్చు. బిడ్డకు తిండిపెట్టి బ్రతికించుకోలేని ఒక నిస్సహాయ పాత్ర, బ్రతకడం కోసం భార్య మంగళసూత్రాలు జేబులో పెట్టుకొని అమ్మేందుకు ప్రయత్నించిన పాత్ర. ఏమీ చేయలేక సమస్యల్ని మర్చిపోవడానికి మంగళసూత్రం ఇచ్చి సానెతో సంపర్కంకోసం వెళ్ళినపుడు ఆ పాత్రకి ఫలహారం పెట్టించి 'ఇదిగో పది రూపాయలూ దగ్గరుంచుకో నాకూ తెలుసు కష్టం ఏమిటో' అని సాగనంపిన పుష్పలత సంభాషణలోని శిల్పాన్ని తిలక్ మాత్రమే చూపగలడు అన్పిస్తుంది.

**వాక్య శిల్పం**

పది వాక్యాల్లో చెప్పవలసిన భావాన్ని ఒక్క వాక్యంలో చెప్పగలిగిన నేర్పు వాక్య శిల్పం. కథకుడు ప్రయోగించే కొన్ని వాక్యాలు పాఠకుణ్ణి జీవితకాలం ఆలోచింప చేసేవిగా ఉన్నట్లయితే ఆ కథకుడు గొప్ప కథాశిల్పకారుడైనట్లే. తిలక్ కథల్లో అలాంటి వాక్యాలు వందల సంఖ్యలో వుంటాయి. పాఠకుణ్ణి నిలబెట్టి ఆలోచనల్లోకి నెట్టే వాక్యాలు ప్రతి కథలోనూ వున్నాయి.

'ఆశాకిరణం' కథలో ఒక టీచర్ తన పైఅధికారిణిని క్షమాపణ కోరబోయే తొందరలో చేతికి చిక్కిన పైట కొంగు పట్టుకుంటాడు. ఆ సమయంలో రచయితగా తిలక్ రాసిన "అంతే ఉద్యోగం ఊడిపోయింది. ఆమె పైటకన్నా బహిరంగంగా; అంతకన్నా శాశ్వతంగా" అనే వాక్యం ఎంతో బలంగా పాఠకుణ్ణి తాకుతుంది.

'బాబు' కథలో యువకుడు పనిలో నుండి పారిపోతున్న తీరును వివరించడానికి స్వతంత్రంలోంచి దాస్యంలోకి పోయేముందు ప్రతిజాతీ, ప్రతివ్యక్తీ, ప్రతిజంతువుకూడా ఓపిక లేని తిరుగుబాటును చేస్తాయి. అనే గొప్పవాక్యాన్ని రాశాడు తిలక్. ఇక్కడ 'ఓపికలేకున్నా తిరుగబడడం' అనే వాస్తవాన్ని వాక్యంలో కూర్చడం మంచిశిల్పం.

'గడియారపు గుండెలు' కథలో ఒక పాత్ర స్వభావాన్ని చెప్పడానికి కొన్ని వాక్యాల్ని రాయకుండా ఒక రోజున రాఘవయ్యతాత గారు వచ్చారు. ఆయన ఒళ్ళంతా విబూది, హృదయం అంతా బొగ్గు! యజ్ఞం చేయించడంలో అంతటి వాడు లేడని ప్రతీతి. అనే వాక్యంలో స్పష్టంచేశాడు. ఒక పేరాలో చెప్పవలసిన కథను తిలక్ ఒక వాక్యంలో ముగిస్తాడు. 'తీవ్రవాద నాయకుడు' కథలో శేషయ్య కుటుంబ వివరాలను "శేషయ్యకి ఓ విధవ అక్కగారూ, తల్లీ ఉండేవారు. ఇతని సంపాదనా చాతుర్యానికి తట్టుకోలేక తల్లి పరలోకానికి చప్పుడు చేయకుండా వెళ్ళిపోయింది. అంతకన్నా గప్‌చిప్‌గా అక్కగారు ఒకనాటి రాత్రికి రాత్రి ఎవడితోనో లేచిపోయింది." అంటూ వ్యంగ్యాత్మకంగా చెప్పి ముగిస్తాడు.

'హోటల్లో' కథలో అప్పు తీర్చలేదనే కారణంతో ఒక వ్యక్తి భార్యను ముగ్గురు వ్యక్తులు వాటాల ప్రకారం పంచుకుంటున్న సందర్భంలో రచయిత చేసిన 'మానవుడిలో పశుత్వం నల్లని వాసనతో హోటలు నంతా ఆవరించింది.' అనే వ్యాఖ్య వాక్యశిల్పానికి మచ్చుతునక. అదేవిధంగా 'సముద్రపు అంచులు' కథలో 'సముద్రం లాంటిదే దరిద్రం కూడా అవతలి ఒడ్డు కనబడదూ', 'జీవితం' కథలో 'విధి నల్లని పెదవులు వారి జీవితాన్ని ముద్దెట్టుకున్నాయి; "శ్రావ్యంగా పాడేవాడికీ, పాట రాని వాడికీ వొకటే హృదయం వుంది. 'నీకంటే నేను గొప్ప వాణ్ణి' అనడానికి ఎవరికీ హక్కు లేదు." వంటి వాక్యాలు ఆయనలోని వాక్య శిల్ప నిర్మాణ దక్షతను నిరూపిస్తాయి.

### వర్ణనాశిల్పం

కవిత్వంలోనూ, కథల్లోనూ మానవతా వాదాన్ని విన్పించిన తిలక్ వర్ణనల జోలికి వెళ్ళివుంటాడా అని ఆలోచించవచ్చు. అయితే తిలక్ వర్ణనలు నేల విడచి

సాము చెయ్యవు. జీవితపు పొరలు చుట్టూ అల్లబడి వుంటాయి. కథలో గాఢతను పెంచడానికి, సన్నివేశంలో వాస్తవికతను ప్రతిఫలింప చేయడానికి తిలక్ కథల్లో అతి నవ్యమైన వర్ణనాశిల్పాన్ని ఉపయోగించాడు. 'బ్లాకౌట్ చేయబడిన విద్యుద్దీపాలు నగరపు మెల్లకన్నులులా వున్నాయి" (కదిలే నీడలు) 'బురదలో వున్న వానపాము మీద అడుగేసినప్పుడు ఆ వానపాము గిలగిలలాడి నీరసంగా నిశ్శబ్దంగా చచ్చిపోవడం లాంటి ఏడుపు" (ఆశాకిరణం)– అనే వర్ణన చేతకాని వ్యక్తి ఏడ్పును వర్ణించడానికి తీసుకున్న పోలిక. బియ్యం దొరక్క పడుతున్న మానసిక సంఘర్షణలో పెళ్ళాం తిట్లు అతన్ని నిస్సహాయుణ్ణి చేసినపుడు గట్టిగా రోదించలేని ఏడుపు అది.

'వెన్నెల, వెన్న చేతులతో 'రారా' అని పిలుస్తుంటే చీకటి మొండి దేహాన్ని కౌగిలించుకుంటున్నట్టుగా అనిపించింది' (యవ్వనం) అనే వాక్యాలు ఒక వైపు భార్య సౌందర్యం చేయి జాచి పిలుస్తుంటే ఉద్యోగధర్మం యమపాశంలా వెంటాడుతున్న శాస్త్రి తత్వాన్ని వ్యాఖ్యానిస్తూ రచయిత చేసిన వర్ణనాశిల్పం.

'వేగంతో శ్రమించి పోయే కాలానికి, పదార్థం మొండి తనానికి జరుగుతున్న అనాది యుద్ధానికి చిహ్నంగా నిలిచినట్టుంది. ఆ ఇల్లూ" (ఊరిచివర ఇల్లు) అనే వర్ణన భౌతికతతత్వం నశించి పోవల్సిందే. కాలం గమనం సాగించాల్సిందే అనే వాస్తవికతను ఆధారం చేసుకుంది.

'దుమ్ములోంచి నొసటి మీద ఎర్రని నేత్రాన్ని, కాళ్ళకీ చేతులకీ అరుణ కంకణాల్నీ, దేహానికి బూడిదనీ ధరించిన అపర శివుణ్ణి రోడ్డుమీద పోయే ఇద్దరు ప్రమధులు లేవనెత్తారు' (సుందరీ – సుబ్బారావు) కారు ఢీకొట్టిన వ్యక్తికి తగిలిన రక్తపుగాయాల్ని, శరీరం దుమ్ములో మునిగిన రూపాన్ని ఇంతకంటే వాస్తవికంగా తిలక్ మాత్రం వర్ణించగలడు.

'దూరంగా త్రాచుపాము, హంతకుడి ఆలోచనలా, మెలికలు తిరుగుతూ వెళ్ళింది.' (జీవితం) మనిషి వర్ణించాల్సినపుడు జంతువుల్ని, దేవదానవుల్ని ఉపమానంగా తీసుకుంటాం. కాని తిలక్ పామును వర్ణించడానికి హంతకుడిని ఉపయోగించాడు. అదే తిలక్ టెక్నిక్.

పట్టణాన్ని వర్ణిస్తూ 'రంగు వేసుకున్న మొహం రాకాసి వంటి అహం మిరుమిట్లు కొలిపే నవ్వుతో మెత్తగా కౌగలిస్తుంది నిన్ను' (రాత్రి 9 గంటలకు) అంటాడు తిలక్. దీన్ని అత్యంత రమణీయమైన వర్ణనాశిల్పం అనకుండా ఉండగలమా!

**కంఠస్వరం**

రచయిత తనకు నచ్చని ఒక అంశం మీద చేసే వ్యాఖ్యనే 'కంఠస్వరం' అంటాం. సమాజంలో న్యూనతలను, అసమానతలను, స్థితిగతులను వ్యాఖ్యానించ వలసి వచ్చినప్పుడు కథకుడు తాను ఎటువైపు ఉన్నాడో తెలియజేసే గొంతుకే కంఠస్వరం. తిలక్ కథల్లో అనేక చోట్ల తన గొంతుకను విన్పిస్తాడు. ఎలాంటి సమాజాన్ని, ఎటువంటి మనిషిని కోరుకుంటున్నాడో పరోక్షంగా తెలియజేస్తాడు.

'గాలీ వెల్తురూ అట్టే సోకని పతివ్రత ఉండటానికి చాలా బాగుంటుంది' (హోటల్లో). ఒక హోటల్ గది స్వరూపాన్ని చెప్తూ ఉదహరించిన వాక్యాలివి. మన సమాజంలో వెళ్ళూనుకొని వున్న కర్మ సిద్ధాంతంలో భాగంగా వున్న పతివ్రతల దుస్థితిపై తిలక్ అభిప్రాయమిది.

'ఎంత మంది శ్రామికుల రక్తం తాగితే ఈ బుగ్గలకి ఎరుపువచ్చింది? ఎంత మంది బట్ట లేకుండా వుంటే ఈమెకి జరీచీర వచ్చింది. ఒక అన్యాయపు ఆర్థిక విధానపు సృష్టి ఈమె' అనే వాక్యం 1948లో రాసిన 'బొమ్మ' కథ లోనిది. ఇందులో రచయిత ఏ దాపరికం లేకుండా సామ్యవాదాన్ని విన్పించాడు. బహుశా ఈ వాక్యాల్ని తర్వాత ఆత్రేయ 'కారులో షికారు కెళ్లే..." పాటగా మలిచాడు.

'నల్లజర్ల రోడ్డు' కథలో సాయం పొంది ప్రాణం దక్కించుకున్న వ్యక్తులు, ఆ ప్రాణం పోసిన వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో వుంటే సాయం చేయకుండా తప్పించుకుపోతూ ఒక వాక్యం అంటారు. అందుకు రచయిత ఒక వ్యాఖ్య చేస్తాడు. "అందులో కలెక్టర్ గారికి మాట యిచ్చామాయె!" అన్నాడు రామచంద్రం – మాట ఇచ్చి తప్పడంలోని అమానుషత్వాన్ని వూహించుకుని భయపడుతూ" మనిషి మానుష స్వభావంపై కొరడాతో కొట్టినట్లుందీ తిలక్ వ్యాఖ్య.

'ఆమెకి దేవుడిమీదా మనిషిమీదా విశ్వాసం ఒక్క పెట్టున తుడిచి పెట్టుకుపోయి నట్లయింది' (ఊరి చివర ఇల్లు)

'తత్వాలు పాడే ఒక చిన్నసైజు ఆధ్యాత్మిక వాది. పెళ్ళాం పోయాక ముండలతోను, ఒళ్ళు పాడైపోయాక మందులతోనూ, ఓపిక పోయాక బైరాగులతోనూ మైత్రి సంపాదించిన విఖ్యాత జీవి' (సముద్రపు అంచులు). వంటి వ్యాఖ్యలు వ్యవస్థలో దేవుడిపై, సన్యాసులపై తిలక్ గొంతుకను తెల్పుతాయి.

'ఊరికి కరణమూ భాషకి వ్యాకరణమూ ప్రబల శత్రువులు' (రాత్రి 9 గంటలకు).

'మూడవక్లాసు పెట్టె ఎప్పటిలాగే దేశ సౌభాగ్యాన్ని ప్రతిఫలిస్తోంది' (ఏమీ లేదు). సమకాలీన సమాజంపై తిలక్ అభిప్రాయాన్ని ఇలాంటి వ్యాఖ్యలు నిర్ధారిస్తాయి.

**పురుషలు**

మనకు మధ్యమపురుషలో అరుదుగాను, ఉత్తమపురుషలో తక్కువగాను, ప్రథమపురుషలో అధికంగాను కథనం చేయడం తెలుసు. తిలక్ కథల్లో కూడా ప్రథమపురుష కథలే ఎక్కువ. లిబియా యెడారిలో, అద్దంలో జిన్నా బాబు, గడియారపు గుండెలు మొదలైన ఒక కథలు ప్రథమపురుషలో సాగాయి. తిలక్ మానవత్వం కథలకు ఈ శిల్పం ఎంతగానో ఉపకరించింది.

తిలక్ నడిపిన ఉత్తమపురుష కథల్లో కథకుదు 'ఓడిపోయిన మనిషీ', నల్లజర్లరోడ్డు, హోటెల్లో, వంటి కథల్లో కన్పిస్తాడు. అయితే, ఈ ఉత్తమపురుష కథలు కూడా రెండు రకాలుగా కన్పిస్తాయి. 'నల్లజర్ల రోడ్డు' వంటి కథల్లో తాను పాత్రగా వుంటూ వేరే ప్రధాన పాత్రలు చేత మాట్లాడిస్తాడు. ఇక 'హోటల్లో' వంటి కథల్లో కథకుడు తాను సాక్షీభూతుడుగా వుంటూ, తాను నలుగుతూ వుంటాడు. అయితే, ఉత్తమపురుష కథనం వల్ల కొన్ని చిక్కులుంటాయని, కథలో 'నేను' ఎవరు అని తెలుసుకొనేందుకు పాఠకుడికి ఇబ్బందిగా వుంటుందని విమర్శకుల అభిప్రాయం. కానీ, తిలక్ కథల్లో అలాంటి సమస్య రాదు. ఉత్తమపురుష పాత్ర ప్రవేశంచగానే ఎవరు ఆ పాత్ర అనేది అర్థమైపోతుంది.

**స్థల – కాలాలు**

కథ జరిగిన కాలాన్ని, ప్రాంతాన్ని నర్మగర్భంగా కథలో ఇమడ్చడం సజీవ కథల లక్షణం. కేవలం కల్పిత కథల్లో స్థల కాలాల విషయంలో కథకుడు దొరికిపోతాడు. తిలక్ కథల్లో స్థల కాలాల విషయంలో కథకుడు దొరికిపోతాడు. తిలక్ కథల్లో కల్పనలు వున్నా వాస్తవికత పాలు ఎక్కువ. అందుకే స్థల కాలాల శిల్పంలో భాగంగా స్పష్టంగా కన్పిస్తాయి. 'సముద్రపు అంచులు' కథ అంతా సముద్ర తీర ప్రాంతంలో జరిగింది. ఆ ప్రాంత ప్రజల సమస్త జీవనాన్ని అందులో ప్రతిబింబిస్తుంది. అలాగే 'నల్లజర్ల రోడ్డు' కథ అంతా అటవీ ప్రాంతంలో సాగినట్లు నేరుగానే అర్థమౌతుంది.

ఇక తిలక్ కథల్లో కాలం విషయానికొస్తే 'అద్దంలో జిన్నా' పాకిస్థాన్ విడిపోయిన కాలానిదని అర్థమౌతుంది. అలాగే 'ఓడిపోయిన మనిషి' కథలో 'భావకవిత్వం మీదా సుబాష్ చంద్రబోస్ నాయకత్వం మీదా మోజు, ఇంగ్లీషు వాళ్ళన్నా, ఉద్యోగస్తులన్నా

చిరాకు' వంటి మాటలు కథాకాలం 1940-47 మధ్య అని అర్థమౌతుంది. ఇలాంటి ఎన్నో సందర్భాల్లో ఈ శిల్పాన్ని నేర్పుగా ప్రదర్శించాడు తిలక్.

**సంఘర్షణ**

దీన్నే ఇంగ్లీషులో 'కాన్‌ఫ్లిక్ట్' అంటాం. ఇతర భాషాసాహిత్యాన్ని బాగా చదివిన తిలక్ ప్రతి కథలోను ఈ శిల్పలక్షణాన్ని అన్వయించాడు. తిలక్ కథలో ఒకే పాత్రలో గాని, రెండు పాత్రల మధ్య గాని ఈ సంఘర్షణ స్పష్టంగా కన్పిస్తుంది. ఒక్కొక్క సారి సమాజంలో వైరుధ్యాల, మనుషుల్లో వైరుద్యాలు, భావవైరుద్యాలు రూపంలో కూడ ఈ సంఘర్షణ తిలక్ కథల్లో కనిపిస్తుంది. ఒకే పాత్రలో చిన్న విషయమై చెలరేగిన మథనం 'ఫలితకేశం' కథలో భార్య పాత్రలో ప్రవేశించి మరణానికి కారణమైంది. సీతాపతి కథలో ప్రధాన పాత్రలో ఆరంభమైన విరోధ భావం చివరికి అతన్ని అసహాయుడిని చేసి, తిరిగి భార్య దగ్గరకే చేరుస్తుంది. 'బాబు' కథలో ఒక యువకునితో ఆరంభమైన బ్రతుకు సంఘర్షణ చివరికి యజమానిపై తిరగబడి దాడి చేసే స్థాయికి వెళ్తుంది. 'యవ్వనం' కథలో విశాలలో ఆరంభమైన శారీరక సంబంధ కోరకల ఊగిసలాట కొనసాగి, చివరికి అప్రయత్నంగా వేరే వ్యక్తికి లొంగిపోతుంది. పొరపాటు జరిగిందని తెలుసుకుంటుంది. 'ఊరిచివర యిల్లు' కథలో మంచి జీవితం కోసం తపనపడే యువతి, ఆమె యవ్వనాన్ని ఉపయోగించుకొని బ్రతకాలని దురాలోచన చేసే ముసలి స్త్రీ రెండు పాత్రల మధ్య సంఘర్షణ శిల్పాన్ని అద్భుతంగా చూపించాడు తిలక్. 'సముద్రపు అంచులు' కథలో వ్యవస్థకు, వ్యక్తికీ మధ్య సంఘర్షణ కన్పిస్తుంది. ఎలాగైనా కష్టపడి చేపలు పట్టి సంపాదించి, సొంత ఇంటిని కట్టుకొని చంద్రిని పెళ్ళిచేసుకొని బ్రతకాలనే వీరూ, పైకి ఎదగాలనే అతన్ని సమాజంలో కొందరు భూవాలు కష్టాల పాలు చేసి యథాస్థితిలో వుంచడం కన్పిస్తుంది. తిలక్ కథల్లో మానసిక సంఘర్షణలు ఎక్కువగా కన్పిస్తాయి.

**ముగింపులు**

కథలో ఎత్తుగడ పాఠకుణ్ణి కథలోకి జొరబడే లాగా చేస్తే, ముగింపు ఉత్కంఠత నుండి పాఠకుణ్ణి విముక్తి చేసేలా వుంటుంది. అయితే తిలక్ కథల్లో ముగింపులు సందేహాత్మకంగా వుండవు. పూర్తిగా అర్థమయ్యేలా వుంటాయి. 'తలలేనోడు' కథలో ముగింపు విషయంలో ఎన్నో చర్చలు. కొన్ని కథల్లో అస్పష్ట ముగింపులు కథా శిల్పాన్ని దెబ్బతీస్తాయి. కథ చివరకొచ్చేసరికి ఏం జరగబోతుందో తిలక్ ప్రతి కథలోను

తెలియజేస్తాడు. అలాగే ముగింపుల్లో సందేశాత్మక, ఆలోచనాత్మక, ఆశావాద ప్రతీకాత్మక, వ్యంగ్యాత్మక, కవితాత్మక, కరుణాత్మక భావాల్ని చూపించి మంచి శిల్పంతో కథల్ని పూర్తి చేశాడు. దొంగ అనే విషయం పాఠకులకు మాత్రం తెలిసేటట్టు, కథలో భార్యా భర్తలకు అతను ఎందుకు వచ్చాడో తెలియనట్టు కథ నడిపిస్తాడు. చివరకు అతణ్ణి ఎవరో చెప్పమని స్త్రీ పాత్ర అడిగనపుడు "నేనా... నేనా" అని ఏమి చెప్పాలో ఆలోచించి చివరకు 'నన్ను గోపాలం అంటారు లెండి. అంతే' అంటూ గోపాలం తలెత్తకుండా వడి వడిగా పెరట్లోకి చీకట్లోకి వెళ్ళిపోయాడు." అని ముగిస్తాడు కథకుడు. దొంగ గోపాలం కాదు ఆమె భర్త అనే సందేశాన్నిస్తూ ముగింపు వాక్యాల్ని రాశాడు తిలక్. 'ఓడిపోయిన మనిషి' కథలో వ్యక్తి ప్రేమించిన బాలని స్వార్థంకోసం వదిలేసి, సుభద్రను పెళ్ళిచేసుకొంటాడు. అన్నీ వున్నా అభద్రతా భావంతో ఇష్టమైన స్త్రీని జీవిత భాగస్వామిని ఎంచుకోలేకపోతాడు. చదువు సంధ్యలేని సుబ్బులుద్వారా గుణపాఠం నేర్చుకున్న ఆ వ్యక్తి 'జీవితపు పందెంలో ఓడిపోయిన వాడిని' అనడంతో కథ పూర్తవుతుంది. ఇది గొప్ప సందేశాత్మక ముగింపు. 'పరివర్తన' కథలో శంకరం తన ఆలోచనా విధానాన్ని మార్చుకొని తాను ప్రేమించిన రాజేశ్వరితో "నీకోరిక ప్రకారం పెళ్ళి చేసుకొని సతీమణితోనే నీకు మళ్ళీ కనిపిస్తాను! అనే ముగింపు వాక్యాల్లో మంచి సందేశాన్ని ఇమిచ్చాడు తిలక్. 'దేవుణ్ణి చూసిన వాడు' కథలో పరమ కఠినాత్ముడుగా, పిసినారిగా ఉన్న గవరయ్య లేచిపోయిన తన భార్యను ఆమె ఎవరి ద్వారానో కన్న బిడ్డను స్వీకరించడం గొప్ప మార్పు. పైగా 'నా కంటె సగం చిన్నదాన్ని పెళ్ళి చేసుకుంటే లేచిపోక ఏం చేసేది.' అని సమర్థించడం సందేశాత్మక ముగింపుగా అర్థమౌతుంది.

అదేవిధంగా 'బొమ్మ' కథలో రోడ్లో జనం గుంపులుగా ఏర్పడడానికి, లాఠీచార్చి జరగడానికి కారణం అందమైన స్త్రీ రూపం. కానీ పేపర్లో వచ్చిన వార్తతో కథను ముగిస్తాడు. 'నగరంలో ప్రజా విప్లవం. పోలీసుల తుపాకీలు కాల్చారు. నగరంలో మతకలహాలు ముగ్గురి మరణం.' అంటూ పాఠకుడిలో ఆలోచనలు ముడివేసి ముగిస్తాడు. 'సీతాపతి కథ'లో చివరికి తప్పు తెలుసుకున్న వ్యక్తి 'పద్మ దేవత' అని డైరీలో రాసుకుంటాడు. అదే వ్యక్తి మొదట్లో తన భార్యను 'చంపెయ్యాలి' అని రాసుకుని వుంటాడు. అందుకే రచయిత ఇలాంటి ఆశావాద ముగింపునిచ్చాడు. 'నవ్వు' కథ ముగింపులో "అతని కథ వెనకాల భయంకర విషాదముంది, వేదాంతం వుంది.'

అవే మాటల వెనకాల ఆశావాదం శిల్పం వుంది. ఎన్ని కష్టాలు వచ్చినా మనిషి చిరునవ్వుతో వుండాలనే రచయిత ఆశ కన్పిస్తుంది. అలాగే 'కవుల రైలు' అనే స్కెచ్‌లో కవులతో నిండి రైలులో స్థానం లేకపోయిన స్త్రీ ఎవరు అనే ప్రశ్నకు చివరగా 'కవిత' అనే వ్యంగ్యాత్మక సమాధానాన్నిచ్చి ముగిస్తాడు తిలక్. అదే విధంగా 'ఐనా రక్తపు మరక పడిన చొక్కా దానికి నిదర్శనం' (హోటల్లో), 'అద్దంలో జిన్నా చాల గొప్పవాడు. చాలా గొప్పవాడి కన్నా గొప్పవాడు. జిన్నా వెనుక పదికోట్ల మహమ్మదీయుల, ఇరవై కోట్ల కళ్ళల్లో..." (అద్దంలో జిన్నా) వంటి ప్రతీకాత్మక ముగింపులున్నాయి. అలాగే 'కృష్ణపక్షపు గుడ్డివెన్నెల్లో ఆ నగరం తనలో తానొదిగిన పెద్ద తాబేలులా వుంది.' (కదిలే మేడలు), 'అందమైన మొహం మీద పడే నల్లని వదిలిన జుట్టునీ చూసేటప్పటికి ఆమె కనుకొలకుల్లో తెల్లని నీటి బిందువు తళతళ లాడింది" (నిర్మల మొగుడు) వంటి కవితాత్మ ముగింపులున్నాయి. తిలక్ అనేక కథల్లోని అనేక సన్నివేశాలు పాఠకుల చేత కన్నీరు పెట్టిస్తాయి. అలాగే కొన్ని ముగింపులు చూసినప్పుడు పాఠకుడికి అక్షరాలు మసకబారుతాయి. అదే శిల్పంలో తారాస్థాయి. 'ఊరిచివర ఇల్లు' కథ ముగింపులో రమ తనను విడిచి వెళ్ళిపోతున్న జగన్నాథం ఉన్న రైలు దగ్గరకువెళ్తుంది. ఏమీ మాట్లాడలేక వెళ్తున్నరైల్లోకి అతను విడిచిన డబ్బున్న పర్సును రైల్లోకి విసిరి తాను పడిపోతుంది. తన తప్పులేక పోయినా, తనను అలా మార్చిన వ్యవస్థను ఏమీ అనకుండా నేల కరుచుకుని, బురదలో ఉండిపోయిన స్త్రీ రూపాన్ని చూపిస్తూ కరుణరసాత్మకంగా ముగిస్తాడు తిలక్. అలాగే 'సముద్రపు అంచులు' కథలో వీరా, చంద్రిల దీనావస్థను చూస్తూ హృదయం కదిలే ముగింపు నిస్తాడు.

ఈ విధంగా తిలక్ కథల్లో శిల్పాన్ని సౌందర్యవంతంగా సిద్ధంచేయడానికి అనేక నిర్మాణ పద్ధతులను ఉపయోగించాడు. తిలక్ శిల్పరీతుల్ని చూశాక కథల్ని ఇలా తప్ప మరో విధంగా చెప్పలేం అనిపిస్తుంది. కథలో ఉండవలసిన వాటిని మాత్రమే వుంచాడనిపిస్తుంది. రాయకూడని విషయాన్ని ఎక్కడా రాయలేదు. కథ ఎన్ని పుటల్లో వుండాలనే నియమాలు ఆయన్ని ఏమీ చేయలేక పోయాయి. ఒక పుట కథ నుండి 30 పుటల కథల దాకా వున్నాయి. కథలన్నీ నేరుగా మొదలై నేరుగానే పూర్తవుతాయేగాని, ఫ్లాష్ బాక్‌లతో సాగవు. అన్నిటికంటే కథను నిర్మించే క్రమంతో సంగీత, సాహిత్య, రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలతో మేళవించాడు. అందుకే తిలక్ కథాశిల్పం సౌందర్యాత్మకంగా భాసించింది. 1967 తర్వాత వెలుగు చూసినా

'విశ్వసాహిత్యంలో ఉత్తమ కథలతో దీటు వచ్చే కథలు'[9] అన్న నిడమర్తి ఉమా రాజేశ్వరరావు మాటలు వాస్తవం.

**ఆధార గ్రంథాలు**


1. కథలెలా రాస్తారు (వ్యాసం) – తిలక్
2. కవికుల తిలకుడేనా తిలక్? కాదు కథకుల కస్తూరితిలకం గూడా! – (వ్యాసం) – మునిపల్లె రాజు
3. తెలుగు కథకు కథనరీతులు (1 వ్యాల్యూమ్)–వ్యాసం–కోడూరి శ్రీరామమూర్తి
4. మనం మరచిపోతున్న మంచి కథకుడు తిలక్ – అంపశయ్య నవీన్ (తిలక్ సాహితీ సందర్శము)
5. కథానిక శిల్పం – వల్లంపాటి వెంకట సుబ్బయ్య
6. కథానిక స్వరూప, స్వభావాలు – పోరంకి దక్షిణా మూర్తి
7. కథలు ఇలా కూడా రాస్తారు – మహమ్మద్ ఖదీర్‌బాబు
8. నా కథల నాయికలు (వ్యాసం) – శార్వారి (కథలెలా రాస్తారు)
9. తిలక్ కథలు – (మొదటి ముద్రణ ముందుమాటలు)–1967, విశాలాంధ్ర.

# 26. తిలక్ సాహిత్యం-సందేశం

- డా॥ ఎన్. ఈశ్వర రెడ్డి

**పరిచయం**

దేవరకొండ బాలగంగాధర తిలక్ ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మధురకవి. కవిత్వాన్ని - జీవితాన్ని సమానంగా ప్రేమించిన అమరకవి తిలక్, మానవ స్వభావంలోని కుళ్ళు కుతంత్రాలను కుమ్మేస్తూనే, స్వచ్ఛమైన అమృతప్రేమను పంచిన గొప్ప రచయిత తిలక్. మనసుకు - మనసుకు మధ్య భావోద్రేక వారధులు కట్టి హృదయ సంగీతాన్ని వినిపించిన సుమధుర భాషాజ్ఞాని తిలక్.

**జననం, విద్యాభ్యాసం**

1921 ఆగష్టు 1న మందపాక తణుకు తాలూకా పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించిన తిలక్, వారి నాన్న సత్యనారాయణమూర్తి గారి హయాంలోనే తణుకుకు వచ్చి, అక్కడే స్థిరపడ్డారు. తల్లి రామసోదెమ్మ. స్వాతంత్ర్య సమరయోధుడైన బాలగంగాధర్ తిలక్‌పై ఉన్న వీరాభిమానాన్ని ప్రకటించుకోవడానికి సత్యనారాయణమూర్తి తన ఆరవ సంతానమైన తిలక్‌కు ఆ పేరు పెట్టాడు. ఎందుకంటే, సత్యనారాయణమూర్తి కూడా గొప్ప దేశభక్తుడు కాబట్టి.

తణుకు బోర్డు స్కూల్లో తిలక్ పాఠశాల విద్యను పూర్తిచేసి, ఇంటర్మీడియట్ కోసం మద్రాసు వెళ్ళాడు. లయోలా కళాశాలలో చేరి, అనారోగ్య కారణాలతో అర్ధాంతరంగా చదువుమానేసి ఇల్లు చేరినాడు. విశాఖపట్నం ఎ.వి.ఎన్. కళాశాలలో చేరి, అనేక కారణాలతో అక్కడ కూడా చదువు కొనసాగించలేకపోయాడు.

పాఠశాలలో చదివిన రోజుల్లో తెలుగు అధ్యాపకుడిగా ఉండిన పెన్మత్స సత్యనారాయణరాజు తిలక్‌కు సాహిత్య గురువు. గురువు ప్రోత్సాహంతో 11 సంవత్సరాల వయసులోనే తొలికథ రాశాడు తిలక్. తెలుగు, సంస్కృత, ఆంగ్లభాషల్లో ప్రావీణ్యం సంపాదించిన తిలక్‌కు ఈ మూడు భాషలు రచనకు బాగా ఉపకరించాయి.

ఎం.ఎన్. రాయ్‌ను అభిమానించిన తిలక్ నవ్యకవిత్వ దారిలో నడిచాడు. జాతీయ, అంతర్జాతీయ సమాజాలను రాజకీయ దృక్కోణంలో అర్థం చేసుకొని, తన సృజనలో స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చాడు. ఇజాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా

సాహిత్య దృక్పథాన్ని ఏర్పరచుకున్నాడు. నెహ్రూ, జయప్రకాష్ నారాయణ వంటి తొలితరం నాయకులను అభిమానించాడు.

తిలక్ 45 సంవత్సరాల వయసులోనే (జూలై 1, 1966) తనువు చాలించాడు. అయినా, వెయ్యేళ్ళు గుర్తించుకోదగిన కవిత్వం ఇచ్చిపోయాడు.

“బైరన్‌లాగే తిలక్ కూడా జీవించాల్సిన వయస్సెంతో ఉండగానే మృత్యువాత పడ్డాడు. అతని వలెనే తిలక్ కూడా బ్రతకడం కోసం కష్టపడాల్సిన అవసరం లేకపోయినా, గాఢంగా విశ్వసించిన సత్యాల కోసం స్వీయ ఆలోచనల కోసం బ్రతుకును కష్టపెట్టుకున్నవాడు” (విస్పష్ట అంతః చైతన్యవాణి కవితావాణి – ఆవంత్స సోమసుందర్; తిలక్ సాహిత్య సందర్శనం).

**రచనలు**

తిలక్ 11 సంవత్సరాల వయసులోనే రచనలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. తన తొలికథ మాధురి అనే పత్రికలో అచ్చుయినట్టు విమర్శకులు భావిస్తున్నారు. అయితే ఆ కథ ఇప్పటి దాకా లభించలేదు. 1937లో 'ప్రభాతము – సంధ్య' పేరుతో ఒక పద్యరచన చేయగా, అది 1940లో అచ్చుయింది. ఆ తర్వాత రాసిన పద్యకావ్యం మండోదరి. ఇది కూడా అందుబాటులో లేదు.

తిలక్‌కు ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టిన కవితా సంపుటి అమృతం కురిసిన రాత్రి. తిలక్ కవిత్వానికి ఇది ఒక అధికారిక సంతకం లాంటిది. 1941 నుండి 1966 మధ్య కాలంలో వచ్చిన కవిత్వం ఈ సంపుటిలోకి చేరింది. తొంభైమూడు కవితలతో, పదహారు సార్లు పునర్ముద్రణ పొందింది అంటే, ఆ కవిత్వ గొప్పతనాన్ని అర్థం చేసుకోవచ్చు. దాదాపు ఇదే కాలంలో (1942-1966) రచించిన 18 పద్య ఖండికలు 'గోరువంకలు' పేరుతో 1993లో కావ్యంగా అచ్చుయింది. సుందరీ-సుబ్బారావు, ఊరుచివరి ఇల్లు పేర్లతో 1961లో కథా సంపుటాలు వెలువడ్డాయి. 1967లో తిలక్ కథలన్నీ (30) 'తిలక్ కథలు' పేరుతో ఒకే సంపుటిగా అచ్చువడమే గాక, తదనంతర కాలంలో పది ముద్రణలు పొందింది.

ఇరుగు పొరుగు (1960), సుచిత్ర ప్రణయం (1961), సుప్తశిల (1967), పొగ (1968), నాటికలు; సుశీల పెళ్ళి (1961), సాలెగూడు (మరణానంతరం 1980లో) నాటకాలు ప్రచురించబడ్డాయి. భరతుడు (1968) పేరుతో రాసిన ఏకపాత్రాభినయం, రచనా విధానానికి సంబంధించి రాసిన మూడు వ్యాసాలు, లేఖలు అన్నీ మరణానంతరం అచ్చుయ్యాయి. తిలక్ రచనల్లో తలమానికంగా నిలిచిన అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు (1969),

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు (1971)లు లభించాయి. భాషకు భావుకతను జోడించి, మానవీయ విలువలకే పట్టం గట్టిన తిలక్ రచనలు ఈనాటికీ ప్రాసంగికతను కలిగి ఉండడం విశేషం. ఇంజనీరింగ్ ఆచార్యులు కూడా తిలక్ కవిత్వాన్ని ఆరాధిస్తున్నారు అంటే ఆ కవిత్వంలోని ఆల్కెమీ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

**తిలక్ కవిత్వం – సందేశం**

బాలగంగాధర తిలక్ ఆధునిక తెలుగు కవిత్వంలో గొప్ప అనుభూతివాద కవి. సౌందర్యోపాసకుడు. ప్రతి కవితలోనూ మనసు భాష వినిపించినవాడు. ఆంగ్ల సాహిత్యంలో బైరన్‌తో పోల్చుకోదగిన కవిగా తిలక్‌ను కొనియాడారు ఆవంత్స సోమసుందర్. తిలక్ కవిత్వం భావాభ్యుద సంగమం, లలితమైన పదప్రయోగాలతో, దుఃఖితులను, బాధితులను అక్కున చేర్చుకుంటుంది. అపార కరుణా ప్రేమలతో పొంగే స్పందన కష్టాలను హృద్యంగా ఆవిష్కరిస్తుంది. అయితే ఈ హృద్యత అభ్యుదయానికి అవతలే ఆగిపోయిందని రాచమల్లు రామచంద్రారెడ్డి విమర్శించాడు.

“దుఃఖితుల పట్లా, బాధితుల పట్లా తిలక్ అపారమైన కరుణతో కరిగిపోయిన మాట యెవరూ కాదనలేరు. కాని ఆ కరుణ అభ్యుదయ హృదయ స్పందనగా కనిపించదు. ఆ కరుణ దుఃఖితులనూ బాధితులనూ క్రియాశీలురనూ కార్యార్మోఖులనూ చేసేది కాదు. కనీసం వాళ్ళకు ఊరట కలిగించేది కూడా కాదు. ఆ కరుణ కేవలం భావకవి సుకుమారుని ఏకాంత సౌందర్యంగా కవితానంద హేతువుగా మిగిలి పోయింది” (తనలో తానొక ఏకాంత సౌందర్యం రచించుకున్న స్వాప్నికుడు (వ్యాసం), తిలక్ సాహితీ సందర్శనం – రాచమల్లు రామచంద్రారెడ్డి). తిలక్ కవిత్వంపై రారా చేసిన ఫిర్యాదులు ఇంతటితో ఆగలేదు. అభ్యుదయ కవిత్వ దృక్పథంలోంచి తిలక్‌ను కొలుస్తూ ‘చిన్నారికి చిన్నమాట’ కవితా ఖండిక గతయుగాలలో అంతఃపురకాంతల కుండే ‘లలిత లలిత లతాంత మాల’గా అలరారిన సౌందర్యం వాస్తవ జీవితంలో ఎక్కడా ఉండదని పేర్కొంటాడు. ‘మైనస్ ఇంటూ ప్లస్’ ఖండిక ‘మానవులకు స్వార్థం ఒక ప్రాథమిక శక్తి అనడం, క్రౌర్యం మీద అభిరక్తి అజ్ఞాతంగా మనిషిలో పశువుతో సమానం’ అనేవి అభ్యదయ దృక్పథానికి ఆమడ దూరంలో మిగిలిపోయాయని, ‘అందుకే మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందే ఈ ప్రయాణం అనంతదీర్ఘం పునఃపునర్వ్యర్థం బహుయుగ విస్తీర్ణం’ అనే వాక్యం అభ్యుదయ తత్వానికి బద్ధ వ్యతిరేకమే గాక, భావకవులకు కూడా వెగటుగానే ఉంటుందని ఎత్తి చూపిస్తాడు రారా.

నిజానికి భావుకతే తిలక్ బలం. అందుకే ‘కవితాసతి నొసట నిత్యరస గంగాధర తిలకం’ కాగలిగాడు తిలక్. సమకాలిక జీవిత వాస్తవం నుండి గ్రహించిన వస్తువు ఏసూత్రాలకూ కట్టుబడని విభిన్న తత్వాలను ఆవిష్కరించింది.

'దయాపారావతాలుగా, విజయ ఐరావతాలుగా, అందమైన ఆడపిల్లలుగా' అక్షరాల్ని కవిత్వీకరించిన తిలక్' కవిత్వ పరిమళాల్ని వెదజల్లడానికి, హృదయాన్ని రసవంతం చేసుకున్నాడు. సామాన్య జీవితంలోని జీవనానికి 'అనుభూతి' సౌందర్యాన్ని అద్ది పాఠకులను మంత్రముగ్ధులను చేశాడు. సైనికుడి ఉత్తరం, పోస్టుమాన్ వంటి కవితలు అందుకు నిదర్శనం.

'అమృతం కురిసిన రాత్రిలో తిలక్ కవిత్వం శృంగార ప్రణయాలూ, మానవుని దైన్య విషాదాలూ, సాంఘిక, రాజకీయ పరిస్థితులూ చమత్కార హాస్యాలతో కలిపి పఠితకు షడ్రసోపేత భోజనం'గా సంతృప్తినిచ్చింది.

ఐతే, 'దేవుడా రక్షించు నాదేశాన్ని పవిత్రుల నుండి, పతివ్రతల నుండి... శ్రీమన్మద్గురు పరంపరల నుండి అన్న తిలక్ కవిత్వం, అంతలోనే 'ఆశల వెచ్చని పాన్పు మీద స్వప్నాల పుష్పాలు జల్లుకొని ఆదమరచి కాసేపు విశ్రమించడాని కనుమతించు తండ్రీ' అంటూ ఉవ్వెత్తున ఎగిసిన కెరటం మళ్ళీ కిందపడిపోయినట్టుగా కనిపిస్తుంది. 'గోరువంకలు' ఛందోబద్ధ రచన. తిలక్ కూడా పద్యరచనలు చేయగలడని నిరూపిస్తుంది ఈ రచన. గోరువంకలు మంచు రేకులతోనూ, గాలిగొంతులతోనూ, పూల కౌగిళుతోనూ సంగమించి ప్రణయ సౌందర్యాన్ని ఆవిష్కరిస్తాయి.

తిలక్ మీద ఏ ఆధునిక రాజకీయ సిద్ధాంతమూ ప్రబలమైన ముద్ర వెయ్యలేదు'. తిలక్ ఏ ఒక్క సిద్ధాంతానికి కట్టుబడి, ఎవరి మెప్పు కోసమో సాగిలపడి కవిత్వాన్ని నినాదప్రాయం చేయలేదు. నీరుగార్చలేదు. సమాజం నుండి స్వీకరించిన వస్తువు ఏ కోవకు చెందినా, దాని స్వరూపాన్ని సమగ్రంగా, హృద్యంగా ఆవిష్కరించడమే ప్రధానంగా భావించింది తిలక్ కవిత్వం. ఈ ఆలోచనకు అడ్డుపడే ఏ సిద్ధాంతాన్ని, సూత్రాన్నీ ఈయన కవిత్వం లెక్క పెట్టలేదు. సమాజంలోని సమస్యను అత్యద్భుతంగా ఎత్తి చూపగలిగితే (అడ్రస్ చేస్తే) చాలు. వాటిపై జనం ఆలోచనలు జడివానల్లా కురుస్తాయని భావించాడు. అందుకే తిలక్ వ్యక్తపరిచిన భావాల చుట్టూ ఇప్పటి పాఠకుడు కూడా కరిగి ప్రవహిస్తుంటాడు.

**కథలు – సందేశం**

తిలక్ కథలు మధ్యతరగతి జీవితాలకు ప్రతిబింబాలు. 'దీనులపట్ల, హీనుల పట్ల, దగాపడిన తమ్ముళ్ళ పట్ల, చెల్లెళ్ల పట్ల అపారమైన దయ, సానుభూతి, గౌరవం' కలిగిస్తాయి తిలక్ కథలు. మనుషుల్లో ఉన్న స్వార్థాన్ని, వంచనను, దోపిడి గుణాలను కథల రూపంలో తూర్పారబడతాడు తిలక్.

సుందరీ–సుబ్బారావు కథ ద్వారా ఆర్థిక అసమానతలు స్త్రీపురుష సంబంధాల

మధ్య ప్రభావం చూపిస్తూ ఉంటాయని, ఇలాంటి చోట ప్రేమలు కూడా భ్రమలే అవుతాయని తెలియచెప్తాడు. 'సీతాపతి కథ'లో మధ్యతరగతి భార్యాభర్తల మధ్య పొడచూపే విపరీత మనస్తత్వాలును బయటపెట్టి, స్వతంత్ర వ్యక్తిత్వాలు పెళ్ళి కారణంగా దెబ్బతింటున్నాయనే ఆలోచనలకు స్వస్తి పలకాలని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించాలనే సందేశాన్నిస్తాడు. డబ్బున్న, చదువుకున్న వారి అవకాశవాద అమానుషత్వాన్ని 'నల్లజర్ల రోడ్డు' బయటపెడుతుంది. 'డబ్బున్న వాళ్ళు దేన్నైనా డబ్బుతో కొనుకోవచ్చు' అనే నీతిబాహ్య ఆలోచనలకు దిగిపోతారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించమంటాడు రచయిత.

'పేదరికము పెద్ద వింత విద్యాశాల దానియందు లజ్జ కానరాదు' అనే జాషువా మాటలను గుర్తుకు తెచ్చే 'ఆశాకిరణం' కథ తెలివితక్కువతనంతో ఉద్యోగం పోగొట్టుకొని, కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యకు పూనుకున్న ఒక మనిషి, తన కూతురు వ్యభిచారం చేసి డబ్బు సంపాదిస్తోందని తెలిసి సంతోషంగా ఇంటికి వెళ్ళిపోతాడు. అవసరం మనిషిని ఎంతకైనా దిగజారుస్తుందనే సత్యాన్ని సందేశంగా అందించడాన్ని తిలక్ కథలో చూడవచ్చు.

నీతులు వల్లించి వాటిని ఆచరించకపోవడం, కాలం చెల్లిన కట్టుబాట్లకు బానిసలుగా మిగిలిపోవడం, పేదవాళ్ళను దూరంగా పెట్టడం, డబ్బున్నవాడి పంచన చేరి వాణ్ణి ముంచాలని చూడడం, కష్టపడకుండా డబ్బు సంపాదించాలనుకోవడం వంటి అనేక సామాజిక రుగ్మతల పట్ల తిలక్ కథలు చైతన్యాన్ని కలిగిస్తాయి. ఊరి చివరి ఇల్లు, పరివర్తన, సముద్రపు అంచులు, దొంగ వంటి కథలు సమకాలీన సమాజానికి అక్షరాకృతులుగా నిలుస్తాయి.

తిలక్ రాసిన దాదాపు ముప్పై కథల్లో అధిక శాతం మధ్యతరగతి సమాజాన్ని చూపించేవే. కుటుంబ ఆర్థిక పరిస్థితులు వారి జీవితాలను శాసిస్తాయని, ఆర్థిక పరిస్థితే స్త్రీపురుష సంబంధాలను నిర్ణయిస్తుందని తన కథల ద్వారా నిరూపించాడు.

'ధనం, ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, అధికారం, హోదా వంటివి ప్రేమ, అనురాగం, వివాహం, దాంపత్యం, పాతివ్రత్యం వంటి అంశాల మీద ప్రభావం చూపిస్తూ, మనిషిని మంచివాడుగానో, చెడ్డవాడుగానో ఎలా మారుస్తాయో నిరూపించాడు.' స్వాతంత్ర్య భారతదేశంలో కూడా పేదరికం, నిరుద్యోగం, మధ్య కింది తరగతి ప్రజలను ఎంత పీడించాయో తిలక్ కథలు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తాయి.

తిలక్ కథలు మనిషి ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఒక అవకాశం కలిగిస్తాయి. దిగజారిపోవడానికి, ఎగబాకి రావడానికి మధ్య మనిషిలో జరిగే

సంఘర్షణలకు, అందుకు కారణభూతంగా నిలుస్తున్న పరిస్థితులకు చాలా కథలు భాష్యం చెప్తాయి. యుద్ధవ్యతిరేకత, శాంతి ప్రాధాన్యతలను కొన్ని కథలు తెలియచెప్తాయి. "తిలక్ తన కథల్లో మానవజీవిత వాస్తవికతను నిశితంగా పరిశీలించి విమర్శనాత్మకంగా చిత్రించారు. సమస్యలను చిత్రించి పాఠకుడిలో ఆలోచనలను రేకెత్తించడం వాస్తవిక వాద రచయిత తిలక్ చేసిన పని."

**నాటికలు - నాటకాలు**

తిలక్ నాటకాలు, నాటికలు సామాజిక నేపథ్యం నుండి వచ్చినవే. సాలెగూడు, సుశీలపెళ్ళి నాటకాలు, ఇరుగు-పొరుగు, సుచిత్ర పరిణయం, సుప్తశిల, పొగ అనే నాటికలు తిలక్ కలం నుండి జాలువారాయి. సుప్తశిల, పాదుకా పట్టాభిషేకం (ఏకపాత్ర) రెండూ పౌరాణిక నేపథ్యంలో వచ్చినవి కాగా, మిగిలినవన్నీ సామాజికమైనవే.

1959లో చైనా భారత భూభాగంలోకి చొచ్చుకొని వచ్చినప్పుడు, ఈ సంఘటనను ప్రతీకాత్మకంగా నాటకీకరించి రాసిన నాటిక ఇరుగు-పొరుగు. 'సహనం, విశ్వాసం, స్నేహం ఇవన్నీ ఉన్నప్పుడే ప్రపంచంలో యుద్ధాలు, బాధలు ఉండవని, నా సిద్ధాంతం ప్రపంచం అనుసరిస్తుందని, ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే, రాతియుగం నుండి మనిషిని మనిషి నమ్మకపోవడం, ఒక తెగని మరొక తెగ, ఒక దేశం మరొక దేశాన్ని అనుమానించడం, ద్వేషించడం' అంటూ గొప్ప ఉపన్యాసాలిచ్చిన చైనా, దానికి విరుద్ధంగా చర్యలతో భారత భూభాగ ఆక్రమణకు బరితెగించిన ధోరణిని నిరసిస్తూనే, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, నిదానం, నిగ్రహం ఎంతో అవసరమని బోధించి యుద్ధ విముఖతను, అందువల్ల జరిగే అనర్థాలను మన ముందుంచుతాడు.

డబ్బు మనిషికి అవసరమే. అయితే ధనం వెంటపడి జీవిత మాధుర్యాన్ని కోల్పోతున్న ఆధునిక పరిస్థితులను నేడు కూడా చూస్తున్నాం. డబ్బుతో వచ్చే సమస్యలను, అనర్థాలను ఎత్తిచూపే నాటిక 'పొగ'. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడడం, తాగుడు, వ్యభిచారం, జూదం వంటి వ్యసనాలకు బానిస కావడం వల్ల జరిగే పరిణామాల పట్ల జాగ్రత్తగా ఉండాలనే సందేశాన్నిస్తాడు తిలక్.

తిలక్ నాటకాలు, నాటికలు సరళంగా, సాఫీగా సాగిపోతున్నట్టు ఉన్నా, కవితా మయంగా సంభాషణలు, చాతురతతో కూడిన సున్నిత హాస్యం నిండుగా ఉంటాయి. తిలక్ నాటకల్లో నాయికా నాయకుల పాత్రలు మధ్యతరగతికి చెందినవై ఉండడం సహజంగా కనిపిస్తాయి.

మధ్య తరగతి వారి ప్రేమలు ఎంత బలహీనంగా ఉంటాయో, ఆర్థిక బరువు పడగానే అవి ఎంత చిన్నాభిన్నం అవుతాయో 'సుశీల పెళ్ళి' నిరూపిస్తుంది. తండ్రి చేసిన అప్పుకు సుశీల తను ప్రేమించిన 'సూర్యం'ను వదిలి అప్పు కట్టిన ప్రభాకరంను పెళ్ళి చేసుకుంటుంది. పెళ్ళయిన తర్వాత బయటపడ్డ ప్రేమ వ్యవహారంతో ప్రభాకరం సుశీలను సూర్యానికే అప్పగించాలనే నిర్ణయానికి వస్తాడు. సూర్యం ఇతరుల ఎంగిలిని ముట్టనని సుశీలను తిరస్కరిస్తాడు. మనస్సు సూర్యంపై ఉందని ప్రభాకరం, ప్రభాకరంతో పెళ్ళైపోయిందని సూర్యం ఇద్దరూ సుశీలను నిరాకరిస్తారు. పురుషాహంకారానికి బలైన సుశీల స్వేచ్ఛాజీవితం కోసం ఒంటరిగా మిగిలిపోతుంది. ఇలాంటి ఇతివృత్తాలతో తిలక్ రాసిన నాటికలు, నాటకాలు మన పక్క ఇళ్ళలో జరిగిన సంఘటనలుగా ఉంటూ మనసుకు హత్తుకుపోతాయి. సమకాలీన సమాజ పోకడలు తిలక్ రచనల్లో రికార్డు అయినట్టుగా తెలుస్తుంది.

'సుచిత్ర పరిణయం' నాటికలో కూడా విలోమ ప్రేమ కథ ఇతివృత్తంగా ఉంటుంది. బి.ఏ. చదువుకున్న శేఖరం ఒడ్డూ పొడవు కలిగిన చమత్కారి. మధ్యతరగతికి చెందినవాడు. లక్షాధికారి అయిన రామనాథం కూతురు సుచిత్రను గాఢంగా ప్రేమిస్తాడు. ఆమె కోసం లేఖలు రాస్తూ, దారికాస్తూ నిరంతరం ఆమెను మెప్పించే పనిలో మునిగి తేలుతాడు. చివరికి అనుకోని పరిస్థితుల్లో శేఖర్‌తో పెళ్ళికి అంగీకరిస్తుంది సుచిత్ర సాయంతో చేబదుళ్ళు, అద్దె బాకీలు, హొటల్ అప్పు అంతా జాబితా రాసుకొని మరీ తీర్చేస్తాడు. సున్నిత హాస్యం, సంభాషణా చతురతలతో ఆకట్టుకునే ఈ నాటిక అనేక ప్రదర్శనలకు నోచుకుంది.

మధ్యతరగతి జీవితానికి అద్దం పట్టే తిలక్ రచనలు స్త్రీ పురుష సంబంధాలను నిర్ణయించడంలో డబ్బు పోషించే పాత్ర ఎలా ఉంటుందో స్పష్టంగా చెప్పే ప్రయత్నం చేస్తాయి. పెట్టుబడిదారీ సమాజంలో సంపద ముందు మానవ విలువలు ఓడిపోవడాన్ని మనకు చూపిస్తాడు.

**లేఖలు**

రచయిత రాసి ముద్రించే సాహిత్యం సుందరీకరించబడి ఉంటుంది. కొన్ని దాపరికాలు, కొంత గౌరవ పోకడ, ఇంకొంత ఆత్మాభిమానం కలగలిసి రచనల్లో కొంత కృత్రిమత్వానికి అవకాశం కలిగిస్తాయి. అలా కాకుండా జీవితాన్ని, సమాజాన్ని, రాజకీయాలనూ ఉన్నవి ఉన్నట్టుగా చెప్పుకుపోయే రచయితలు ఉండడం అరుదు. అయితే, రచనల్లో చెప్పలేని అంశాలను స్నేహితులకు చెప్పుకునే అవకాశాలు చాలా ఎక్కువ. మనం మనం ఇంట్లో వారితో పంచుకోలేని విషయాలను స్నేహితులతో

పంచుకుంటుంటాం. అలాగే, లేఖా సాహిత్యం కూడా మిత్ర సమత్వాన్ని కలిగిన సాన్నిహిత్యంతో ఉంటుంది. తిలక్ లేఖల్లో కూడా అలాంటి సందర్భాలే కనిపిస్తాయి.

తిలక్ తన సమకాలికులకు రాసిన ఉత్తరాలు, వాటిల్లో ఉన్న సాహిత్య అంశాలపై పిహెచ్.డి. పరిశోధన జరుగుతోంది. నగ్నముని, నిఖిలేశ్వర్, శిష్ట్లా జగన్నాథం, రెంటాల గోపాలకృష్ణ, ఆవంత్స సోమసుందర్, వరవరరావు, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, మిరియాల రామకృష్ణ, మోగంటి మాణిక్యాంబ, తంగిరాల వెంకటసుబ్బారావు తదితరులకు రాసిన లేఖలు ఆనాటి పరిస్థితులను వ్యాఖ్యానించాయి.

దిగంబర కవులు తాము రాసిన కవితా సంపుటి (ఇతిశాసనమ్)ని నాంపల్లి పాండు అనే రిక్షా కార్మికుడితో ఆవిష్కరింపచేసి, తమ విభిన్నతను ప్రకటించుకున్నప్పుడు తిలక్ నగ్నమునికి రాసిన లేఖ (21.6.1965) దిగంబరకవులకు ఆత్మపరిశీలన చేసుకోమని చెప్పడంగా కనిపిస్తుంది. "రిక్షావాడు ఆవిష్కరించినా మంత్రి శేఖరుడు ఆవిష్కరించినా ఒకటే. ఇద్దరికీ కవిత్వమంటే ఏమిటో తెలియదు" అనీ, మీ ఆవిష్కరణ ఆత్మవంచన (8.7.1965న నిఖిలేశ్వర్‌కు రాసిన ఉత్తరం) అని చెప్పిన సందర్భాలు తిలక్ సూక్ష్మ దృష్టికి ఉదాహరణలు.

కవులు వాస్తవాలను చిత్రించాలని, అవే సమాజానికి ఉపయోగపడతాయని చెప్తూ "తెలుగు సాహిత్యంలో వర్తమాన కాలాన్ని గురించి సంపూర్ణంగా తెలియపరచడం ఖచ్చితమైన, నిర్మలమైన కొందరు వ్యక్తులకే సాధ్యమౌతుంది" (3.11.1963న జానకీ జానీ గారికి రాసిన లేఖ) అంటాడు. "గ్రాంథికాన్ని, ఛందస్సునూ, ఆర్ష ధర్మాన్ని పట్టుకు వేళ్ళాడే వీళ్ళను చూస్తే జాలివేస్తుంది" (ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మకు రాసిన లేఖ) అంటాడు. మారుతున్న కాలంతోపాటు మారవలసిన సాహిత్య రూపాల ఆవశ్యకతను కూడా తెలియజేస్తాడు.

'మోడ్రన్ పొయిట్రీ పేరుతో పత్రికలలో ప్రకటితమయ్యే వాటిని చూసి విసుగు చెందానని', 'ఉద్యమం అనేది నిజమైన బలమైన కవులుంటేనే బతుకుతుందని' 'జయంతి పత్రిక సనాతన వాసన కొంచెం ఎక్కువగా కొడుతుందని' ఆయన రాసిన లేఖలు చెప్తాయి.

"వేళ్ళ సందుల్లోంచి పొడి ఇసకలా జారిపోయే కాలాన్ని, వయస్సును తలచుకుంటే భయమౌతుంది" (27.5.1959 సోమసుందర్‌కు రాసిన లేఖ) "వయస్సు కౌమారం వైపూ వృద్ధాప్యంవైపూ పెరుగుతున్న మనస్సు యువకత్వం వైపూ లాగుతుంటుంది" (26.2.1964 వరవరరావుకు రాసిన లేఖ) అనడంలో ఆయన అనారోగ్య పరిస్థితుల ప్రభావం ద్యోతకమౌతుంది. ఒక్క నయనం నుండి ఉబికే భాష్పాన్ని తుడవగలిగితే,

ఒక్క అధరం మీదికి హాస్యాన్ని రప్పించగలిగితే జీవితం ధన్యమౌతుందని నా ఉద్దేశ్యం" (9.5.1961-మాణిక్యాంబకు రాసిన లేఖ) అనటం వెనుక తిలక్ మనస్తత్వాన్ని, జీవిత సార్థకతను అర్థం చేసుకోవచ్చు. తిలక్ లేఖలు ఆయనను మానవతావాదిగా, మంచి విమర్శకుడిగా, గొప్ప నిజాయితీ పరుడిగా నిలబెడతాయి.

**ముగింపు**

'మనోంతరాల నుండి అనుభూతిని తోడి తేవడంలో తిలక్‌ది ఒక ప్రత్యేక స్థానం. అనుభూతిని ఎక్కడా అస్పష్ట గగనంలో కరిగిపోనివ్వడు. హృదయపు దిశల చివరల సన్నని మబ్బులుగా వ్రేలాడే అనుభూతుల్ని విశాల పరిధిలోనికి గొనివచ్చి ఘనీభవింపజెయ్యాలని' (అనుభూతివాది తిలక్ – వ్యాసం; అద్దేపల్లి రామమోహనరావు –తిలక్‌సాహిత్య సందర్శనం)చేసిన ప్రయత్నం తిలక్‌ను అమృతతత్త్వకవిగా నిలబెట్టింది.

"కవిత్వానికి ఒక తాత్విక స్థాయిని తెచ్చిన కవి, ఈ నాగరికత అంతా, ఈ చరిత్ర అంతా, ఈ పరిణామమంతా 'నిరంతర నూతన పరిశోధన, సత్య సౌందర్యాన్వేషణ, ఒక శిఖరారోహణ' అని తేల్చుకున్న కవి, ఎన్నడూ దేనితోనూ అలసిపోడు, విసిగిపోడు, అట్లా సాగుతూనే ఉంటాడు. ఆ అర్థంలో తిలక్‌కు మరణం లేదు. నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించే సూర్యకాంతిలో ఆయన ప్రభావాన్ని చూస్తూనే ఉంటాయి" (శిఖారారోహణ (వ్యాసం) – తిలక్ సాహిత్య సందర్శనం) అంటున్న వరవరరావు మాటలు అక్షరసత్యాలు.

తిలక్ సాహిత్య సందేశం చాలా గొప్పది. తిలక్ జీవితం 'శంకరాచార్యుడు, షెల్లీ, రూపర్ట్ బ్రూక్, డిలన్ థామస్, స్వామి వివేకానంద, మొదలైన ధ్రువతాలర హ్రస్వాయుష్కుల సరసన చేరినా, అతని సాహిత్య సందేశం మాత్రం తెలుగు యుగాల్లో సుదీర్ఘ ఆయుష్షుతో దీర్ఘ శ్వాస తీసుకుంటుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

**ఆధార గ్రంథాలు**


1. దేవరకొండ బాలగంగాధర – లభ్య రచనలు సంకలనం (2013)
2. తిలక్ సాహితీ సందర్శనం – సం॥ కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ (2016)
3. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు-సం॥ కె.కె.రంగనాథాచార్యులు (1982)
4. సాహిత్యం – మౌలిక భావనలు – పాపినేని శివశంకర్ (2002)
5. అమృతవర్షిణి – ఆవంత్స సోమసుందర్ (1984)
6. ఆధునికాంధ్ర కవితా సమీక్ష – కాకర్ల వెంకటరామ నరసింహం (1982)

యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప

&

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి

సంయుక్త నిర్వహణ

"తిలక్ శతజయంతి సప్తాహం"

(అంతర్జాతీయ అంతర్జాల సదస్సు)

**14-20 డిసెంబరు, 2020**

**ఆహ్వానం**

ప్రారంభ సమావేశం

తేది: **14.12.2020** సమయం: ఉదయం **10.30**

| | | |
|---|---|---|
| అధ్యక్షులు | : | ఆచార్య మునగాల సూర్యకళావతి<br>ఉపకులపతి, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. |
| ముఖ్య అతిథి | : | ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి<br>ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి. |
| కీలకోపన్యాసం | : | శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, ఐ.ఏ.ఎస్.<br>కమిషనర్, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్. |
| ప్రత్యేక అతిథి | : | ఆచార్య తుమ్మల రామకృష్ణ<br>ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. |
| విశిష్ట అతిథి | : | ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి<br>అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం. |
| సదస్సు నిర్వహణ | : | ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి<br>తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. |

డా. ఎన్. ఈశ్వర రెడ్డి
సదస్సు సంచాలకులు, తెలుగు శాఖాధ్యక్షులు
యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప-516005

## మొదటి సమావేశం

**14.12.2020; సోమవారం; సాయంత్రం 5.00 గం॥లకు**

**అధ్యక్షులు** : **ఆచార్య మేడిపల్లి రవికుమార్,** తెలుగు అధ్యయన శాఖ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
**అంశం : తిలక్ కవిత్వం–మానవతావాద దృక్పథం**

**పత్ర సమర్పకులు** : **ఆచార్య కిన్నెర శ్రీదేవి,** తెలుగు అనువాద అధ్యయన శాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
**అంశం : తిలక్ కథలు – స్త్రీ పురుష సంబంధాలు**

**డా॥ డి. నల్లన్న,** సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.
**అంశం : సాలెగూడు నాటకం**

**డా॥ జె. వెంకట రమణ**
తెలుగు శాఖ, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం, మధురై.
**అంశం : సుశీల పెళ్ళి (నాటకం)**

## రెండవ సమావేశం

**15.12.2020; మంగళవారం; సాయంత్రం 5.00 గంటలకు**

**అధ్యక్షులు** : **ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, తెలుగు శాఖ,**
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**అంశం : తిలక్ కవిత్వతత్త్వం**

**పత్ర సమర్పకులు** : **ఆచార్య విస్తాలి శంకర రావు,** శాఖాధ్యక్షులు
తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.
**అంశం : అమృతం కురిసిన రాత్రి – వస్తు విశ్లేషణ**

**డా॥ పి. రమాదేవి**
**తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.**
**అంశం : తిలక్ కథలు – పాత్రచిత్రణ**

**డా॥ బూసి వెంకటస్వామి**

సంపాదకులు, భావవీణ, పెదనందిపాడు.

**అంశం : తిలక్ కథలు – మానవ సంబంధాలు**

## మూడవ సమావేశం

**16.12.2020; బుధవారం; సాయంత్రం 5.00 గంటలకు**

**అధ్యక్షులు** : **ఆచార్య జి. బాలసుబ్రహ్మణ్యం,** వైస్ ప్రిన్సిపాల్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

**అంశం : తిలక్ కవిత్వం – శిల్పం**

**పత్ర సమర్పకులు** : **డా॥ పి.ఆర్. హరినాథ్**

ప్రాంతీయ విద్యాకేంద్రం, మైసూరు.

**అంశం : తిలక్ కవిత్వం – ఆలంకారిక వైవిధ్యం**

**డా॥ తరపట్ల సత్యనారాయణ, తెలుగు శాఖ**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

**అంశం : ప్రభాతము – సంధ్య: తిలక్ సందేశం**

**డా. ఎం. ఎం. వినోదిని**

తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

**అంశం : తిలక్ కథలు – కథన శైలి**

## నాలుగో సమావేశం

**17.12.2020; గురువారం; సాయంత్రం 5.00 గంటలకు**

**అధ్యక్షులు** : **ఆచార్య కె. మధుజ్యోతి,** తెలుగు శాఖ,

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

**అంశం : తిలక్ కథలు–మనస్తత్వ విశ్లేషణ**

**పత్ర సమర్పకులు : ఆచార్య ఎం. రామనాథం నాయుడు,** శాఖాధ్యక్షులు,
తెలుగుశాఖ, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం,మైసూరు.
**అంశం : తిలక్ కవిత్వం - అభ్యుదయ దృక్పథం**

**డా॥ పి. విజయకుమార్,** తెలుగు శాఖ,
ఆం.ప్ర. కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.
**అంశం : తిలక్ కవిత్వం అనుభూతి - అభివ్యక్తి**

**డా॥ ఎం. ఓబులేసు**
తెలుగు శాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.
**అంశం : గోరువంకలు - వస్తువిశ్లేషణ**

## ఐదో సమావేశం

**18.12.2020; శుక్రవారం; సాయంత్రం 5.00 గంటలకు**

**అధ్యక్షులు : ఆచార్య కె. ఆశాజ్యోతి**
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ,
బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు.
**అంశం : తిలక్ కథలు - వస్తువిశ్లేషణ**

**పత్రసమర్పకులు : ఆచార్య ఎన్.వి. కృష్ణారావు,** శాఖాధ్యక్షులు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.
**అంశం : తిలక్ కవిత్వం - నవ్యత**

**డా॥ పి.సి. వెంకటేశ్వర్లు,** ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
**అంశం : తిలక్ కథలు - శిల్ప సౌందర్యం**

**డా॥ టి. వెంకటస్వామి**
ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
**అంశం : తిలక్ రచనలు-ఏకపాత్ర**

## ఆరో సమావేశం

**19.12.2020; శనివారం; సాయంత్రం 5.00 గంటలకు**

**అధ్యక్షులు** : **ఆచార్య పి.పద్మ, పీఠాధ్యక్షులు,** మానవశాస్త్రాల పీఠం
యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.
**అంశం : తిలక్ కవిత్వం – పాశ్చాత్య ప్రభావం**

**పత్రసమర్పకులు** : **డా॥ మూల మల్లికార్జున రెడ్డి**
లలితకళల శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.
**అంశం : ఇరుగు – పొరుగు, పొగ నాటికలు**

**డా॥ జి. పార్వతి**
తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.
**అంశం : తిలక్ నాటికలు – వస్తువిశ్లేషణ**

**డా॥ గంపా వెంకటరామయ్య**
ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ
**అంశం : తిలక్ కథలు: రీడర్ రెస్పాన్స్ సిద్ధాంతం**

**ఎ. రాజయ్య**
పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
**అంశం : తిలక్ లేఖా సాహిత్యం**

## ముగింపు సమావేశం

## 14-20 డిసెంబరు, 2020

తేది: **20.12.2020** సమయం: సాయంత్రం **5.00** గం॥కు

| | |
|---|---|
| అధ్యక్షులు | : ఆచార్య జి. సాంబశివా రెడ్డి, ప్రాచార్యులు<br>యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల, కడప. |
| ముఖ్య అతిథి | : ఆచార్య సుధీర్ ప్రేమ్ కుమార్<br>కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి |
| సమాపనోత్సవ సందేశం | : ఆచార్య ఆర్వీయస్. సుందరం<br>ప్రముఖ సాహితీవేత్త, మైసూరు. |
| గౌరవ అతిథి | : ఆచార్య డి. విజయరాఘువ ప్రసాద్<br>కులసచివులు, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. |
| విశిష్ట అతిథి | : డా॥ ఎల్.వి. కృష్ణా రెడ్డి, కులసచివులు,<br>విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు. |
| ప్రత్యేక అతిథులు | : డా॥ శ్రీగణేశ్ తొట్టెంపూడి<br>సైంటిస్ట్, హైడల్‌బర్గ్ విశ్వవిద్యాలయం, జర్మనీ.<br>డా॥ వైదేహి శశిధర్<br>న్యూజెర్సీ, అమెరికా. |
| సదస్సు నివేదిక | : డా. ఎన్. ఈశ్వర రెడ్డి, తెలుగు శాఖాధ్యక్షులు<br>యోగివేమన విశ్వవిద్యాలయం, కడప. |
| సదస్సు నిర్వహణ | : డా. ఎం. ఎం. వినోదిని<br>తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. |